న్యూఢిల్లీ లేఖ

డా. జయ్ దుబాషి



ఢిల్లీలో తీరికలేకుండా ఎప్పుడూ హడావుడిగా వుండేవాళ్ళు ఎవరంటే రాజీవ్‌గాంధీ ప్రజా సంబంధాల వ్యవహారాలు చూసే కుర్రకారు అని చెప్పవచ్చును. సినిమాహాలులో ప్రేక్షకులను నవ్వించేందుకు లారెల్, హార్డీ చేసినట్లే, వారు కూడాఒక తమాషా, తర్వాత యింకో తమాషా గురించి ఆలోచిస్తూంటారు. రాజ్‌పథ్‌లో హెచ్. కె. ఎల్. భగత్, శివశంకర్ వంటి భారీవ్యక్తులతో కలసి ఇటాలియన్ రకం సూట్‌లో రాజీవ్‌గాంధీ ఒకరోజున పరుగుతీస్తూవుంటారు. ఆటిన్‌బరో తీసిన 'గాంధీ' చిత్రంలో బెన్‌కింగ్‌స్లే ధరించినట్టు స్వదేశీ ఖాదీ దుస్తుల్లో, ఆ మర్నాడు బరోడా వీధుల్లో మతిస్థిమితంలేనివాడిలాగా ఆయన పరిగెత్తుతారు. ఒక ఉదయం పి. ఎన్. హక్సర్, సిద్ధార్థ శంకర్‌రే వంటివారితో ఉపాహారం తీసుకుంటూ ఉంటారు. ఆ సాయింత్రమే రైతులకు – అవును రైతులకే – వాతావరణంపై ఉపన్యాసం యిస్తూ కనిపిస్తూంటారు. ఇదంతా ఆయనని ఇటాలియన్‌లు వాణిజ్యవొప్పందం విషయంలో వొత్తిడిచేసినపుడు. ఇక్కడో మంత్రి అక్కడ కొందరు ఎం. పి.లు ఆయనకి డబ్బాకొడుతుంటారు. కానీ ఇవన్నీ ప్రజాసంబంధాలలో భాగంకాదు.

వీటన్నిటి గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడానికి ప్రజా సంబంధాల కుర్రకారు ప్రయత్నిస్తున్నారా? వారు నిజంగా మిత్రుల్ని సంపాదిస్తున్నారా? ప్రజలని ప్రభావితులని చేస్తున్నారా? అది వారు చేయాల్సినపని. ఈ రాజీవ్‌గాంధీ ఆకర్షణ ఏమిటి? అది ఏ విధంగా ఈ ప్రజా సంబంధాలవారు ప్రయత్నిస్తున్నదానికి సరిపోతుంది? రోనాల్డ్ రీగన్, మార్గరెట్ థాచర్ అయితే సరే. వారిద్దరిదగ్గర ప్రజలకి అవసరమైనది ఏదో కొంతవుంది. స్టాక్ మార్కెట్ ఘోరంగా పడిపోయినప్పటికీ, ఇతర దురదృష్టకరమైన పరిణామాలు సడలింపబడిన ఆర్థిక వ్యవస్థలపైపడే అవకాశం వున్నప్పటికీ ఆ రెండుదేశాలు గత ఆ రేడు సంవత్సరాలుగా ప్రజలకు ఎంతో కొంత మేలుచేశాయి. అమెరికా సుదీర్ఘ శాంతి విస్తరణ అమెరికాలో మూడవవంతు మాత్రమే. నిరుద్యోగం అమెరికాలో యింకా ఎక్కువేకానీ, యిది 11 శాతం నుంచి 6 శాతానికి అంటే దాదాపు సగానికి తగ్గింపబడింది. వాస్తవానికి అక్కడ ద్రవ్యోల్బణం లేదు.

ఈ అంకెలు నేను లండన్ ఎకానమిస్ట్ నుంచి తీసుకున్నాను. ఇలాంటివాటిలో అది నమ్మదగినది. బ్రిటన్‌ని తీసుకోండి! థాచర్‌కు ముందు యూరప్‌లో ఆ దేశం ఒక రోగిష్టిగా చెప్పబడేది. ఆర్థిక వ్యవస్థ యిప్పుడు అలాకాదు. 1981 నుంచి వాస్తవంగా


దిగజారిపోతున్న ఆర్థికవ్యవస్థ

యిప్పుడు ఆరవ సంవత్సరంలోవున్నది – సరిగ్గా చెప్పాలంటే 64 నెలలు – ఈ సమయంలో అమెరికా మొత్తం జాతీయ ఉత్పత్తి సంవత్సరానికి 4.2 శాతం చొప్పున పెరి గింది. జపాన్ లేదా నాలుగు పెద్ద యూరోపియన్ ఆర్థిక వ్యవస్థలకన్నా వేగంగా పెరిగింది. అదేసమయంలో అమెరికా కోటి కొత్త ఉద్యోగాలని సృష్టించింది. జపాన్‌కన్నా యిది అయిదు రెట్లు, పశ్చిమ జర్మనీకన్నా దాదాపు నూరురెట్లు ఎక్కువ. భారతదేశంలో 1980 నుంచి కేవలం 30 లక్షల కొత్త ఆద్యోగాలు మాత్రమే వచ్చాయి. అదీ ప్రభుత్వరంగంలో. అంటే యిది మొత్తం జాతీయ ఉత్పత్తి స్థిరంగా పెరుగుతూ వస్తోంది. గత సంవత్సరం 5 శాతం పెరిగింది. ఆ సంవత్సరమే మనదేశం మొత్తం జాతీయఉత్పత్తి పడిపోయింది. బ్రిటన్‌లో నిరుద్యోగం ప్రబలంగానే వుంది. కానీ రెండు సంవత్సరాలలో 30 శాతానికి తగ్గింది. ప్రభుత్వం సంపన్నంగా వుంది. కోశాగార అధ్యక్షుడుగా పిలువబడే ఆర్థికమంత్రి 25 శాతానికి కనీస ఆదాయపు పన్నును తగ్గించారు. బ్రిటన్‌లో రెండు అంచల ఆదాయపు పన్నురేట్లు, 25 శాతం, 40 శాతం మాత్రమే వున్నాయి. 40 శాతం గరిష్ట రేటు. ప్రపంచంలో ఏ దేశంలో కూడా యింత తక్కువ రేట్లులేవు. జపానులో కూడా అలా లేదు.

మార్గరెట్ థాచర్ తిరిగి ఎన్నిక అయినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు. ఈ శతాబ్దం మొత్తంమీద యిప్పటికే ఆమె దీర్ఘకాలం బ్రిటన్ ప్రధానమంత్రిగా వున్నారు. రీగన్ ఈసారి నిలబడటానికి వీలులేదు. కానీ ఆయన సహచరుడు జార్జ్ బుష్ దాదాపు ఖచ్చితంగా గెలుస్తారు. రీగన్ యిటీవల ఒక కొత్త ప్రజాసంబంధాల వ్యక్తిని నియమించారు. కానీ ఇంగ్లాండులో మార్గరెట్ థాచర్ మాత్రం పాత ప్రజా సంబంధాల వ్యక్తితోనే కొనసాగుతున్నారు. భారతదేశంలో గోపీ అరోరా అనే ఆయన కొత్తసూపర్ ప్రజాసంబంధాల వ్యక్తిగా వచ్చారు. ఆయన యిప్పుడు రాజీవ్‌గాంధీ పరిపాలనకి తగినట్లే అబద్ధాలు, సగం నిజాలకి బాధ్యత వహిస్తున్నారు. ఆ విషయంలో ఆయన అందరినీ మించిపోయారు.


కానీ ప్రజల్ని వెర్రివాళ్ళని చేయడం తేలికకాదు. భారతదేశంలో రానున్న ఎన్నికలలో ప్రతిపక్షాలు

(8 వ పేజీ చూడండి)



పెరుగుదలకి ఒక రుచికరమైన మార్గం గురించి రాశిఫలం చెప్తోంది ఫారెక్స్

34566




మీకు రాశిచక్రాలలో నమ్మకం వుంటే, కర్కటరాశిలో జన్మించిన పాప నెమ్మదైన స్వభావం కలిగి, చక్కగా ప్రవర్తించే పాప అని అనుకోవచ్చు. పాప మనో భావాలకు ప్రతిబింబం ఆమె ముఖా కృతి. అందుచేత పాప హాయిగా, ఆనందంగా వున్నదా లేదా అని మీకు ఇట్టే తెలిసిపోతుంది. మీ మనోస్థితి ప్రభావం పాపపై అధికంగా వుంటుంది. పెద్దపెద్ద చప్పుళ్లంటే నచ్చదు కనుక పండుగ సంబరాలలో టపాకాయల మోతతో సంతోషించదు. సూక్ష్మస్వభావం కల్గినది కనుక, చీటికి మాటికి ఏడ్చేస్తుంది. మీరు తనను ప్రేమిస్తున్నారని తెలుసుకోవడం పాపకు అవసరం. కనుక, మీ ప్రేమను మాటల్లో, చేతల్లో కనపర్చండి. తనకు తానే ఆనందంగా వుండగలదు. కనుక, పాపతో వేగేదెలాగా అనే సమస్యే మీకు వుండదు.

మీకు రాశిచక్రాలలో నమ్మకం వున్నా లేకపోయినా, పోషకాహారం విషయానికి వస్తే, మీరు నమ్మదగినది ఒకటి వుంది. అదే ఫారెక్స్.

4 నెలల నుంచీ మీ పాపకి 'పాలతో కూడిన ఫారెక్స్ సీరియల్' ఇవ్వండి. సమగ్రమైన గోధుమ సీరియల్‌తోనూ సంపూర్ణమైన పాలతోనూ తయారు చేసిన దీనిలో కాల్షియం, మినరల్స్, విటమిన్లు మరియు ప్రోటీన్లు వుండి శీఘ్రంగానూ అన్ని విధాలా మీ పాప పెరగడానికి కావలసిన పోషకత్వం అవి అందజేస్తాయి.

6 నెలల నుంచి రకరకాల రుచుల కోసమే కాక పూర్తి పోషకత్వం కోసమూ పాప తీసుకొనే ఆహారానికి 'ఫారెక్స్-వెజ్' కలిపి ఇవ్వండి.





పెరుగుదల కోసం రుచికరమైన విధానం.

GX/49/244 TEL

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు : (1938-1972)

1.7.88; 8.7.88

శ్రీ విభవ నామ సం. నిజ జ్యేష్ఠ బ. విదియ; నవమి

సంపుటము 81 : సంచికలు 45; 46

ముఖ్య సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

కార్యవాహక (యాక్టింగ్) సంపాదకుడు :

మతుకుమల్లి మాధవరావు

విడి ప్రతి వెల రు. 3.00

పోస్టులో 6 నెలల చందా రు. 87.10

పోస్టులో 12 నెలల చందా రు. 174.20

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటి : రజని

(ఫొటో : ఈశ్వరి)

కథలు :

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు

ముఖచిత్రం

సుమలత ముఖచిత్రం ముగ్ధ మనోహరంగా మా హృదయాలను ఓలలాడించినది.

పి. సరోజనీనాయుడు, యర్రగుంటపల్లి

సీరియల్స్

సుమలత ముఖ చిత్రం చాలా బాగున్నది. 'పవిత్రపాపి' సీరియల్ నాకెంతో నచ్చింది. రచయితకు ధన్యవాదాలు.

వెలుగు రామక్రిష్ణుడు, యర్రగుంటపల్లి

★ ★ ★

చల్లా సుబ్రహ్మణ్యంగారి సీరియల్ "పవిత్రపాపి" ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. సీరియల్ చదువుతున్నంతసేపూ ఆ పాత్రలలో లీనమై పోతున్నాము. 'రాకా' పాత్ర చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది. మంచి సీరియల్స్ అందించడంలో పత్రిక ఎప్పుడూ ముందేనని మరోసారి నిరూపించింది.

ఐ. సత్యనారాయణ, శ్రీకాకుళం

★ ★ ★

చల్లా సుబ్రహ్మణ్యంగారి సీరియల్ "పవిత్రపాపి" సూపర్ హిట్ సీరియల్ అని చెప్పక తప్పదు. రచయిత మంచి శైలిలో రచన సాగిస్తున్నారు. ఏవారంకావారం సస్పెన్స్‌తో ముగించడంవల్ల రాబోయే సంచిక కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాము. ఈ సీరియల్ సినిమాగా నిర్మిస్తే 'సూపర్ హిట్' అయితీరుతుంది. 'రాకా' పాత్రలో సుప్రీం హీరో చిరంజీవి, దేదీప్యగా 'రాధ', సీతాదేవిగా శారద, పోలీస్ కమీషనర్‌గా గుమ్మడి ఆయా పాత్రలకు సరిపోతారు. చక్కని సీరియల్ రాస్తున్న రచయిత చల్లా సుబ్రహ్మణ్యంగారికి మా అభినందనలు.

-న్యాయపతి రమేష్‌బాబు, మిత్ర బృందం, హైదరాబాదు

మా అభిమాన రచయిత శ్రీ మల్లాది "వినాయకరావ్ పెళ్లి" మాపై హాస్యపుజల్లు కురిపిస్తున్నది. 'మల్లాది'కి మా అభినందనలు.

-సింగం దత్తాత్రేయమూర్తి, రఘురామారావ్, ఒంగోలు

★ ★ ★

సుమలత ముఖ చిత్రం ఎంతో అందంగా వుంది. మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి స్వర్ణాక్షరమాల అల్లుతున్న "వినాయకరావు పెళ్ళి" సీరియల్ మమ్మల్ని ఎంతో ఆకర్షించింది. హాస్యపుజల్లు కురిపిస్తోంది.

ఆర్. డి. సుధాకరపాల్, పుంగనూరు

★ ★ ★


సుమలత ముఖచిత్రం ముచ్చటగా ఉంది. మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి 'వినాయకరావు పెళ్లి' అద్భుతంగా వుంది. చల్లా సుబ్రహ్మణ్యంగారి 'పవిత్రపాపి' సీరియల్ చాలా బాగుంది.

బొండా కాళీబాబు, విశాఖపట్నం

గమనిక

3-6-88; 10-6-88 సంచికలోని 'హైదరాబాద్ నోట్‌బుక్' శీర్షికలో "నిష్మల వెంకటరావుకు రెండు బంగారు పతకాలు" అని పడింది. శ్రీ నిష్మల వెంకటరావు తమ మాతృమూర్తి స్మారకంగా హైదరాబాద్ విశ్వ విద్యాలయంలో ఉత్తమ తెలుగు పరిశోధనకి ఒక బంగారు పతకాన్ని, విశ్వ విద్యాలయానికి వెలిగా ఉత్తమ పరిశోధన గ్రంధానికి మరొక బంగారు పతకాన్ని ఇవ్వటానికి నిశ్చయించారు. ఆ రెండు బంగారు పతకాలు ఆయన ఇచ్చేవి కానీ ఆయనకి కాదని పాఠకులు గమనించ కోరుతున్నాము. పొరపాటుకి చింతిస్తున్నాము.

–సం



గెలుపొందడానికి 35 శాతం అవకాశం వుందని ఒక విదేశీసంస్థ అధ్యయనం తెలిపింది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పడిపోయ్యేట్లుందనటానికి అది ఒక హెచ్చరిక. కానీ ఈ అవకాశం 35 శాతం కాకుండా 65 శాతం వుందని నేను చెపుతున్నాను. ఎన్నికల రోజు దగ్గరయ్యేకొద్దీ విదేశీయులు కూడా యిదేమాట చెపుతారు. కాంగ్రెసుకు ఓటు వేసేవాడు గ్రుడ్డివాడైనా అయివుండాలి లేదా ఏమి జరుగుతోందో చూడలేని – లేదా చూడనటువంటి, ఎప్పుడూ దూరదర్శనం చూస్తూండే మూర్ఖుడైనా అయ్యుండాలి. గత మూడు సంవత్సరాల కాలంలో రాజీవ్‌గాంధి అధికారంలో వుండి సాధించిన ఘనకార్యాలు ఏమిటి?

ఏమీలేదు. పూర్తిగా ఆయన విఫలమైనారు. అంతా వినాశనమే. ఆయన ఏది ముట్టుకుంటే అది బూడిద అయింది. ఆర్థికవ్యవస్థ సరేసరి. వరుసగా మూడేళ్ళు పంటలు సరిగాలేవు. గతంలో ఎప్పుడూ యిలా జరగలేదు. ఆఖరికి చెడ్డరోజులుగా పేర్కొనబడే బ్రిటిష్‌వారి కాలంలో కూడా ఈవిధంగా జరగలేదు. ఒక్క రష్యనులే ఈవిధమైన విపత్తులకు గురిఅయ్యారు. కానీ రష్యావారికి ఏ రకమైన నాయకులు వున్నదీ మనందరికీ తెలుసు. ఒక పెద్ద గుండ్రటి రాయి కొండలపైనుంచి దొర్లినట్లు మన ఆర్థికవ్యవస్థ దిగజారిపోతోంది. దానికి అదుపులేదు. 1981 – 82 నుంచి చూస్తే ఈ ఏడాది మనం అతి

న్యూఢిల్లీ లేఖ

(4 వ పేజీ తరువాయి)

తక్కువ పంట దిగుబడిని సాధించివుంటాము. అంటే ప్రత్యేకించి 1988 నుంచి మిగతా ప్రపంచం అంతా అభివృద్ధి చెందుతుంటే మనంమాత్రం ఎక్కడి " వాళ్ళం అక్కడేవున్నాం. వ్యవస్థీకృత ప్రవేటురంగంలో ఉద్యోగావకాశాలలో ఏమాత్రం పెరుగుదలలేదు. 1983 నుంచి నిజానికి 2,00,000 ఉద్యోగావకాశాలు పడిపోయాయి. ప్రస్తుతం కొత్తవారికి ఉపాధి కల్పించడానికి వారు నిరాకరిస్తున్నారు. ద్రవ్యోల్బణం సంగతి? మనం అసలు దానిగురించే మాట్లాడకూడదు.. నారాయణదత్ తివారి పార్లమెంట్‌లో లేచి ధరలు నిజంగా తగ్గుతున్నాయని అందరికీ అభయమిచ్చిన రోజున (సర్వాంతర్యాములైన ప్రజా సంబంధాల కుర్రకారు ఆయనకు కూడా అలా చెప్పమని చెప్పారా?) ఢిల్లీలో ఒక అరటిపండు ఒక రూపాయి అమ్ముతోంది. పసిఫిక్‌లోని బనానా రిపబ్లిక్‌లకు మనదేశం మరింతగా చేరువైంది.

ఆర్థిక వ్యవస్థకు సంబంధించినంత వరకు ప్రభుత్వంవారు తయారుచేసిన ఆర్థిక సర్వేలనుంచి నేను ఈ అంకెలను తీసుకున్నాను. ఆ లెక్కలు దేవుడి దయివల్ల యింకా ప్రజాసంబంధాల కుర్రకారు దృష్టికి రాలేదు. ఇతర రంగాలలో ఏదో ఒక మహాభూతం అన్నీ పనులను చక్కదిద్దుతున్నట్లు పెద్ద గందరగోళం తప్ప మరేమీలేదు. పంజాబులో చూస్తే రోజుకి ఒకళ్ళిద్దరుకాకుండా 20 మంది హతమార్చబడుతున్నారు. శ్రీలంకలో శాంతిపేరుతో భారతీయులను, భారతీయులే చంపుతున్నారు. మాకియవెల్లియన్ దౌత్యనీతికి యిది మచ్చుతునక.

అయినా రాజీవ్ అండ్ కంపెనీ మాత్రం అన్నీ సక్రమంగానే నడుస్తున్నాయని, అరటిపండు కొనగలిగినా, కొనలేకపోయినా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని, ధరలు తగ్గుతున్నాయని, అత్యవసర పరిస్థితి వున్నా లేకపోయినా శ్రీలంక పరిస్థితి మెరుగుపడుతోందని చెప్పుకుంటున్నది. గత కొద్దిరోజులుగా దూరదర్శన్ పంజాబు వార్తలను పూర్తిగా ప్రసారం చేయడంలేదు. పంజాబులో ఎందరు హతమయ్యారో తెలుసుకోవడానికి ఉదయం పత్రికలు వచ్చేవరకు వేచి చూడాల్సివస్తోంది.

ఈ దేశాన్ని నెహ్రూలు నాశనం చేశారు. గత్యంతరంలేనప్పుడు పిల్లి కూడా తిరగబడుతుంది. అప్పుడు ప్రజాసంబంధాల కుర్రకారు ఎన్ని తమాషాలు చేసినా ఫలితం వుండదు. ఫ్రీడం రన్, దండి యాత్రల తరువాత యిక ఒకే యాత్రకి మార్గంవుంది. అదేమిటన్నది నాలాగే మీరుకూడా బాగా ఊహించగలరు. □

సీరియల్

వినాయకరావు పెళ్లి



మల్లాది వెంకటకృష్ణమూర్తి

(గత సంచిక తరువాయి)

ఆ రోజు ఆఫీస్‌లో లంచ్ అవర్‌లో శాస్త్రి, వినాయకరావు కామేశ్వరరావుతో ఆదిలక్ష్మి పెళ్ళి ఎలా విఫలం చేయాలా అని ఆలోచించారు.

"మూడు సాధిస్తే గాని మన ప్రయత్నం విఫలం కాదు" చెప్పాడు శాస్త్రి.

"ఏమిటా మూడు?" అడిగాడు వినాయకరావు.

"ఒకటి రమణమూర్తికి కామేశ్వరరావుని తన కూతురికి ఇవ్వకూడదనిపించడం. రెండు నాదకర్ణికి తన కొడుకుని ఆదిలక్ష్మికి ఇవ్వకూడదనిపించడం. మూడు కామేశ్వరరావుకి ఆదిలక్ష్మిని చేసుకోవాలనిపించకపోడం. ఈ మూడు మనం సాధించగలిగితే చాలు. పెళ్ళి రద్దవుతుంది."

"అంటే మూడు పథకాలు అవసరం అన్నమాట" చెప్పాడు వినాయకరావు.

"వీటిలో కనీసం రెండు సక్సెస్ అయినా చాలు. ఒకటి ఆల్‌రెడీ ఆలోచించేసాను."

"ఏది?" ఉత్సాహంగా అడిగాడు వినాయకరావు.

"అన్నీ రాత్రికి ఎర్ర తేలు విషం ఎక్కుతుండగా చర్చించుకుందాం. లంచ్ టైం దాటుతోంది. పద" చెప్పాడు శాస్త్రి చిన్నగా నవ్వి.

★★★★

ఆ రాత్రి ఎనిమిదిన్నర నించి బార్ మూసేసే దాకా – రాత్రి పదకొండున్నర దాకా శాస్త్రి, వినాయకరావు ఓ బార్‌లో కూర్చున్నారు. ఆఖరులో బార్‌లోంచి బయటకి వెళ్ళింది వాళ్ళిద్దరే.

ఇద్దరు బయటకి వచ్చాక కొద్ది దూరం నడిచి రోడ్డు పక్కనున్న ఓ తూము మీద కూర్చున్నారు. శాస్త్రికి నిషా బాగా ఎక్కడంతో కాళ్ళూపుతూ రకరకాల పథకాల గురించి ఆలోచించసాగాడు.

"ముందర ముఖ్యంగాఆదిలక్ష్మి, అంటే కామేశానికి కంపరం ఎత్తేలాచేయాలి. అందుకు ఆమె కొంత డ్రామా ఆడటానికి సిద్ధంగావుండాలి."

"ఏమిటది?" అడిగాడు వినాయకరావు.

శాస్త్రి బార్‌లోంచి బయటకి తెచ్చిన, సోడా కలిపిన విస్కీ సీసాలోంచి కొద్దిగా తాగి చెప్పాడు–

"ఇవాళ వుదయమే పేపర్లో ఓ వార్త చదివాను. అలాంటి వార్తలు రోజూ చదువుతుంటాను. పెళ్ళయ్యాక ఏ మగాడయినా సరే అది చదివితే భయపడి హడలి చచ్చే వార్త అది."

"ఏమిటది?" అడిగాడు వినాయకరావు.

"నీవు రోజూ పేపర్ చదువుతుంటావా?"

"చదువుతాను."

"మరి నాకు కనబడిన ఆ వార్త నీకు ఎందుకు కనపడలేదు. నీవూ చదివినా నాలా నీకెందుకు ఐడియా కలగలేదు?" అడిగాడు శాస్త్రి మరో చుక్క తాగి.

"నీకు నాకు వున్న తేడా అదే. నీవు నా కన్నా తెలివిగలవాడివి" చెప్పాడు వినాయకరావు.

జరిగిన కథ –13 : శాస్త్రి సలహా మేరకు సుబ్బలక్ష్మి ఈశ్వరరావును ప్రేమించినట్టు కథ అల్లి తండ్రికి ఉత్తరం రాస్తాడు వినాయకరావు. పెళ్ళి చెడగొట్టడానికి చేసిన ఈ ప్రయత్నం బెడిసి కొడుతుంది. అసలు విషయం తెలిసి, వినాయకరావును పిలిపిస్తారు. ఆదిలక్ష్మి తల్లిదండ్రులు అంగీకరిస్తే తనకు అభ్యంతరం లేదంటాడు డాంబికేశ్వరరావు. నిశ్చితార్థాన్ని తప్పించుకున్న ఆదిలక్ష్మి తల్లితో కలిసి వినాయకరావుతో మాట్లాడడానికి వస్తుంది. తన మీద అంత పెద్ద అభాండం వేసినందుకు కక్ష తీర్చుకుంటానని సుబ్బలక్ష్మి వినాయకరావుకు ఉత్తరం రాస్తుంది.

శాస్త్రి చెవులకి ఆ పొగడ్త అన్ని పొగడ్తల్లా తియ్యగా చేసింది. గర్వంగా నవ్వి చెప్పసాగాడు తనాలోచించిన పథకం గురించి.

"వండ్రఫుల్ అండ్ బెస్ట్ అయినవే నేనెప్పుడు ఆలోచించేది."

వినాయకరావు ఆ పథకం గురించిన ఒకటి రెండు అనుమానాలని వ్యక్తం చేసాడు. శాస్త్రి వాటిని క్లియర్ చేసాక చెప్పాడు వినాయకరావు ఆనందంగా–

శాస్త్రి, నీవు మహాగొప్ప తెలివిగలవాడవోయ్. ఇది చాలా మంచి పథకం."

"కేవలం నా ఒక్కడి తెలివే కాదు. ఇది కూడా జోడయింది– క్వాబట్టి" చేతిలోని విస్కీ సీసాని చూపించి చెప్పాడు.

"రెండో పథకం?" అడిగాడు వినాయకరావు.

మరో చుక్క తాగి ఆగాడు శాస్త్రి.

"రెండో పథకం ఏమిటి?"

"రమణమూర్తి తండ్రికి కామేశం మీద విరక్తి కలిగే పథకం"

"రమణమూర్తెవరు? కామేశం ఎవరు?" అడిగాడు శాస్త్రి మరో చుక్క తాగి మత్తుగా చూస్తూ.

"రమణమూర్తంటే మరణమూర్తి. మన ఇంటాయన. ఆదిలక్ష్మి తండ్రి. కామేశం ఆయన కాబోయే అల్లుడు" చెప్పడు వినాయకరావు ఓపికగ్గా.

"ఆదిలక్ష్మి కాబోయే అల్లుడు కామేశమా?"

"కాదు, కాదు. నీవు తాగడం ఆపు. ఆదిలక్ష్మిని మరణమూర్తి కామేశానికి....."

వినాయకరావు మాటలు పూర్తి కాకుండానే శాస్త్రి తూము మీంచి దబ్బున కింద పడ్డాడు.

"అరెరె! ఏమైంది" అడిగాడు వినాయకరావు కిందకి దూకి శాస్త్రిని లేపుతూ.

శాస్త్రి కళ్ళు అప్పటికే మూసుకుని పోయాయి, నిషా పూర్తిగా తలకెక్కడంతో అయినా చేతిలోని సీసా పట్టు వదల్లేదు. వినాయకరావు రెండు మూడు సార్లు తిట్టి లేపాడు కాని అతను లేవకపోవడంతో చేసేది లేక అతన్ని వీపుని తూముకి ఆనించి కూర్చోపెట్టి దగ్గర్లో వున్న సినిమా థియేటర్ నించి రిక్షా నొకదాన్ని తెచ్చి అందులో అతన్ని ఎక్కించి ఇంటికి తీసుకెళ్ళాడు. రిక్షా అతను, వినాయకరావు ఇద్దరు కలసి శాస్త్రిని గదిలోకి మోసుకెళ్ళారు.

మంచం మీదకి చేరిన వినాయకరావు గొణుక్కున్నాడు. శాస్త్రి మంచి ఆలోచనలు చేస్తు అలా అవుట్ అవడం వల్ల.

★ ★ ★ ★ ★

మర్నాడు వుదయం శాస్త్రి నిద్ర లేచేసరికి వినాయకరావు టేప్ రికార్డర్‌కి ఏదో డిక్టేట్ చేస్తూ కనబడ్డాడు.

"అప్పుడే" బార్ మూసేసారా?" అడిగాడు శాస్త్రి.

"అప్పుడే ఏమిటి? ఇప్పుడు వుదయం తొమ్మిదింపావు.

"ఆ? రాత్రి ఇంటి కెలా వచ్చాం? అబ్బ, తల పగిలిపోతోంది" చెప్పాడు శాస్త్రి లేచి కూర్చుంటూ.

రాత్రి జరిగిందంతా చెప్పాడు వినాయకరావు.

"నిజంగా? నాకసలు తూము మీద కూర్చోవడం గుర్తే లేదు. అసహ్యంగా రోడ్ము మీద తూము మీద ఎలా కూర్చున్నాం మిత్రమా? మన ఆఫీసు వాళ్ళో, తెలిసిన వాళ్ళో ఎవరయినా చూస్తే ఏం అనుకుంటారు?" చెప్పాడు శాస్త్రి బద్ధకంగా.

"నా మాట వింటేనా నువ్వు. పైగా మిగిలిన బాటిల్ చేతిలో"

"ఇక చెప్పక. ఎవరు మనల్ని చూడలేదనే ఆశిద్దాం."

"త్వరగా తయారవు. ఆఫీసుకి, టైమవుతోంది."

వినాయకరావు తనే రికార్డ్ చేసిన కేసెట్‌ని ఆదిలక్ష్మికి రహస్యంగా ఇచ్చి చెప్పాడు.

"ఓ సారి విని వెంటనే ఇరేజ్ చేసేయండి. ముఖ్యంగా మీ నాన్నగారు వినకూడదు."

"ఏమిటది?" అడిగింది.

"ఓ ప్లేన్. పూర్తిగా వింటే మీకే తెలుస్తుంది. మీ కామేశం బావ మీకు గుడ్ బై చెప్పే ప్లేన్ అనుకోండి."

"అలాగా? వెంటనే వింటాను. నాన్నగారు కూడా ఇంట్లో లేరు" చెప్పింది ఆదిలక్ష్మి వుత్సాహంగా.

గంటలో ఆరు సార్లు విన్న ఆధిలక్ష్మి, కనకమహాలక్ష్మి ఆ ప్లేన్‌ని వినగా వినగా ఇద్దరికీ అదీ కామేశం మీద పని చేసే ప్లేన్ అనిపించింది.

"దిసీజ్ ఓకే" సాయంత్రం చెప్పింది ఆదిలక్ష్మి, వినాయకరావుతో, అతను ఆఫీస్ నించి ఇంటికి రాగానే.

"మీ బావ రాగానే దీన్ని అమలు చెయ్యండి చాలు" చెప్పాడు వినాయకరావు.

"రేపు సాయంత్రం ఓ సారి మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను. ఎక్కడ కలుద్దాం?" అడిగింది ఆదిలక్ష్మి.

కొన్ని క్షణాల ఆలోచించి చెప్పాడు వినాయకరావు.

"టేంక్ బండ్."

"ఓకే. వేమన విగ్రహం దగ్గర" చెప్పింది ఆదిలక్ష్మి.

"ఇప్పుడర్థమయింది నాకు మన ఎన్టీఆర్ ప్రజాధనం వృథా చేయలేదన్న సంగతి" చెప్పాడు వినాయకరావు వెంటనే.

ప్రశ్నార్థకంగా చూసింది ఆదిలక్ష్మి.

"ఆ విగ్రహాల కయిన ఖర్చు వృథా అని పేపర్లు తెగరాసాయి కదా. వాళ్ళనుకున్నట్లు పూర్తిగా వృథా గాదు. మనలాంటి వాళ్ళు అంత పొడవు టేంక్ బండ్ మీద ఎక్కడ కలుసుకోవాలో నిర్ణయించుకోడానికి ఆ విగ్రహాలు వుపయోగిస్తాయి. వేమన విగ్రహం దగ్గర కలుద్దాం. అయిదున్నరకి" చెప్పాడు వినాయకరావు.

రాత్రి పదింటికి అడిగాడు శాస్త్రి.

"మిత్రమా. మూడు పథకాల్లో మనకి ఒకటి లభ్యం అయింది. మరో రెండు ఆలోచించాల్సిన అవసరం వుంది కదా?"


"అవును. నీకిప్పుడు మూడ్ వుందా?" ఆసక్తిగా అడిగాడు శాస్త్రిని.

"ఓ. అందుకే ఆ ప్రసక్తి తెచ్చాను."

"అయితే ఆలోచిద్దాం" వెంటనే మంచం మీద బాసిం పట్టు వేసుకుని కూర్చున్నాడు వినాయకరావు.

"మిత్రమా. మూడ్ ఆలోచించడానికి కాదు. తేలు విషానికి" చెప్పాడు శాస్త్రి చిన్నగా నవ్వి.

"నిన్నేగా అయిందది."



"ఆ కార్యక్రమం అయితే చక్కటి పథకాలు వాటంతట అవే మనసులోంచి పుట్టుకు వస్తాయి. కనుక నాకు మూడ్ వుంది. పోదాం రా" అయిష్టంగానే వినాయకరావు శాస్త్రిని బార్‌కి తీసుకెళ్ళాడు.

ఆ రాత్రి కూడా బార్‌లోంచీ బయటకి వచ్చిన ఆఖరు వ్యక్తులు వారిద్దరే. చేతిలో మిగిలిన విస్కీ బాటిల్‌తో తూము వైపు దారి తీసాడు శాస్త్రి. దాని మీద ఎక్కి బాసింప లేసుకుని కూర్చుని చెప్పాడు.

"అవుట్‌డోర్‌లో ఇలా తాగితే భలే వుంటుందోయ్" "మెయిన్ రోడ్డు. ఎవరయినా చూస్తే బావుండదు" చెప్పాడు వినాయకరావు.

"ఏడిచారు వెధవలు. మంచి ఆలోచనలకి ఇది నాకు బాగా అచ్చొచ్చిన ప్లేస్" చెప్పాడు శాస్త్రి ఓ గుక్క విస్కీ తాగి.

దూరం నించి వాళ్ళిద్దర్ని చూసి గతరాత్రి వాళ్ళకి సవారి కట్టిన రిక్షావాడు తూముకి కొద్దిగా దూరంగా తన రిక్షాని ఆపాడు.


"అయితే ప్రారంభించు" చెప్పాడు వినాయకరావు.



నాటి పెళ్ళిముచ్చట్లు

పక్కా రంగు

నా పెళ్ళి సంబరాలు మూడు రోలు జరిగినయి. నాకు ఏమీ అర్థంకాని పెళ్ళితంతులు పురోహితుడు ఏవేవో జరిపారు. ఈ తంతు పూర్తి అయ్యేసరికి కనీసం ఏభయి మాట్లు నా భార్య పేరు ఏదో సందర్భంతో చెప్పాల్సొచ్చింది. ఒకసారి పరధ్యానంగా నా భార్య పేరు చెప్పమంటే "పక్కా రంగు" అన్నాను. పురోహితుడు తెల్లబోయాడు. ఇంతకూ సంగతి ఏమంటే మా ఆవిడ కొత్త నేత చీర గుంటూరుది కట్టుకుంది. కొంగు పైన "పక్కా రంగు" అని రాసి వుంది. అది నేను చూస్తూ అలా అన్నాను. ఇంతకీ మా ఆవిడ ఇప్పటికీ పక్కా రంగేలెండి. నలుపా? ఎరుపా?"



కె. రామారావు,
నింబోలిఅడ్డ, హైదరాబాద్

★ ★ ★

తొందరపాటు



1975 మే నెల 22వ తేదీన కావలిపట్టణంలో జరిగింది నా వివాహం. ఆరోజు రాత్రి 12 గంటల నుండి 1.42 లోపు ముహూర్తం. ఉదయం పదిగంటలకు విడిదిలో దిగాం. శ్రీమతి తరఫు పెద్దలకన్నా, బంధువులకన్నా చొరవగా అన్ని పనులలో జొరబడి అంతటా తామే అయి తిరుగుతున్న ఆవిడగారి స్నేహితురాళ్ళను గూర్చి మా వాళ్ళంతా ఘనంగా చెప్తూనే వున్నారు. వాళ్ళను చూస్తుంటే ముచ్చట అనిపించినా, తెలియని భయంతో నాలో వింత ఆలోచనలు చెలరేగాయి.

పది గంటలకి రాత్రి భోజనాలు పూర్తి అయ్యాయి. విశ్రాంతి తీసుకుంటున్నాం. పురోహితుడి ఆగమనంతో పెళ్ళి పందిట్లో సందడి మొదలైంది. నాకు పిలుపు వచ్చింది. వెళ్ళి పెళ్ళి పీటల మీద కూర్చున్నాను. అంతవరకు శ్రీమతిని నీడలా అంటిపెట్టుకుని వున్న స్నేహితురాళ్ళు పరిసరాల్లో కనిపించలేదు. తేలిగ్గా గాలిపీల్చాను. పురోహితుడు పలకమన్న ప్రతి మంత్రాన్ని తు. చ. తప్పకుండా పలుకుతూ, చేయమన్నట్లే చేస్తున్నాను. జీలకర్ర బెల్లం పెట్టడం (ముహూర్తం) అయింది. మంగళ సూత్రాలు కూర్చిన పసుపుతాడు నా చేతికి యిచ్చారు శాస్త్రులవారు. తీసుకుని వెంటనే లేచి నిలబడి, వంగి శ్రీమతి మెడలో మూడు ముళ్ళు వేయ బోయాను. వెనక్కు లాగారు శాస్త్రులవారు, 'ఇంకా ఏడు నిముషాలు టైం వుంది సూత్రధారణకు' అని.

'ఇన్నాళ్ళూ లేని తొందర. నిముషాల్లో వచ్చింది యీ యనగారికి' అని, బిగ్గరగా నవ్వారెవరో. వేనుదిరిగి చూచాను. ఇంకెవరు. శ్రీమతి గారి స్నేహితురాళ్ళు. మా వాళ్ళంతా వాళ్ళను అనుసరించారు పళ్ళు బయట బెట్టి.

అన్నట్లు చెప్పడం మరిచాను. 1974 అక్టోబర్‌లో సెటిలైన మా పెళ్ళి 1975

వినాయకరావు పెళ్ళి

"నిన్న కాళ్ళు కిందకి వేలాడేసి కూర్చున్నానా లేక ఇలానా?" అడిగాడు శాస్త్రి కొనసాగి.

"కిందకి వేలాడేసి."

అదీ సంగతి. ఏవిటా ఒక్క ఆలోచనా రావటం లేదనుకుంటున్నాను" చెప్పి ఓ గుక్క విస్కీ తాగాడు శాస్త్రి.

"ఇప్పుడు ప్రారంభించు."

"తేలు దాటి మంత్రగబ్బలోకి, ప్రవేశిస్తున్నా కదా?" అడిగాడు శాస్త్రి విస్కీ సీసా వంక చూసి.

"అవును."

"కానీ. మన చేతుల్లో ఏంలేదు. ఆ ఎంత దాకా వచ్చాను" అడిగాడు శాస్త్రి.

"తూము దాకా. ఆ తర్వాత మరే కదలిక లేదు" విసుగ్గా చెప్పాడు వినాయకరావు

"ఇవాళ వుదయం పేపర్లో ఓ వార్త చదివాను. నీవూ చదివావు కదా పేపరు" అగాడు శాస్త్రి.

"చదివాను."

"అయితే ఆ వార్తేమిటో చెప్పు."

"దాదాపు నలభై ఏభై దాకా వార్తలున్నాయి. అందులో ఏదని 'చెప్పను?" అడిగాడు వినాయకరావు.

"అయితే అన్నీ చెప్పు."

"నన్ను న్యూస్ పేపర్‌ని అప్పచెప్పమంటం ఏం బాలేదురా శాస్త్రీ. ముందు విషయానికి రా."

"అదే నీకు నాకు తేడా."

"ఆ సంగతి నిన్ననుకున్నాం."

"ఏదీ. మళ్ళీ ఇంకోసారను" ఓ గుక్క తాగి అడిగాడు శాస్త్రి.

"నీది మహగట్టి బుర్ర కాబట్టి మాకు సామాన్యంగా కనబడే వార్తల్లోంచి నీకు చక్కటి ఆలోచనలు తడుతుంటాయి.

"మందు మీదున్నప్పుడు" చెప్పాడు శాస్త్రి.

"అవును."

"నా గురించి భలే నిజం బాగా చెప్పావోయ్ మిత్రమా." ఆ పొగడ్త చెవుల్లో తేనె పోసినట్లుగా వుండటంతో చెప్పాడు శాస్త్రి.

"ఇంతకీ అదేం వార్త?" అడిగాడు వినాయకరావు.

"బాబుగారు చిన్న సవారి దొరికింది. హిమయత్‌నగర్ దాకా వెళ్ళి రానా? పది నిముషాల్లో వస్తాను. మీ అంతట మీరే మోసుకెళ్ళండి. బరువు" అరిచాడు రిక్షావాడు.

"నా కోసం రిక్షా కూడా సిద్ధంగా వుంచావా మిత్రమా? నేనంటే నీకింత గౌరవం, ఎంత ప్రేమ? ఆ? ఏవీ? నీ కాళ్ళేవి?" అడిగాడు శాస్త్రి.

"నా కాళ్ళతో ఏం పని?

వాటిని నా చేతుల్లో వుంచి నీ కృతజ్ఞత తెలియ చెయ్యి. ఊరికే నా చేతులు నీ చేతులతో పట్టుకుని 'ఇవి చేతులు కావు' అనకు."

"ఇంతకి విషయానికి రాలేదు."

"రమణమూర్తి కూతురు ఆదిలక్ష్మి. ఆమె పెళ్ళి కామేశం బావతో జరక్కూడదు. అందుకు రమణమూర్తికి కామేశం మీద అయిష్టం కలగాలి" చెప్పాడు శాస్త్రి గంభీరంగా.

"సరిగ్గా అలా జరగాలి" చెప్పాడు వినాయకరావు.

మేలో జరిగింది లెండి, నా మూలంగానే.

నేటికీ, ప్రతి మారేజ్‌డేకి గ్రీటింగ్స్ పంపే శ్రీమతి స్నేహితురాళ్ళను, అనాటి నా తొందరపాటును తలచుకొని నవ్వుకుంటాము హాయిగా.

–యం. వి. మాధవరావు,
నెల్లూరు.

★ ★ ★



నిద్రపోతూ పెళ్ళి!

"నాటి పెళ్ళి ముచ్చట్లు" శీర్షిక చూడగానే నాకూ మా పెళ్ళినాటి ముచ్చట ఒకటి గుర్తుకొచ్చింది. మా పెళ్ళి 1984వ సం.లో జరిగింది. రాత్రి 11 గం. ముహూర్తం. అంతకు వారం రోజులు ముందునుంచీ పెళ్ళి పనులతో రాత్రింబవళ్ళు తిరిగి, కష్టపడి, అలిసిపోయి పెళ్ళి పీటల మీద నిద్రలేమి మొహంతో కూర్చున్నారు మావారు. పెళ్ళిలో హారతు లిచ్చేటపుడు "నిద్ర పోతున్నా వేమిట్రా?" అని బంధువులు, స్నేహితులు వేళాకోళ మాడేసరికి, ఉలిక్కిపడి కళ్ళు తెరిచి "పొగకి మండుతుంటే కళ్ళు మూసుకున్నాను" అని జవాబు చెప్పడంతో పెళ్ళి పందిరంతా నవ్వులతో నిండిపోయింది. తాళి కట్టేప్పుడు "ఒరేయ్? నిద్ర మత్తులో ఒక ముడే వెయ్యకు రోయ్! మూడు ముళ్ళు గట్టిగా వెయ్యి. ఇపుడు నిద్రపోతే ఈ ఛాన్సింకా రాదు" అని స్నేహితులు వేళాకోళ మాడేసరికి, మరోసారి నవ్వులతో పెళ్ళి పందిరి మారుమ్రోగింది. ఆ సంఘటనలు తల్చుకుంటే ఇప్పటికీ నవ్వొస్తుంది. ఎపుడైనా మా వారికి కోపం వచ్చినప్పుడు "నిద్రపోతూ పెళ్ళి చేసుకున్న వారికి కూడా కోపమేనా" అంటే చాలు, కోపం అంతా పోయి నవ్వేస్తారు.

–ఎమ్. స్వయంప్రభ,
రాజమండ్రి

★ ★ ★



స్పెషల్ బిస్కట్లు!

మా పెళ్ళి జరిగి 40 సం.లు అయినా ఈ సంఘటన మటుకు మర్చిపోలేము. మా పెళ్ళి తిరుపతిలో చేద్దామని నిర్ణయించి మగ పెళ్ళివారు, మేము ఒకేసారి బయలుదేరే ఉద్దేశ్యంతో పెళ్ళివారు ముందుగా మా ఇంటికి వచ్చేరు. అప్పుడు మా వారు అంటే పెళ్ళి కొడుకు టిఫిన్ ఏమి తినను అనడంతో మా నాన్నగారు మంచి స్పెషల్ బిస్కట్లు తెమ్మని మా తమ్ముణ్ణి పంపించేరు. అప్పుడు బజారులోకి కొత్తగా కుక్క బిస్కట్లు వచ్చేయి. మా చిన్న తమ్ముడికి అవి కుక్కలకని తెలియక స్పెషల్ కంపెనీ అనుకొని బావగారి కోసం తెచ్చి పై కాయితం చింపేసి ప్లేటులో పెట్టి ఇచ్చాడు. అవి చాలా గట్టిగా ఉండి పాపం మా వారు తినలేక అవస్థపడుతూ ఉంటే, మా వాళ్ళు ఆయన తినడానికి మొహమాట పడుతున్నారని అనుకుని బలవంతంగా చాలా భాగం తినిపించేరు. నమిలి, నమిలి మా వారికి దవడలు వాచి తరువాత చాలా బాధపడ్డారు. తరువాత ఆ బిస్కట్లు సంగతి తెలిసి మా నాన్నగారు అంతకంటే బాధపడ్డారు. బిస్కట్లు చూసినప్పుడల్లా మాకీ సంఘటన గుర్తుకొచ్చి నవ్వుకుంటూ ఉంటాము.

– బి.వి.ఎస్. లక్ష్మి, న్యూఢిల్లీ

ఓ గుక్క విస్కీ తాగి చెప్పాడు శాస్త్రి.

"అయిష్టం కాదు. అసహ్యం కలిగించే ప్లేన్ ఇది."

"మరీ మంచిది ఏమిటది?" వుత్సాహంగా అడిగాడు.

"బాబుగారు. వెళ్ళి చిటికెలో వస్తా" అరిచాడు రిక్షావాడు.

శాస్త్రి వాడికి చేతి నూపి బార్‌లో పని పూర్తి చేసుకుని, డ్రస్ మార్చుకుని వెళ్తున్న బేరర్‌తో చెప్పాడు.

"బేరర్. మరో పెగ్."

"ష్. తంతాడు. ఇది రోడ్డు వాడు ఇంటికి వెళ్తున్నాడు" చెప్పాడు వినాయకరావు శాస్త్రితో.

శాస్త్రి, సిగరెట్ వెలిగించి, మరో గుక్క తాగి చెప్పసాగాడు–

"కామేశానికి ఎయిడ్స్ వ్యాధి."

"ఏమిటి?" వులిక్కి పడ్డాడు వినాయకరావు.

"అవును."

"నీకెలా తెలుసు?"

"మనకి తెలియక్కర్లేదు. రమణమూర్తికి ఆ సంగతి తెలిస్తే చాలు."

"ఎలా తెలియడం?"

శాస్త్రి కొద్ది సేపు ఆలోచించాడు.

"ఎయిడ్స్ వ్యాధి లక్షణాల వల్ల."

"అవేవిటి?"

"నీకు తెలీదా? నాకూ తెలీదు. అయినా పర్లేదు. ఇప్పుడు ఆలోచిద్దాం. డిసెంట్రీ ఓ లక్షణం."

"డిసెంట్రీ."

"అవును. అలాగే డల్‌గా, నీరసంగా వుండటం."

"ఇంకా?"

"ఇంకా.... వామిటింగ్స్ కూడా ఓ ముఖ్యలక్షణం."

"ఈ మూడు లక్షణాలు వున్న వాళ్ళకి ఎయిడ్స్ వ్యాధి వుంది అని రమణమూర్తిని నమ్మించడం ఎలా?"

"ఆ సంగతలా వుంచు. ఉదయం నేను చదివిన వార్తని గురించి అడుగు."

"చెప్పు."

"నువ్వడక్కుండా ఎలా చెప్పను?" అడిగాడు శాస్త్రి మరో గుక్క తాగి.

"నువు వుదయం పేపర్లో చదివిన వార్తేమిటి గురు?"

"ఎయిడ్స్ వ్యాధి వల్ల అమెరికాలో పది లక్షల మంది దాకా బాధ పడుతున్నారట. మరో అయిదేళ్ళలో ఆ సంఖ్య ఏభై లక్షలని చేరుతుందని అంచనా. ఎయిడ్స్ వ్యాధి వస్తుందన్న భయంతో ఎవరూ వేశ్యలదగ్గరకి వెళ్ళడం లేదట. హమోసెక్సువల్ అన్న అనుమానం గలవాణ్ణి చంపేస్తున్నారుట కొందరు. వాళ్ళే అంత భయపడితే పిల్లనిచ్చేవాడు ఇంకెంత భయపడాలి అన్న థియర్ మీంచి ఈ ప్లేన్ లాక్కొచ్చాను" చెప్పాడు శాస్త్రి.

వినాయకరావు కొద్దిగా ఆలోచించి చెప్పాడు.

"కాని మనదేశంలో ఎయిడ్స్ వ్యాధి వచ్చిన వాళ్ళు లేరుగా?"

"ఇప్పుడిప్పుడే వుంటున్నారు. సినిమా ఇండస్ట్రీలో వాళ్ళు ఎలాంటి వాళ్ళయినా బయట వాళ్ళు వాళ్ళ గురించి చెడ్డగా అనుకుంటుంటారు. కామేశానికి ఆ వ్యాధి రావడంలో ఆశ్చర్యం లేదు. సింగపూర్‌కి కెళ్ళొచ్చాడు."

"అలాంటిదేం లేదే."


"పోనీ వెళ్ళొచ్చిన వాళ్ళు ఇతని యూనిట్‌లో వున్నారు. వాళ్ళ ద్వారా కొందరు జూనియర్ ఆర్టిస్ట్‌లకి, ఆ పైన వాడికి అంటుకుందన్న థియేర్‌ని మరణమూర్తి మనసులో ఆలోచించుకోగలడు"

"మరీ ఎయిడ్సా అసహ్యంగా?"

"నీవు సెంటిమెంటల్‌గా ఫీలవుతే ఎలా? ఇలా అయితే నేనేం ఆలోచించలేను" కోపంగా చెప్పాడు శాస్త్రి.

"అలాగే. చెప్పు."

"చూడు ఈ తూము మీద కూర్చుని కాళ్ళడిస్తుంటే ఎలాంటి మంచి ఆలోచనలు వస్తున్నాయో. రమణమూర్తికి ముందర ఈ వ్యాధి లక్షణాల గురించి ఎక్కిస్తాం. అటు పిమ్మట కామేశంలో ఈ లక్షణాలని ఆయనకి చూపిస్తాం."



"ఎలా?"

"అన్నీ ఇప్పుడే చెప్పను. ఈ రెండు ఎలా అని నా దగ్గర రెండు సరయిన సమాధానాలున్నాయి. దాంతో మరణమూర్తికి తన కూతుర్ని కామేశానికివ్వాలంటే చచ్చేంత భయం కలుగుతుంది."

"నిజమే."

"శాస్త్రి మరో గుక్క తాగి చెప్పాడు.

"ఓ పక్క ఇటు కామేశం ఆదిలక్ష్మిని చేసుకోకూడదనుకుంటాడు. మరో పక్క అటు రమణమూర్తి తన కూతుర్ని కామేశానికి ఇవ్వకూడదనుకుంటాడు. దాంతో మేరేజ్ సెటిల్ కాదు."

"అవును గురు."

"ఇంకో పథకం వేసి నాదకర్ణికి కూడా తన కూతుర్ని రమణమూర్తి కొడుక్కి ఇవ్వకూడదన్న ఆలోచన చేస్తే పని సక్సెస్."

"నాదకర్ణి కొడుకుని రమణమూర్తి కూతురికి" సరి చేసాడు వినాయకరావు.

"నాదకర్ణి ఎవరు? రమణమూర్తెవరు? " అడిగాడు శాస్త్రి మత్తుగా చూస్తూ.

"అదేమిట్రా? వాళ్ళిద్దరు...."

"అసలు నువ్వెవరు నా పక్కన కూర్చుని వున్నావు? సమయం చేసి నా జేబు కొట్టేద్దామనా?" అడిగాడు శాస్త్రి.

"అదేమిటి గురు? నేను వినాయకాన్ని."

"అబద్ధాలాడకు. నీకు తొండం లేదే మరి."

శాస్త్రి ఆఖరి గుక్క తాగి సీసాని తూములోకి పారేసాడు. వినాయకరావు గమనించాడు శాస్త్రి కాళ్ళూపడం మానేసాడని.

"ఓసారి కాళ్ళూపు గురు. అంతా గుర్తుకు వస్తుంది." చెప్పాడు.

దూరం నించి ఇద్దరు బీట్ కానిస్టబుల్స్ వాళ్ళ దగ్గరకి వచ్చారు.

"ఏమిటిది? ఇక్కడేం చేస్తున్నారు?" అడిగాడు లాఠీని నేల మీద కొట్టి.

"గాలికి కూర్చున్నాం" చెప్పాడు వినాయకరావు లేచి నిలబడి.

"వాడు నా జేబు కొట్టేయాలని నా దగ్గరకి చేరాడు" చెప్పాడు శాస్త్రి మత్తుగా.

రెండో బీట్ కాన్‌స్టబుల్ వినాయకరావు వంక అనుమానంగా చూసాడు.

"అవునా?" అడిగాడు.

"అబద్ధం. వీడికి మందెక్కువైంది."

"అలాగా. అతని పేరేమిటి?" అడిగాడు ఓ కాన్‌స్టబుల్ గద్దిస్తూ.

"శాస్త్రి."

"నీ పేరేంటి?" శాస్త్రిని అడిగాడు.

"రమణమూర్తి" చెప్పాడు శాస్త్రి తూలుతూ.

వెంటనే ఓ కాన్‌స్టబుల్ మరో కాన్‌స్టబుల్‌తో చెప్పాడు.

"వీడు నిజంగా పిక్‌పాకెటర్. తన ఫ్రండన్నాడు. పేరు చెప్పమంటే తప్పు చెప్పాడు. పట్టుకెళదాం."

"లేదండి. నేను దొంగని కాను. మేం ఇద్దరం ఎల్. ఐ. సి.లో పని చేస్తున్నాం" చెప్పాడు వినాయకరావు గాభరాగా.

"బాబు నీవు పని చేసేది ఎల్. ఐ. సి. లోనా?" అడిగాడు ఓ కాన్‌స్టబుల్ శాస్త్రిని.

"కాదనుకుంటా. న్యూస్ పేపర్‌లో!" చెప్పాడు శాస్త్రి.

"నడు" గద్దించాడు వినాయకరావుని ఓ కాన్‌స్టబుల్.

"అది తప్పండి. నేను...."


"నోరెత్తక. స్టేషన్‌కి నడువ్. తాగిన వాడని పక్కకి చేరి జేబు కొట్టేద్దా



ఆమెకి కూడా సంరక్షణ కావాలి!

ఉదయం టిఫిన్ చేయడం, పిల్లలను బడికి పంపడానికి తయారు చేయడం, మధ్యాహ్నం వంట, బజారుకు వెళ్ళి సరుకులు తేవడం, యిల్లు సర్దుకోవడం, కుటుంబంవారి మంచి చెడూ చూసుకోవడం.... ఇలా నాకు లేచింది మొదలు పడుకునేవరకు పనే.

హార్లిక్స్‌కి పోషణ శక్తి ఉండటంవల్ల మా డాక్టరు దీనిని సిఫార్సు చేశారు. హార్లిక్స్ రోజంతా నాకు కావలసిన శక్తి సత్తువ యిస్తుంది. అందుకే సాయంకాలాలు కూడా నా కుటుంబ సభ్యులతో ఆ విలువైన సమయాలు ఆనందంగా గడపడానికి తగిన ఉత్సాహంతో ఉండగలుగుతున్నాను.



గృహిణికి శక్తినిచ్చే పానీయం

హార్లిక్స్‌లో కీలకమైన సహజపోషకాలు- మాంసకృత్తులు, విటమినులు, ఖనిజాలు, పిండిపదార్థాలు, సమృద్ధంగా ఉన్నాయి. అవి రోజంతా బలం, జీవశక్తి సమకూరుస్తాయి.

కుటుంబానికంతటికీ పోషక శక్తి సమకూర్చేదిగా రుజువుకావడంవల్ల ప్రపంచ మంతటా డాక్టర్లు హార్లిక్స్‌ని సిఫార్సు చేయడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు.



మంచి పుష్టికరమైనది

మనుకుంటున్నావా?"

"అది కాదు సర్. వాడికి తాగితే తన పేరుతో సహా ఈ లోకం అంతా మర్చి పోవడం అలవాటు."

"వచ్చేసా బాబు. పడి పోయారా?" అడిగాడు రిక్షావాడు రిక్షాతో వేగంగా తూము దగ్గరకి వచ్చి."

"పడి పోవడం ఏమిటి?" గద్దించాడు కానిస్టేబుల్ అనుమానంగా చూస్తూ.

"ఈ తూము మీద కూర్చుని ఈయన తాగుతాడు. పడిపోయాక నా రిక్షాలో ఈయన ఇంటికి చేరుస్తాడు.' చెప్పాడు రిక్షావాడు.

కానిస్టేబుల్స్ ఇద్దరు ఒకరి మొహాల నంక మరొకరు చూసుకున్నారు.

"అవును. నిన్న నేనే ఈయన గార్ని ఇంటికి చేర్చింది." చెప్పాడు రిక్షావాడు.

"ఇప్పుడయినా నిజం తెలిసిందిగా" అడిగాడు వినాయకరావు.

"ఓ కానిస్టేబుల్ వినాయకరావు మొహం మీద లైటు వేసి చూసి అడిగాడు.

"అరె! వినాయకరావు కదా నువ్వు?"

"అవును. నేనెలా తెలుసు?" అడిగాడు అతను ఆశ్చర్యంగా.

"నన్ను, మా సర్కిల్ ఇన్స్పెక్టర్‌ని పెళ్ళి తప్పించు కునేందుకు కొట్టి అరెస్ట్ అయి, విడుదలైంది నీవే కదూ?"

"అవును. రెండు వారాల క్రితం జరిగిందిది. అమ్మయ్య. నన్ను గుర్తు పట్టారన్న మాట.

"బదులుగా ఆ రోజు కొట్ట లేదు. ఇంత చెడ్డ ఆలోచన వచ్చినందుకు నిన్నేం చేయాలి?" గద్దించా డతను.

"నాకు వచ్చిన ఆలోచన కాదిది. ఇదిగో, ఈ శాస్త్రి గాడిచ్చిన ఆలోచన అది."

"ఈయన పడి పోయారు. అమ్మయ్య. ఓ పనై పోయింది. తూముకి రిక్షా ఆనించి శాస్త్రిని రిక్షాలోకి లాగుతూ చెప్పాడు రిక్షావాడు.

"ఇలా దార్లో పడి తాగడం, పోలీసుల్ని స్వంత ప్రయోజనాల కోసం కొట్టడం లాంటి వన్నీ నేరాలు. ఇంకోసారి ఇక్కడ కనబడితే స్టేషన్‌కి రావాల్సి వుంటుంది.' చెప్పాడు రెండో కానిస్టేబుల్.

"నే వెళ్ళచ్చుగా!" అడిగాడు వినాయకరావు.

రిక్షాలో ఇంటికి చేరుకున్నారు. రిక్షావాడు, వినాయకరావు శాస్త్రిని గదిలోకి మోసు కెళ్తుంటే చెప్పాడు తమ ఇంటి గుమ్మంలోంచి రమణమూర్తి కంగారుగా.

"అరెరె! శాస్త్రి కేమైంది?"

ఆయన హడావిడిగా వచ్చి శాస్త్రి నాడి చూసాడు. ఆయనకి శాస్త్రి నించి ఆల్కహాల్ వాసన వేసింది.

"నా ఇంట్లో ఇదేం అప్రాచ్యపు పని?" అడిగా డాయన కోపంగా.

"శాస్త్రికి ప్రమోషన్ వచ్చింది. అందుకని జీతం నాలుగు వందలు పెరిగింది. పార్టీలో ఇలా అయింది."

"మరీనెల ఇల్లు ఖాళీ...."

"మా జీతం పెరిగింది. కాబట్టి మీ అద్దె పెంచా లన్నాడు శాస్త్రి ఇందాకే. చేరిన తర్వాత మళ్ళీ మీరు అద్దె పెంచనే లేదు. ఈ ఇంటికి ఎంత పెంచచ్చుంటారు?" అడిగాడు వినాయకరావు.

వెంటనే రమణమూర్తి మొహం లోని కోపం మటుమాయమయి ప్రశాంతంగా మారింది. శాస్త్రికి దుప్పటి కప్పి చెప్పాడు....

"ఏభై దాకా పెంచచ్చు."

"ఈ నెలనించే పెరిగిందనుకోండి. మళ్ళీ మా శాస్త్రికి ఎప్పుడు ప్రమోషన్ వస్తుందో, ఎప్పుడు తాగుతాడో" చెప్పాడు వినాయకరావు.

"అంటే అలవాటు లేదన్న మాట?" అడిగా డాయన.

"ఛస్తే లేదు."

"నీవూ పుచ్చుకున్నావా?"

"ఉహు. నాకు కాదుగా ప్రమోషన్ వచ్చింది."

"ఈ అయ్య ఇంటికి తీసుకు రావడానికే వచ్చారు" రిక్షావాడు సాక్ష్యం చెప్పాడు.

"పడుకోండి. అలసి పోయి వచ్చారు. పొద్దు పోయింది." చెప్పాడు రమణమూర్తి బయటికి వెళుతూ.

రిక్షా పాడికి డబ్బిచ్చాడు వినాయకరావు. అతను బయటకి వెళుతూ చెప్పాడు.

"రేపు పోలీసు లొచ్చేలోగా బేగి వచ్చేద్దాం. నేను పదకొండు నించి రెడీగా వుంటాను."

వినాయకరావు శాస్త్రి చెప్పిన ఆ రెండో పథకం గురించి ఆలోచించాడు కాసేపు. అతనికి అది బానే వున్నట్లుగానే అనిపించింది. రమణమూర్తి ఎయిడ్స్ వ్యాధి ఇండియాకి వచ్చిందని నమ్మడేమో అనిపించింది. అదే సంగతి మర్నాడు వుదయం పంపు దగ్గర నీళ్ళు పడుతూ ఆదిలక్ష్మిని అడిగాడు.

"నమ్ముతారండి. మీకు ఈ లోకంలోని మనుషుల గురించి పెద్దగా తెలిసినట్లు లేదు. చెడుని నమ్మినట్లుగా మంచిని ఓ పట్టాన నమ్మలేరు."

"నమ్మితే సరే."

"మన పక్కింటాయన్ని రాత్రి పోలీసులు అరెస్ట్ చేసారు తెలుసా?" అడిగింది కాసేపాగి.

"దేనికి?" అడిగాడు వినాయకరావు.

"నిన్న వుదయం స్కూటర్ ఓ ముసలిదాని మీంచి పోనించి కాలు విరగ్గొట్టి నందుకు."

"అలాగా!"

"మొన్న పెళ్ళయిన మా బావకి ఇండియాలోని ప్రభుత్వ కార్యాలయా లన్నిటిలో ఎంతో ఎఫిషిమెంట్ పని చేసినందుకు పది లక్షల నగదు బహుమతిని రాష్ట్రపతి గ్రాంట్ చేసారు."

"నిజంగా! ఆయన్ని చూస్తే అలా అనిపించ లేదే?" అడిగాడు వినాయక రావు.

ఆదిలక్ష్మి ఫక్కున నవ్వి చెప్పింది.

"రెండూ అబద్ధమే. చూసారా మీరు చెడు వార్తని తక్కున నమ్మేసారు. మంచి వార్త విషయంలో డౌట్ పడ్డారు. అది మానవ నైజం. మా నాన్నగారు మా బావకి ఎయిడ్స్ అంటే నమ్ముతాడు, ఆయన నమ్మేవిధంగా చెప్పగలిగితే."

"మీకు నచ్చితే చాలు."

"ఓసారి మీరు, మరోసారి నువ్వు ఏమిటండి? నన్ను నువ్వు అనండి చాలు" కోరింది ఆదిలక్ష్మి.

"అలాగే"

"ఇవాళ సాయంత్రం మనం కలుసుకుంటున్న సంగతి మర్చి పోలేదుగా?"

"లేదు. వేమన విగ్రహం దగ్గర."

"అయిదున్నరకి." చెప్పింది ఆదిలక్ష్మి.

"మళ్ళీ మీ బావ ఎప్పుడు వచ్చేది?" అడిగాడు వినాయకరావు.

"షూటింగ్ అయిపోవస్తోంది. త్వరలో వస్తాడు. ఈలోగా మేం ఓసారి కరీంనగర్ వెళ్ళి సినిమా షూటింగ్ చూడాలను కుంటున్నాం. వెళ్తే మీరు కేసెట్‌లో చెప్పింది అక్కడ అమలు పరుస్తాను." చెప్పింది ఆదిలక్ష్మి.

"ఈ రెండోది వాళ్ళొచ్చాక అమలు చేద్దాం" చెప్పాడు వినాయకరావు తృప్తిగా.

"దీంట్లోంచి బయట పడతామనే నమ్మకం ఇప్పుడిప్పుడే కలుగుతోంది నాకు." చెప్పింది ఆదిలక్ష్మి.

రమణమూర్తి బయటికి రావడంతో నీళ్ళ బిందె ఎత్తుకుని వినాయకరావు తన పోర్షన్ వైపు నడిచాడు.

(ఇంకావుంది)

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్

ఆహారం-పోషణ సర్టిఫికెట్ స్థాయి కార్యక్రమం-88-89

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం భారతదేశంలో తొలి సార్వత్రిక విశ్వవిద్యాలయం. ఇది 1982 లో స్థాపితమైంది. ఇది డిగ్రీ స్థాయి కోర్సులతోపాటు (బి. ఏ., బి కాం., బి. యస్. సి.) కొన్ని డిప్లమా కోర్సులనుకూడా నిర్వహిస్తోంది. వివిధ కారణాలవల్ల, కుటుంబ బాధ్యతలవల్ల విశ్వవిద్యాలయంలో చేరి చదువుకోలేనివారుసైతం ఈ విశ్వ విద్యాలయంలో చేరి చదువుకోవచ్చు. 1985 సెప్టెంబరులో ప్రారంభమైన ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం సహకార, సమన్వయాలతో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆరు మాసాల వ్యవధిగల "ఆహారం - పోషణ" అను సర్టిఫికేట్ కోర్సును ఈ విద్యా సంవత్సరంనుండి ప్రారంభిస్తోంది ఈ కోర్సు,చదవడానికి అభ్యర్థులనుండి అప్లికేషన్లు ఆహ్వానిస్తోంది.

ఈ కోర్సు ఎవరికి ?

చదవనూ, రాయనూ వచ్చి 1988 సెప్టెంబరు, 1వ తేదీ నాటికి 20 సంవత్సరాలు నిండిన యువతీ యువకు లందరూ అర్హులే.

బోధనా పద్ధతులు :

* నిపుణులైనవారు ఆయా అధ్యయన కేంద్రాలలో పాఠ్యాంశాలలో నిర్వహించే సలహా - సంసర్గ - తరగతులు.
* సొంతంగా చదువుకోవడానికి వీలైన పద్ధతిలో పాఠ్య విషయ నిపుణులు రాయగా ముద్రించిన పాఠ్యపుస్తకాలు.
* రేడియో పాఠాలు, ఆడియో, వీడియో పాఠాలు.

అధ్యయన కేంద్రాలు :

హైదరాబాదు, సికిందరాబాదు, విశాఖపట్నం, తిరుపతి, వరంగల్.

దరఖాస్తు పొందే విధానం :

పోస్టుద్వారా : దరఖాస్తు ఫారాన్ని పోస్టుద్వారా "డైరెక్టరు, విద్యార్థి సేవా విభాగం, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, 8-3-952/10/67, శ్రీనగర్ కాలని రోడ్డు, పంజగుట్ట, హైదరాబాదు-500 016" నుండి పొందవచ్చు. అధ్యయన కేంద్రాలకు రాయకండి. దీనికిగాను మీరు రూ. 10/- డి. డి. గానీ పోస్టల్ ఆర్డరుగానీ "ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు" పేర తీసుకొని మీ అభ్యర్థన లేఖకు జతపరిచి పైన పేర్కొన్న చిరునామాకు పంపాలి. పోస్టుద్వారా దరఖాస్తు ఫారాలు 18-7-88 నుండి 18-8-1988 వరకు మాత్రమే పొందవచ్చును.

స్వయంగా : మీరు స్వయంగా దరఖాస్తుఫారం పొందాలనుకొంటే రూ. 5/- డి.డి.ద్వారాగానీ, పోస్టల్ఆర్డరు ద్వారా గానీ "రిజిస్ట్రారు, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం" పేర తీసుకొని "డైరెక్టరు, విద్యార్థి సేవా విభాగం" నుండి గానీ" పౌరసంబంధాల సహాయ అధికారి, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, 6-3-645, సోమాజీగూడ, హైదరాబాద్- 500482" నుండిగానీ పొందవచ్చు.

ఈ క్రింది అధ్యయన కేంద్రాలనుండి కూడా మీరు స్వయంగా దరఖాస్తుఫారాలను [గురువారం తప్ప] అన్నిరోజుల లోనూ మధ్యాహ్నం 3-00 గంటల నుండి సాయంత్రం 6-00 గంటల వరకు పొందవచ్చు.

1. విశాఖపట్నం, వి.యస్. కృష్ణా గవర్నమెంటు కాలేజి. 2. తిరుపతి, యస్.వి. ఆర్ట్సు కాలేజి. 3. వరంగల్ ఆర్ట్సు అండ్ సైన్సు కాలేజీ.

దరఖాస్తు ఫారాలు పొందే వివరాలు

జంట నగరాలు	: 18-7-1988 నుండి 18-8-1988 వరకు
పైన పేర్కొన్న అధ్యయన కేంద్రాలలో	: 26-7-1988 నుండి 18-8-1988 వరకు

నింపిన దరఖాస్తు ఫారాలతోపాటు 18-8-88 లోపు తీసుకొన్న రూ. 10/- డి.డి.గానీ పోస్టల్ ఆర్డరుగానీ [రిజిస్ట్రేషన్ ఫీజు] జతపరిచి 25-8-88 లోపు చేరేలాగా "డైరక్టరు, విద్యార్థి సేవా విభాగం" కార్యాలయానికి పంపాలి.

[సం.]

రిజిస్ట్రారు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

1988 దీపావళి కథల పోటీ

మొత్తం బహుమతులు రు. 7,200/-

ముగింపు తేదీ : 10 సెప్టెంబరు, 1988

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా దీపావళి కథల పోటీ నిర్వహిస్తున్నాము. గతంలో లాగే ఈ సంవత్సరం కూడా సంపాదకుని ఎన్నికలో ఉత్తమంగా వచ్చిన ఆరు కథలని అకారాది క్రమంలో ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి సంచిక, ఆ తరువాతి సంచికల్లో ప్రచురిస్తాము. అనంతరం పాఠకుల బాలట్ నిర్వహిస్తాము.

పోటీలో సంపాదకుని ఎన్నికలో వచ్చిన ఆరుకథలకీ ఒక్కొక్క దానికి రు. 700/- చొప్పున బహుమతి లభిస్తుంది. ఆ తరువాత పాఠకుల బాలట్‌లో మొదటి స్థానంలో వచ్చిన కథకి రు. 750/- అదనపు బహుమతిగా అంద జేస్తాము. బాలట్‌లో రెండవ, మూడవ స్థానాలలో వచ్చిన కథలకి వరుసగా రు. 650/- ; రు. 550/- వంతున అదనపు బహుమతులుగా లభిస్తాయి. మిగిలిన మూడు కథలకీ ప్రత్యేక బహుమతిగా ఒక్కొక్క దానికీ రు. 350/- చొప్పున అందజేస్తాము.

పోటీలో సాధారణ ప్రచురణకి స్వీకరించిన కథలకి ఒక్కొక్క దానికీ రు. 150/- వంతున వాటి ప్రచురణ జరిగిన తర్వాత ఇస్తాము.

నిబంధనలు

1. కథావస్తువు తెలుగువారి సామాజిక జీవితానికి సంబంధించినదై ఉండాలి.

2. కథ వ్రాతప్రతి పన్నెండు అరఠావు (ఎక్సర్‌సైజ్ నోట్ పుస్తకం పేజీకి రెట్టింపు) పేజీలకి మించి ఉండరాదు. కాగితానికి ఒక వైపే సిరాతో లేదా బాల్ పెన్‌తో రాయాలి. వ్రాత ప్రతిపై "1988 దీపావళి కథల పోటీకి" అని మొదటి పేజీ పై భాగంలో స్పష్టంగా రాయాలి.

3. అనువాదాలు, అనుసరణలు, కాపీ కథలు పంపరాదు. గతంలో ఇతర పత్రికలకి పరిశీలనకి పంపిన, ప్రచురింపబడిన, రేడియో, టి. వి. లలో ప్రసారం అయిన రచనలని పోటీకి పంప కూడదు. ఈ మేరకి రచయిత (త్రు)లు హామీ పత్రం రాసి వ్రాత ప్రతికి జతపరిచి పంపాలి. హామీ పత్రం లేని రచనలని పరిశీలించటం జరగదు. ఆంధ్ర పత్రిక సంస్థ ఉద్యోగులు, వారి బంధువులు ఈ పోటీలో పాల్గొనరాదు.

4. రచయిత (త్రు)లు కలం పేరుతో రాసినా, వారు తమ అసలు పేరు, పూర్తి చిరునామా వ్రాత ప్రతి మీద స్పష్టంగా రాయాలి.

5. సంపాదకుని ఎన్నికలో బహుమతి పొందిన ఆరు కథలనీ ఆయా రచయిత (త్రు)ల పేర్లు లేకుండా ప్రచురిస్తాము. తరువాత బాలట్ ఫలితాలతో పాటు వారి పరిచయాలని ఫోటోలతో సహా ప్రచురిస్తాము.

6. పోటీ లో బహుమతి పొందిన కథా రచయిత (త్రు)లు తమ జీవిత వివరాలని, ఫోటో లని పంపి, వాటి ప్రచురణకి అంగీకరించ వలసి ఉంటుంది.

7. రచనలపై వచ్చే ఎటువంటి పేచీలకైనా ఆయా రచయిత (త్రు)లే బాధ్యత వహించ వలసి ఉంటుంది.

8. పోటీకి పంపే కథలని 10 సెప్టెంబరు, 1988కి కానీ ఆలోగా కానీ మా కార్యాలయానికి అందేలా పంపాలి. ఆ తరువాత అందిన వాటిని పోటీకి పరిశీలించటం జరగదు.

9. పోటీకి పంపిన కథలని ఎట్టి పరిస్థితులలోనూ తిప్పి పంపటం జరగదు. కాబట్టి రచయిత (త్రు)లు తమ కథలతో పాటు తపాలా బిళ్ళలు అతికించిన, స్వంత చిరునామా కల కవర్లని జతపరచ వలసిన అవసరం లేదు.

10. పోటీలో బహుమతి పొందని కథలలో కొన్నిటిని సాధారణ ప్రచురణకి స్వీకరించి వాటిని వీలు వెంబడి ప్రచురిస్తాము. స్వీకరించిన కథల విషయం ఆయా రచయిత (త్రు)లకి తెలియ చేస్తాము. ప్రచురణకి స్వీకరించని కథల విషయంలో ఆయా రచయిత (త్రు)లకి తెలియ చెయ్యటం సాధ్యంకాదు. కాబట్టి వాటి విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకి అవకాశం లేదని గమనించ కోరుతున్నాము.

11. పోటీకి పంపే కథలని "సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ - 520003" అనే చిరునామాకి పంపాలి. వ్యక్తుల పేర పంపరాదు. కవరు పై భాగంలో "1988 దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి.

రచయిత (త్రు)లు అందరూ ఉత్సాహంగా ఈ పోటీలో పాల్గొని దీనిని జయప్రదం చేయగలరని ఆశిస్తున్నాము.

—సంపాదకుడు

ప్రశ్నావళి — కె. రామలక్ష్మి

కె. ఎస్. పి. అమలాపురం.

★ ఒకనాడు సామాన్యులకోసం కవిత్వం రాసిన కవులు, ఈనాడు సినిమాల్లోపడి ప్రజల సంగతి వదిలేశారు?

ఏం చేస్తారు? జానెడు పొట్ట కవులకూ వుందికద!

★ సినిమాలు పత్రికలు నవలలు యువతరాన్ని కలల్లో విహరింపచేసి మానసిక సంఘర్షణలకు గురిచేస్తున్నాయి. దీనికి పరిష్కారమార్గం ఏమిటి?

సంపాదకు లొకవేళ "మీ కెలాంటి రచనలు కావాలి?" అని అడిగినా – నిర్మాతలను "ఎలాంటి సినిమాలు కావాలని అడిగినా..... వారు పబ్లికుగా అందించే సమాచారం – వారి కనుకూలమైనదిగానే – వుంటుందని గ్యారంటీగా చెప్పవచ్చు. ఎందుకంటే పత్రికలూ, నిర్మాతలూ – విమర్శను తమ వాదం పెంపొందించుకోడంకోసం – తగినంత మాత్రమే భరించకలరు! ఇక – ఏవిచూడాలి? ఏవి చదవాలి అన్న నిర్ణయమేనా మన చేతుల్లో వుంది కనుక మనం – మన దారి – సరైనదిగా చూసుకోవా లి అంతే. మురికివాడల్లో కూడా శుభ్రంగా వుండాలని. పరిసరాలు శుభ్రంగా వుంచుకోవాలనీ చూసే ప్రాణులు ఒకటీ అరా వుంటూనే వుంటాయి. అలాగే మనమూ – ఈ మురికి మనకి అంటకుండా చూసుకునే ప్రయత్నం చేయవచ్చు – నని నేను అనుకుంటూ వుంటాను.

★ నేడు అధికసంఖ్యలో వస్తున్న సినిమా పత్రికలపై మీ అభిప్రాయం?

నేను వాటిని చూడడంలేదు. అవీ – పాఠకాభిరుచికి అనుగుణంగానే వుండాలికద!

బి. ఎస్. భీమవరం.

★ స్త్రీలు తమ పేర్లవెనుక భర్తల పేర్లు తగిలించుకోవడం తప్పుకాదా?

తప్పుకాదు. కాని తగిలించుకుని తీరాలన్న రూలూ లేదు. అలా రూల్ పెడితే – ప్రతిఘటించినా తప్పుకాదు. అన్నిటా 'దొరలని' అనుసరించే మనకిదీ అలవాటైంది. దీన్నిగురించి తలలు బద్దలుకొట్టుకోవడం – టైంవేస్టు. వినలేదా పూరికి రాజైనా మా అమ్మాయి 'మొగుడే' అనేమాట! అలాగే భర్త తరఫువాళ్ళు అబ్బాయి పెళ్ళాం అనీ, అమ్మాయితరఫువాళ్ళు అమ్మాయి మొగుడనీ వ్యవహరించడం పరిపాటే – ఎన్నో స్త్రీలను చిన్నచూపుచూసే విషయాలుండగా ఈ విషయం భూతద్దంలోంచి చూసి బెదురుకోవడం సిల్లీ అని నా అభిప్రాయం.

★ ఆరుద్రగారి భావాలతో మీ రెంతవరకు ఏకీభవిస్తారు?

కుటుంబానికి – అవసరమైనంతవరకు. మిగిలినవాటిలో మా అభిప్రాయాలు – ఉత్తరదక్షిణ ధృవాలు!

డి. ఎ. డి. కాకినాడ.

★ ఆదర్శాలకి కూడా ఓ ఎల్ల ఉంటుంది కదా?

ఉంటుంది. అది తెలిసేది- వయసు ముదురుతున్నకొద్దీ కదా?

జి. ఆర్. కె. రాయగడ

★ తన చెల్లెలిని ఏమన్నా సహించలేడట. కాని తను ఎవరిని ఏమన్నా సహించాలట. ఇదెక్కడి న్యాయం అండీ?

● దీంట్లో న్యాయానికి చూపెక్కడవుంది? తన చెల్లెలు తన బాధ్యత. పూరివాళ్ళు – పైవాళ్ళు – అందుకే కద రోడ్డు మీద నడిచే పరాయి ఆడవారిని ధైర్యంగా – ఎంత అసభ్యంగా నైనా మాట్లాడ కలుగుతున్నారు.

ఆర్. నారాయణపేట

★ అవినీతిని రూపుమాపుతాం అంటారు. ఏ పార్టీ అయినా ఒకటేనా – చేసే పనులకు, చెప్పే మాటలకు పొంతనలేదు.

● రాజకీయపార్టీలు – గాలికోళ్ళు. ఓట్ల వాసనకి తిరుగుతాయి – గాలివాటానికి కాక. అంతే. ఎవర్నీ నమ్మక్కరలేదనిఖిందలి నీతి.

★ తమిళనాడులో ఎం. జి. ఆర్. తరవాత పార్టీ చీలిందిగదా. జయలలిత – జానకీ రామచంద్రం. న్యాయంగా ముఖ్యమంత్రి ఎవరు కావలసింది?

● తను పోయాక తన పార్టీ వుండదని ఎం. జి. ఆర్. కి బాగా తెలుసు. అధికారం తమిళనాట ఎప్పుడు శాశ్వతం కాలేదు. ఇప్పుడు సవతుల్లో కయ్యం కానివ్వరు! పిల్లీ పిల్లీ తగవు కోతి తీర్చిందికద.

ఎం. డి. ఎస్. పుల్లూరు


★ .....జీవితాదర్శం శాంతి అయినప్పుడు శాంతి నివ్వని విజ్ఞానం ఎందుకు?

● శాంతి అంటే ఏమిటని మీ ఉద్దేశ్యం? జడత్వం కాదే! విజ్ఞానం అంటే ఏమిటని మీ ఉద్దేశ్యం? యాటంబాంబు రూపొందించడ మొక్కటే కాదే. మనిషి హాయిగా బ్రతకాలంటే కాస్తైనా గ్రేమేటరుండాలి బుర్రలో. నిరక్షరాస్యులైతే హాయిగా చెత్త చదవక్కరలేదు" అన్నట్టుంది మీ వాదన!

బి. ఎస్. తిరుపతి

★గెలుపో ఓటమో పోరాటమనేది ఒక టుండాలి జీవితానికి అని ఎవరో అన్నమాట అనుసరిస్తున్నేను. కాని ఏ పోరాటమూ లేకుండా తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తితో రోజూ ఒకేవిధంగా, సాఫీగా జీవితాన్ని గడిపేవారిని చూస్తే అసూయ, నామీద నాకే జాలివేస్తుంది – తప్పని తెలిసే.

● పంపక్వత చెందని జీవితాల ధోరణే యిది. నినాదాలు శ్రావ్యంగా వుంటాయి. ఆశలు బలంగా పీకుతాయి. వ్యక్తిత్వం ఏర్పడని ఆవేశం..... ఎవరికైనా ప్రతిదినం పోరాటమేనని ఎందుకనుకోరు మీరు? సాఫీగా సాగే జీవితాలలో అలజడిలేదనా మీ ఉద్దేశ్యం? జీవితంలో స్థిరపడి – జీవితాదర్శాలవైపు వేయాలని చూసే ప్రతి అడుగూ ఎంత భారమో తెలిస్తేగాని – మికసలు పోరాటమేమిటో అర్థం కాదు. □





నెస్టమ్ బేబి సిరియల్
ప్రారంభించేందుకు ఆదర్శప్రాయమైనది
పెరుగుదలకు ఆదర్శప్రాయమైనది
నెస్టమ్, పాలు-పూర్తి పోషక విలువలున్న ఆహారం.
నెస్టమ్‌తో వివిధ వంటలు-పాపాయి ఆహారంలో కోరేదన్ని రకాలు.
నెస్టమ్.
రైస్
ఇనుము-విటమిన్లతో కూడినది
పాలలో కలపండి.
ఉచితం
మీ బాబు, తన ఆహారంలో, కొత్త రుచులను కోరుతాడు అందుకని—మీ ఉచిత నెస్టమ్ వంటల పుస్తకం కోసం వ్రాయండి.
నెస్టమ్
పోస్ట్ బాక్స్ నం. 6016,
న్యూ ఢిల్లీ-110008.
Nestlé
Nestum
baby cereal
Rice
mix with milk
Nestlé
Nestum
baby cereal
Rice
mix with milk
R K SWAMY/FSL/4764 TEL

సాతినేస్తం!

వడ్లమన్నె హనుమంతరావు

లక్ష్మణరావుది చాలా విలక్షణమైన మనస్తత్వం. తను వేళాపాళా లేకుండా వెళ్ళి స్నేహితుల్ని డిస్టర్బ్ చేస్తుంటాడు. అతని స్నేహితులు మాత్రం అతన్ని ఎప్పుడు పడితే అప్పుడు కలవ కూడదు.

దానికి లక్ష్మణరావు సలక్షణంగా ఒక పథకం రూపొందించాడు!

ఎవరన్నా స్నేహితుడు వచ్చినప్పుడు లక్ష్మణరావు ఖాళీగా ఉన్నాడా సరే సరి! చాలా ఆప్యాయంగా ఎదురెళ్ళి స్వాగత సత్కారాలతో రిసీవ్ చేసుకుని ఆప్యాయంగా లోపలికి తీసుకొచ్చి అతిథి మర్యాదలతో ఉక్కిరి బిక్కిరి చేస్తాడు. అయితే దానికీ ఓ కండిషనుంది! ఆ వచ్చిన వ్యక్తి వల్ల తనకేదన్నా వ్యక్తిగత ప్రయోజనం మాత్రం ఉండాలి.

అలా కాకపోయినా.... లేదా.... తను ఏదన్నా రాతపనిలో నో (అన్నట్టు లక్ష్మణరావు కథలూ గట్రా రాస్తుంటాడు లెండి!) లేక ఏ ఇంగ్లీషు నవల్లో... తెలుగు నవలో పఠనంలో నో ఉన్నప్పుడు ఎవరన్నా వచ్చి పిలుస్తే... తకీమని జవాబు చెప్పిస్తాడు కుటుంబ సభ్యులతో.

"వారు లేరండీ... బయటి కెళ్ళారు" అంటుందా ఇంటి ఇల్లాలు.

"మా నాన్నగారు బజా రెళ్ళారండీ" అంటాడు లక్ష్మణరావు సుపుత్రుడు.

"మా డాడీ మార్కెట్ కెళ్ళారండీ" అంటుంది అతని సుపుత్రిక.

అంటే.... అందరూ ఒకేసారి ఇలా అంటారని కాదు అర్థం!

ఒక్కోసారి ఒక్కొక్కరు పై జవాబులు చెప్పేలా ఏర్పాటు చేస్తాడు లక్ష్మణరావు.

అక్కడికీ ఆ వచ్చిన వాళ్ళు లక్ష్మణరావు కుటుంబ సభ్యుల్ని క్రాస్ చేస్తూనే ఉంటారు.

"స్కూటరుంది కదండి" అంటారు కొందరు.

"ఎవరో వచ్చి బుల్లెట్ మీద తీసు కెళ్ళారండీ" అంటూ వెతుక్కోకుండా జవాబిస్తుందతని భార్య.

"బూట్లు వాకిట్లో కనిపిస్తున్నయ్ కదు బాబూ!" అంటారు మరి కొందరు.

"మా నాన్న గారికి ఆరు జతల బూట్లున్నయ్యండీ! ఈ రోజు బ్రౌన్ కలర్ బూట్లు వేసు కెళ్ళారు" అంటాడు వాళ్ళబ్బాయి స్పాంటేనియస్‌గా.

"ఆ దగ్గు మి నాన్నగారిది కాదా పాపా?" అని అడుగుతారు ఇంకొందరు.

"అబ్బే! మా డాడీది ఐరన్ హెల్తండీ! దగ్గులు... తుమ్ములు ఆయన్ని చూస్తే చాలు వెనక్కి తగ్గాల్సిందే!" అంటుందా అమ్మడు.

లక్ష్మణరావు తన కుటుంబ సభ్యుల కిచ్చిన రిహార్సల్ అలాంటిది మరి!

ఇంకేం చేస్తారు పాపం?!! ఆ పిలిచిన వాళ్ళు వచ్చిందారినే వెళ్ళి పోతుంటారు మళ్ళీ కలుస్తామని చెప్పమంటూ.

కుటుంబ సభ్యు లందర్నీ... వాళ్ళ నటనా చాతుర్యానికి తెగ మెచ్చుకుని... తిరిగి తన పనిలో మునిగి పోతుంటాడు లక్ష్మణరావు మీసం ఒక్కసారి తడుముకుని.

ఇక లక్ష్మణరావు తన స్నేహితుల ఇళ్ళకి వెళ్ళినప్పుడు ఎలా ప్రవరిస్తాడో చూద్దాం!

ఒకసారి ఒక స్నేహితు డింటికి వెళ్ళాడు లక్ష్మణరావు. అప్పుడతను ఆఫీసుకు శెలవు పెట్టి మరీ రిలయన్స్ కప్ వన్‌డే మాచ్ చూస్తున్నాడు టి.వి.లో. ఇండియా బాటింగ్... ఆస్ట్రేలియా బౌలింగ్. బాదీ పారేస్తున్నారు మన వాళ్ళు! ఉత్సాహంగా ఉంది క్రికెట్ మాచ్!

బయట నిలుచున్న ముసలి తల్లి గారితో లోపలకు కబురు పెట్టాడు తను వచ్చినట్టు.

లోపలికి రమ్మనమనీ.... టీ.వీ. చూడమనీ పిలు పొచ్చింది లోపల నుంచి.

చాలా అర్జంటు... ఒక్కసారంటే... ఒక్కసారి బయటికి వచ్చి వెళ్ళమని మళ్ళీ కబురు చేశాడు లక్ష్మణరావు.

అతను విసుక్కుంటూనే బయటి కొచ్చాడు... "త్వరగా చెప్పు బ్రదర్. అవతల మాచ్ పోతోంది" అన్నాడు.... అసహనంగా.

క్రికెట్ మాచ్ గురించి ఇంత సంబర పడు తున్నావ్ నేనొచ్చింది మీ అమ్మాయికి మాచ్ గురించి" అన్నాడు లక్ష్మణరావు.

దాంతో అతని స్నేహితుడికి చల్లబడక తప్పలేదు. "అయిపోయింది... అయిపోయింది!" అంటూనే అతన్ని గంటన్నర వరకూ బోరుకొట్టేశాడు లక్ష్మణరావు.

"సరే.... అలాగే" అంటూ వింటున్న అతని నెత్తిన బాంబు పేల్చేశాడు చివరికి... గోత్రం ఒకట్టై పోయిందంటూ. దాంతో అతను బెంబేలెత్తి పోయి కూతురు మాచ్ పోయింది.... అవతల క్రికెట్ మాచ్ కూడా పోయిందన్న విచారంతో... "వస్తాను బ్రదర్! నంబర్ టూకి వెళ్ళా"లంటూ వంకపెట్టి వెనక్కి తిరిగి చూడకుండా ఇంట్లోకి పరుగెత్తాడు.

మరోసారి... మరో స్నేహితు డింటి కెళ్ళేసరికి అతను ఫామిలితో సహా ఏదో ఊరికి ప్రయాణ మవుతున్నాడు. రిక్షాలని పిలవటానికి కుర్రవాడిని కూడా పంపాడతను.

"మీ ఆఫీసరు నీ మీద చాలా కోపంగా ఉన్నాడని... మీ ఆఫీసులో పనిచేసే మా బాబాయి చెప్పాడు. నేను మా బాబాయితో నీ మీద మంచిగా చెప్పిస్తాను అంటూ మాటల్లో పెట్టి వాళ్ళ ప్రయాణం గంట వాయిదా వేయించాడు. మింగలేక కక్కలేక వింటూ ఉండి పోయి... లక్ష్మణరావు వదిలి పెట్టిం తర్వాత బతుకుజీవుడా! అంటూ బయట పడ్డాడు తను.

ఇలా చెప్పుకుంటూ పోతే... లక్ష్మణరావు విలక్షణ మనస్తత్వ విన్యాసాలు చాలా ఉంటాయి. మన కథ కవసర మయినంత వరకూ మరొక్కటి చెప్పుకొంటే చాలు!

ఇంకోసారి... మరో స్నేహితు డింటికి వెళ్ళాడు లక్ష్మణరావు. అప్పటికి టైం... రాత్రి పది గంట లయింది. ఆ స్నేహితు డింటి... తలుపులు మూసేసి ఉన్నయ్. లైట్లు తీసేసి ఉన్నయ్. కానీ లోపల నుంచి సన్న సన్నగా గుసగుసలు! గాజుల గలగలలు వినిపిస్తున్నయ్. అసలు సంగ తేమిటో ఆ మాత్రం అర్థం చేసుకోలేని మూర్ఖుడు కాదు కదా లక్ష్మణరావు? కనీసం.... అప్పుడయినా... చప్పుడు చెయ్యకుండా ఇంటికి తిరిగి వెళ్ళి పోకూడదూ?

అహ(!

అలా చేస్తే... అతని పేరు లక్ష్మణరా వెందుకవుతుంది?

ముందు తలుపుల మీద వేలి కణుపులతో కొట్టాడు.

లోపలి నుంచి గుసగుసలు. గాజుల శబ్దాలు ఆగిపోయినయ్!

కానీ ఎవరూ వచ్చి తలుపులు తియ్యలేదు.

ఈసారి లక్ష్మణరావు అరిచేత్తో తలుపు తపతపా బాదాడు. (కాలింగ్ బెల్ కనపడ లేదేమో పాపం!)

ఈసారీ తలుపులు తెరుచుకో లేదు. కసి రేగి పోయింది లక్ష్మణరావులో.

అతని పేరు పెట్టి పిలుస్తూ... గట్టిగా బాదాడు తలుపుల్ని... అది కూడా విడవకుండా...!

ఇక తప్పదనుకున్నాడో... ఏమో... అతని స్నేహితుడు భార్యతోటి సురత బంధాన్ని తెంచుకుని... భగభగ మండుతూ వచ్చి విసురుగా తలుపు తీశాడు... లైటు వేసి. ఛడామడా తిడదా మనుకున్న అతని స్నేహితుడి గొంతు... లక్ష్మణరావు చేతిని చూడగానే మూగ బోయింది. అతను వచ్చే లోపుగా జేబులోంచి వంద రూపాయల నోటు తీసి

రడీగా ఉంచుకున్నాడు లక్ష్మణరావు.

"ఏమిటిది?" అన్నా డతను.

"ఇంత మతి మరుపయితే ఎలాగోయ్? ఇది నేను నీ దగ్గర ఆరు సంవత్సరాల క్రితం అప్పుగా తీసుకున్న వంద. ఇందు! ఇప్పుడు నీ కివ్వకుండా వెళ్ళి పోయాననుకో దీన్ని మా ఆవిడ నా జేబులోంచి ఘరానాగా తస్కరించివులుసుకు... కూరకు నజరానాగా ఇచ్చేస్తుంది! అందుకనే... ఎంత రాత్రయినా సరే... నీ కిచ్చి తీరాలని తలుపు కొట్టానోయ్. సారీ! పాపం నువ్వు నిద్రా... దేవతా ఒళ్ళో... హాయిగా శయనించావో ఏమో?! అన్నాడు నర్మగర్భంగా.

పాపం అతని బాధ అతనిది!

"థాంక్సోయ్..." అన్నాడు ఆవలిస్తూ.

"అసలీ నోటు నీకు తీసుకొచ్చి ఇవ్వటానికి ఓ కథ ఉందోయ్" అంటూ... ముప్పావు గంట పైన నిల్చో బెట్టేశాడు– లక్ష్మణరావు– అతన్ని.

చివరి కతను స్పృహ తప్పి పడి పోయినట్టు నటిస్తే గానీ లక్ష్మణరావు అతన్ని వదలి పెట్టలేదు.

ఆ తరువాత అతను ఆవురావురు మంటూ వెళ్ళి... రసానందానికి మధ్యలో విఘాతం కలగటంతో బావురు మంటున్నట్టుగా పడి ఉన్న భార్యని ఓదార్చి ఆమెను రంజింప జేశాడు.

"మీ స్నేహితుడి కసలు బుద్ధుందా?" అంది అతని భార్య కోపంగా.

"ఉండు యివ్వాళ్టితో వా డంటే నా క్కూడా చిర్రెత్తిపోయింది. బుద్ధి వచ్చేట్టు చేస్తాను" అన్నాడు ధృడంగా.

"ఏం చేస్తారు? ఎలా చేస్తారు?"

"చూస్తూవుండు" అన్నాడతను.

అతని పేరు ప్రతాప్. చాలా పట్టుదలగల వ్యక్తి. ఆ రోజు నుంచీ అతను అవకాశంకోసం పొంచి చూడటం మొదలుపెట్టాడు.

రెండు మూడుసార్లు కావాలని లక్ష్మణరావు యింటికి వెళ్ళాడు.

ప్రతాప్‌తో అతనికి పనిలేకపోవటంతో ఇంట్లో వుండీ లేడనిపించాడు. లక్ష్మణరావు.

"అలాగటండీ! సరేలెండి! మళ్ళీ వచ్చి ఆయన ఇంట్లోనే వున్నప్పుడు కలుస్తాలెండి" అని వ్యంగ్యంగా అని 'కామ్'గా వెళ్ళిపోయాడు.


ఆ తరువాత నాలుగు రోజులకి..... ప్రతాప్ హడావుడిగా లక్ష్మణరావింటికి వచ్చాడు. బయటి నుంచి కేకేశాడు.... గట్టిగా.

ఆ టైంలో.... లక్ష్మణరావు.... ఇర్వింగ్ వాలస్ నవల చదువుతూ అందులోని ఘాటైన సన్నివేశానికి మెలికలుతిరిగిపోతున్నాడు. అంత రస కందాయకంలో అతను ప్రతాప్ మాట్లాడటానికి సుముఖంగా లేడు.

దగ్గరవున్న శ్రీమతికి సంజ్ఞచేసి లేరని చెప్పి పంపించెయ్య మన్నాడు.

"ఇప్పుడే ఎవరో వచ్చి ఇండోసుజకి మీద తీసుకెళ్ళారండీ" అని జవాబిచ్చింది లక్ష్మణరావు





శ్రీమతి.

"ఎంతసేపట్లో వస్తారండి? అన్నాడు ప్రతాప్.

"తెలియదండీ."

"ఈ రాత్రి క్కూడా రారాండీ?" అన్నాడు ప్రతాప్.

"తెలియదండీ."

"సర్లేండి ఏం చేస్తాం. నేను దురదృష్ట వంతుణ్ని" అన్నాడు ప్రతాప్.

"అదేంటండీ?" అంది లక్ష్మణరావు భార్య.

"ఆ సంగతి మీకు, చెప్పినా అర్థంకాదులెండి! మీవారితో తరవాత మాట్లాడతాలెండి" అని వెళ్ళిపోయాడు.

అంతా పొంచివిన్న లక్ష్మణరావు మళ్ళీ మీసం మీద చెయ్యివేసుకున్నాడు

'ఇతరుల ఏకాంతాన్ని...... విలువైన టైముని వేస్టుచెయ్యటం నా జన్మహక్కు! కాని..... నాటైం మాత్రం నా యిష్టం' అనుకున్నాడు సగర్వంగా.

మర్నాడు సాయంత్రం బజారులో లక్ష్మణరావు స్నేహితులంతా నిలేశారతన్ని "వాట్ బాస్ నిన్న రాత్రి నువ్వు రాలేదెందుకని.... అరెరెరె...." అన్నారు.

లక్ష్మణరావులో ఒకటే ఆరాటం!

"నేను రాకపోవటమేమిటి? ఎక్కడికి?" అన్నాడు ఆతృతగా.

"ఏం చేప్పమంటావు గురూ? ఆహా! ఎన్ని ఐటమ్స్?!"

"ఏమిటోయ్ అది..... ఐటమ్స్ ఏమిటి?" నిలవలేక పోతున్నాడు లక్ష్మణరావు.

"చికెన్ దోప్యాజ్.... కాజూ చికెన్ పకోడా..... మటన్ ఫ్రై.... ప్రాగ్‌మసాలా.... మొఘల్ బిరియానీ.... అబ్బ! ల్చ్!"

"నోరూరిపోతోంది లక్ష్మణరావుకి.

"ఎక్కడ ఇదంతా?" అంటూ అరిచాడు గట్టిగా.

"షారీ! ముందుది వెనుక..... వెనుకది ముందు చెపుతున్నాం.... నాన్‌వెజ్‌కన్నా ముందు బూజింగ్....! ఓహ్! ఎంత బ్రహ్మాండమయిన వెట్‌పార్టీ! రాయల్ సెల్యూట్.... షివాస్‌రీగల్.... జానీవాకర్.... అమెరికన్ జిన్.... షాంపేన్.... జర్మన్ బీర్.... తాగినవారికి తాగినంత మహదేవ!"

నాలుక పిడచకట్టుకుపోయింది లక్ష్మణరావుకి. "ఎక్కడ? ఇదంతా ఎక్కడ? ఎవరు ఏర్పాటు చేశారు?" గొంతు తడారిపోతుండగా పొడిగా అరిచాడు.

అతన్ని పట్టించుకోలేదు అతని స్నేహితులు.

"మన లక్ష్మణరావు యింతమాత్రానికే కొంకర్లు పోతున్నాడు..... ఇక అసలు విషయం కూడా చెప్పేస్తే గింగిరాలు తిరిగిపోయి.... మూర్ఛవచ్చి పడిపోతాడేమో....." అన్నారు.

"చంపేస్తున్నారోయ్! చెప్పిచావండోయ్ ఏమిటో అది!" చిందులుతొక్కాడు లక్ష్మణరావు.

"మందు..... విందుతోపాటు మగువల పొందు కూడా ఎంత ఘనంగా ఏర్పాటుచేశాడోయ్....వహ్వా!"

"మగువల పొందా....?" దాదాపు పిచెక్కినట్టు అరిచాడు లక్ష్మణరావు.

'ఏం చెప్పమంటావ్ లక్ష్మణరావు....? పెద్దాపురం పాప..... గుడివాడ గిరిజారాణి..... చిలకలూరిపేట అలకనంద...! జున్నుముక్కల్లా వున్నారు కదూ?! ఆ వంపులు... ఆ సొంపులు.... హె హె! రాత్రి పార్టీకి రాని నీ దురదృష్టాన్ని ఏమని వర్ణించమంటావోయ్ పూర్‌ఫెలో!"

"ఎవరు? ఎవరీ ఏర్పాట్లు చేసింది?" ఆవేశంగా అన్నాడు లక్ష్మణరావు.

"ఇంకెవరోయ్.... మన ప్రియతమ స్నేహితుడు ప్రతాప్....!! అతనికి లాటరీలో పది లక్ష లొచ్చాయిగా.... ఆ సందర్భంలో...."

"ఏమిటి ప్రతాప్‌గాడికి లాటరీలో పది లక్ష లొచ్చినయ్యా..... నన్ను వదిలేసి.... మీ అందరికీ మందు.... విందు.... పొందుల పార్టీ ఇచ్చాడా? ఇడియట్! వాడికి కళ్ళు నెత్తిమీదకొచ్చినయ్యన్న మాట....! ఇప్పుడే తేల్చేస్తాన.... వాడి సంగతి!" అంటూ ఆఘమేఘాలమీద ప్రతాప్ ఇంటికి దౌడుతీశాడు.... స్కూటర్‌మీద.

"రావోయ్ రా! లక్ష్మణరావ్.... ఊరకరారు మహాత్ములు! రా! ఆ కుర్చీలో కూర్చో. సారీ....... "

న్యాయపీఠం



బి.బి.రావు. ఎమ్.ఎ.ఎల్ఎల్.బి.

మోటార్ ఏక్సిడెంట్ కల్వర్టు పడిపోవడం వలన జరిగితే నష్టపరిహారం హైవేస్ వారు ఇచ్చుకోవాలి

దక్షిణ ఆర్కాట్ జిల్లాలో 1960 సంవత్సరం 14 తేదీన ఉదయం 5.30 గంటలకు రోడ్డుపై వస్తున్న బస్సు కల్వర్టు పడిపోవడం వలన ప్రవహిస్తున్న గెడ్డలో పడిపోయింది. ఫలితంగా సంతాన్.గోపాలన్ మరణించాడు. అతని తల్లిదండ్రులు నష్టపరిహారం కొరకు మోటారు యజమాని మీద, ఇన్సూరెన్సు కంపెనీ మీద, తమిళనాడు హైవేస్ డిపార్టుమెంట్ మీద 25,000 రూపాయలకు దావా వేశారు. కోర్టు వారు ప్రమాదం జరగడానికి డ్రైవర్ తప్పు లేదని, ఇన్సూరెన్స్ కంపెనీ వారి బాధ్యత కూడా లేదని వారిపై దావా కొట్టి వేశారు. కల్వర్టు కూలిపోవడం హైవేస్ డిపార్టుమెంట్ వారి నిర్లక్ష్యం వలన జరిగింది గనుక హైవేస్ డిపార్టుమెంట్ వారు 9100 రూపాయలు నష్ట పరిహారం క్రింద చెల్లించాలని కోర్టు వారు తీర్పు చెప్పారు. ఈ తీర్పుపై తమిళనాడు ప్రభుత్వం వారు హైకోర్టుకు అప్పీలు చేశారు. గోపాలన్ తల్లిదండ్రులు నష్టపరిహారం క్రింద 5000 రూపాయలు అదనంగా ఇవ్వాలని హైకోర్టుకు విన్నవించుకున్నారు. కాని హైకోర్టు వారు అప్పీలును అనుమతించి క్రింది కోర్టు తీర్పును కొట్టి వేశారు. ఈ తీర్పుపై నష్టపరిహారం కోసం సుప్రీమ్ కోర్టుకు అప్పీలు పెట్టుకున్నారు. వృధాచలం హైవేస్ అసిస్టెంట్ ఇంజనీర్ మరియు కడలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భారీ వర్షాల వలన కల్వర్టు పడిపోయినట్టు రిపోర్టు ఇచ్చారు. కాని కల్వర్టు భద్రతకు తీసుకున్న చర్యలు వివరించలేదు. ఈ రిపోర్టు ఆధారంగా భారీ వర్షాల వలన కల్వర్టు పడిపోయినట్టు హైకోర్టు తమ తీర్పులో అభిప్రాయపడ్డారు. భారీ వర్షాలు, వరదలు వస్తాయని హైవేస్ డిపార్టుమెంట్ తెలుసుకుని ఉండాలి. ముందు జాగ్రత్త చర్యగా కల్వర్టులు, బ్రిడ్జిలు మరమ్మత్తులు చేయాలి. అటువంటివి చెయ్యకుండా భారీ వర్షాల వలన కల్వర్టు పడిపోతే హైవేస్ డిపార్టుమెంట్ వారు బాధ్యత నుంచి తప్పించుకొనలేరు. తమిళనాడు ప్రభుత్వం హైకోర్టుకు అప్పీలు చెయ్యకుండా ఉండవలసింది. హైకోర్టు వారు దావా కొట్టి వెయ్యడం అన్యాయం గనుక హైకోర్టు తీర్పును సుప్రీమ్ కోర్టు వారు 1986 నవంబర్‌లో కొట్టి వేస్తూ తీర్పు చెప్పారు. 14000 రూపాయలు నష్టపరిహారం వడ్డీతో సహా చెల్లించాలని కూడా తీర్పు ఇచ్చారు. □

అన్నాడు ప్రతాప్ చాలా సౌమ్యంగా.

"దేనికి సారీ!" కోపం చిందుతోంది కుర్చీలో కూర్చున్న లక్ష్మణరావు గొంతులో.

"మా మిసెస్.... పైవీధిలో తెలిసిన వాళ్ళింటికి పేరంటానికి వెళ్ళిందోయ్. నీకు కాఫీ యివ్వలేనందుకు!"

"అద్సరే! ఇంత మిత్రద్రోహం చేస్తావా?" సూటిగా, ఘాటుగా అడిగేశాడు లక్ష్మణరావు కుండబద్దలుకొట్టినట్టుగా.

"నేనా? నీకా? ద్రోహమా? ఏమిటి లక్ష్మణరావ్.... కొత్తగా మాట్లాడుతున్నావ్?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రతాప్.

"నీకు లాటరీలో పది లక్షలొచ్చాయట నిజమేనా?"

"నిజమే!"

"రాత్రి నువ్వు మనవాళ్ళందరికీ తాగుడు..... తిండి..... తరుణీల పార్టీ ఇచ్చావట నిజమేనా?"

"నిజమే!"

"దానికి నన్ను కూడా ఆహ్వానించాలన్న ఇంగిత జ్ఞానం కూడా లేకపోయిందా నీకు?" ఉద్రేకంగా అన్నాడు లక్ష్మణరావు.

"నేను..... నిన్ను ఆహ్వానించలేదా? ఏమిటి లక్ష్మణరావు ఈ తప్పుడు అభియోగం?" శాంతగానే అన్నాడు ప్రతాప్.

"నువ్వు..... నన్ను.... ఆహ్వానించావా?" ఈసారి నిర్ఘాంతపోయింది లక్ష్మణరావు.

"ఆహ్వానించుదామనే మీ ఇంటికి వచ్చాను లక్ష్మణరావ్! నీ స్కూటర్.... కారిడార్‌లో నేవుంది. నీ బూట్లు గుమ్మంముందే వున్నయ్! అయినా నా దురదృష్టం!నువ్వింట్లో లేవని సాక్షాత్తూ నీ అర్ధాంగి చెప్పింది. రాత్రికి వస్తాడా? అని కూడా అడిగాను అక్కడికీ. తెలియదని చెప్పింది మీ శ్రీమతి. ఇలాంటి పార్టీ యిస్తున్నానని మీ ఆవిడతో ఎలా చెప్పి.... నీకు కన్వేచెయ్యగలను? మీ ఆవిడ చెప్పుచ్చుకు కొట్టదూ నన్ను! అందుకని.... నిరాశతో నిస్పృహతో వెనక్కి తిరిగి వెళ్ళిపోయాను లక్ష్మణరావ్! ఇందులో నా తప్పేముందన్నా వుందా? నువ్వే చెప్పు" అన్నాడు ప్రతాప్ వేడికోలుగా.

లక్ష్మణరావు ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. గాలితీసిన బెలూన్‌లా కుప్పకూలి పోయాడు!

"సారీ! ప్రతాప్. తప్పు నీదికాదు నాదే.... నాదే...." అంటూ మెల్లగా గొణిగాడు లక్ష్మణరావు.

"ఏమిటి లక్ష్మణరావ్.... తప్పు నీ దేమిటి? అదేమిటి ఫ్రెండ్! నా కేమీ అర్ధంకావటం లేదు" అమాయకంగా ముఖంపెట్టాడు.

మరుక్షణంలో.... ముఖంచెల్లని లక్ష్మణరావు అక్కడలేడు. అతనెక్కిన స్కూటర్ స్టార్టయ్యింది భారంగా.

ఆ తరువాత ప్రతాప్ ఎప్పుడు లక్ష్మరావు యింటికి వెళ్ళినా.... అతను ఇంట్లో లేడనే సమాధానం రాలేదు.

"ఏం చేస్తారు? ఎలా చేస్తారు? అని సవాల్ విసిరావుగా లక్ష్మణరావు విషయంలో?ఇప్పుడర్ధ మయిందా మన ప్రతాపమేమిటో?" అన్నాడు ప్రతాప్ శ్రీమతిని దగ్గరగా తీసుకుని నలిపేస్తూ.

"ఏమండీ? మీ కసలు లాటరీలో పది లక్షలు రాకుండానే.... మీ రసలు ఎలాంటి పార్టీ ఇవ్వకుండానే.... మీ స్నేహితులలో లక్ష్మణరావు కలా చెప్పించారు కదా..... రేపెప్పుడన్నా వీళ్ళలో ఒకడు అసలు నిజం లక్ష్మణరావుకి చెప్తే స్తేనో.....?" అంది అనుమానంగా.


"వా ళ్ళిప్పుడు చెప్పేసినా మనకు నష్టం లేదు" అన్నాడు ప్రతాప్.

"ఎందుకని?"

"అనుకున్నది సాధించానుగా? లక్ష్మణరావుని లొంగదీశానుగా? ఆ బెదురు బెదురుగానే వుంటుంది అతనిలో..... దట్సాల్."

"మొత్తానికి ఘటికులనిపించారు" అంది అతన్ని మీదకు లాక్కుంటూ.

లైటు సిగ్గుపడి ఆరిపోయింది. □



ఈకాలం పిల్లలు....


కె.నాగేశ్వరి

నోటి దురుసుతనం ఒకప్పుడు అతి చెడ్డ అలవాటుగా పరిగణింపబడేది. దాని పైన సామెతలు కూడా ఉన్నాయి. అది వయసును బట్టి, రూపాంతరం చెందుతూంటుంది. అప్పుడే చిలక పలుకులు నేర్చే పిల్లలు" అమ్మా చూడు నాన్నా చూడు" అనే ఏవో ముదిమాటలు అంటారు. అప్పుడు వారి మాటలని ఏదో గొప్ప మాటకారితనం. క్రింద భావించి వారికో చెడు అలవాటును పెంచేవారు కొందరు. ఈ రోజుల్లో నిజానికి పాపం పిల్లలకు అంత స్వేచ్ఛలేదు. బుద్ధి లేత మొగ్గలా ఉన్నప్పుడే చదువు, హోమ్ వర్క్‌లు, బండెడు పుస్తకాలు, చుట్టుముడతాయి. ఫస్టు ర్యాంకు లేక ఏ గ్రేడు తప్పనిసరిగా తెచ్చుకోవాలి. అందువల్ల వీరికి అలవాటు అవడం తక్కువనే చెప్పాలి.

ఆడపిల్లకు పదమూడు సంవత్సరాల వయసు, మగపిల్లవాడికి పధ్నాలుగేళ్ల వయసు బుద్ధి, అలవాట్లు మంచి దారో, చెడు దారో పట్టించే వయసని ఒక గొప్ప కవి అన్నారు. ఆ వయసులో తల్లితండ్రులు జాగ్రత్త తీసుకోవడం అతి ముఖ్యమైనదని హెచ్చరించారు.

ప్రస్తుత కాలంలో తిండి లోపమో, ఇంకే కారణాల వల్లో ఎదుగుదల అంత ఏపుగా లేదు. పోనీ పదమూడు నుండి, పదహారుకి పెంచవచ్చు. ఆ వయసుకు సరిగ్గా ఇంటర్మీడియెట్ చదువుతుంటారు వీరు.

ఆ వయసులో వీరు నోరు జారి ఇంట్లో వెనుకవారినీ తల్లినీ, తండ్రినీ ముసలి నాయనమ్మ తాతలను ఏవో అనడం జరగడం సహజం. మన



హిందూ వివాహ ధర్మంలో భార్య పట్ల భర్త, భర్త పట్ల భార్యా ముఖా ముఖీ లోపాల్ని ఎంచుకుంటే అదో అపరాధం కద! తండ్రిని పిల్ల వేళాకోళం చేస్తే తల్లి ముసి ముసి నవ్వులు నవ్వడం.... తల్లిని పిల్ల ఈసడిస్తే తండ్రి ఓర చూపులు విసరడం... పెద్ద వారిని అంటే వారు ఖిన్నులవడం... అది చూసి ఒకనాడు తమని పెట్టిన అరడికి మంచి శాస్తి అయింది! అని గృహిణి తాత్కాలిక ఆనందం పొందడం, ఇవన్నీ ప్లస్ పాయింట్లా, మైనస్ పాయింట్లా?

అంతటితో ఆ నోరు జారడం నాలుగు గోడల వరకే పరిమితమవదు. శాఖోపశాఖలుగా విస్తరించిన వటవృక్షంలా మాటల బాణాలు వదులుతారు. అర్జునుడు మొదలైన వీరుల వద్ద ఆగ్నేయ యాస్త్రానికి, వారుణాస్త్రం సంధించడం మొదలైన తరుణోపాయాలుంటాయి. వీరి అస్త్రాలు అన్ని విధాల ఉండవు. ముందు వెనుకలు ఆలోచించకుండా అనెయ్యటమే! ఒక్కసారి మనమాట ఎదుటి వారిపై ఎలాంటి ప్రభావం చూపిందో అనే యుక్తాయుక్త విచక్షణ క్రమేణా నశిస్తుంది. మాటల్ని ఎంత తొందర దుడుకుగా విసురుగా అనేసి సంస్కారం, సభ్యత మొదలైనవి మరిచిపోతారు. ఈ రోజుల్లో కొందరిని చూస్తే "చదువుకున్న వారి కంటే....' సామెత నిజం అనిపిస్తుంది. అలాగే "విద్య యొసగును వినయంబు" అన్నది నిరర్థకమైన పదంగా తోస్తుంది.

వీళ్ళకి ఎదుటి వారు చెప్పడమా, మనం వినడమా అనే తల పొగరు రోజు రోజుకీ ఎక్కువవుతుంది. అంతవరకూ ఉదయం పాలు, భోర్నవిటా లేక హార్లిక్స్ ఇచ్చి మధ్యాహ్నం లంచ్, సాయంత్రం టిఫిను, రాత్రి భోజనం వరకూ అమర్చిన తల్లి ఒక చాతకాని దానిలా తోస్తుంది. ఆమె పెట్టిన తిండి తినే ఈ శరీరం పెరిగిందని యుక్తాయుక్త విచక్షణ నశిస్తుంది. ఒక్క పైసా సంపాదించలేని తమకు, తన చెమట ధారపోసి, ఒకటవ తరగతి నుండి వీరినీ వారినీ పట్టుకుని సీటు తెప్పించి, రాంకుల కోసం ట్యూషన్లు పెట్టించి, వేలకు వేలు ఎంట్రన్సు కోచింగ్‌కూ (ఇక్కడ ఒకటి గుర్తుంచుకోవాలి.... ఎందుకంటే ఇంటరులో గ్రూపులో ఒక్క సబ్జక్టుకు పుచ్చుకునే మొత్తమే ఎక్కువ సంఖ్యలో ఉంది) డబ్బు పోసే తండ్రి తమంత జీనియస్ కానట్లు చూస్తారు.... అంతేగాని వెనకటి తరం యొక్క స్థితిగతులు ఆలోచించరు. తమకంటే తమ పిల్లలు విద్యాధికులవాలనే సగటు తండ్రి వీరిని చూసి నివ్వెరపోవటం మినహా ఏం చెయ్యగలడు. ఎందుకంటే వారికి కొంత లోకజ్ఞానం ఉంటుంది. పిల్లలు గుర్తిస్తారని, తండ్రిని గౌరవిస్తారనీ ఈ రోజులలో ఏ తండ్రీ చదివించడం లేదు. వనరుల కొరత చూసి, రాజీపడి, అష్ట కష్టాలు పడి వీరికి చదువుకొని ఇస్తున్నారు. ముఖ్యంగా ఇంగ్లీషు మీడియం చదువు అధిక రేట్లో గాని లభ్యమవదు. తెలుగు మీడియం చెప్పిస్తే ఇంట్లో భార్యే ఒప్పుకోదు.

ఒకవేళ ఏ అమాయకుడో పిల్లలకి పరిస్థితి వివరిస్తే "నిన్నెవరు కనమన్నారు. నీకేం మీ రోజుల్లో



35% మార్కులు తెచ్చుకున్నా చదువులు ఉద్యోగాలు ఉండేవి. రెండు వేలు కట్నమిచ్చినా ఆడపిల్లకు ఉద్యోగస్తుడు దొరికేవాడు"... ఇలా ఆడపిల్లా, మగ పిల్లాడు కలిసి కష్టపడిన తండ్రికిచ్చే కితాబు చూసి నవ్వాలా? ఏడవాలా? తక్కువ మార్కులొచ్చినా వారికి భాషపై అధికారముండేది. చదివిన చదువుకి తగిన జ్ఞానం ఉండేది. ఉద్యోగం కష్టపడి చేసి ఒక్కో మెట్టూ ఎక్కారు. ఏదో పెళ్ళి ఖర్చులకు కట్నాలు తీసుకోవడమే గానీ, సంతలో పశువు అమ్ముడు పోయినట్లు పోలేదు" అనే ఇంగిత జ్ఞానం రావడం నోరు పారేసుకున్నంత సులభ సాధ్యం కాదు.

దేశంలోని నిరుద్యోగ సమస్యను, ఆర్థిక అసమానతలనూ, ఉపాధి పథకాలు జయప్రదం చేయాల్సిన బాధ్యత రేపటి తరం వారిది. వీరింత నోటి దురుసువారైతే కార్యవాదులెలా అవుతారు. మాటలాడినంత సుళువుగా చేతలుండవు. చేసి అనాలి. అనుకోవద్దా? ఇది యువతీ యువకుల బాధ్యత కాదా?


నీకేం ఒక్క కూతురివి. మీ నాన్న నాలుగు లక్షలైనా ఇవ్వగలడు. మా ఇంట్లో ఇద్దరం రెండు లక్షలకు గ్రాడ్యుయేటన్నా దొరకడు. అని వాపోయే. నోటి దురుసు యువతి, తన మాటలలో ఎంత వెనకబడి ఉందో తనంత తనే చెప్పుకుంటుంది. ఇదీ కుటుంబ నియంత్రణ అమలు పరచి, ఉన్న ఒక్కరూ ఇద్దర్నీ లోటు లేకుండా పెంచితే దొరికే సమానత్వం. అలాగే పదవ తరగతి పాసయి కుర్రతనం నుండి మగాడి లక్షణాలు పుణికి పుచ్చుకున్నాననుకొనే కుర్రాడు ఎలా మాట్లాడతాడో చూద్దాం.


"పదవ తరగతికి మార్కెట్లో లక్ష రేటు. ఫర్వాలేదు. రూపాయికి వడ్డీకిచ్చినా బోల్డు డబ్బు. ఇంకఇంటరు డొనేషను కట్టి చదివి, ఎంట్రన్సుకు ప్రిపేరయితే ఇంకా రేటు పెరుగుతుంది. ఇంక ఇంజినీరింగు డాక్టరు చదివితే కట్నం రేటు అదిరిపోతుంది. నాకేం" ఇది వారి ధోరణి. నిరక్షరాస్యత, వడ్డీ వ్యాపారం, వరకట్న దురాచారం, సోమరితనం, రూపుమాపవలసిన బాధ్యత ఎవరిది?

రక్తంలో బిగి, వేడి ఉండే యువతరంది కాదా? వారు వాటిని మరింత పెంచుతుంటే ప్రగతి పథంలోకి ఎలా ప్రయాణిస్తారు. భ్రమరకీట న్యాయంలా, వీరి మాటలు విని విని మిగతా వారు కూడా తాము అనవసరంగా కష్టపడుతున్నట్లు భావించవచ్చు. వారికి కూడా క్రమేణా పెద్దలు నూరిపోసే నీతి పాఠాలు వెగటు కలిగించవచ్చు. అయితే ఇక్కడొక ముఖ్యమైన మలుపుంటుంది. అదేమిటంటే యువతకి తమ మాటల, చేతల, అలవాట్లు వారి కంటే చుట్టూ ఉన్న అనుభవజ్ఞులే ఎక్కువ గమనించే నేర్పుంటుందని తెలియదు. ముఖ్యంగా దురుసువారి కసలు తెలియదు. నోటికేది వస్తే అది సమయా సమయాలు, ఉచితానుచితాలూ, సందర్భం లేకుండా అనేస్తారు.

వాళ్ళంతట వారికి స్వతహాగా వచ్చిన వాటికీ, ఎదుటివారు నేర్పితే నేర్చిన వాటికీ నక్కకూ నాకలోకానికీ ఉన్నంత దూరం ఉంటుంది. అందుకే మంచి నేర్చుకుంటే నేర్పిన వారి మంచితనం నివురు బాటు నిప్పులా అణిగిమణిగి ఉంటుంది. ఇటువంటివి నేర్చిన వారు గభాలున, "నొనొక్క కూతుర్ని నాకు మీరు నగలు, డిపాజిట్లు, ప్లాట్లు రూపంలో వేసినవి ఫలానా! నేనుఇంతవరకూ చదువులో, వివిధ యాక్టివిటీస్‌లో సాధించినవి ఫలానా?" అంటే ఇదేదో అంటు జాడ్యం బదనికను నాశనం చేసినట్లు వదిలించాలి. అనుకుంటారు. మొదటి నుండి ఆ పిల్లని కట్టుబాటులో పెంచి అంతవరకూ తెచ్చిన తల్లితండ్రులు, సరస సామదాన భేద దండోపాయాలతో అమ్మాయి బుర్రకి పట్టిన చిలుం వదిలిస్తారు. ఫలితం.... నిజం బైటికొస్తుంది. ఈసారి "నీకు నోటి దురుసుతనం ఎక్కువ. మీ ఇంట్లో విచ్చలవిడిగా వదిలేశారు. ఒక్క కూతుర్నని గర్వం పడితే ఎలా?" మొదలైన నీతి వాక్యాలు వినాల్సి వస్తుంది. ఏ నోటితో దురుసుగా అంటారో, అదే నోరు మూసుకుపోతుంది. స్నేహం విడిపోతుంది. మంచి స్నేహితులంతా దూరమవుతారు. బేవార్సు స్నేహితురాండ్రతో తల బొప్పి కడుతుంది. సంబంధాల దగ్గర అమ్మాయికది వీక్ పాయింట్‌గా మిగులుతుంది. ఉద్యోగం చేయాల్సొస్తే "ఏం చదివారండీ' వర్కసలు రాదు. మాటలు చెప్తారు మళ్ళీ కోటలు దాటేట్టు", అని పై అధికారి చులకన చేయొచ్చు. అదీ నోటి దురుసు వారికెదురయే పరిస్థితులు. ఇవి కొన్ని మాత్రమే!

అలాగే మగ పిల్లాడికి కూడా చీవాట్లు పడతాయి. "ఎవడ్రా నీకు లక్షలిచ్చేది! నెత్తి మీద దమ్మిడీ పెడితే చెల్లవు. అయినా ఇంకా కులాల కంపు కొట్టే కబుర్లేమిటి? ఆ రోజులు పోవాలి. ఎవరు నీకు నిషా ఎక్కించింది. వ్యాపారం చేస్తాడుట వ్యాపారం. ఈసారిలాంటి కబుర్లు చెబితే, నిన్ను వెంట పెట్టుకుని వెళ్ళి నా కొడుకని చెప్పను. పని కుర్రాడని చెప్తాను జాగ్రత్త!" అని అనటమే కాదు. ఆకుర్రాడికి ఎక్కించిన కుర్రాడి తండ్రి దగ్గరకు కూడా వెళతాయి. బైట ఒక హోదా, కష్టపడి పైకి వచ్చాడని పేరున్న ఆ తండ్రి "ఏరా అబ్బాయ్! లక్షలొస్తాయిరా లక్షలు. సోంబేరి ఎదవని కన్నందుకు బాగా బుద్ధొచ్చింది. నీ చెతిలో ఆ డబ్బు పొయ్యనురా? మన పాలెగాడికంటే నీ బ్రతుకు అధ్వాన్నమవుతుంది. ఒక్కసారి మంచి సావాసం చెయ్యి. నీ పొగరుమోతు మాటల నిషా దిగుతుంది. ఈసారి ప్రేలు. ఎముకలు ఏరేస్తాను..." అనే తిట్లు పడతాయి. ఇలా వేలెత్తి చూపించుకోడం ఎందుకు? అందుకే విద్యతో వినయం, నిదానంగా ఆలోచించి మాట్లాడాలి. పెద్దలు మాట్లాడేటప్పుడు ఓర్పుగా విని అందులో మంచి గ్రహించాలి. □





(గత సంచిక తరువాయి)

గోదావరి రేంజ్ డి. ఐ. జి. ఆఫీసు – లంచ్‌కి వెళ్ళబోతున్న డి. ఐ. జి. మాధవ్ ఫోన్ రింగయేసరికి వెనక్కి తిరిగి రిసీవరెత్తాడు.

"మాధవ్‌జీ! సరిగ్గా మీకు పంథొమ్మిది కిలోమీటర్ల దూరంలో యింకా ప్రారంభం కాని ఓ హరిజనకాలనీలో ముప్పై అయిదుగురు ఇంజనీర్లు విషాహారం తిన్నారు. వాళ్ళింకో పదినిముషాల్లో చావబోతున్నారు. చేతనైతే కాపాడండి. లేకపోతే తాపీగా వెళ్ళి శవాలను తెచ్చుకోండి!"

ఫోన్ కట్ అయింది.

"హలో! హలో ..... ఎవరు?" గట్టిగా అరిచాడు డి.ఐ. జి. మాధవ్. తర్వాత కంగారుగా ఆ ప్రాంతంలో వున్న పోలీస్‌స్టేషన్‌కి వైర్‌లెస్‌లో మెసేజ్ యిచ్చాడు.

"సార్! ఇక్కడ వున్న కొద్దిమంది స్టాఫ్ భీమవరంలో జరుగుతున్న

జరిగిన కథ –7 : దుండగుల బారి నుండి దేదీప్యను రక్షిస్తాడు రాకా. ఆ రోజే రాకా బ్యాంక్ దోపిడీ చేస్తాడని పోలీసులు అప్రమత్తంగా ఉంటారు. చెప్పినట్టుగానే రాకా బ్యాంక్ దోపిడీ చేస్తాడు. బ్యాంక్ విషయంలో దేదీప్య ఇచ్చిన సలహాకు థాంక్స్ చెప్పడానికి వచ్చిన రాకా దేదీప్యతో తాను ప్రేమకు అతీతుణ్ణని చెప్పాడు. రాకా పేరుతో శంభు దాదా నేరాలు మొదలు పెడతాడు. రాకా మానసిక ప్రశాంతత కోసం తాతయ్య దగ్గరికి వెళ్తాడు. డి జి పి పుట్టిన రోజు కానుకగా రాకా జోగి శవాన్ని పంపుతాడు. ప్రముఖ ఇంజనీర్లను బంధించి వాళ్ళ నేరాల్ని వినిపిస్తూ ఉంటారు.

మంత్రిగారి మీటింగ్ బందోబస్త్‌కి వెళ్ళారు. నాలుగు కానిస్టేబుల్స్ పోస్టులు ఖాళీగా వున్నాయ్. ప్రస్తుతం వెహికిల్ కూడా......" అని ఏదో చెప్పబోయాడు యస్సై.

"షటప్! చెప్పినట్టు చెయ్!" అనేసి ఫోన్ పెట్టేశాడు. డి.ఐ. జి. తర్వాత పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి ఫోన్‌చేసి అడిషనల్ యస్. పి. తో మాట్లాడి ఆ హరిజన కాలనీకి రిజర్వ్‌డ్‌ఫోర్స్‌ని వెంటనే పంపమని చెప్పాడు.

అప్పటికి సమయం –

పన్నెండు గంటల యాభైనిముషా లయింది!

ఆ వెంటనే మాధవ్ హెడ్‌క్వార్టర్స్ హాస్పటల్‌కి ఫోన్‌చేశాడు.

ఆ తర్వాత హోం సెక్రటరీకి మెసేజ్ పంపి, తన బలగంతో బయల్దేరాడు.

అప్పుడు సమయం –

సరిగ్గా – ఒంటిగంట!

★ ★ ★ ★

అయిపోయింది!

అంతా అయిపోయింది.

పోలీసుబలగం అక్కడికి చేరుకునేసరికే ముప్పై అయిదుగురు రిటైర్డ్ ఇంజనీర్లు దారుణంగా మరణించారు.

ఆ వార్త చుట్టుపక్కల గ్రామాలకు కార్చిచ్చులాగా వ్యాపించడంతో లక్షలాది ప్రజలు ఆ కాలనీని చేరుకున్నారు. పోలీసులు వాళ్ళని కంట్రోల్ చెయ్యలేక సతమతమవుతున్నారు.

"ఘోస్ట్లీ....మోస్ట్ పాథటిక్ సీన్! దేశ నౌ భాగ్యానికి విఘాతం కలిగించే పనులు చేశారన్న కారణంతో యింతమందిని పొట్టనపెట్టుకోవడం అమానుషం!!" అన్నాడు యస్. పి.

"అవును. నిజంగా హారిబుల్! మన గ్రామాల్లో పోలీస్‌స్టేషన్ల పరిస్థితులు – హాస్పటల్స్ స్థితిగతులు, ఊరికి దూరంగా విసిరేసినట్టుండే హరిజన కాలనీలకు అందని నౌకర్యాలను ప్రభుత్వానికి చెప్పి మరీ ఈ ఘాతుకం చేసారు!" అన్నాడు డి.ఐ. జి.

మరికొద్దిసేపట్లో ముఖ్యమంత్రి ఏకాంబరం, డి. జి. పి. కళ్యాణ్‌రాం అక్కడికొచ్చేశారు.

ముఖ్యమంత్రి అప్పటికప్పుడు పత్రికావిలేఖరులను సమావేశపర్చి జరిగిన దారుణాన్ని ఖండించి – హంతకుడిని పది రోజుల్లో పట్టుకోకపోతే రాజీనామా చెయ్యడానికి కూడా వెనుకాడనని ప్రకటించాడు.

ఆ మీటింగ్ పూర్తికాగానే ఓ నీలిరంగు కాయితం జేబులోంచి తీసి డి. ఐ. జి కి యిచ్చాడు కళ్యాణ్‌రాం.

"కళ్యాణ్ జీ దేశ ప్రగతిని చిల్లులుపొడిచిన ఘాతుకుల్ని ముందు తరాలవారికి గుణపాఠంగా వుండేందుకు హతమారుస్తున్నాను – 'రాకా'?

అని వుందా ఉత్తరంలో.

భయాందోళనలతో కళ్యాణ్‌రాం ముఖంలోకి చూసాడు డి. ఐ. జి. మాధవ్.

కళ్యాణ్‌రాం బాధగా కళ్ళు మూసుకున్నాడు.

★ ★ ★ ★

సాయంత్రం నాలుగున్నర –

కోర్ట్ నుంచి అప్పుడే యింటికొచ్చిన జస్టిస్ సీతాదేవి ఆ రోజు వచ్చిన పోస్ట్ చూడసాగింది.

ఆఖరుగా విప్పిన ఆ కాయితాన్ని చదువుతున్న సీతాదేవి గుండె వేగంగా

హెత్రీ హోం ప్రొడక్ట్స్ ప్రై. లిమిటెడ్, సికింద్రాబాద్ సమర్పిస్తున్న స్పెషల్ సీరియల్

కొట్టుకుంది.

తన భర్త శ్రీనాథ్ విడుదలకాబోతున్నాడు. ఆ వార్త చదివి సంతోషించాలో..... బాధపడాలో తెలీడంలేదామెకి! తన భర్త..... లోకం దృష్టిలో తప్పుచేసి శిక్ష అనుభవించిన నేరస్థుడు! అవును......

మరి తను?

పేరు ప్రఖ్యాతులుపొందిన న్యాయమూర్తి!

రేపు అతను యింటికొస్తే తన పరువుప్రతిష్ఠ లేమౌతాయి? తన బిడ్డమీద సంఘం ప్రభావం ఎలావుంటుంది? ఇవికాదు ఆమె ఆలోచించేది!

ఏడేళ్ళక్రితం తాను ఏ విషయంలో మనోక్షోభ అనుభవించిందో ఆ క్షణాలు మళ్ళీ అలాగే తిరిగి వచ్చినట్లనిపించింది.

అన్యాయంగా భర్తను బలిచెయ్యాలా?

భర్తకోసం న్యాయాన్ని పక్కదారి మళ్ళించాలా? అని ఆనాడు తన మనసులో అగ్నిపరీక్ష జరిగింది – ఈనాడు అదే అగ్నిదావానలంలా ఆమె మనసును దహిస్తోంది! ఆమె కళ్ళ ముందు ఆనాటి సంఘటనలు మెదులుతుండగా అలాగే నిస్త్రాణగా సోఫాలో వెనక్కివాలింది.

★ ★ ★

ఉదయం పదిగంటలు –

సెషన్స్‌కోర్ట్ జనంతో కిటకిటలాడిపోతోంది.



బోనులో ప్రముఖ సంఘసేవాతత్పరుడైన శ్రీనాద్ నిర్లిప్తంగా నిలబడివున్నాడు. నిస్వార్థపరుడనే గొప్ప పేరున్న వ్యక్తి డబ్బుకోసం హత్య చేశాడనేవార్త వినగానే – కావలసిన వాళ్ళతోపాటు ఆయన ద్వారా సేవలందుకున్నవాళ్ళూ ఆయన్నిలా బోనులో నిలబెట్టినవాళ్ళూ – ప్రెస్‌వాళ్ళూ – ఆసక్తిగా కోర్టుకొచ్చారు.

"యువరానర్! 'సేవా ప్రతిష్ఠాన్' సంస్థ ఛైర్మన్ ధర్మారావ్ హత్య కేసు వివరాల్ని క్లుప్తంగా విన్నవిస్తున్నాను" అన్న ప్రాసిక్యూషన్ లాయర్ విశ్వనాథం కంఠం కోర్టుహాల్లో ఖంగుమంది.

'సమాజ శ్రేయస్సుకోసం – మంచి ఆదర్శంతో ధర్మారావు అనే వ్యక్తి సేవా ప్రతిష్ఠాన్ స్థాపించాడు. దానికి అతని మిత్రులే మెంబర్లుగా వ్యవహరించారు. వాళ్ళ పేర్లు, వివరాలు, కోర్టువారికి తెలుసు.

ఆ 'సేవా ప్రతిష్ఠాన్' కార్యక్రమాలను విస్తృతపర్చడానికి ఒకానొక దేశం – సేవాభిలాషతో అయిదుకోట్ల రూపాయల నిధులను విడుదల చెయ్యడానికి అంగీకరించింది. ఆ నిధుల ఖర్చు విషయమై నిందితుడు శ్రీనాథ్ యింట్లోనే కమిటీ మీటింగ్ సమావేశం జరిగింది. ఆ మీటింగ్‌లో ప్రజాశ్రేయస్సుకోసం వినియోగించాల్సిన సొమ్మును యితరత్రా వాడాలని' నిందుతుడు పట్టుబట్టాడు" అన్న ప్రాసిక్యూషన్ లాయర్ మాటల్ని కట్‌చేస్తూ –

"ఐ అబ్జక్ట్ యువరానర్!" అంటూ లేచాడు డిఫెన్స్‌లాయర్ రామం.


"నిందితుడు అలా అన్నాడో లేదో ధృవపడలేదు. ఆరోపణ అంటగట్టడం అన్యాయం!" అన్నాడు.

"అతను అలా అనలేదని అక్కడ హాజరైన మిగిలిన కమిటీమెంబర్లెవరూ ఖండించకపోగా – డబ్బును వాడే విషయంలోనే ఛైర్మన్‌కూ – శ్రీనాథ్‌కీ గొడవ ప్రారంభమైందని చెప్పారు. వాళ్ళ సాక్ష్యం అలాగే నమోదయినట్లు కోర్టువారికి తెలుసు! కనుక ఆ విషయం ప్రస్తావించడం అనుచితం కాదనుకుంటాను" అన్నాడు విశ్వనాథం!

"అబ్జక్షన్ ఓవర్‌రూల్డ్! యుకెన్ ప్రొసీడ్!" అన్నారు జస్టిస్.

"థాంక్యూ యువరానర్! ఆ డబ్బు విషయంలో భిన్నాభిప్రాయంలో వున్న శ్రీనాథ్‌ని ఛైర్మన్ ధర్మారావు మందలించాడు. మాట మాట పెరిగింది. అందరూ చూస్తుండగానే పళ్ళుకోసే కత్తితో శ్రీనాథ్ – ధర్మారావు గుండెల్లో పొడిచాడు.

ప్రజల సంక్షేమానికి వినియోగించవలసిన డబ్బు తనకు దక్కలేదనే కక్షతో నిందితుడు ఈ దారుణమారణకాండకు పూనుకున్నాడు. శ్రీనాథ్ ఉద్దేశ్య పూర్వకంగానే ఈ హత్య చేసాడు. కాబట్టి న్యాయస్థానం చట్టప్రకారం దోషిని కఠినంగా శిక్షించవలసిందిగా కోరుతున్నాను!" అంటూ ప్రాసిక్యూషన్ లాయర్ విశ్వనాథం తన వాదన ముగించాడు.



డిఫెన్స్ లాయర్ రామం లేచి నిల్చున్నాడు.

"యువరానర్! ప్రాసిక్యూషన్ లాయర్ అసంబద్ధమైన విషయాల్ని పచ్చినిజాలుగా వక్రీకరించడానికి గట్టిగా కృషిచేశారు. అయితే శ్రీనాథ్ డబ్బు కాజేయడానికి ఘర్షణపడలేదనీ – నిజానికి డబ్బుకోసం కుట్ర చేస్తున్న యితర మెంబర్లకి అడ్డుపడ్డాడని నేను సవినయంగా కోర్టువారికి మనవిచేస్తున్నాను. తమపై ఎక్కడ నిందారోపణ జరుగుతుందో నన్న భయంతో కమిటీసభ్యులు నిజాల్ని వక్రీకరించారు!

ఈ హత్య జరిగినపుడు శ్రీనాథ్ యింట్లోవున్న ఒక వ్యక్తి ఈ నేరాన్ని కళ్ళారా చూసారని నా నమ్మకం. కాని.... ఎందువల్లో ఆ వ్యక్తి సాక్ష్యం చెప్పడంలేదు. ఆ వ్యక్తిని సాక్ష్యం చెప్పవలసిందిగా అర్థిస్తున్నాను!" అన్నాడు రామం.

కోర్టుహాల్లోని జనమంతా ఎవరా ఆ వ్యక్తి? అని ఆశ్చర్యంగా చూడసాగారు! అంతటా నిశ్శబ్దం!!

జస్టిస్ కొంచెం ముందుకు వంగి –

"ఎవరా వ్యక్తి?" అని అడిగింది.

డిఫెన్స్ లాయర్ కాస్సేపు మౌనంగా నిలబడి తర్వాత గొంతు సవరించుకున్నాడు.

"ఆ వ్యక్తి...... ఎవరో కాదు మేడం! శ్రీనాథ్ భార్య! న్యాయమూర్తిగా కూర్చున్న మీరే..... మీరే ఆ సాక్షి!" అంటూ చూపుడు వేలుతో సూటిగా న్యాయపీఠంలో కూర్చున్న జస్టిస్ సీతాదేవినే చూపించాడు.

సీతాదేవి ముఖం పాలిపోయింది!

కోర్టుహాల్లో గొడవ ప్రారంభమైంది!!

* * * *

"అమ్మా! కాఫీ!" వంటమనిషి పిలుపువిని వర్తమానంలోకి వచ్చింది జస్టిస్ సీతాదేవి.

"అమ్మాయి వచ్చిందా?" అడిగింది నీరసంగా.

"వచ్చారమ్మా! స్నానానికెళ్ళారు."

"సరే.... టిఫిన్‌చేసి చదువుకోమని చెప్పు. గంట వరకూ నన్ను డిస్టర్బ్ చెయ్యొద్దని చెప్పు.... అలసటగావుంది."

"అలాగేనమ్మా!" అంటూ వెళ్ళిపోయింది వంటమనిషి.

సీతాదేవి లేచివెళ్ళి తన బెడ్‌రూంలో మంచంపై వాలిపోయింది. గతం తాలూకు జ్ఞాపకాలు ఆమెని ఉక్కిరిబిక్కిరిచేస్తున్నాయి.

* * * *

కోర్టులో జనం ఉత్కంఠతంతో చూస్తున్నారు.

న్యాయపీఠంలో మరో న్యాయమూర్తి కూర్చునివున్నారు.

సాక్షి బోనులో జస్టిస్ సీతాదేవి నిలబడివుంది. నల్లకోటు తీసేసి సామాన్యస్త్రీలా నిల్చునివుంది.

"మీ పేరు?" ప్రాసిక్యూషన్ లాయర్ విశ్వనాథం అడగడం ప్రారంభించాడు.

"సీతాదేవి."

"వయసు?"

"ముప్ఫైమూడు."

"వృత్తి?"

"న్యాయమూర్తిని."

"చూడండి సీతాదేవిగారూ! ధర్మారావు హత్య చేయబడిన రోజు మీరు యింట్లోనే వున్నారా?"

"ఉన్నాను."

"సేవా ప్రతిష్ఠాన్ మీటింగ్‌లో గొడవ జరగడం మీరు విన్నారా?"

"విన్నాను."

"అంటే మీరప్పుడు అక్కడేవున్నారా?"

"లేదు. కాఫీకలపమని వంటమనిషిని పురమాయిస్తూ వంటగదిలో వున్నాను."

నేరాల నేపథ్యంలో

అమానుషత్వానికి పరాకాష్ఠ

వాస్తవ గాథలు

ఉదయం నాలుగున్నర–

తెల్లవారుతోందన్నట్లుగా కాకులు అరుస్తున్నాయ్.

చలిగాలి తెరలు తెరలుగా వీస్తోంది.

ఓ నిర్ణయానికొచ్చిన నర్సింహులు పక్కనే పడుకుని నిద్రపోతున్న భార్య ముంతాజ్‌ని లేపాడు. ఇంటికి అర ఫర్లాంగు దూరంలో వున్న టీ స్టాల్ కెళ్ళి టీ తెమ్మని చెప్పాడు. ఆ సమయంలో వెళ్ళడం ఇష్టం లేకపోయినా అతనికెక్కడ కోపం వస్తుందోనని లేచి లాంతరు వత్తిని పెద్దది చేసింది. ఆ వెలుగులో భర్త కళ్ళు చింతనిప్పుల్లా ఉండేసరికి–

"నిద్ర పట్టలేదా?" అనడిగింది.

"లేదు. త్వరగా టీ తెస్తావా లేదా?" విసుక్కున్నాడు.

ఈ పాటికి టీ స్టాల్ తెరిచే వుంటారనుకుని బయల్దేరింది. ఆమె బయటి కెళ్ళగానే తలుపు దగ్గర కేశాడు.

లాంతరు వెలుగులో ఓ మూలగా పడుకుని నిద్రపోతూ కనిపించారు పిల్లలు. ఆరేళ్ళ ఇబ్రహీం తమ్ముణ్ని పెనవేసుకుని నిద్రపోతున్నాడు.

* * *

ఇటుక బట్టీలో కూలీగా పని చేసే నర్సింహులు వయసు నలభై ఏళ్ళు. పెళ్ళి కాలేదు. అయితే ఆ ప్రాంతంలో నే వుండే ముంతాజ్‌కి భర్త చనిపోవడంతో ఆమెనీ ఆమె పిల్లల్నీ చేరదీసి తన దగ్గరే ఉంచుకున్నాడు. తొమ్మిది మాసాలుగా వాళ్ళు కలిసి కాపురం చేస్తున్నారు.

ఆరేళ్ళ ఇబ్రహీం రెండో తరగతి చదువుతున్నాడు. చిన్నవాడికింకా బడికి వెళ్ళే వయసు లేదు. పిల్లల్ని చూసుకుంటాననడంతో ముంతాజ్ అతన్ని మనసా, వాచా, కర్మణా నమ్ముకుని ఉన్నది.

అయితే రాత్రుళ్ళు తాగి వచ్చి నర్సింహులు చేసే గొడవ చూస్తే ఇబ్రహీంకి కోపం ముంచుకొచ్చేది.

దీపం వెలుగులో గుణింతాలను కంఠస్థం చేస్తూ, బలపంతో ఎక్కాలని పలక మీద రాస్తున్న సమయంలో బాగా తాగి వచ్చి ఇబ్రహీం మీద పడేవాడు నర్సింహులు. అకారణంగా వాణ్ని చితకదన్నేవాడు. ముంతాజ్ అడ్డుకున్నా వినేవాడు కాదు. ఆరేళ్ళ పసివాణ్ని బూతులు తిట్టేవాడు.

తండ్రి లాంటి వాడని ఇబ్రహీం ఊరుకున్నా– అన్యాయంగా కొడుతున్నందుకు అతని మనసు ఎదురు తిరిగేది. రోజులు గడిచే కొద్దీ ఇబ్రహీంలో సహనం నశించింది. ఎదురు తిరిగి నరసింహులు చేతిని కొరికే వాడు. తలతో అతని పొట్టలో పొడిచేవాడు. ముంతాజ్ ఇద్దరికీ సర్దిచెప్పలేక సతమతమయ్యేది.

తనకెదురుగా ఇబ్రహీంకి అన్నం పెట్టవద్దనీ– వాడు తల్లి పక్కన పడుకోరాదనీ శాసించాడు నర్సింహులు.

ఇబ్రహీం మేలుకుని ఉండడంతో అర్ధరాత్రయినా ముంతాజ్‌తో శారీరక వాంఛ తీర్చుకునేందుకు నర్సింహులుకి సమయం చిక్కేది కాదు.

ఏడ్చి ఏడ్చి ఏ అపరాత్రో ఇబ్రహీం నిద్రపోతే అప్పటికే బాగా అలసిపోయి వున్న నర్సింహులు భార్యతో ఉత్సాహంగా ఉండగలిగే వాడు కాదు. తెల్లారిన తర్వాత ఏదో పోగొట్టుకున్న వాడిలా బాధపడి అందుకు కారణం ఇబ్రహీం అని నమ్మి మళ్ళీవాడితో పోట్లాటకి దిగేవాడు.

నర్సింహులు కూలికి, ఇబ్రహీం స్కూల్‌కి వెళ్ళే వరకూ ఇల్లు రణరంగంలా ఉండేది. రాత్రయ్యేసరికి మళ్ళీ మామూలే!

* * *

కాకులు అరుస్తూనే ఉన్నాయి.

మెల్లగా వెళ్ళి ఇబ్రహీంని తట్టి లేపాడు నర్సింహులు.

ఉలికిపాటుగా కళ్ళు తెరిచి చూశాడు ఇబ్రహీం. ఎదురుగా నర్సింహుల్ని చూసేసరికి ప్రమాదం ముంచుకొచ్చిందనుకున్నాడేమో– పారిపోవాలని చూశాడు. నర్సింహులు అతనికా అవకాశమివ్వలేదు. ఇబ్రహీంని పట్టి విసురుగా కిందకి నెట్టాడు. బోర్లాపడ్డ వాడి తలకి దెబ్బ తగిలి గాయమయ్యింది.

అంతే– క్షణంలో లేచి నర్సింహులు పొట్టలో తలతో పొడిచేందుకు పరుగున వచ్చాడు.

వాడి కంఠాన్ని ఒడుపుగా చేతులో పట్టుకున్నాడు నర్సింహులు. పట్టుని సడల నివ్వకుండా వాణ్ని వంచి, చేతుల్ని మరింతగా బిగించాడు. ఇబ్రహీం నవనాడులూ తెగిపోతున్నాయ్. అసహాయంగా, దీనంగా చూస్తున్నాడు వాడు. ఆర్తనాదం చేసేందుకు కూడా గొంతు పెగిలి రావడం లేదు. గిలగిలా కొట్టుకుంటున్నాడు ఇబ్రహీం.

పసివాడ్ని వెల్లకిలా పడదోసి గుండెల మీద కూర్చుని గొంతు నులమసాగాడు. ఇబ్రహీం అచేతనుడయినా కసిగా వాడి గొంతు నింకా నులుముతూనే ఉన్నాడు నర్సింహులు.

టీ తీసుకొచ్చిన తల్లి దగ్గరగా చేరవేసి వున్న తలుపు నెట్టుకుంటూ ఎదురుగా కన్పించిన దృశ్యాన్ని చూసి చేతిలోని టీని జార విడిచి భయంతో కేకలు వేసింది. చుట్టుపక్కల వాళ్ళు వెంటనే రావడంతో నర్సింహులు తప్పించుకోవడానికి వీలులేకపోయింది.

అయితే – తను చేసింది నేరం కాదని, తన ఆనందానికి అడ్డంకయిన ఇబ్రహీంని తొలగించడం న్యాయమేనని నర్సింహులు పోలీసులతో అన్నాడు.

ఈ సంఘటన కోవూరుకి మూడు కిలో మీటర్ల దూరంలో వున్న పోవురెడ్డిపాలెం సాలు చింతల దగ్గర రెండేళ్ళ క్రితం జరిగింది. □

"అప్పుడేం జరిగిందో కొంచెం విపులంగా చెపుతారా?"

"ఏవో అరుపులు వినిపించాయ్. తర్వాత ధర్మారావు పెద్దగా కేకవేసాడు. కేక విని వంటగదిలోంచి వాళ్ళ మీటింగ్ జరిగే హాల్లోకి పరుగెత్తాను. ధర్మారావు రక్తపుమడుగులో గిలగిలా కొట్టుకుంటున్నాడు! నా భర్త కత్తి చేత్తో పట్టుకుని నిలబడివున్నారు" అంది సీతాదేవి.

లాయర్ విశ్వనాథం కొంచెం ముందుకు వంగి –

"జాగ్రత్తగా ఆలోచించి చెప్పండి మేడం! మీ భర్త శ్రీనాథ్ ధర్మారావుని కత్తితో పొడిచినట్లు మీరు అనుకుంటున్నారా? అలాగే జరిగివుంటుందని మీరు భావించారా?"

డిఫెన్స్ లాయర్ రామం కోపంగా లేచాడు.

"ఐ అబ్జక్ట్ యువరానర్! దిసీజ్ ప్యూర్లీ ఇర్రిలివెంట్ క్వశ్చన్! ప్రాసిక్యూషన్ వారు సాక్షి మనసులో తమ ఆలోచనలను నాటి చెప్పించాలని చూస్తున్నారు!" అన్నాడు.

ప్రాసిక్యూషన్ లాయిర్ నర్మగర్భితంగా నవ్వాడు.

"యువరానర్! నిందుతుడి శ్రీమతి ఒక న్యాయమూర్తి. విద్యావంతురాలు. ఇటువంటి సంఘటనలపట్ల ఆమె ఒక అవగాహనతో ఆలోచించగల మేధావి! ఆమె మామూలు స్త్రీ కాదు! అందుకే ఆమె సాక్ష్యానికి అత్యంత విలువవుందని భావిస్తున్నాను. దయచేసి ఈ ప్రశ్న అడగడానికి అనుమతి యివ్వవలసిందిగా కోరుతున్నాను." అన్నాడు విశ్వనాథం.

"అబ్జెక్షన్ ఓవర్ రూల్డ్! అడగండి!" అన్నాడు న్యాయమూర్తి.

తేలిగ్గా ఊపిరిపీల్చుకుని ఆ ప్రశ్నను మళ్ళీ గుచ్చి అడిగాడు విశ్వనాథం!

సీతాదేవి హృదయం ఒక్క క్షణం వణికింది!

కోర్టులోని అన్ని కళ్ళూ ఆమెనే నిశితంగా చూస్తున్నాయ్. అందులో కొన్ని కళ్ళు విషపూరితంగా వున్నాయ్.

విషపూరితమైన చూపులు ఎవరివో కాదు! ఆ సంఘటన జరిగిన రోజు - అక్కడున్న మిగిలిన కమిటీ మెంబర్లవి!

భగవాన్! నన్ను క్షమించు!

ఆమె మనసులో అగ్నిపర్వతాలు బద్దలౌతున్నాయ్. గుండె పగిలి పోతుందేమోనన్నంత ఆవేదన కలిగిందామెకు!

న్యాయంకోసం నిజంచెబితే తన భర్త విడుదలకావొచ్చు. కాని నిజంగా అతను విడుదలైన మరుక్షణం...... ఈ లోకాన్ని విడుస్తాడు! లేదు.... ఆ దుర్మార్గులు..... అతన్ని బ్రతకనివ్వరు.

నో..... ఆయన బతకాలి!

తన పసుపు కుంకుమలు నిలవాలి!

తన బిడ్డ తండ్రిలేని అనాధ కాకూడదు!

చెయ్యని నేరానికి శిక్ష అనుభవించినా ఫర్వాలేదుగాని..... ఆయన కలకాలం బ్రతికివుండాలి!

జస్టిస్ సీతాదేవి కళ్ళు గట్టిగా మూసుకుంది కొన్ని క్షణాలు. మనసుని కఠిన శిలలా మార్చుకుని ఎదురుగా బోనులో నిల్చున్న భర్తని చూసింది.

నిర్లిప్తంగా ముఖంలో ఏ భావమూ లేకుండా తననే చూస్తున్నాడు!

నీకోసం...... శ్రీనాథ్!

నిజంగా నీకోసం.... మన బిడ్డకోసం....!

నా శ్రీనాథ్..... న్యాయాన్ని కప్పెడుతున్నాను!

ద్రోహులకు సాయం చేస్తున్నాను!

కేవలం నిన్ను రక్షించుకోలేనేమోనన్న భయంతో - నీమీద నిందవేస్తున్నాను!

ఇది తప్పు...... ఆత్మద్రోహం.

అయినాసరే! ఆ తప్పుకు నా మనసు విధించే శిక్షను ఆనందంగా భరిస్తాను!

శ్రీనాథ్....! నా శ్రీనాథ్! నువ్వు నాకు కావాలి!

నువ్వు అన్యాయంగా చచ్చిపోకూడదు -

నా గుండెల్లో దాచుకోవలసిన నిన్ను -

జైలు గోడల మధ్య దాస్తున్నాను!

అవును... కలకాలం..... కన్నీళ్ళతో నయినా నువ్ వున్నావనే నిజంలోని ఆనందంకోసం! నన్ను క్షమించవూ?

"చెప్పండి సీతాదేవిగారూ!" అంటున్నాడు విశ్వనాథం.

గొంతు దాటి వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ గొంతు విప్పింది సీతాదేవి!

"అవును! నా భర్తే ధర్మారావుని కత్తితో పొడిచి చంపాడని మనస్ఫూర్తిగా భావిస్తున్నాను!"

అన్న సీతాదేవి రెండు చేతులతో ముఖాన్ని కప్పుకుని కుప్పకూలిపోయింది.

"అమ్మా!" పదకొండేళ్ళ దేదీవ్య పెట్టిన కేక కోర్టు హాల్లో మార్మోగింది.

సంచలనం కలిగించిన ఈ కేసులో శ్రీనాథ్‌కి న్యాయస్థానం పదేళ్ళు శిక్ష విధించింది.

ఈ సంఘటనతో అప్పుడే కొత్తగా జడ్జి అయిన సీతాదేవికి చెప్పలేనంత పేరొచ్చింది.

'సొంత భర్తని సైతం న్యాయంకోసం వదులుకున్న న్యాయమూర్తి'

అనే హెడ్‌లైన్స్‌తో పత్రికలు ప్రముఖంగా పొగిడాయ్! కొందరు ఆడవాళ్ళు సీతాదేవిని తీవ్రంగా విమర్శించినా అదికూడా ఒకవిధంగా పబ్లిసిటీని తెచ్చిపెట్టిందామెకు!

అయినా -

ఆ రోజు నుంచీ సీతాదేవి తన యింటినే జైలుగా మార్చుకుంది. తన చుట్టూ ఒంటరి ప్రపంచాన్ని నిర్మించుకుంది!

స్నేహితులు - బంధువులు - పార్టీలు - పెళ్ళిళ్ళు...... అన్నిటికీ దూరంగా

ంతకసాగింది.

ఆనాటి సంఘటనలు గుర్తొచ్చిన సీతాదేవి మనసు కలతబారింది. ఆమె కళ్ళు శ్రావణ మేఘా లయ్యాయ్!

ఇప్పటివరకూ దేదీప్యకి తన తప్పుడు సాక్ష్యంలోని నిజాన్ని చెప్పలేదు – ఆమె పసిమనసులో ఎలాంటి ఆలో చనలుచో టుచేసుకుంటాయోనన్న భయంతో –

కాని.... యిప్పుడు తండ్రి వస్తున్న సంగతి చెప్పకతప్పదు. తన సత్ప్రవర్తనతో మూడేళ్ళు ముందుగానే శిక్షని తగ్గించుకు వస్తున్నాడని చెబితే దేదీప్య ఎంత ఆనందిస్తుందో!! ఆ పసిదాని సంతోషాన్ని కళ్ళారా చూడాలి! అనుకుంటున్న సీతాదేవి మనసు ఏ మూలో..... ఎక్కడో..... కీడుని శంకించింది.

శ్రీనాథ్ విడుదలకాగానే ఆ దుర్మార్గులు అతన్నేమయినా చేస్తే?

నో.... అలా జరగడానికి వీల్లేదు! ఆ ఊహే భరించలేకపోయిందామె! గభాల్న లేచి తల విదిలించింది సీతాదేవి.

వంటమనిషిని పిల్చి –

"దేదీప్యని ఓసారి రమ్మని చెప్పు!" అంది.

"అలాగే" నని వంటమనిషి వెళ్ళిపోగానే తల దిండుక్రింద దాచిన భర్త ఫొటో ని తీసి గుండెలకానించుకుంది ఆర్తిగా.

"నాథ్..... ఎలావున్నావ్? నీ సీతని మన్నిస్తావా? మళ్ళీ ఎప్పట్లా నీలో కరిగిపోయే అదృష్టం నాకుందా?" అనుకుంటున్న సీతాదేవి తలుపుదగ్గర శబ్దమయేసరికి చటుక్కున ఫొటో ని దాచేసి కళ్ళు తుడుచుకుంది.

* * * *

"రాజకీయవేత్తలు తమాషా మనుషులు. అసలు వాళ్ళు రాజకీయాల్లోకి వచ్చినందువల్ల అలా తయారవుతారో లేక తమాషా మనుషులే రాజకీయాల్లోకి వస్తారో అంతుపట్టని విషయం!"

ఆ రోజు ముప్పయ్యవసారి ఆమాట అనుకున్నాడు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కళ్యాణ్‌రాం!

ఓ నేరస్థుడు ఎంత పెద్ద నేరం చేసినా, దానివల్ల ప్రజలు పెద్దయెత్తున నష్టపోయినా పట్టించుకోని రాజకీయవేత్తలు – తమకి చీమకుట్టినంత అపకారం జరిగినా నానా హడావుడిచేసి – కొంపలు మునిగిపోయినట్లుగా బాధపడిపోతారు.

సరిగ్గా 'రాకా' విషయంలో అదే పరిస్థితి ఏర్పడింది. 'రాకా'వల్ల తమ ప్రభుత్వం పతనమవుతుందని గ్రహించగానే మంత్రులంతా పోలీసుశాఖమీద చిందులు తొక్కుతూ స్టేట్‌మెంట్స్ యివ్వసాగారు. ముఖ్యంగా ఒక నేరస్థుడు ప్రజల్లో తన యిమేజ్‌ని పెంచుకోవడం ముఖ్యమంత్రికి భరించరాని విషయమైంది.

అయితే – వారం రోజుల్లో 'రాకా'ని పట్టుకోకపోతే తాను రాజీనామా చేస్తానని బహిరంగ ప్రకటనచేసి పది రోజులయినా ఆ విషయం మర్చిపోయినట్లు నటిస్తున్నాడు.

ఆయనలా వాగ్దానాలు చెయ్యడం– మర్చిపోవడం అలవాటే గనుక ప్రజలు కూడా దాన్ని పట్టించుకోలేదు. కానీ, ఏదో ఒకటి చేసి ఎలాగయినా 'రాకా'ని పట్టుకుని తీరాలని కళ్యాణ్‌రాం మీద విపరీతమైన ఒత్తిడి తీసుకొస్తున్నాడు ముఖ్యమంత్రి.

'ఇంజనీర్ల' సామూహిక హత్య తర్వాత ప్రజల్లో 'రాకా'కి విపరీతమయిన హీరో వర్షిప్ పెరిగిపోయింది. దానికి కారణం దేశద్రోహులైన ఆ ఇంజనీర్లందర్నీ– ఏ ప్రభుత్వమూ ఏ న్యాయస్థానమూ శిక్షించలేని విధంగా రాకా మట్టుపెట్టడం! ఆ సంఘటనతో అతని పట్ల ప్రజలకి భయంతో కూడిన ఆరాధనా భావం పెరగడం యిటు రాజకీయ నాయకులకీ– అటు పోలీసులకీ తలనొప్పిగా తయారయింది.

ఇంజనీర్ల మూకుమ్మడి హత్య తర్వాత పోలీసులు 'రాకా'ని పట్టుకోవడంలో విఫలమయినందుకు పత్రికలు పోలీస్ శాఖని తీవ్రంగా విమర్శించాయి. అంతటితో ఆగకుండా ఆ ఇంజనీర్లు గతంలో చేసిన తప్పుల వివరాలను కూడా



ప్రముఖంగా ప్రకటించాయి. అసలే పోలీసుల మీద సదభిప్రాయం లేని ప్రజలు 'రాకా' పోలీసుల్ని ఫూల్స్‌ని చెయ్యడం పట్ల బాగా ఆకర్షితులయ్యారు. పైగా పెద్దమనుషులుగా చలామణి అయ్యే దేశద్రోహుల్ని శిక్షించే పవిత్రమైన పాపిగా ప్రజలు ఆరాధించడం ప్రారంభించారు. అది మరింత అవమానించి నట్లయింది పోలీసులకి.

"డామిట్! ఈ ట్రెండ్ మంచిది కాదు!"

బిగ్గరగా– విసుగ్గాఅన్నాడు డి. జి. పి కళ్యాణ్‌రాం.

ఆయనకు దగ్గరగా నిల్చున్న కుక్కుటేశ్వరరావ్ ఉలిక్కిపడి–

"ఏ ట్రెండ్ సార్!" అన్నాడు.

డి. జి. పి. చిరాగ్గా–

"అదే.... జరుగుతున్న నేరాల్ని గురించి నేను బుర్రబద్దలయ్యేలా ఆలోచించడం– నీలాంటి ఆఫీసర్లు గుడ్లు మిటకరిస్తూ నా ముందు నిల్చోవడం– ఈ ట్రెండ్ మంచిదికాదు!" అన్నాడు.

బిత్తరపోయి– గుటక మింగడం మర్చిపోయి– అయోమయంలో కొన్ని క్షణాలు బిగుసుకు పోయిన కుక్కుటం తేరుకుంటూ–

"అదే నేనూ తెగ ఆలోచిస్తున్నాను సార్! కానీ ఏ విధమైన క్లూలూ దొరకడంలేదు!" అన్నాడు.

"క్లూలు దొరికేలా నేరం చేస్తే అతనెందుకు 'రాకా' అవుతాడు. కుక్కుటం అయ్యేవాడు!" విసుగ్గాఅన్నాడు కళ్యాణ్‌రాం.

"సార్! నాదో చిన్న ఐడియా!" అన్నాడు కుక్కుటం.

"ఏమిటది?"

"రాష్ట్రంలో వున్న హరిజన కాలనీలన్నిటి మీదా ఓ కన్నేసి ఉంచుదాం సార్! మళ్లీ ఏ కంట్రాక్టర్లనో– కూలీలనో చంపడానికి 'రాకా' వాళ్ళని ఖాళీ కాలనీలకు తీసుకెళ్ళినప్పుడు చటుక్కున పట్టుకోవచ్చు!" అన్నాడు.

డి. జి. పి. కుక్కుటం వేపు నిప్పులు కక్కేలా చూసాడు.

"యిలాంటి బోడి సలహాలు చెప్పకుండా– నీ ఏరియాలో ఇంకేం జరక్కుండా అఘోరించు.... గెటౌట్!" అన్నాడు.

కుక్కుటం బెంబేలుపడి తక్కున సెల్యూట్ చేసి మాయమయ్యాడు.

ఆ వెంటనే బయల్దేరి ముఖ్యమంత్రి ఛాంబర్స్‌కి వెళ్ళాడు కళ్యాణ్‌రాం. అప్పుడే కాబినెట్ మీటింగ్ ముగించుకు వచ్చిన ముఖ్యమంత్రి ఏకాంబరం–

"ఏమయింది కళ్యాణ్‌రాంగారూ!" అని అడిగాడు.

"మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం సర్! రాకా జాడ తెలీలేదు! పైగా ఈ మధ్య అతను ఫోన్లు, ప్రకటనలు చెయ్యటం కూడా మానేశాడు! అయినప్పటికీ అన్ని విభాగాలనూ ఎలర్ట్ చేశాం. మారువేషాల్లో తిరుగుతున్న మన సి. ఐ. డీ. లు రాకాతో ఎవరికైనా లింకులున్నాయేమోనని కనుక్కోవడానికి ప్రయత్నిస్తున్నారు..."

"ఇవన్నీ రొటీన్‌గా జరిగె ప్రికాషనరీ మెజర్స్! ఇవన్నీ నాకెందుకు? మంత్రులంతా గగ్గోలు పెడుతున్నారు. ఐ వాంట్ క్విక్ రిజల్ట్స్!" చిరాగ్గాఅన్నాడు ముఖ్యమంత్రి.

"యస్సర్!" అన్నాడు డి. జి. పి. ఏమనాలో తోచక.

"పోనీ... ఓ పని చేస్తే?" అన్నాడు ముఖ్యమంత్రి.

"చెప్పండి...."

"ఇప్పటికే అపోజిషన్ వాళ్ళు గోల పెడుతున్నారు మమ్మల్ని రాజీనామా చెయ్యమని......" అంటూ క్షణం ఆగాడు ముఖ్యమంత్రి.

ఆ ఉపోద్ఘాతం వెనక ఏ ప్రమాదకరమైన ప్లాన్ ఉందో నని కాస్త యిబ్బందిగా కదిలాడు డి. జి. పి.

చాలా రోజులుగా తాను ఆలోచిస్తున్న ప్లానే విషయం చెప్పడానికి గొంతు సవరించుకున్నాడు ముఖ్యమంత్రి.

మెల్లగా గొంతు తగ్గించి చెప్పసాగాడు. అది వింటున్న డి. జి. పి కనుబొమలు ముడుచుకుపోయాయ్. (ఇంకా ఉంది)

1-7-'88; 8-7-'88 ఆంధ్రసచిత్రవారపత్రిక

అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్ఠమైన ఆముదము



అమృతాంజన్ లిమిటెడ్ 42-45, లజ్ చర్చ్ రోడ్డు, మద్రాసు 600 004

Amrutanjan Limited

నైజం

అడుసుమల్లి మల్లికార్జున

కైలాసంలో ఢమరుక ధ్వని లాగా వంటింట్లో గిన్నెల రణగొణధ్వని వినిపిస్తోంది. ఆ శబ్దం తుఫాను వచ్చేముందు రేడియో సంకేతం లాంటిది. రేడియోలో చెప్పినప్పుడు తుఫాన్ రాకపోవచ్చుగాని, వంట గదిలో ఆ సంకేతం వచ్చిందంటే యింట్లో తుఫాన్ వచ్చితీరాల్సిందే.

'ఏమి జరిగివుంటుందబ్బా' అని ఆలోచిస్తూ హాల్లో అడుగుపెట్టాను.

పాత్రల శబ్దంతో పాటు కాంతం సణుగుడు కూడా పోటీపడుతోంది.

నన్ను చూడగానే అది కాస్త తారాస్థాయికి చేరుకుంది.

విసురుగా కాఫీ పట్టుకొచ్చి టేబుల్‌మీద పడవేసినట్టుగా పెట్టి ఏదో అంది కాంతం. అర్థంకాలేదు.

"ఏమిటే. ఏం జరిగింది?" అన్నాను కాఫీగ్లాసు అందుకుంటూ.

"విపరీత బుద్ధులు. విపరీతకాలం."

"ఎవరివి. నీవా?" అన్నాను నవ్వుతూ.

"అలాంటి బుద్ధులు మా యింటా వంటా లేవు. వుంటే మీ తండ్రీకొడుకుల దగ్గరే వుండాలి."

పరిస్థితి రవంత అర్థమైంది.

కొశ్చన్‌మార్కు మొఖంపెట్టి అమాయకంగా నా భార్య ముఖంలోకి చూశాను.

అదే నాకు తెలిసిన చిట్కా. ఇన్నేళ్ళ సంసార జీవితంలో నేను అట్లా ముఖంపెట్టి తప్పించుకున్న సంఘటనలు చాలా వున్నాయి.

మరింక నోటితో మాట్లాడలేదు కాంతం. చరచరా వెళ్ళి వుత్తరం పట్టుకొచ్చి నా వొడిలో పడేసి "చూడండి" అంది.

ప్రియమైన అమ్మకు,

నమస్కారములతో గోపి!

ఎంతో కాలంగా అనుకుంటున్నా డబ్బులు చాలక మీ కోడలికి వుంగరం చేయించలేదు. ఈ నెలతో ఆ కోరిక తీరింది. తెల్ల ముత్యంతో చిన్న వుంగరం చేయించాను. లలిత వ్రేలికి ఆ వుంగరం ఎంత ముచ్చటగావుందో! అందువలన ఈ నెల డబ్బులు పంపించటంలేదు.

మీకు మరీ అవసరం అనిపిస్తే కబురుచేయండి. ఎట్లాగో పంపిస్తాను.

నాన్నగారికి నమస్కారములు.

ఇంతే సంగతులు.

ప్రేమతో....

'గోపి'

ఉత్తరం చూశాక విషయం పూర్తిగా అర్థమైపోయింది. గోపి యిన్నాళ్ళకు ఆ మంచిపని కాస్తా చేసినందుకు మనసులో సంతోషం కలిగిందికూడా. పచ్చగా కుందనపు బొమ్మలా వుండే కోడలుపిల్ల ముచ్చటగా వుంగరం పెట్టుకుని, తళతళలాడే ముఖంతో చేతులు జోడించి 'నమస్కారం! మామయ్యగారు' అంటున్నట్టు కళ్ళముందు కదలాడింది.

అసలు పెళ్ళిలోనే లలితకు వుంగరం పెట్టవలసింది. అట్లాగే అనుకున్నాం కూడా. కాని కాంతం తెలివితేటలవల్ల, వియ్యంకుడి మంచితనంవల్ల – ఆ కార్యక్రమం కాస్తా రద్దు ఐపోయింది. తన తెలివితేటలకు కాంతం ఈనాటికీ మురిసిపోవటం నాకు తెలుసు. అమాయకంగా వుండే కోడలుపిల్లను చూచినప్పుడల్లా నా మనసు ఆర్ద్రమైపోయేది.

కట్నం డబ్బులు దండిగా గుంజాం. కనీసం చిన్న వుంగరమైనా పెట్టలేకపోయాం. ఉద్యోగరీత్యా వాళ్ళు కాస్తా మమ్మల్ని విడిచిపోతున్నప్పుడు మావాణ్ణి ప్రక్కకి పిలిచి చెవిలో చెప్పాను. "నువ్వైనా లలితకు వుంగరం చేయించరా."

అట్లాగే అన్నట్టు చిరునవ్వుతో వెళ్ళిపోయేడు.

ఇన్నాళ్ళకు ఆ కోరిక తీరిందన్నమాట.

ముఖంలో ఎలాంటి భావము కన్పించకుండా జాగ్రత్తపడి – భారంగా వూపిరిపీల్చి 'వూఁ' అన్నాను.

"నిన్నగాక మొన్న వచ్చిన పెళ్ళాం బెల్లమైంది. కన్నవాళ్ళం అల్లమైపోయాం. పెద్దలు వూరకే అన్నారా?"

"పోన్లేవే. నా పెన్షన్ ఎట్లాగూవుంది. పొలం నుంచి గింజలు వస్తున్నాయి. ఈ ఒక్కనెల వాడు పంపకపోతే నష్టమేమిటి?" అన్నాను.

"ఇవాళ వుంగరం అంటుంది. రేపు నెక్లెస్ అంటుంది. దానికంటే సరే. వీడికైనా జ్ఞానం వుండక్కర్లేదూ?"

"లలిత అట్లాంటి పిల్లకాదు. వుంగరం కూడా ఆ పిల్ల అడిగివుంటుందంటే నాకు నమ్మకంలేదు."

"మీరు ఏది నమ్మేరు గనుక. హవ్వఁ బంగారం మండిపోతున్న ఈ రోజుల్లో ఇప్పుడు అంత అవసరం ఏమి వచ్చి పడింది. మేమూ ఇట్లాగే చేసి వుంటే సంసారాలు ఇంత దూరం వస్తాయా?"

అది మాత్రం నిజం. ఈనాటి వరకు నగ నట్రా చేయించమని కాంతం నన్ను అడిగిన పాపాన పోలేదు. అడగటానికి ఆస్కారం కూడ లేని స్థితి అనుకోండి. పెళ్ళయిన ఏడాదికల్లా తల్లి కావటం, ఆ తర్వాత పిల్లల జంజాటం. అదీగాక పుట్టింటి నుంచి తెచ్చుకున్నవి దండిగానే వున్నాయాయె. నేనూ ఏనాడు చేయిస్తానని అనలేదు. తనూ అడగలేదు. ఈ విషయంలో మాత్రం కాంతం అందరి ఆడవాళ్ళలాంటిది కాదని ఢంకా భజాయించి చెప్పవచ్చు.

శాంతంగా కాంతం ముఖంలోకి చూస్తూ–

"అసలు పెళ్ళిలోనే జరుగవలసింది. ఈనాటికి ఇట్లా తీరింది. నువ్వు తిడుతూ వుత్తరం వ్రాయకు. వాడు బాధపడతాడు." అన్నాను.

ఆ మాటతో కాంతం ముఖం బాగా ఎర్రబడింది.

"వాడు బాధపడతాడు. మీరు మంచి వాళ్ళు. ఎంత చెడ్డానేనే కదా! ఆడాళ్ళ సంగతి మీకేం తెలుసండి. ఆడదాన్ని, నాకు తెలుసు. తెచ్చే మగడుంటే హిమాలయాన్ని కూడ తెమ్మంటారు. 'అయ్యో! ఎట్లా తెస్తాడు!' అని ఆలోచించరు. ముందు వెనక చూసుకోక పోతే, రేపు బాధపడేది వాళ్ళే కదా!"

చాల కాలం తర్వాత చక్కటి జీవిత సత్యం చెప్పింది. నిజమే! చాల మంది భార్యలకు భర్త సంపాదన ఎంత? ఎట్లా తెస్తున్నాడు? అన్న ఆలోచన వుండదు. తీసుక వస్తుంటే పుచ్చుకోవటమే. తీసుకరాని నాడు అలిగి మూతి బిగించటం. దాని పర్యవసానం ఎంతో భయంకరంగా వుంటుంది.

కాని నా బిడ్డ గురించి, కోడలు పిల్ల గురించి నాకు తెలీదూ?

గోపికి తగ్గ ఇల్లాలు లలిత. వాళ్ళ విషయంలో భయం లేదు.

ఆ మాట కాంతంతో అంటే మరెంత రాద్ధాంతం జరుగుతుందో!

"మాధవయ్యగారూ" అని బైట నుంచి కేకవేస్తున్న పరంధామయ్యగారు గజేంద్రుని రక్షించిన విష్ణుమూర్తిలా కనిపించాడు ఆ క్షణాన. బైటపడి పరంధామయ్యగారితో సమస్త 'విశ్వం' గురించి మాట్లాడుతూ వుండిపోయాను. ఆయన్ని ఎప్పుడూ విసుక్కుంటూ వుంటానుగాని, ఈ రోజు కాంతం నుంచి రక్షించినందుకు ఆయన యెడల చాల గౌరవ భావం కలిగింది. ఎప్పుడో, ఏదో సహాయం కూడ చేయాలనిపించింది.

నా మాటలు వింటూ పరంధామయ్యగారు ఆశ్చర్యపోతున్నారు. ఎప్పుడెప్పుడు వెళ్ళిపోదామా!

అని ముళ్ళ మీద కూచున్నట్లు కూర్చునే నేను. ఇవాళ, ఇట్లా– సూర్యుడు గృహోన్ముఖుడైపోయినా వదలక వుండటం ఆశ్చర్యంగాక మరేమిటి?

పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి.

జీవితం, రాజకీయం, సాహిత్యం... ఇట్లా నోటికి వచ్చిన విషయాలన్ని ఏకరువు పెట్టేస్తున్నాను.

పరంధామయ్యగారు రవంత కదిలి, 'ఇహ వెళ్దామా' అన్నాడు చివరకు.

ఏమాత్రం ఇష్టం లేకపోయినా తప్పుతుందా?

అయిష్టంగానే పైకి లేచాను.

ఇంటికి వెళ్ళేసరికి కాంతం టి.వి. ముందు కూర్చొని 'భరత నాట్యం' చూస్తూ వుంది. ఇంత వయసు వచ్చినా భరత నాట్యమంటే తనకు చచ్చే ఇష్టం. మనసుకు రవంత సుఖం కలిగి ప్రక్కనే కూచున్నాను.

భోజన కార్యక్రమం ఐపోయింది.

సన్నజాజి పందిరి ప్రక్కగా కుర్చీ వాల్చుకుని, ఆకాశంలోని నిండు చంద్రున్ని ఇష్టంగా చూస్తున్నాను.

కాసేపటికి కాంతం వచ్చింది.

రాగానే మొదలు పెట్టింది– సాయంత్రం వొదలిన యుద్ధం.

ఎదురు చెప్పటం మానుకున్నాను.

నిజమే!! బంగారం ధర మండిపోతుంది కదా! హితం ఏమిటంటే– మా చిన్నతనంలో సవర బంగారం (8 గ్రా.) వంద రూపాయలు. ఆ రోజుల్లో బంగారం కొనాలంటే భయపడే వాళ్ళు. ఇవాళ సవర రెండు వేల ఐదు వందలు. ఐనా ఎడా పెడా కొనేస్తున్నారు. ఏమనాలి?

నా మౌనాన్ని మరో విధంగా అర్థం చేసుకున్న కాంతం మరింతగా విజృంభించింది.

నా బాధ చూడలేక చంద్రుడు నవ్వుతో మబ్బుల చాటుకి తప్పుకున్నాడు.

★ ★ ★ ★

పండుగ మూడు రోజులు వుందనగా సుమతి అల్లుడితో కలిసి వచ్చింది.

ఇల్లంతా సందడి.

ఈసారి సుమతి రవంత వొళ్ళు చేసింది. ఆనందంగా, ఆరోగ్యంగా కనిపించింది.

"అల్లుడిగారికి ప్రమోషన్ ఏమైనా వొచ్చిందామ్మా" అన్నాను నవ్వుతో.

"పొండి నాన్నగారూ" ఇంట్లోకి పరిగెత్తింది సుమతి.

అల్లుడు రాకతో కాంతం మరీ బిజీ యాక్టరై పోయింది. పిండి వంటలు, విందు భోజనాలు, పాపం క్షణం తీరిక లేదు.

అల్లుడితో పిచ్చాపాటి మాట్లాడి, బజారు వెంట పడ్డాను.

రిటైర్డ్ మిత్రులతో కలిసి బాతాఖానీ చేస్తూ కూచున్నాను. రవంతసేపటికి పరంధామయ్యగారు అలసిన ముఖంతో వచ్చారు.

ఎప్పుడూ గల గల మాట్లాడే మనిషి అట్లా వుండేసరికి ఆశ్చర్యం కలిగి పలకరించాను.

"ఏమిటి? అట్లా వున్నారు?"

"ఏం లేదండి"

"ఫర్లేదు. చెప్పండి"

"పండక్కి అల్లుడుగారు వస్తున్నారు. చేతిలో పైసా లేదు. ఏమిటో ఈ ఫార్మాలిటీస్, ఇంత వయసు వచ్చినా మానుకోలేకపోతున్నాం" నవ్వేడు.

ఆ నవ్వులో మిళితమైన విషాధం నా గుండెను కలిచి వేసింది.

"ఎంత కావాలి" చాల సౌమ్యంగా అడిగాను.

వూహించని ప్రశ్నకు వులిక్కి పడ్డాడు.



విజ్ఞానం–వినోదం

బాబ్ బ్రౌన్



సమస్య

మంచు ముక్క

అవసరం

నీటిపై మంచు ముక్క

ఈ విధంగా చేయండి

నీటిపై తేలుతున్న మంచు ముక్కను గమనించండి. ఇది గబుక్కున తిరగ బడుతుంది.

ఇలా ఎందుకని?

ఇది కేవలం సైన్సు చేసే ఒక చిన్న తమాషా! చూడటానికి వింతగా ఉంటుంది. వెచ్చని నీరు తగులుతున్న అడుగు భాగాన మంచు ఎక్కువ కరుగు తుంది. దాంతో పై భాగాన బరువు ఎక్కువ అవడమే మంచు ముక్క తిరగబడ టానికి కారణం.

నైజం

"కనీసం ఐదు వందలైనా కావాలి"

"మీరు దిగులు పెట్టుకోకండి. రెండు రోజుల్లో నేను సర్దుతాను. తర్వాత మీ దగ్గర వున్నప్పుడు ఇవ్వండి"

సజల నయనాలతో నా రెండు చేతులు పట్టుకున్నాడు.

"మనం ఎంత కాలం బ్రతుకుతాం. పిల్లల సంతోషమే కదా మనకు తృప్తి" అన్నాను.

పరంధామయ్యగారి కళ్ళలో కాంతి చూశాక ఏదో తెలీని ఆనందం కలిగింది.

కాంతాన్ని అడిగి పరంధామయ్యగారికి డబ్బు అందించే మార్గం ఆలోచిస్తూ ఇంటి దారి పట్టేను.

మాటైతే ఇచ్చేనుగాని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అంతా కాంతానిదే. ఏం చెయ్యాలో తెలీక బుర్ర బద్దలు చేసుకుంటుంటే– చిరు నవ్వులు చిందిస్తూ కాంతం వచ్చింది.

"ఎవడు ఏడవమన్నాడు. ఆ మాత్రం అల్లుడికి పెట్టలేని వాడు పండక్కి రావద్దని చెప్పవచ్చు కదా. మళ్ళీ ప్రిస్టేజి. బోడి ప్రిస్టేజి."

"ఎవర్నండీ తిడుతున్నారు."

"ఇంకెవరు? ఆ పరంధామయ్యగారు. ఐదు వందలు కావాలట. లేకుంటే ఆత్మహత్య చేసుకుంటాడట".

"ఏం పాపం".

"అల్లుడికి బట్టలు పెట్టాలిట"

"మరి పండక్కి ఆ మాత్రం లేకుంటే ఎట్లాగండి."

"ఇతని దగ్గర వుండాలి కదా".

"లేకుంటే అప్పు చేయాలి. అల్లుడన్నాక తప్పుతుందా?"

"అదే కదా! అప్పు అంటూ నా ప్రాణం తీస్తున్నాడు."

"పోనీ ఇవ్వకపోయారా".

"మనం ఏమన్నా కోటీశ్వర్లమా!"

"పండుగపూట పెద్దాయన బాధ పడుతుంటే ఏం బావుంటుంది. నేనిస్తాను, ఇచ్చి రండి. పైనెల పెన్షన్ తీసుకోగానే ఇవ్వాలని చెప్పండి"

ప్లాన్ ఇంత త్వరగా ఫలిస్తుందని వూహించలేదు.

ఆనందం ఏ మాత్రం బైటకు కన్పించకుండా జాగ్రత్తపడ్డాను.

ఎట్లాగైనా ఆడ గుండె కదా! జాలిగుండె.

"అన్నట్లు చప్పున రండి. మీకో శుభవార్త చెప్పాలి."

"ఈ వయసులో ఏం శుభవార్త" అన్నాను చిలిపిగా.

"వేషాలకేం తక్కువ లేదు." అంటూ ఇంట్లోకెళ్ళి ఐదు వందలు తీసుక వచ్చి చేతిలో పెట్టింది.

"మళ్ళీ ఇప్పుడు ఎవరు వెళ్తారు. రేపు ఇవ్వొచ్చులే"

"పాపం వెళ్ళి రండి. ఆ పెద్ద మనిషి అన్నంత పని చేసుకుంటారేమో".

"సరే" అని బయల్దేరాను.

తిరిగి వచ్చేసరికి కాంతం వాకిట్లోనే ప్రత్యక్షమైంది. ఆ వార్త ఏదో నా చెవిని పడేస్తే కాని నిద్ర పట్టేట్టు లేదు.

"వున్నారా?"

"ఆహాఁ లక్షణంగా వుచ్చుకున్నారు."

"కూచోండి ఒక్క క్షణంలో వస్తాను." అని పరుగులాంటి నడకతో ఇంట్లోకెళ్ళింది.

అరిశలు, జంతికలు పట్టుకొచ్చింది.

శుభ్రంగా తింటూ కాంతం చెప్పబోయే విషయం గురించి ఆలోచిస్తున్నాను.

"అల్లుడుగారు చాల మంచివారండి" అంది.

"ఏ అల్లుడుగారు."

"మన అల్లుడుగారే".

ఆ విషయం కాంతం క్రొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. సుమతి పెళ్ళికి పడ్డ తిప్పలన్ని అల్లుడు మంచితనం గమనించాక ఇట్టే మాయమయ్యాయి. వున్నతమైన వ్యక్తి. అల్లుడంటే ఇన్‌కంటాక్స్ ఆఫీసరులాంటివాడని అందరూ అంటారు. కాని ఏమీ ఆశించే మనిషి కాదు. అత్తగారిల్లంటే అదేదో బాకీ వున్న కొంపలా ప్రవర్తించే వాళ్ళు నాకు తెలుసు. కాని మా అల్లుడు అందుకు పూర్తిగా విరుద్ధం.

కాని ప్రత్యేకించి ఇవాళ అల్లుడుగారి మంచితనం గురించి కాంతం ఎందుకు చెప్తుందో అర్థం కాలేదు.

"పండుగ వొస్తుందంటే దోపిడీ దొంగల్లా దోచుకుపోయే అల్లుళ్ళేగాని మన అల్లుడిలాంటి వారు ఎక్కడ వుంటారు." అంది.

"నిజమే. సుమతే కాదు మనం కూడ అదృష్టవంతులం" అన్నాను.

"అమ్మాయికి జత బంగారు గాజులు చేయించాడు పండక్కి"

"ఆఁ" అని నోరు తెరిచాను.

"నిజమండి. ఎంత ముచ్చటగా వున్నాయో" అంది మురిపెంగా.

రాత్రి భోజనాలప్పుడు సుమతి చేతుల వొంక పరిశీలనగా చూశాను. రెండు బంగారు గాజులు. పచ్చగా తళ తళలాడే ఆ గాజులు సుమతి చేతికి మరింత అందాన్నిచ్చాయి.

"నిజమేనేవ్. గాజులు చాల బావున్నాయి" పడక గదిలో కాంతంతో అన్నాను.

"మరి అల్లుడుగారంటే ఏమనుకున్నారు.?" అంది ఇష్టంగా.

తటాలున వారం రోజుల క్రితం జరిగిన రాద్ధాంతం గుర్తొచ్చింది నాకు. కోడలికి చిన్న వుంగరం చేయించినందుకు కొడుకుని తిట్టిపోసిన కాంతం, ఇవాళ కూతురికి జత బంగారు గాజులు చేయించిన అల్లుణ్ణి నెత్తి మీదపెట్టుకుంది.

చిత్రం!!

ఇందులో ఆశ్చర్యం ఏముంది? నిజానికి కాంతం మంచిదే. కాని ప్రతి స్త్రీలో ఇద్దరు ఆడవాళ్ళు వుంటారు. ఒకరు అమ్మ అయితే రెండో వారు అత్త. వాళ్ళ తప్పు ఏమీలేదు. వాళ్ళ "నైజమే" అంత.

ఆ ఆలోచనతో చిన్నగా నవ్వుకున్నాను.

"ఏమిటి నవ్వుతున్నారు" అంది కాంతం.

"ఏమీ లేదు. సుమతి అదృష్టవంతురాలు" అన్నాను.

ఆ మాటతో కాంతం కళ్ళు మెరిశాయి– తృప్తిగా.



తెలుసుకోండి

సన్నీ

ఆర్నికా షాంపూ

తద్వారా మీ శిరోజాల
అందాన్ని తిరిగి మెచ్చుకోండి

అన్ని ప్రధాన షాపులలో దొరుకుతుంది



సన్నీ. అందమైన శిరోజాలకు ప్రకృతి కానుకని అదిమీకు అందజేస్తుంది.

ఆర్నికా : హోమియోపతీలో ఒక ప్రధానమైన మూలిక. ఇది మీ శిరోజాలను శుభ్రపరచడమే కాక, టానిక్‌గా కూడా పనిచేస్తుంది. జుట్టు రాలిపోవడాన్ని, చుండ్రుని అదుపు చేస్తుంది — మృదువుగా, సహజంగా.

వీటన్నింటికీ మించినది ఏమిటంటే, సన్నీయొక్క కండిషనర్, వెంట్రుకలు చిక్కుబడటాన్ని తొలగిస్తుంది. మీ జుట్టుని సిల్కులాచేసి, మంచి అదుపులో ఉంచుతుంది. సన్నీకిగల ప్రత్యేకమైన ఫ్రెంచి సువాసననికూడా మీరు మెచ్చుకుంటారు!

ఉత్తమఫలితాలు ఉండేందుకు,

సన్నీ ఆర్నికా హెయిర్ ఆయిల్‌ని
బాగా తలకు అంటేలా రాయండి. 1-2 గంటలు ఆగండి.

ఆ తరువాత

సన్నీ ఆర్నికా షాంపూని
తడి జుట్టుకి పట్టించండి. నురగవచ్చేలా రుద్దుకోండి. నీళ్ళతో బాగా కడగండి.

ఉత్పత్తి చేసినవారు
బాక్సన్ హోమియో ఫార్మసీ ప్రయివేట్.లి.
121, ఓఖ్లా ఇండస్ట్రియల్ ఏరియా, ఫేజ్-1
న్యూఢిల్లీ-110 020.

సన్నీ ఆర్నికా షాంపూ కండిషనర్‌తోబాటు

మృదువుగా, సహజంగా —
హోమియోపతి మూలికలకు
మాత్రమే సాధ్యమైన రీతిలో.

RK SWAMY/BHP/4927 R1-TEL

షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు



—యన్. రామ్‌జీ, న్యూఢిల్లీ

ఏదైన ఒక కంపెనీ తమ యొక్క వాటాలను ప్రజలకు పంచే ముందు కంట్రోలర్ ఆఫ్ కాపిటల్ ఇస్యూస్ యొక్క అనుమతి పొందాలి. దాని తరువాత ఆ కంపెనీ గురించి ప్రజలకు తెలిసే విధంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తృతంగా ప్రచారం చేయాలి. దీనికోసం వారికి, వారు సేకరించే మొత్తంలో 10 శాతం ప్రకటనల నిమిత్తం కేటాయించటానికి అనుమతించ బడింది. ఇందువల్లనే మనం ఈరోజు రకరకాల కంపెనీల ప్రకటనలు అనేక రకాలైన వార్తా పత్రికలలో చూస్తున్నాము. ఇక్కడ విచారించ వలసిన విషయం ఏమిటంటే, షేర్‌మార్కెట్ పెట్టుబడులలో 4.79 శాతం కల్గిన మన తెలుగు వారికి తమ భాషా పత్రికలు మాత్రం కనీసం సంవత్సరానికి రెండు మూడు ఐనా పూర్తి పేజీ ప్రకటనలు లేదా కనీసం చిన్న ప్రకటనలు కూడా పొందలేక పోవటం. ఇందుకు నిందించ దగ్గ వారు ఎవరు అంటే పత్రికలవారే. వీరు ప్రకటనలను సరైన విధంగా తమకు వచ్చేట్టు చేయలేకపోవటమే. సాధారణంగా ఈ ప్రకటనలు కావాలంటే ప్రముఖుల చేత షేర్ మార్కెట్ కాలమ్‌లు రాయిస్తే వారికి తప్పక ఈ ప్రకటనలు వస్తాయి. అలాకాక ఏదో మొక్కుబడిగా ఎవరో ఒకరి చేత ఈ షేర్ మార్కెట్ కాలమ్ వ్రాయిస్తే, ఆ వ్యక్తికి తనకు వున్న పరిమిత మైన విజ్ఞానంతో ఏవో కొన్ని షేర్‌లు రికమెండ్ చేసి, అవి అన్ని కూడా తప్పయ్యే టప్పటికి, వేదాంతం లోకి దిగిపోయి చివరికి అంతా మిథ్య అని వ్రాయవలసి వస్తుంది. ఇటువంటి తప్పులు జరగకుండా చూస్తే ప్రతి సంవత్సరం 125 – 175 వరకు వచ్చే ఈ ప్రకటనలను పొంది వారు లాభం పొందటమే కాక, ఇటు మన తెలుగు వారికి కూడా వుపయోగ పడగల్గుతారు. ఎందుకంటె ఈ ప్రకటనలను చూసి, మరి కొంత మంది ఈ రంగానికి రాగల్గుతారు. మిగతా వారు పూర్తి సమాచారంను పొంద గల్గుతారు.

ఈ ప్రకటనలే కాకుండా దేశంలో వున్న అన్ని స్టాక్ ఎక్స్‌ఛేంజిలలో వీరి కంపెనీ యొక్క అప్లికేషన్ ఫారాలు, ప్రాస్పెక్టస్‌లు కూడా ఒక నెల ముందు ప్రజలకు అందు బాటులో వుంచాలి. దీని వలన ప్రజలందరికి ఈ వాటాలను పొందే అవకాశం కల్గుతుంది. ఈ ప్రాస్పెక్టస్‌లో కంపెనీ యొక్క పూర్తి వివరాలను పొందుపరచబడి ఉంటాయి. ఈ ప్రాస్పెక్టస్‌ను విశ్లేషించ దగ్గ నైపుణ్యం చాలా తక్కువ మందికి ఉంటుంది. కాబట్టి సాధారణ ఇన్వెస్టర్ వీరియొక్క సలహా తప్పక పొంద వలసిన అవశ్యకత వుంది. లేకుంటె, ఇన్వెస్టర్ యొక్క పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. మీలో చాలా మందికి తెలిసి వుంటుంది 1985–86 మధ్యలో వచ్చిన పబ్లిక్ ఇస్యూస్ లలో, పంచిన షేర్‌లు ఈ రోజున కనీసం కిలోల లెక్కన కూడా కొనే నాథుడు లేడు.

1985లో వచ్చిన, పబ్లిక్ ఇస్యూలను ఒక్కసారి పరిశీలిద్దాము. ఆటో మొబైల్స్, యాన్సిలరీస్‌లలో 26 కంపెనీలు పబ్లిక్ ఇస్యూలుగా రాగా వాటిలో కొన్ని ధర కన్న లాభంలో అమ్మదగ్గవి. ఫినోలెక్స్ కేబుల్స్, హీరో హోండా, ఇండ్ సుజుకీ, కినెటిక్ హోండా, శ్రీచక్ర టైర్స్, సుందరం క్లేటన్‌లు మాత్రం ఈ రోజున లాభంతో అమ్ముకో కల్గుతుంటే మిగతా వాటివి 6 కంపెనీలు మాత్రం 9-3 రూపాయలకు అమ్ముకో దగ్గ అవకాశం వుంటే, మిగిలిన వాటికి ఈ మాత్రం అవకాశం కూడా లేదు.

ఇంక సిమెంట్, సిమెంట్ ఉత్పత్తులలో 16 కంపెనీలలో ఒక విశాఖ ఆస్బెస్టాస్ మాత్రం ఇన్వెస్టర్ అమ్ముకోవటానికి అవకాశం ఉంది. మిగతావి మైక్రోస్కోప్‌లో కూడా కనిపించటంలేదు. స్టాక్ ఎక్స్‌ఛేంజ్ కొటేషన్‌లలో ఈ రోజున చాలా బాగా ఆదరణ పొందుతున్న సిరమిక్స్, పైప్స్, ఫిట్టిగ్స్‌లో హైట్రాన్ ఇండియా కాని, కిరా. సింటర్ కాని, దాసి సిరామిక్ కాని లక్ష్మి ప్రొసెలైన్‌లు కాని ఎక్కడ వున్నాయో ఎవరికి అర్థం కావటం లేదు. ఒక్క స్పార్టెక్ సిరామిక్‌తప్ప. ఇలా వ్రాసుకుంటూ పోతే, ఎన్ని రంగాలు, ప్రజల పెట్టుబడి నీరు కారి పోయి వుండడం చాలా బాధాకరంగా వుంటుంది.


కాబట్టి ఇన్‌వెస్టర్‌లూ మీరు చాలా జాగ్రత్తగా వుండాలి. ఈ పబ్లిక్ ఇస్యూలలో కూడా, ఎవరో ఏదో చెప్పారని, నమ్మి మోసపోకండి. సరైన కన్సల్టెంట్‌ను కాని సరైన బ్రోకర్ కాని ఎన్నుకొని అతని సలహా మీద ఈ పబ్లిక్ ఇస్యూలను పొందండి. లేకుంటే మీ సొమ్ము బూడిదపాలు అయ్యే అవకాశం ఎక్కువ. కాబట్టి వీటిని గూర్చి సరైన అవగాహన కలిగినవారు, మరియు ఈ పెద్ద పెద్ద కంపెనీలు ఇచ్చే లంచాలకు లొంగిపోని జర్నలిస్టులు ఇంకా నాలాటి వారు కొందరు ఈ దేశంలో మిగిలి వున్నారు. వారిలో మన దక్షిణాదిలో వున్న శ్రీ లియోగారు ఒకరు. ఈయన ది హిందూలో వ్రాస్తూ వుంటారు. లేకుంటే బ్యాక్ వర్గీస్, బొంబాయిలో వున్నారు. ఈయన ఫార్చ్యూన్ ఇండియా మొదలైన వాటిలో వ్రాస్తూ వుంటారు. అంతేకాక లిబ్రా అనే కలం పేరుతో ఎకనామిక్ టైమ్స్‌లో వ్రాస్తున్న వారి వద్ద నుంచి గాని సలహాలను పొందండి.

ఇంతలో ఫోన్ మ్రోగుతుంటే, మా డుంబూ ఫోన్ ఎత్తాడు.

'హలో ఎవరు మాట్లాడేది?' అన్నాడు మా డుంబు.

అవతల అతను తన పేరు కొసరాజు రాజేశ్వరరావు అని, తను త్రివేంద్రం నుంచి మాట్లాడుతున్నాను అని చెప్పి, తన వద్ద ఆంధ్రా సింథెటిక్స్, హేమాద్రి సిమెంట్స్, సైక్లిక్ కెమికల్స్, ఎ. పి. రిఫ్రాక్టరీస్, నెహ్రూ పాలెస్ హోటల్స్ యొక్క షేర్‌లు ఉన్నట్లు చెప్పి, వాటి యొక్క ధరలు స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లో ఎలా వున్నాయి. ఇక్కడ పేరద్దీవాడు (అంటే పాత పేపర్లు, పుస్తకాలు కొనేవాడు) కిలో 3 రూపాయలకు కొంటానంటున్నాడు. ఏది మంచిది? అని ప్రశ్నించాడు

డుంబు తడుముకోకుండా "మీ రద్దీవాడు ఇచ్చే ధరే చాలా ఎక్కువలాగ వుంది. ఇక్కడ కనీసం ఆ ధరకైనా కొనేవారు లేరండి" అని చెప్పేటప్పటికి, అవతల వున్న శ్రీ రాజేశ్వరరావుగారు ఫోన్ పెట్టేశారు, ఎందుకులే ఫోన్ డబ్బు దండుగ అనుకుని. □



సీరియల్

తమస్



తెనుగుసేత: డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



హిందీమూలం: డా. భీష్మసాహ్నీ

(గత సంచిక తరువాయి)

మెహతాజీ గంభీరంగా చిరునవ్వు నవ్వుతూ, అజీజ్ భుజం మీద చేతులు వేసి, "ఆ రోజుల్లో కారు పక్కన నిలబడితే నన్ను చూసి, జవహర్‌లాల్ నెహ్రూ వచ్చారా! అని జనం అనుకొంటూ ఉండేవారు" అంటూ తల మీద గాంధీ టోపీని సరి చేసుకోసాగారు.

"మెహతాజీ! మీరు ఎవరికీ తీసిపోతారు! మీ పర్సనాలిటీయే వేరు."

"ఎత్తులో ఆయన కంటే నేనే కొంచెం ఎక్కువ" మెహతాజీ కొంచెం ఉత్సాహంగా అన్నారు.

"స్నానం చేసి వచ్చారా?" కాశ్మీరీలాల్ మెహతాజీని ప్రశ్నించాడు.

"ఇది కూడా అడగవలసిన ప్రశ్నేనా? నేనెప్పుడూ స్నానం చేసే వస్తాను. చలికాలమైనా, ఎండా కాలమైనా, నా నియమం మాత్రం మారదు. చూడు కాశ్మీరీలాల్! ప్రభాత ప్రదర్శనకు స్నానం చేయకుండా ఎవరూ రాకూడదు. నువ్వసలు ముఖమైనా కడిగావా లేదా?"

"లెఫ్ట్...... రైట్...... లెఫ్ట్...... రైట్...... లెఫ్ట్......" దూరంగా ఎత్తుగా ఉన్న ప్రాంతం నుండి వినపడసాగాయి.

"జనరల్‌గారు కూడా వచ్చేస్తున్నారు." అని బక్షీగారు అనగానే అందరూ నవ్వారు..

లాంతరు వెలుగులో అందరి దృష్టి జనరల్ తెగిపోయిన చెప్పుల మీద పడింది. అవి చెప్పులో స్లిప్పర్లో అర్థం కాకుండా ఉన్నాయి. ఆ చెప్పులకు ఆ రంగులాల పైన ఖాకీ పేంటు మొదలౌతుంది. పైన ఖాకీ కోటు దాని మీద గాంధీ నెహ్రూల బొమ్మల బాడ్జీలు, అస్తవ్యస్తంగా పెరిగిన గడ్డం, పైన ఆకు పచ్చ రంగు తలపాగా.

జనరల్, ఉద్యమం ఉన్నా లేకపోయినా జైలుకి వెళ్ళి వస్తుంటాడు.

ఊరేగింపులు, ప్రదర్శనలూ ఉన్నా లేకపోయినా నగరం అంతా తిరిగి నినాదాలు చేస్తూ ఉంటాడు. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట దెబ్బలు తింటూ ఉంటాడు. బెత్తం ఒకటి వెంట తీసుకొని ఎప్పుడూ ఏదో ఒక వీధిలో తిరుగుతూ ఉంటాడు. ప్రకటనలు చేయడానికి బయల్దేరే ప్రచారపు గుర్రపు బండిలో ఈయన తప్పకుండా ఉంటాడు. ఊరేగింపు మొదలైతే అగ్రభాగంలో నినాదాలు చేసుకుంటూ ఈయనే ప్రత్యక్ష మౌతాడు. ఐతే ఈయన గొంతు ముందు వరుసల్లో ఉన్న కొద్ది మందికి కూడా వినిపించదు.

"జనరల్‌గారూ!! నిన్న ఊరేగింపు నుంచి మధ్యలో పారిపోయారేమిటి?" జనరల్‌ను చూడగానే కాశ్మీరీలాల్ ఎగతాళిగా అన్నాడు.

కాశ్మీరీలాల్ గొంతు గుర్తు పట్టి అతని వైపు కోపంగా చూస్తూ "పొద్దున్నే నీలాంటి వాళ్ళతో మాట్లాడడం నాకు ఇష్టముండదు. ఫో! ఫో దూరంగా." విసుక్కున్నాడు జనరల్.

"ఎగతాళికి వేళాపాళా లేదా? నిశ్శబ్దంగా ఉండు" బక్షీ కాశ్మీరీలాల్‌ను మందలించాడు.

కాని జనరల్ ఊరుకోలేదు–

"నీ అసలు రంగు బయట పెడతాను. నీవు కమ్యూనిస్టులతో తిరుగుతున్నావన్న సంగతి నాకు తెలుసు. కమ్యూనిస్టు నాయకుడు దేవదత్‌తో కలిసి 'కుబడే' హోటల్లో, దొంగచాటుగా కోడిమాంసం తినడం చూసాను."

"జనరల్! ఇక చాలు, చాలు. ఇంకా ముసుగు తీయకు." బక్షీ సర్దడానికి ప్రయత్నం చేసాడు.

ఇంతలో వెడల్పాటి పైజమాతో శంకర్‌లాల్ అక్కడికి వచ్చాడు. చీకటిలో ప్రభాత సమయపు వాతావరణం కన్పిస్తుంది. కుడివైపు ఎత్తుగా ఉన్న బ్యాంకు

జరిగిన కథ– 1: మురాద్ అలీ చూపిన ఆశతో నత్తూ పందిని చంపడానికి సిద్ధపడతాడు. కాని ఆ పంది నత్తూ శక్తినంతా తోడేస్తుంది. ఎంతో కష్టంతో పందిని లొంగదీసి చంపేస్తాడు. కాంగ్రెస్ ప్రభాత ప్రదర్శన నిర్వహిస్తూ ఉంటుంది. బక్షీ, అజీజ్, మెహతా వచ్చి ఉంటారు.

గోడ నీడ చీకటిని ఇంకొంచెం చిక్కబరుస్తుంది. రోడ్డుకి అవతల 'ఆర్యా' స్కూలు భవనంలో హల్వావండే పొయ్యిలలో నుండి పొగ పైకి లేచిరాసాగింది. పక్క వీధిలో నుండి అస్పష్టపు ధ్వనులు అప్పుడప్పుడు విన్పిస్తున్నాయి. అక్కడక్కడ ముసుగులు వేసుకొన్న స్త్రీలు గురుద్వారాలకు వెళుతూ కన్పించసాగారు.

బక్షీ చేతిలోని లాంతరును పైకెత్తి వత్తిని ఊది ఆర్పి వేసాడు. "ఏమిటీ! మేము రాగానే బక్షీగారు దీపం ఆర్పేశారు?" శంకర్ మునాదీవాలా అడిగాడు.

"నీవు నా ముఖం చూడాలా, మెహతాజీని చూడాలా? నూనె ఎక్కువ కాలుచున్నది. ఇది కాంగ్రెసు కమిటీ లాంతరు కాదు. నా స్వంతం. కాంగ్రెస్ కమిటీ నుంచి నూనె మంజూరు చేయించు. పగలు రాత్రి వెలిగించే ఉంచుతాను." బక్షీ వెంటనే అన్నాడు.

"సిగిరెట్లకే మీకు అనుమతి అవసరం లేకపోయింది. ఇక కిరసనాయిలుకి దేనికి?" కాశ్మీరీలాల్ వెనక నిల్చున్న శంకర్ నెమ్మదిగా అన్నాడు.

"బక్షీ ఈ మాటలు విన్నప్పటికి తేలు కుట్టిన దొంగ లాగా ఉండిపోయాడు. బహుశా ఇటువంటి లోఫర్‌లతో నోరు కలపటం అవమానం అనిపించినట్లుంది.

"బక్షీజీ! మీరే యజమానులు. మీకు అనుమతి దేనికి? మీ ఆజ్ఞ లేకుండా పక్షి కూడా రెక్క కదపలేదు" అంటూ శంకర్ మెహతాజీ వైపు తిరిగి 'జైహింద్ మెహతాజీ' అన్నాడు.

"జైహింద్."

"నేను మిమ్మల్ని చూడలేదు."

"మేము నీకెక్కడ కనపడతాము? నీవు చాలా పెద్దవాడివై పోయావు కదా!"

"మీరు ఇవాళ మీ సంచి తెచ్చినట్టు లేరే?"

"ప్రభాత ప్రదర్శనలో సంచితో పనేముంది?"

"మీ సంచికి ప్రతి చోట పని ఉంటూనే ఉంటుంది. భీమా చేసేవాళ్ళు ఎక్కడైనా చిక్కవచ్చు."

మెహతాజీ నోరు మెదపలేదు. ఆయన కాంగ్రెస్ పనితో పాటు 'జీవిత భీమా' కూడా చేయిస్తూంటాడు.

"శంకర్! నువ్వు నోరు మూసుకో. మెహతాజీ నీ కంటె మూడింతలు పెద్దవాడు. పెద్దలను గౌరవించడం నేర్చుకో"

బక్షీ మందలించాడు.

"నేనేమన్నాను. సంచీ ఎందుకు తేలేదని మాత్రమే అడిగాను. సేఠీగారి వద్ద ఏభై వేల రూపాయిల పాలసీ దొరికిందా లేదా, అని నేను అడగలేదు కదా."

శంకర్ బాణం వదిలాడు. సాధారణంగా శంకర్ ఈ విధంగా ఎప్పుడూ మాట్లాడడు. నిక్కచ్చి అయిన మనిషి. ఏ విషయమైనా ముఖం మీదే అడిగేస్తాడు. అయితే ఏభై వేల పాలసీ విషయం మాత్రం మెహతాజీకి తిరుగులేని దెబ్బ! మెహతాజీకి నోటి మాట లేదు. మెహతాజీ సామాన్యుడు కాదు. మొత్తం మీద పదహారు సార్లు జైలుకు వెళ్ళి వచ్చాడు. పైగా కాంగ్రెస్ కమిటీలో ముఖ్యుడు. అతి తెల్లని ఖద్దరు ధరిస్తాడు. అటువంటి వాడి మీద ఈ ఆరోపణ చాలా తీవ్రమైనది. అయితే కంట్రాక్టరు సేఠీ ఏభై వేల రూపాయిల పాలసీ ఈయనకే ఇస్తున్నట్లు. దీనికి బదులుగా మెహతాజీ రాబోయే ఎన్నికలలో సేఠీకి కాంగ్రెసు టిక్కెట్టు ఇప్పించబోతున్నట్లు జనం గుసగుసలుగా చెప్పుకోసాగారు.



"మెహతాజీ! వాడేదో వాగుతూ ఉంటాడు. మీరు పట్టించుకోవద్దు."

"మెహతాజీ టిక్కెట్టు ఇప్పిస్తానని వాగ్దానం చేసారని నేను చెప్పటం లేదు. టిక్కెట్టు ఇచ్చే అధికారం ప్రాంతీయ కమిటీది. జిల్లా కమిటీ సిఫారసు చేస్తుంది. సరే! కార్యదర్శి, ప్రాంతీయ కమిటీ ముఖ్యులు లోపల కుమ్మక్కయితే చెప్పలేం. అయితే మనం ఆ విధంగా జరగ నివ్వం గదా! అందరు వినండి. పెద్ద పెద్ద కంట్రాక్టర్లకు టిక్కెట్లు ఇస్తే కాంగ్రెస్ పని అయిపోయినట్లే."

మెహతాజీ అక్కడ నుండి జారుకుని కాశ్మీరీలాల్‌తో మాట్లాడ సాగాడు. బక్షీ మరొక సిగిరెట్టు వెలిగించాడు.

శంకర్‌కు మెహతాజీకి సరిపడదు. నెహ్రూగారు పాల్గొనే లాహోరు సభకు పంపే జిల్లా ప్రతినిధులు లిస్టులో మెహతాజీ శంకర్ పేరు చేర్చనప్పటి నుండి ఈ మనస్పర్థలు మొదలైనాయి. శంకర్ లిస్టులో తన పేరు చేర్చకపోయినా లాహోరు వెళ్ళి సమావేశంలో పాల్గొన్నాడు. అక్కడ పెద్ద సహ పంక్తి భోజనం ఏర్పాటు చేసారు. అందులో నెహ్రూగారు కూడా పాల్గొన్నారు. దానిలో పాల్గొన్న ప్రతినిధులందరి దగ్గర ఎనిమిదేసి అణాలు చొప్పున వసూలు చేసారు. జిల్లా ప్రతినిధులందరికి మెహతాజీ కాంగ్రెసు కమిటీ నిధి నుండి ఆ పైకం చెల్లించారు. అక్కడ కూడా శంకర్‌కు పైకం చెల్లించడానికి ఆయన నిరాకరించాడు. శంకర్‌కు చాలా కోపం వచ్చింది. మెహతాజీ ఉపేక్షించినప్పటికి అతను ఆ సహ పంక్తి భోజనంలో పాల్గొని మెహతాకు ఎదురు పంక్తిలో కూర్చుని ఆకలిగొన్న తోడేలు లాగా ఆహారం మీద కలియబడ్డాడు. వడ్డన చేసేవాళ్ళ మీద కేకలు కూడా వేశాడు. ఇదంతా చూస్తూ మెహతాజీ ఊరుకోలేకపోయాడు.

శంకర్! మనిషి లాగా భోజనం చేయ్, మన జిల్లా కాంగ్రెస్ కమిటీ పరువు తీస్తున్నావు."

"మెహతాజీ మాట్లాడకుండా ఉంటే మంచిది. నేను కాంగ్రెస్ డబ్బుతో తినటం లేదు. స్వంత డబ్బుతో తింటున్నాను. మనం ఇంటి కెళ్ళిన తర్వాత మాట్లాడుకుందాం. మీ లాంటి వాళ్ళను చాలా మందిని చూశాను."

"నువ్వేం చూశావ్? ఎప్పుడూ వాగటం తప్ప నీకేం తెలుసు? ఇంటికెళ్ళిన తర్వాత నన్నేం చెయ్యగలవ్?"

లాహోరు నుండి తిరిగి వచ్చిన తర్వాత శంకర్ మెహతాజీని బొత్తిగా ఆటలు పట్టిస్తున్నాడు. ప్రదేశ్ కాంగ్రెస్‌కు ఎన్నికలు జరగబోతున్నాయి. ప్రత్యేక జిల్లా కమిటీ నుండి నలుగురు సభ్యులను పంపవలసి ఉంది. మెహతాజీ మిగిలిన ముగ్గురు సభ్యులతో పాటు నాలుగో పేరుగా 'కోహలీ'ని ప్రతిపాదించాడు. శంకర్ అడ్డుకోకుండా ఉంటే 'కోహలీ' జిల్లా కమిటీ తరఫున ఎన్నుకోబడేవాడే. స్క్రూటినీ కమిటీ మీటింగు జరుగుతూ ఉండగా శంకర్ లేచి నిలబడ్డాడు.

"క్షమించండి! నేనొక ప్రశ్న వేయదలచుకొన్నాను"

మెహతాజీకి వళ్ళు మండింది. "ఇక్కడ స్క్రూటినీ కమిటీ సమావేశం జరుగుతూ ఉన్నది. నువ్వేదయినా అడగదలుచుకొంటే తర్వాత నన్నడగు".

"మిమ్మలను కాదు. నేను స్క్రూటినీ కమిటీని అడగదలచుకొన్నాను". స్క్రూటినీ కమిటీ అధ్యక్షుడు మాట్లాడే వరకు శంకర్ నాటకీయంగా నిలబడే ఉన్నాడు.

"ఏం చెప్పదలచుకున్నావో చెప్పు? " అధ్యక్షుడు అడిగాడు.

'కాంగ్రెసు సభ్యత్వపు నియమాలేమిటో తెలుసుకోదలచాను?"

'నువ్వు పనికొచ్చే మాటలేమైనా ఉంటే చెప్పు. వ్యర్థ ప్రసంగాలు చేయకు".

"మెహతాజీ! నేను మీతో మాట్లాడటంలేదు. మీరు నిశ్శబ్దంగా ఉంటే అందరికి మంచిది".


"చెప్పనివ్వండి. అతన్ని చెప్పనివ్వండి. శంకర్! చెప్పు. కాంగ్రెస్సు సభ్యత్వపు నియమా లేమిటో నువ్వు చెప్పు".

"సభ్యుడు సంవత్సరానికి నాలుగణాల చందా కడుతూ ఉండాలి. చేతితో వడికిన, చేతితో నేసిన శుద్ధ ఖద్దరు ధరించాలి. రాట్నంతో నూలు వడకాలి. అంతే కదా?"

"అవును. నువ్వు చెప్పింది నిజమే!"

"అయితే ఒక్కసారి కోహలీగారిని నిలబడవలసినదిగా నేను కోరుతున్నాను".

అంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు.



"క్షమించండి (స్క్రూటినీ కమిటీ ముందు ప్రశ్నలు వేసే హక్కు ప్రతి సభ్యుడికి ఉంటుంది".

మెహతాజీ కోపంతో ఊగిపోయాడు.

"మెహతాజీ! మీరిక్కడ అధ్యక్షులు కాదు. ఇక్కడ మీ కర్ర పెత్తనం చెల్లదు. కోహలీగారు ఒక్క నిముషం దయచేసి నిల్చుంటారా!"

కోహలీ లేచి నిలబడ్డాడు.

'మీరు ఖద్దరే ధరిస్తారు కదా!'

"ఈ నాటకం ఏమిటి? నువ్వు అడగదల్చుకున్నదేదో తిన్నగా అడుగు".

"మీ ముడి చూపించండి. ముడి అంటే పైజామా బొందు".

"నీ ఉద్దేశ్యం ఏమిటి?"

"ఇది సభ్యుని గౌరవానికి సంబంధించిన విషయం. వేళాకోళానికి ఇది సమయం కాదు".

"నేను వేళాకోళం చేయటంలేదు మెహతాజీ! మీరు నిశ్శబ్దంగా ఉండండి. అధ్యక్షుని అనుమతి లేకుండా మాట్లాడే హక్కు మీకు లేదు. కోహలీగారు చూడండి. మీ పైజామా బొందు ముడి చూపించండి".

"చూపించకపోతే?"

"మీరు చూపించి తీరాలి. నేను ఋజువు చేయదల్చుకున్న విషయానికి మీరు ముడి చూపించడం చాలా అవసరం".

"చూపించవయ్యా! వీడి మొరుగుళ్ళతో పనంతా ఆగిపోతున్నది. ఏం చేస్తాం. కాంగ్రెసులో ఇటువంటి లోఫర్లు ప్రవేశించారు".

"ఏమన్నారు మెహతాజీ! నేను లోఫర్‌నా? మీరు గౌరవనీయులా? నాతో చెప్పించకండి. నాకు తెలుపేదో, నలుపేదో పూర్తిగా తెలుసు. ఆఁ కోహలీగారూ! చూడండి...."

"నువ్వేం చెప్తున్నావ్ నేను అందరి ముందు ముడి విప్పదీయాలా?"


"నేను విప్పమనడంలేదు. కేవలం చూపించమంటున్నాను".

"చూపించవయ్యా బాబూ! గోల ఆగిపోతుంది....."

కోహలీ ఖద్దరు చొక్కా ముందు భాగాన్ని పైకెత్తాడు. కింద పసుపురంగు బొందు వేలాడుతూ ఉంది. శంకర్ ఒక్కసారి ముందుకు దూకి ఆ ముడిని పట్టుకున్నాడు.

"అయ్యా! పెద్దలందరు చూడండి. ఈ బొందు సిల్కుది. చేతితో వడికిన నూలుది కాదు. యంత్రం మీద తయారైనది. కావాలంటే మీరు పట్టుకుని చూడవచ్చు".

"అయితే ఏమైంది?"



"కాంగ్రెసు సభ్యుడు సిల్కు బొందు ధరిస్తాడా! మీరాయనను ప్రాంతీయ కాంగ్రెసు కమిటీకి సిఫారసు చేస్తారా! కాంగ్రెసుకు మాన మర్యాదలు ఉండాలా. అవసరం లేదా!"

స్క్రూటినీ కమిటీ సభ్యులు ఒకరి ముఖం ఒకరు చూసుకోసాగారు. తప్పనిసరిగా కోహలీ పేరు తీసివేయవలసి వచ్చింది. ఆనాటి నుండి శంకర్ మెహతాజీని చూస్తేనే సహించలేకపోతున్నాడు.

బక్షీ చాలా ఆందోళనగా ఉన్నాడు. దేశరాజ్ రాలేదు. రామదాసు మాస్టారు రాలేదు. పాడేవారెవరు. ప్రభాత ప్రదర్శనలో తప్పక ఎవరో ఒకరు పాడాలి. ఎవరూ లేకపోతే తానే పాడగలడు. కాని జిల్లా కమిటీ నుండి జీతం తీసుకునే వాళ్ళు తప్పక వచ్చి తీరాలి.

"మెహతాజీ! మనం ప్రభాత ప్రదర్శనను మొదలుపెడదాం?" రెండు వీధులు తిరిగేసరికి రామదాసు మాస్టారు పరుగెత్తుకొస్తారు. దూడ పాలు తాగేసింది. నేనేం చేయను. అంటాడు. కానివ్వండి. ఏం చేస్తాం. వీళ్ళిట్లా పని చేస్తున్నారు" అంటూ మిగిలిన సభ్యుల వైపు తిరిగి 'కాశ్మీరీలాల్! ఇంకా ఎదురు చూడటం భావ్యంకాదు. నువ్వు ప్రారంభించు" అన్నాడు బక్షీ.

కాశ్మీరీలాల్ ఇతరులను యిరికించి ఆనందిస్తుంటాడు. జనరల్‌వైపు తిరిగి "జనరల్! నువ్వు ఉపన్యాసం ప్రారంభించు. ప్రభాత ప్రదర్శనకు ముందు ఉపన్యాసం వుంటే బాగుంటుంది."

జనరల్‌కు ఇంతకంటే కావలసింది యేముంది. వెంటనే బెత్తం వూపుకుంటూ లెఫ్ట్, రైట్ చేసుకుంటూ రోడ్డుపక్కనున్న యెత్తైన రాయిపైకి యెక్కాడు.

"కాశ్మీరీలాల్! ఏం చేయిస్తున్నావు నువ్వు? కాస్త సమయం సందర్భంచూడు. నీకు ప్రభాత ప్రదర్శన యిష్టంలేకపోతే సూటిగా చెప్పు." అంటూ బక్షీ విసుగ్గా జనరల్‌వైపు కదిలాడు. కాని అప్పటికే జనరల్ తన ఉపన్యాసం ప్రారంభించాడు.

"సోదరులారా!........"

"సోదరులారాలేదు గీదరులారాలేదు కిందకు దిగు" అంటూ బక్షీ చేతులు వూపుతూ "దిగవయ్యా బాబూ! పొద్దున్నే తమాషా మొదలుపెట్టావు" అన్నాడు.

"నా గొంతును యెవరూ ఆపలేరు. నా నోరును యెవరూ నొక్కలేరు" రాయిమీదనుంచి దిగకుండా జనరల్ తన ప్రసంగాన్ని మొదలుపెట్టసాగాడు.

"సోదరులారా......."

బొంగురుపోయిన గొంతుతో జనరల్ మాట్లాడసాగాడు.

జనరల్ వయసు ఏభై సంవత్సరాలకు పైబడివుంది. అయితే సంవత్సరాల తరబడి జైలులో వున్నకారణంగా శరీరం శిథిలమైపోయింది. నగరంలోని మిగతా కాంగ్రెసువాదులు జైలులో 'బి' క్లాసులో వుండగా, జనరల్ మాత్రం ఎప్పుడూ 'సి'క్లాసులోనే వుంచుతూ వచ్చారు. ఆ కారణంగా జనరల్ ఆరోగ్యం చెడిపోవటమేకాక యిసుకతో నిండిన రొట్టెలు తినవలసివచ్చేది. కాని జనరల్ మాత్రం యెప్పుడూ క్షమా భిక్ష కోరలేదు. తన ఖాకీదుస్తులు వదలలేదు. యవ్వనపు తొలి రోజుల్లో లాహోరు కాంగ్రెసు సభలకు వాలంటీరుగా తమ పట్టణం నుంచి లాహోరు వచ్చాడు. సంపూర్ణ స్వరాజ్యసాధన నినాదం ఆ సభలో మార్మోగినప్పుడు నెహ్రూతో కలిసి 'రావీ' నది ఒడ్డున ఆనందంతో గంతులువేశాడు. ఆ రోజు నుంచి అతను వాలంటీరు దుస్తులు ధరిస్తూనే వున్నాడు. రోజులు బాగున్నప్పుడు ఆ దుస్తులపైనే మూడు రంగుల తాడు, విజిల్ ధరిస్తూ వుండేవాడు. రోజులు గడుస్తున్నకొద్దీ దుస్తులు వుతుక్కునే పరిస్థితి కూడా లేకుండాపోయింది. జనరల్‌కు యెక్కడా పనిదొరకలేదు. అతను ప్రయత్నము చేయలేదు. కాంగ్రెసు కార్యాలయం నుండి గౌరవభృతిగా నెలకు పదిహేను రూపాయలు మాత్రం తీసుకుంటూ వుంటాడు. బక్షీ ఏదైన అవకతవక పనిచేస్తే వెంటనే అక్కడే లేచి వుపన్యాసం ప్రారంభించుతాడు. గుండెనిండా ధైర్యం నిండివుంది. అందుకే జీవితమంతా దుఃఖాన్ని, బాధలను భరించుకుంటూ వస్తున్నాడు. ఇల్లూ – వాకిలి లేదు. భార్యా బిడ్డలు లేరు. పనీపాటాలేదు.

వారానికి రెండు మూడుసార్లు యెక్కడో ఒకచోట దెబ్బలు తింటూనేవుంటాడు. పోలీసులు లాఠీచార్జి చేస్తున్నప్పుడు మిగిలినవారంతా పారిపోతే ఎండి న తన ఛాతీని పోలీసుల లాఠీలకు ఎదురొడ్డి ఎముకలు విరగ్గొట్టించుకొంటుంటాడు.

"కాశ్మీరీలాల్! వాడిని దింపవయ్యా బాబు. పొద్దునే మంచి తమాషా మొదలుపెట్టించావ్" ఈసారి మెహతాజీ కొంచెం బిగ్గరగా అరిచాడు. కాని జనరల్‌మాత్రం యింకాపట్టుదలగా నిలబడి మాట్లాడసాగాడు.

"సోదరులారా! చాలా విచారించవలసిన విషయం. జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడే దేశంపట్ల విశ్వాసఘాతంగా ప్రవర్తిస్తున్నాడు. 1929వ సంవత్సరంలో 'రావీ' నది ఒడ్డున మనంచేసిన ప్రతిజ్ఞపై ఆఖరి శ్వాసవరకు నిలబడి వుందాం. మీ సమయం నే నెక్కువగా తీసుకోను. కాంగ్రెస్ మౌలిక సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రవర్తించేవాళ్ళు ఇంకా మనదేశంలో పుట్టలేదు. ఈ మెహతాజీ ఎక్కడినుండి వచ్చాడు? మనం ఈయనతో, ఈయన తాబేదారులతో



'తమస్' నవలా రచయిత డా. భీష్మసాహనీ. టి. వి. సీరియల్‌కి దర్శకత్వం వహించిన శ్రీ గోవింద్ నిహలానీ ఇటీవల విజయవాడ వచ్చినప్పుడు తీసిన చిత్రం. అనువాదకుడు డా. యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్‌ని కూడా చిత్రంలో చూడవచ్చు.

కాశ్మీరీలాల్, శంకర్‌లాల్, జీత్‌సింగ్ వంటి దేశద్రోహులతో పోరాడగలం" బిగ్గరగా నవ్వులు.

"వీ డీ విధంగా దిగడు. దింపాలని ప్రయత్నంచేసినకొద్దీ రెచ్చిపోతుంటాడు" దీనికంతా కారణమైన కాశ్మీరీలాల్ బక్షీ చెవిలో చెప్పాడు.

బక్షీ కోపంతో మండిపోతూ కాశ్మీరీలాల్‌వైపు చూశాడు.

"చప్పట్లు కొట్టండి. వాడే దిగిపోతాడు. మీ రేం బాధపడవద్దు. రెండు మూడుసార్లు చప్పట్లుకొడితే వాడే వుపన్యాసం ఆపేస్తాడు" అంటూ కాశ్మీరీలాల్ చప్పట్లుకొట్టాడు. మిగిలినవాళ్ళు అతన్ని అనుసరిస్తూ చప్పట్లుకొట్టారు.

"అద్భుతం! బ్రహ్మాండంగావుంది."

"సోదరులారా!...... నేను మీ సమయాన్ని వ్యర్థం చేయకుండా, ఇంతవరకు శ్రద్ధగా నా ఉపన్యాసాన్ని ఆలకించిన మీకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. హిందూస్తాన్ స్వాతంత్ర్యం పొందే రోజు అతి దగ్గరలోనే వుందని మీకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. కాంగ్రెస్ ఈ పోరాటంలో తప్పకవిజయం సాధిస్తుంది. నేను 'రావీ'నది ఒడ్డున చేసిన ప్రతిజ్ఞ......"

"ఆహా! అద్భుతం. బ్రహ్మాండంగావుంది" అంటూ కాశ్మీరీలాల్ మరలా చప్పట్లుకొట్టాడు.

"సోదరులారా!....... మీకు నేను కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. మరలా యింకొక రోజు మీ ముందుకు వస్తాను. దయచేసి మీరంతా నోతో గొంతుకలిపి వినాదాలు చేయ్యండి."

"ఇంక్విలాబ్ – జిందాబాద్" అంటూ రెండు మూడు గొంతులు ప్రతిధ్వనించాయి.

"ఏం! అన్నం తినలేదా? బిగ్గరగా అరవలేరా? అరవండి...... "ఇంక్విలాబ్."

"జిందాబాద్" చాలామంది బిగ్గరగా అరిచారు.

జనరల్ చేతితో బెత్తం పట్టుకొని కిందకు దిగాడు.

ఇంతలో 'జిందాబాద్' అనుకుంటూ రామదాసు మాష్టారు రొప్పుకుంటూ అక్కడకు పరుగెత్తుకొచ్చారు.

"ఇదేనా రావలసిన టైము?" బక్షీ కోపంగా అన్నాడు.

"దూడ పాలు కుడిచేసింది. అందువలననే ఆలస్యమయింది...." కాశ్మీరీలాల్ సమాధానం చెప్పాడు.

అందరూ గొల్లున నవ్వారు.

కాని రామదాసు మాష్టారు చాలా నెమ్మదిగా చెప్పాడు. "ఈ రోజు ప్రభాత ప్రదర్శన జరగదు."

"ఎందుకని?"

"ఈ రోజు పారిశుధ్య కార్యక్రమం నిర్ణయించబడింది."

"ఎవరు నిర్ణయించారు?"

"రాత్రి గోసాయి పాకలలో కన్పించి ఇమామీదిన్‌పేట వెనకవీధులు శుభ్రంచేద్దామని చెప్పాడు."

"ఆలస్యంగా వచ్చి, పైగా కథలు చెప్తున్నావా?"

"అబ్బే! నేను చీపుర్లు పారలు అక్కడ చేర్చి వచ్చాను. కొన్ని రాత్రిచేర్చాను. కొన్ని ఇప్పుడు తీసుకువెళ్ళాను" అంటూ తనకు తానే లెక్క చెప్పుకోసాగాడు......

"ఐదు పారలు, పన్నెండు చీపుర్లు, మూడు గడ్డపారలు, ఐదు గవేళాలు రాత్రే అక్కడ చేర్చాను. మొత్తం సామానంతా షేర్‌ఖాన్ ఇంట్లో పెట్టివచ్చాను."

"మాకు యెవరూ చెప్పలేదే!"

"అందుకే నేను పరుగెత్తుకొచ్చాను. నేను మొట్టమొదటిసారి యిక్కడకొచ్చినప్పుడు ఇక్కడ యెవరూ లేరు."

"నీ బుర్ర పాడైపోయినట్లుంది. ఇక్కడ శుభ్రం చేయడానికి మురికి కాలువలే లేవు" కాశ్మీరీలాల్ అన్నాడు.

"ఎందుకులేవు? అక్కడ శుభ్రంచేయని మురికి కాల్వలు చాలా వున్నాయి."

"ఆ మురికి కాలువలైతే ఏళ్ళతరబడి శుభ్రంచేయకుండా వుండివుంటాయి. వాటి నెవడు శుభ్రంచేస్తాడు?"

"మేమే చేస్తాం. నువ్వు దేశద్రోహివి" జనరల్ కోపంతో అన్నాడు.

"నీ యిష్టం వచ్చిన నిర్ణయం తీసుకుంటున్నావు. గోసాయి నిర్ణయిస్తే మా కెందుకు చెప్పలేదు?"

చీకటి తగ్గి వెలుతురు పరుచుకోసాగింది. ప్రభాత ప్రదర్శనకు గుమికూడిన వ్యక్తులు సంకోచిస్తూ వుండిపోయారు.

"ముందు ఇక్కడనుండి పదండి. ఇక్కడనుండి పాడుకుంటూ వెళదాం....." అంటూ ఆరిపోయిన లాంతరు పట్టుకొని బక్షీ ముందుకు సాగాడు.

జనరల్ లెఫ్ట్...... రైట్...... అనుకుంటూ నడుస్తున్నాడు. మూడు రంగుల జెండాను కాశ్మీరీలాల్ పట్టుకుని పైకెత్తాడు. రామదాసు మాష్టారు ప్రభాత ప్రదర్శన గీతాన్ని పాడుకుంటూ నడవసాగాడు. మిగిలినవాళ్ళు ఆ పాటతో గొంతు కలిపి నడవసాగారు.

(ఇంకావుంది)

పుట్టిన తేదీ తెచ్చిన తంటా?

కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి సరోజ్‌కపర్డీ పుట్టిన రోజు ఇప్పుడు ఒక సమస్యగా తయారైంది. రాజ్యసభ "హూ ఈజ్‌హూ" ప్రచురణలు వరుసగా నాలుగింటిలో నాలుగు రకాల తేదీలు ఇవ్వ బడ్డాయి. మహారాష్ట్ర టైమ్ విలేఖరి ఒకాయన ధైర్యం చేసి అసలు తేదీ ఏమిటన్నది ఋజువులతో సహా బయటికి లాగారట! ఆ తేదీని బట్టి ఆమె 1972లో మొట్ట మొదటి సారి రాజ్య సభకి ఎన్నికైనప్పుడు ఆమెకి రాజ్యసభ సభ్యురాలిగా ఉండే అర్హత లేదు. రాజ్యసభ సభ్యులుగా ఉండేవారి వయసు కనీసం 30 సంవత్సరాలు ఉండాలి. కానీ ఆమెకి 30 సంవత్సరాలకి 4 నెలలు తక్కువ ఉన్నదట. సరోజ్ కపర్డీ దీనికి సంజాయిషీ ఇవ్వవలసి



ఉంటుంది. ఆమెదే తప్పయితే రాజ్యసభ సభ్యత్వానికి ఆమె అనర్హురాలయ్యే అవకాశం ఉంది......

పార్టీ మార్పు– చెంప దెబ్బ– సంఘసేవ

ఈవిడ ఒకప్పుడు పాత కాంగ్రెసులో ఉండే వారు. అప్పుడే ఆవిడని కొత్త కాంగ్రెసు వారు ఒకరు చెంప దెబ్బ వేశారని వార్తలు (ఫొటోలతో సహా) వచ్చాయి. ఎందుకో గాని శ్రీమతి తారకేశ్వరీ సిన్హా తరువాత కొత్త



కాంగ్రెసుకి మారిపోయారు. అందు లోనూ ఎక్కువ కాలం ఉండకుండా (1979 లో) శ్రీమతి గాంధీ పార్టీని వదులుకుని కీ. శే. దేవరాజ అరస్ పార్టీలో చేరారు. "ఎందుకు?" దేవరాజ అరస్‌మీద జాలి వేసి. ఆయన ఆసుపత్రిలో ఉండగా ఆయనని కాంగ్రెసు (ఇందిరా)లో నుంచి బహిష్కరించారు.


శ్రీమతి తారకేశ్వరికి శ్రీమతి ఇందిరా గాంధీ పాకిస్తాన్‌లో, పశ్చిమ జర్మనీలో రాయబారి ఉద్యోగం ఇస్తామన్నారుట కాని ఆమె తీసుకోలేదుట. ప్రస్తుతం ఆమె బీహారులోని ఒక మారుమూల గ్రామ ప్రాంతంలో ఒక ఆసుపత్రి నడుపుతున్నారు....

17 ఏళ్ళకే డాక్టర్ ఆఫ్ మెడిసిన్ కాబోతున్న క్రిస్ బెనర్జీ!

అమెరికాలో స్థిరపడిన భారతీయ సంతతికి చెందిన బాలిక క్రిస్ బెనర్జీ ప్రపంచ రికార్డుని సృష్టించింది. ఈమె వయస్సు 11 సంవత్సరాలు. మెడిసిన్ చదువుతున్నది. ఈమెకి 17 ఏళ్ళు వచ్చేటప్పటికి డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (ఎం. డి.) పట్టాని అందుకుంటుంది. పాఠశాల, కళాశాల స్థాయిలలో ఈమె ప్రదర్శించిన అద్భుతమైన ప్రతిభకి ఫలితంగా 11 వ ఏటే ఈమెకి వైద్య కళాశాలలో సీటు వచ్చింది. ప్రస్తుతం పారా మెడిసిన్ కోర్సులో ఉన్న ఈమె దాని తర్వాత మూడేళ్ల కోర్సు కూడా పూర్తి చేసి ఎం. డి. డిగ్రీ అందు కుంటుంది. విచిత్రం ఏమిటంటే ఈమె తల్లి కూడా ఈమెకి సహపాఠిగా ఉన్నది. తల్లీ కూతుళ్లిద్దరూ ఒకేసారి 1994 లో పట్టాలు అందుకుంటారు! ఇంత చరిత్ర సృష్టించినా ఈమె తనకి **21 వ ఏడు వచ్చే దాకా అమెరికన్** చట్టాల ప్రకారం వైద్య వృత్తిని చేపట్టటానికి వీలు లేదు. అద్భుత ప్రజ్ఞావంతురాలైన క్రిస్ బెనర్జీ బహుభాషా ప్రవీణ కూడా. ఈమె బెంగాలీ, హిందీ, ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలు అనర్గళంగా మాట్లాడ గలదు....

ఆర్థిక సంక్షోభ ఫలితాలు!

అమెరికాలో ఆర్థిక సంక్షోభ ఫలితాల గురించి విషాదకరమైన వార్తలెన్నో క్రమక్రమంగా బైటికి వస్తున్నాయి. దాదాపు పదికోట్ల డాలర్లు బాకీ పడిన హృద్రోగ శస్త్రచికిత్సా నిపుణుడు డెంటన్ కూలీ తన దగ్గర చిల్లిగవ్వలేదని ప్రకటించాడు. టెక్సాస్



రాష్ట్రపు మాజీ గవర్నర్ జాన్ కొన్నాల్లీ తాను జీవిత మంతా సంపాదించిన ఆస్తులన్నిటినీ వేలం వేసి అప్పులు తీర్చుకోనున్నారు. ఇప్పటికే ఆయన రెండు ఇళ్ళు, పాడిపశువులను, గుర్రాలను అమ్మి కొంత అప్పు తీర్చారు. పెయింటింగ్‌లు, పురాతన వస్తువులు, పింగాణీ పాత్రలు, స్వంత జీన్లు, గవర్నర్ కార్యాలయంలోని ఇత్తడి నేమ్ ప్లేట్ మొదలయిన సామాన్లు వేలం వేసి మరొక ఇరవై నుంచి ముప్ఫై లక్షల డాలర్లు సంపాదించాలని ఆయన ఆలోచిస్తున్నారట!.....

రాజకీయాల నుంచి టి.వి. తెర మీదకి...

సినిమా నటులు రాజకీయాలలోకి ప్రవేశిస్తున్న నేటి రోజులలో రాజకీయ నాయకులు సినిమా రంగంలోకి, టెలివిజన్ తెరమీదికి వెళుతున్న సాంప్రదాయం కూడా కొనసాగుతున్నది. పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ (ఐ) నాయకుడు, శాసన సభ్యుడు సుబ్రత ముఖర్జీ చౌరంఘీ ఫార్మాసూటికల్స్ అనే 52 భాగాల టెలి సీరియల్‌లో నటించనున్నారు. ఈ చిత్రంలో ఆయన బెంగాల్‌లోని ప్రఖ్యాత తార మూన్ మూన్ సేన్‌తో పాటు నటించడమే గాక ఆమెతో సమానమైన పారితోషికాన్ని తీసుకుంటారట! మాదక ద్రవ్యాల వ్యసనానికి వ్యతిరేకంగా తీసిన ఈ చిత్రం ద్వారా తాను ఒక ఉత్తమ ఆదర్శాన్ని ప్రచారం చేయగలనని ఆయన అన్నారు. అగ్నిధర్ ఛటర్జీ దర్శకత్వం వహించే ఈ చిత్రంలో మమతా శంకర్, గౌతమ్‌ఘోష్ వంటి ప్రముఖులు కూడా నటిస్తున్నారు......





"వికాస్! ఏమిటి సంగతులు? ఉద్యోగం ఎలా వుంది? అమెరికా ఎలా వుంది?" మూర్తి అడిగాడు.

"అమెరికాలో ఏం తక్కువ బావ! మిమ్మల్నందర్నీ మాత్రం మిస్ అయ్యాము" అన్నాడు వికాస్.

"అక్కడేమిటోయ్! అన్ని సదుపాయాలూ వున్నాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటారు. బోల్డు డబ్బు! వచ్చిన దగ్గర్నుండి హడావడే సరిపోయింది. అమెరికా నుంచి మాకేమి గిఫ్టు తీసుకు వచ్చావ్" అన్నాడు మూర్తి.

"ఈసారి వీడియో తీసుకు వచ్చాను బావ! వీడియో కెమెరా కూడా తీసుకు వచ్చాను. రేపు మీ అందరి వీడియో తీసి రేపు రాత్రికి ఫిల్మ్ చూపిస్తాను".

"ఎలాగైనా అమెరికా అమెరికానేనోయ్. అన్నింటిలోనూ ముందంజే వాళ్ళు. ఆడవాళ్ళు కూడా అన్ని రంగాలలోనూ ఎంతో ముందు వుంటారు. అక్కడి వేగం, ఆడవాళ్ళు కూడా మొగవారితో పాటు ఉద్యోగాలు చెయ్యడమే కాకుండా ఇంటి పనులు కూడా స్వయంగా చేసుకుంటారు కదా! వింటుంటే ముచ్చట వేస్తుంది".

"అదేమిటి బావా అలా అంటావు? ఇక్కడ ఆడవాళ్ళు మాత్రం ఇంట్లో ఖాళీగా వుంటున్నారా? పాశ్చాత్య నాగరికత, అలవాట్లు ప్రతీ ఇంట్లోనూ, నాకు కొన్ని సంవత్సరాల మార్పులోనే కని[illegible]సు్తన్నాయి. ప్రతీ ఇంట్లోనూ ఫ్రిజ్‌లు, టి. వి. లు, స్టీరియోలు, ఎ. సి. లు, స్కూటర్లు, మారుతీ కార్లు కనిపిస్తున్నాయి. ఎంతోమంది ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక్క ఆరు సంవత్సరాల్లో జరిగిన ఈ మార్పు చూస్తుంటే నాకు ఆశ్చర్యమేస్తోంది!"

"ఆ ఏం మార్పులే! మీ అక్కని చూడరాదూ! చదువుకున్నది కదా! ఉద్యోగం చెయ్యమంటే చెయ్యనంటుంది. ఆధునిక సౌకర్యాలని నీవు చెప్పిన ఫ్రిజ్, గ్రైండర్, వాషింగ్ మిషన్, లాంటి అన్ని సౌకర్యాలూ మా ఇంట్లో వున్నాయి. అయినా ఎప్పుడూ మీ అక్క పని లేదే. పగలంతా ఇంట్లో వుంటుంది కదా! ఏం చేస్తుందసలు! పని చెయ్యలేక అలసి పోతున్నాననుకుంటుంది. ఇంక అమెరికాలో పని చెయ్యడానికి రొబట్లు కనిపెట్టారట. అది కూడా మీ అక్కకి కొనిపెడితే [illegible] పగలంతా ఇరుగు

పొరుగులతో బాతాఖానీ కొట్టవచ్చును" అన్నాడు మూర్తి వేళాకోళంగా భార్యని చూస్తూ.

అతని మాటలు వింటూ నవ్వి వూరుకుంది వాసవి. వికాస్‌కి మాత్రం అక్కని బావ అలా అనడం చాలా బాధ వేసింది. వచ్చిన దగ్గర్నుండి చూస్తున్నాడు అక్క దినచర్య. బావ చెప్పిన దాన్లో ఎంత నిజం వుంది.

వికాస్ అమెరికా నుండి 6 సంవత్సరాల తర్వాత ఇండియా వచ్చాడు. తల్లిదండ్రులని చూసి అక్కా, బావలని. చూడ్డానికి వచ్చాడు. పొద్దున్నే మూర్తి ఆఫీసుకి వెళ్ళే హడావడిలోనూ, 10 ఏళ్ళ సందీప్ స్కూలుకి వెళ్ళే హడావడిలోనూ, 16 ఏళ్ళ నీలేష్ కాలేజీకి వెళ్ళే హడావడిలోనూ వున్నారు. ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. ఇదిగో! రాత్రి ఇప్పుడే సావకాశంగా మాట్లాడుకోవడానికి బావమరదులకి కుదిరింది.

* * * * *

రెండు రోజులు గడిచాయి. ఆ రోజు సాయంత్రం మూర్తి, సందీప్, నీలేష్ ఇంట్లోనే ఉన్నారు. వాసవి మాత్రం ఎక్కడో పేరంటం వుందని వెళ్ళింది. అక్కడ పూజ వుందని, అర్చన, హారతీ అవీ అయ్యేటప్పటికి లేటవుతుందని, వంటంతా చేసి పెట్టి వుంచానని, ఆకలి వేస్తే తినెయ్యమని చెప్పి మరీ వెళ్ళింది.

"మనం మంచి వీడియో ఫిల్మ్ చూద్దాం" అన్నాడు వికాస్.

"ఏం ఫిల్మ్ మామయ్యా!" అని ఒక్కసారి ఉత్సాహంగా అడిగారు నీలేష్, దీపూ.

"మీ ఇంట్లో మీకు తీసిందే చూపిస్తున్నాను" అన్నాడు వికాస్.

"అరె! మా ఫిల్మా! ఎప్పుడు తీశావు మామయ్యా! మేము బాగా వచ్చామా? మాకు తెలవకుండా ఎలా తీశావు"

"అదే గమ్మత్తు ఇప్పుడు చూడండి".

పిల్లలిద్దరూ సరేసరి. మూర్తి కూడా తను వీడియోలో ఎలా వుంటాడోనన్న థ్రిల్‌తో చూస్తున్నాడు. వికాస్ వీడియో సెట్ చేసి అన్ చేసాడు.

* * * * *

పొద్దున్న 5.30 గంటలు చూపిస్తోంది గడియారం. వాసవి పాలవాడు యిచ్చిన పాకేట్లు తీసుకుని వంటింట్లోకి వెళ్ళింది. కాఫీకి డికాషన్ తీసి, పాలు వేడిచేసి, ముందర వీధి గుమ్మం కడుక్కొని ముగ్గువేసివచ్చింది. మూర్తి నిద్రలేస్తూనే 'వసూ! కాఫీ' అంటూ అడిగాడు.

న్యూస్‌పేపరుతో పాటు కాఫీ కప్పు కూడా చేతికి యిచ్చింది. తను కూడా కాఫీ తాగుతూనే బ్రేక్‌ఫాస్ట్‌కి కావల్సినవి అమర్చుకుంటోంది.

"దీపూ! నీలూ! నిద్రలేవండమ్మా! ఏడైపోయింది" వాసవి నెమ్మదిగా అంది.

"అబ్బ! ఏమిటి మమ్మీ! కాసేపు పడుకోనియ్యవు!"

"నాకేం! మళ్ళీ కాలేజీకి లేటైపోయింది! నన్నెందుకు లేపలేదంటావ్! నేను వెడుతున్నా."

నీలేష్ కాసేపు బద్ధకంగా అటూయిటూ దొర్లి లేచి కూర్చున్నాడు.

"వాసవీ! ఇక్కడ నేను గడ్డం గీసుకునే మగ్ పెట్టాను. ఏమైంది?" మూర్తి కేకపెట్టాడు.

చపాతీలు పిండి కలుపుతున్న చేతితోనే వాసవి వంటింటిలోంచి యివతలకి వచ్చింది. అటూయిటూ వెతికి మగ్ తీసుకువచ్చి యిచ్చింది.

"మమ్మీ! 8 అయిపోయింది. ఇంకా టిఫిన్ చెయ్యడం పూర్తికాలేదా?" అంటూ డైనింగ్‌టేబుల్ దగ్గరకివెళ్ళి ఫ్యాన్ అన్‌చేసుకుని కూర్చున్నాడు నీలేష్.

"ఇదిగో నీలూ అయిపోవచ్చింది. కొంచెం ఆ ప్లేటూ, మంచినీళ్ళూ పెట్టుకొని కూచోవూ" హడావడిపడిపోతూ అంటోంది వాసవి. గేస్‌మీద ఒకవైపు చపాతీలు కాలుస్తూ, ఒకవైపు కూర కలియబెడుతూను. ఆ వేడికి చెమటలు ధారగా కారుతున్నాయి.

"అబ్బ! ఏమిటి మమ్మీ! కూచున్నాక చెబుతావు? ప్లీజ్ ఆ చేతో యిచ్చేద్దూ!"

వాసవి గబగబా రెండు చపాతీలువేసి, ఒక చేతో మంచినీళ్ళగ్లాసు పట్టుకొచ్చి యిచ్చింది.

"మమ్మీ! ప్లీజ్. నాకు ఈ సైన్స్ రికార్డ్‌లో బొమ్మలు వేసిపెట్టవూ! చక్కగా, నీట్‌గా వుంటుంది నీ డ్రాయింగ్. మళ్ళీ రేపు రికార్డ్ యిచ్చేయాలి. నాకు సాయంత్రం క్రికెట్‌వుంది. కాలేజీలో ఒక్క పీరియడ్ కూడా ఖాళీలేదు. మాష్టార్ రేపు కనక యివ్వకపోతే పనిష్‌చేస్తారు. ప్లీజ్ కాస్త వేసిపెట్టవా?"

"సర్లే! నీ టేబుల్‌మీద పెట్టివెళ్ళు" అంది వాసవి.

గబగబా టిఫిన్‌చేసి 'అరె అప్పుడే 8.30 దాటిపోయిందే. మమ్మీ! మర్చిపోకేం. నేను వెడుతున్నాను" అంటూ ప్లేటులోనే చెయ్యికడిగేసుకుని హడావిడిగా నీలేష్ వెళ్ళిపోయాడు.



ప్లేటుతీసి సింక్‌లో పడేస్తూనే "ఒరేయ్ దీపూ! నువ్వు రావేరా? స్కూలుకి టైమైపోతోంది. టిఫిన్‌బాక్స్ బేగ్‌లో పెట్టాను. మళ్ళీ యివతల పడెయ్యకు. మర్చిపోతావు. రా తొందరగా చల్లారిపోతే చపాతీలు సయించవంటావు."

"అబ్బ ఏమిటి మమ్మీ! మళ్ళీ ఈ కూరేనా! ఛ! నాకొద్దు! ఛోలే చెయ్యమంటే ఎందుకు చెయ్యవు?"

"ప్రొద్దున్నే హడావడిగా కుదరదురా! ఛోలే చెయ్యడానికి చాలా టైముపడుతుంది. శెలవురోజు చేస్తానులే."

ఎప్పుడూ హడావడి, హడావడి అంటావు. మా ఫ్రెండ్ వాళ్ళ అమ్మ చూడూ రోజూ చేస్తుంది. నువ్వు ఏం పనిచేస్తావేమిటి మహా" అంటూ గునుస్తూనే చపాతీలు తిండం మొదలెట్టాడు.

దీపూ అటు స్కూలుకి వెళ్ళడం, యిటు మూర్తి వంటింట్లోకి రావడం అయింది. "వాసవీ! నావి నాలుగు పేపర్స్ టైపుచేసిపెట్టాలి. మధ్యాహ్నం ఖాళీగానే వుంటావు కదా! అర్జంట్‌గా రేపు పోస్టుతో పంపించేయాలి" అంటూ హడావిడిగా టిఫిన్‌చేసి వెళ్ళిపోయాడు.

ఇల్లంతా ఒక్కసారి నిశ్శబ్దమైపోయింది. అప్పటిదాకా పేపర్ చదువుతున్న వికాస్ అక్కని పలకరించడానికి వచ్చాడు. ఠంగ్‌ఠంగ్ మంటూ గడియారం పది గంటలు. కొట్టింది. వాసవి డైనింగ్‌టేబుల్‌నిండా పరిచేసినట్టున్న ప్లేట్లు, నీళ్ళగ్లాసులు, కాఫీగ్లాసులు అన్నీ సింకులో పడేసి శుభ్రంగా తోమి లోపల పెట్టింది.

"ఏమిటే అక్కా పనిమనిషి లేదా?"

"లేదురా. ఇప్పుడు ఇక్కడ పని మనుషులు దొరకడంలేదు. ఒకవేళ దొకినా వంద రూపాయలు అడుగుతున్నారు. పోనీ పని చేసుకోలేక అడిగినంతా ఇచ్చి పెట్టుకుందామనుకున్నా పదిహేను రోజులు చేస్తారు. పదిహేను రోజులురారు. కంపెనీ కూలీల కింద పని దొరికింది. డైలీ వేజస్ మీద వెళ్ళిపోతారు.

దాని ఆ రోజు రామని ముందే చెబుతారా అంటే అదీ చెప్పరు.

12 గంటల దాకా చూసుకుని అప్పుడు చేసుకోవటం. డబ్బూ ఇవ్వీ, సుఖమూ లేక వాళ్ళతో పడలేక పెట్టుకోలేదురా! నేనే చేసుకుంటున్నాను" అంది ఇంటి నిండా విప్పి పడేసిన బట్టలు వాషింగ్ మెషిన్లో వేస్తూను.

"మరి చాకలాడు కూడా లేడా?" వికాస్ ఆశ్చర్యంగా అడిగాడు.

"వాళ్ళు ఎప్పుడో చాకిరేవు మానేసారు. అడుగడుక్కీ లాండ్రీలు, డ్రైక్లీనింగ్ షాపులూ వచ్చాయి. వాటికి బోల్డు ఖరీదు. పైగా మీ బావ వాషింగ్ మెషిన్ ఉంది కదా ఇంకెందుకు లాండ్రీకెయ్యడం అంటారు. అదీ నిజమే. ఇంత ఖరీదు పెట్టి వాషింగ్ మిషన్ కొన్నాక డబ్బిచ్చి వుతికించుకోవడం నాకూ నచ్చలేదు" అంది మొద్దులా వున్న దుప్పటి మిషన్లోంచి తీసి నీళ్ళలో జాడిస్తూను.

"ఆ కొనుక్కునే మిషన్ ఏదో పూర్తి ఆటో మేటిక్‌ది కొన లేకపోయావా? నీకు ఏం సుఖముంది. అంతంత బరువుని జాడిస్తున్నావు?"

ఫారిన్‌లో వున్నంత ఎడ్వాన్స్ మిషన్స్ ఇక్కడ దొరకవు. దొరికినా వేల మీద వున్నాయి. మాలాంటి వాళ్ళకి అందుబాటులో వున్నాయి కదా కనీసం బ్రష్ చేసే పనైనా తప్పుతుందని ఇవి కొనుక్కోవడం" అంది బట్టలన్నీ ఆరేస్తూను. "ఎంతయిందిరా టైము?"

"పన్నెండు అవుతోంది".

"అమ్మ బాబోయ్ బావ భోజనానికి వచ్చే టైము అయిపోతోంది. వంట చెయ్యాలి." అంది, గబగబా ఫ్రిజ్ తెరచి కూరలు తరగడం మొదలెట్టింది. గేస్ వెలిగించి కుక్కర్ ఎక్కించి అన్నం, పప్పు, కూర పడేసి ఇంకో దానిమీద పచ్చడికి వేయించింది. మిక్సీ పెట్టి పచ్చడి చేసింది. ఇవన్నీ మిషన్‌లా చకచకా చేసుకు పోతూంటే వికాస్ అక్క వెనకే తిరుగుతూ ఖబుర్లు చెబుతూ కూర్చున్నాడు. వంట చేస్తూనే కుక్కర్ అయ్యే టైములో చెల్లాచెదురుగా పడేసిన బుక్స్, బొళ్ళు తీసి, ఇల్లంతా నీట్‌గా సర్ది ఇల్లు తుడిచి తడిగుడ్డ పెట్టి పోచ చేసింది.

"ఏమిటో అమ్మావాళ్ళు తెల్లారేటప్పటికి ముందు ఇల్లు తుడుచుకునే వారు. ఇప్పుడు మేము 12 గంటలకి ఆ పని చేస్తున్నాము. ముందరే చేద్దామంటే పిల్లలు లేవరు. మంచాలెత్తందే తుడవడానికి వుండదు. బూట్లు దుమ్ము, కాగితాలు ఇంటి నిండా పడేస్తారు. పొద్దున్నే తుడిచినా తుడిచినట్లు వుండదు. దుమ్ము ఎక్కువ. ఎంత దులిపినా పడుతూనే వుంటుంది. అమెరికాలో దుమ్ము వుండదట కదా" అంది వాసవి.

"ఔను! అక్కడ ఈగలు, దోమల బాధలు కూడా లేవు. కార్పెట్లు, దుమ్ము తీసెయ్యడానికి మిషన్ వుపయోగిస్తే చాలు. అది మొగవాళ్ళైనా అక్కడ చేసేస్తారు. సెలవు రోజుల్లో ఆడా, మగా కలిసి ఇల్లు శుభ్రం చేసుకుంటారు ఇద్దరూ ఉద్యోగస్థులైనాను".

డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్దుతుండగానే మూర్తి వచ్చేసాడు.

పొగలు కక్కుతున్న అన్నాన్ని చూస్తూనే "ఎప్పుడూ అన్నం ఇంత వేడి వేడిగా వడ్డిస్తావేం? కొంచెం ముందు చేయరాదా? 9.30 కల్లా మేం వెళ్ళిపోతే ఇంట్లో ఖాళీగా ఏం చేస్తావు" అన్నాడు విసుక్కుంటూ మూర్తి.

వికాస్ ఏదో అనబోయి వూరుకున్నాడు.

హడావుడిగా భోజనం చేసి మూర్తి తిరిగి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. డైనింగ్ టేబుల్ సవరించి తుడుచుకొని గిన్నెలు తోముకుని ఇవతలకి వాసవి వచ్చేటప్పటికి గడియారం 2.30 చూపిస్తోంది. కాసేపు పత్రిక తీసుకుని మంచం మీద వాలిందో లేదో కాలింగ్ బెల్ మోగింది. వాసవి లేచి వెళ్ళి తలుపు తీసింది. పక్కింటి వనజ. వనజ ద్యోగం చేస్తోంది. పనిమనిషి పగలంతా ఇంట్లో వుండి అన్ని పనులూ చేస్తుంది. వనజ కొడుకు చిన్నవాడేను. వాడు విపరీతంగా అల్లరి చేస్తాడు. వాళ్ళ అమ్మ పగలంతా పిల్లవాడ్ని విడిచి వుంటుంది. కాబట్టి వాడు ఏం చేస్తున్నాడో పట్టించుకోదు. విపరీతమైన గారాబం. ఇంక వనజ ఆఫీస్‌కి వెళ్ళి ఏం చేస్తుందో కానీ ఎప్పుడూ నవలలు చేతిలో వుంటాయి. మొత్తం లైబ్రరీలో వున్న పుస్తకాలన్నీ చదివేసింది.

"రండి వనజా!" అని ఆహ్వానించింది వాసవి. "ఇవాళ ఆఫీస్ లేదా?"

"వుంది కానీ బోర్‌గా అనిపించి శెలవ పెట్టేసాను. హాయిగా మీకేమండి ఇంట్లో వుంటారు. బోల్డు తీరిక వుంటుంది. ఏవైనా పుస్తకాలు వున్నాయేమో అడుగుదామని వచ్చాను" అంది వనజ. అక్కడున్న పత్రికను తిరగేస్తూ.


"అది ఆఫీస్ క్లబ్ నుంచి మావారు తీసుకు వచ్చారు. ఇంకా చదవలేదు" అంది వాసవి.

"సరే ఇప్పుడే చూసేసి ఇచ్చేస్తాను" అంటూ పత్రిక తీసుకుని వెళ్ళిపోయింది వనజ. సైన్స్ రికార్డ్ వేసి పెట్టకపోతే నీలేష్ మళ్ళీ గోల చేస్తాడని ఆ డ్రాయింగ్స్ వేస్తూ కూర్చుంది వాసవి.

దిలీప్ స్కూలు నుంచి వస్తూనే బూట్లు ఒక మూల, పుస్తకాల బేగ్ ఒక మూల పడేసి సోఫాలో అడ్డంగా పడుకున్నాడు. "మమ్మీ ఆకలివేస్తోంది. ఏం టిఫిన్ చేశావ్?" అని అడిగాడు.

పాపం రోజూ బస్సులో పడి స్కూలుకి వెళ్ళాలి. బస్సులు కిక్కిరిసి వుంటాయి. ఎలా అవస్థపడి ఎక్కుతాడోను. బస్తాలా ఆ పుస్తకాల బరువు ఒకటి భుజాలు పడిపోతూను. అటు పొద్దున్న అన్నం తినే టైము కాదు! వచ్చేటప్పటికి 3-30 అవుతుంది. అప్పుడూ అన్నం తినరు. చప్పగా చల్లారి పోయిన టిఫిన్ బాక్స్. ఏం చదువులో ఏమిటోను. స్కూలు నుంచి రాగానే పిల్లలు వేలాడిపోతారు అని బాధపడింది వాసవి బూట్స్, బుక్స్‌ని తీసి దాస్తూను.

గడుసులోకం —బాబు



ఇ-వేమన పద్యాలు — మదమదుడు



మదము చేత లోకమాయలు తెలియక
మదము చేత దన్ను మఱచు నెపుడు
బుద్ధిలేక చెడును శుద్ధపశువు వోలె
విశ్వదాభిరామ వినుర వేమ

వంటింట్లోకి వెళ్ళి గబగబా కాస్త టిఫిన్ చేసి పట్టుకు వచ్చి ఇచ్చింది. అవి తిని హోమ్‌వర్క్ చేసుకుంటూ కూర్చున్నాడు దిలీప్. "అమ్మా! మా యూనిట్ టెస్ట్ వచ్చే వారం నుండే. మాకు పోర్షన్ కంప్లీట్ అవ్వలేదు కదా రోజుకి రెండు లెస్సన్స్ చెప్పేస్తానంది మా టీచర్. క్వశ్చన్ ఆన్సర్స్ రాసుకురమ్మంది. ఎప్పుడు చెప్తావ్" అని అడిగాడు దీపూ. "ఇంకా ప్రాజక్ట్ వర్క్ కూడా ఇచ్చారు. మీ మమ్మీ హెల్ప్ తీసుకోమన్నారు అది కూడా చేయాలి".

"రాత్రి ఏడు గంటలకు క్వశ్చన్ ఆన్సర్స్ చెబుతాలే.

ఆలోచించు

సండే ప్రాజక్ట్ వర్క్ చేద్దాము. సరేనా!" అంది ఏం చదువులో ఏమిటో పేరెంట్స్‌కి పనిష్మెంట్ అనుకుంటూ.

ఇంకా పేపర్స్ టైప్ చెయ్యాలి. అప్పుడే 5 గంటలయిపోయింది అనుకుంటూ మూర్తి ఫారిన్ నుండి తీసుకొచ్చిన పోర్టబుల్ టైపురైటరు ఇవతలకి తీసి టైపు చేయడం మొదలెట్టింది. అవి పూర్తి కాకుండానే నీలేష్ కాలేజి నుంచి వచ్చేసాడు. వాడికి కాఫీ, టిఫిన్ పెట్టి ఆరేసిన బట్టలు మడతలు పెట్టి, స్కూలు యూనిఫాం ఇస్త్రీ చేసి మళ్ళీ రాత్రి వంట ప్రయత్నం మొదలెట్టింది.

మూర్తి ఆఫీస్ నుంచి రావడం, భోజనాలు హడావడి, దీపూకి చదువు చెప్పి వాసవి మూర్తి వికాస్ దగ్గరికి వచ్చేటప్పటికి రాత్రి 10 గంటలైంది.

వాసవీ పేపర్సు టైప్ చెయ్యడం పూర్తి కాలేదేమిటి? అర్జెంట్‌గా పంపాలని చెప్పాను కదా! అని అడిగాడు మూర్తి.

"పొద్దుట్నుంచీ తీరుబడి కాలేదండి" అని ఇంకా ఏదో చెప్పబోతోంటే–


"చూడు వికాస్ ఈ ఇండియాలో ఆడవాళ్ళు! ఇంట్లో కూర్చునే టైము లేదంటారు. మేము పొద్దున్నే వెళ్ళిపోతామా. పగలంతా ఏం చేస్తున్నట్లు. ఉద్యోగం చేస్తోందా ఏమన్నానా! ఎన్ని ఆధునిక సౌకర్యాలు కొనిపెట్టనీ మళ్ళీ పాత పాటే పాడుతారు. వీళ్ళని మాత్రం సంతృప్తిపరచలేం" అంటూ మూర్తి అంటోంటే అలసిపోయి వున్న వాసవి ఆ మాటలకి మనసు కష్టం అనిపించి కళ్ళమ్మట నీళ్ళు తిరిగితే గబుక్కున వాళ్ళకి తెలియకుండా మొహం పక్కకు తిప్పుకుని కళ్ళు తుడుచుకుంది.

* * * * *


వీడియో కాసెట్ అక్కడితో అయిపోయింది. చూస్తున్న మూర్తి నీలేష్, దిలీప్ నిశ్శబ్దంగా వుండిపోయారు. కాసేపు అయ్యాక వికాస్ అన్నాడు. "బావా పగలంతా అక్క ఏం చేస్తోందో చూశావు కదా! ఒక్క ఓదార్పు మాట మీ దగ్గర్నుంచి వస్తే అక్క ఎంత సంతోషిస్తుంది. అమెరికా తోటి మనదేశాన్ని ఎందుకు పోలుస్తావు? అక్కడ ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నా. వచ్చాక ఆడమగా కలిసి పనిచేసుకుంటారు. అన్నీ టిన్ ఫుడ్ రడీమేడ్‌గా దొరుకుతుంది. చేసుకోవడం తేలిక. ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశం మనది. ఈ ఆధునిక యుగంలో చదువుకున్న మహిళ పిల్లలకి చదువులు చెప్పడం, భర్తకి తోడూ, నీడగా ఆఫీసు పనిలో సాయం చెయ్యడం అన్ని రకాలుగానూ ద్విపాత్రాభినయం చేస్తోంది. అక్క పరిస్థితి చూస్తే మీకు అర్థం కావడం లేదా పగలంతా ఏం చేస్తున్నదీ, ఒక్క తీయని మాటకే సంతోషిస్తుందే. ఈ దేశంలోని ఆడవాళ్ళ గురించి కామెంట్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించండి. ఇండియాలో ఆడవాళ్ళే రాబట్‌లు. వేరే రాబట్‌లు ఎందుకు" అని ఆవేశంగా అన్నాడు వికాస్.

చిన్న మనవి:—ఈ కథ చదివి వీడియో ఫిలిమ్ ఎలా తీశారు అన్న ప్రశ్న ఉదయించవచ్చు. ఉరుకులు, పరుగులతో మొదలు పెడుతున్న దినచర్యలో సగటు భారతదేశ మహిళ ఆధునిక సదుపాయాలు ఉన్నప్పటికీ ఎంత కష్టపడవలసి వస్తుందో చెప్పడమే నా ముఖ్యోద్దేశము – రచయిత్రి

నా ప్రపంచమే తలక్రిందులై పోయేది...



నేను న్యూ ఇండియాతో పంపుసెట్టు భీమా చేయించి వుండకపోతే



నా పంపుసెట్టు దొంగలెత్తుకొని పోయారు, కాని పని మాత్రం ఆగి పోలేదు ఎందుకంటే, న్యూ ఇండియా సహాయంతో కొత్త పంపుసెట్టు కొని పెట్టేసుకొన్నా

రైతుకు అతడి పంపుసెట్టు ఎంత విలువైనదో, అతడికీ, అతడి కుటుంబం వారికి బాగా తెలుసు. కాని అ పంపుసెట్టు కాలిపోతే, విరిగిపోతే. పాడైపోతే లేదా దొంగలెత్తుకు పోతే? అలాంటప్పుడు న్యూ ఇండియా ఎష్యురెన్స్ ఒక మంచి నేస్తంలా మీకు అధారంగా నిలుస్తుంది.

న్యూ ఇండియా ఎష్యురెన్స్ వారి పంపుసెట్టు భీమా

పంపు మోటారు యొక్క హార్స్ పవర్‌ను బట్టి, ఒక ఏడాదిలో 50 రూపాయల నుంచి 190 రూపాయల దాకా చెల్లిస్తే చాలు. దేశమంతటా న్యూ ఇండియా ఎష్యురెన్స్ వారివి దాదాపు 1000 కార్యాలయాలు వున్నాయి. ఎక్కువ వివరాలకోసం నేడే మీ ఏజెంట్‌ను కలవండి, లేదా మీకు దగ్గరలోని కార్యాలయానికి విచ్చేయండి.

న్యూ ఇండియా ఎష్యురెన్స్

జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ అఫ్ ఇండియా అనుబంధ సంస్థ

పంపుసెట్టు భీమా–నష్టాలలో మీకు నమ్మకమైన ఆధారం!

F.. SWAMY/NIA/3573/TEL

ఫాలాక్షుని డైరీ

వెలుగుమీద వేట – మనిషి మరణం

సేలం ఖర్కాడు కొండమీద లేళ్ళను వేటాడడానికి సుబ్రహ్మణ్యం, షణ్ముగం అనే యిద్దరు మిత్రులు వెళ్ళారట. సుబ్రహ్మణ్యం తన తలకు బ్యాటరీ లైటున్న పటకా పెట్టుకుని వో పక్కగా వెళ్ళాడట. మరోపక్కన వెతుకుళ్ళాడుతున్న షణ్ముగానికి చిన్నగా వెలుతురు కనబడేసరికి ధామ్మని గురిచూసి తుపాకి కాల్చాడట. అది నేరుగా సుబ్రహ్మణ్యం తలలోకి దూరడంవల్ల అతను అక్కడికక్కడే పడి విలవిల్లాడి చచ్చిపోయాడట!

పట్టపగలు హత్య!

తూత్తుకుడికి చెందిన 42 ఏళ్ళ పార్థసారధి అనే అతనికి, అదేవూరుకు చెందిన శంకరలింగ మూప్పనార్ అని అతనికి దొంగసారా అమ్మకాలలో తగాదాలు వచ్చాయట! ఫలితంగా శంక రలింగ మూప్పనార్ వో అయిదుగురు వ్యక్తులతో దారికాసి, పట్టపగలు నట్ట నడిరోడ్డుమీద పార్థసారథిని గడ్డపారలతోనూ, గునపాలతోనూ కొట్టి చంపేశాడట.

ఆస్థికోసం తమ్ముడి హత్య!

తిరుచెంగోడుకు చెందిన వరదప్ప గవుండరు అనే అతను ఆస్థికి ఆశపడి పెళ్ళి కాని తన తమ్ముడు 33 ఏళ్ళ మురుగేశన్‌ను తన భార్యసహాయంతో చంపి, రాత్రికి రాత్రి వూరు చివరకు మోసుకుపోయి పాతిపెట్టేశారట. తన కొడుకు కనబడకపోవడంతో శంగోడ గవుండరు వూరంతా గాలించడంలో వూరు చివర కుక్కలు వో గొయ్యిలోంచి పీకుతున్న శవాన్ని చూసి, అది తన కొడుకేనని గుర్తుపట్టిపోలీసుకు రిపోర్టు చేస్తే వా రొచ్చి శవాన్ని త్రవ్వి తీసి, విచారించి వరదప్పనూ, అతని భార్యనూ అరెస్టు చేశారట.



చూపు ఆనని పక్షి!

"కివి" అనే పక్షికి చూపు ఆనదట. పొడవైన తన ముక్కును అది గుడ్డివాడు కర్రను వుపయోగించి నట్టు వుపయోగిస్తూ దారి వెతుక్కుంటూ పోతుందట నేలమీదున్నపుడు. ఈ పక్షి న్యూజిలాండ్‌లో ఎక్కువగా కనుపిస్తుందట.

భార్య అర్హతల పరీక్ష!

ప్రఖ్యాత ఆంగ్ల కవి, రచయితా అయిన థామస్ డే 1748 నుంచి 1789 వరకూ జీవించాడట. తాను ప్రేమించిన వో కోమలి తనకు భార్యగా వుండ అర్హురాలో కాదో తెల్సుకోడానికి వో పరీక్ష పెట్టి, ఆమె చేతులమీద కరిగించిన మైనం పోశాడట! అనక ఆమె కేసి గురిచూసి తుపాకీ హఠాత్తుగా గాలిలో పేల్చాడట. దాంతో తారెత్తిన ఆ సుకోమలి అతన్ని పెళ్ళాడడానికి నిరాకరించి ఫోపొమ్మనదట. అంతే! ఇహాయన పెళ్ళిచేసుకోలేదట — వేపకాయంత వెర్రున్నట్టుంది. ☐

సీరియల్

ఆకాంక్షలు - అన్వేషణలు

హరికిషన్

(గత సంచిక తరువాయి)

ఎ. ఎ. బి. బి. సి. సి. డి. డి. హేమంత్

జగదీష్ పర్ణశాల, కలిమిలేముల పార్టీ కొన్ని వర్గాల వారిని ఆకర్షించి ఆలోచింప చేశాయి. ఏ గుళ్ళో అయినా, ఏ క్షేత్రంలోనయినా పురాణాలో, హరికథలో చెప్పిస్తుంటే ఆ పౌరాణిక గాథల్ని ఈ రోజున కూడా విని ఆనందించి చరితార్థులం అవుతున్నామని మనశ్శాంతిని పొందేవారు చాలామంది ఉన్నారు. సంసార జీవితంలో అనేక అవస్థలూ, తాపత్రయాలు ఈషణత్రయంతో కొట్టుమిట్టులాడి, ఏదో ఆఖరి పీరియడ్‌లో డ్రిల్లు క్లాసు మాదిరి, ఆధ్యాత్మిక డ్రిల్లు క్లాసులకు వెళ్ళి తరిస్తున్నామనే మెంటల్ సాడిస్ ఫ్యాక్షన్‌తో ఉండేవారు అనేకమంది ఉన్నారు. ఆ పౌరాణిక శాస్త్రిగారయినా, హరి కథా కేసరి అయిన హరిదాసు గారయినా ఆ వచ్చిన భక్తుల మనస్సుకు ఆహ్లాదం కలిగించేటట్టుగా, ఇదంతా మాయామేయ జగమూ, పోయేనాడూ వెంబడి రాదు పూచిక పుల్లయినా అనే గీతాన్ని వినిపించి, సత్కార్యాలను చేయమనీ, సద్భావాన్ని పెంపొందించుకోమనీ, చక్కని చిక్కని పద జాలంతో భక్తకోటి మనస్సుల్లోకి ఆధ్యాత్మిక ప్రబోధాన్ని ఇంజక్ట్ చేస్తారు. మధ్య మధ్య "శ్రీమద్రమారమణ గోవిందో హరి" అని తన స్వవిషయాల్ని, కథ చెప్పటంలో తన ప్రావీణ్యతనూ ఉటంకించి, కానుకల విషయమూ, హారతి పళ్ళాల వైనమూ సందర్భానుసారముగా తరచి చెప్తుంటే భక్తులు రూపాయి, రెండూ, అయిదూ, పది పైసలూ హారతి పళ్ళెంలో వేస్తూ, చదివిస్తూ ఉంటే, ఆ దాసుగారు పరమానందభరితుడవుతాడు. అంతా మిథ్య అయినప్పుడూ, ఏదీ శాశ్వతం కానప్పుడు, ఈ హారతి పళ్ళెం కూడా మిథ్యే కదా? ఎదటి వారికి చెప్పేటప్పుడు మాత్రం మిథ్య తన స్వవిషయంలో మాత్రం కాదు. రాను రాను భగవంతుడు భక్తి కూడా వ్యాపార స్వరూపాన్ని సంతరించుకున్న ఈ రోజుల్లో, ఆధ్యాత్మిక ప్రబోధన కూడా స్వార్థపూరిత వాతావరణానికి లొంగిపోయింది.

అందు చేతనే కొన్ని సంవత్సరాలుగా ఆధ్యాత్మిక చింతన కొందరి మహాత్ముల చేతిలో, చేతలలో కొంచెం రూపురేఖలు దిద్దుకుని సేవా కార్యక్రమంగా మారిపోయింది. కొందరి మనస్సులో, కొంతమంది మేధావి వర్గాల ఆలోచనా సరళిలో మార్పులు వచ్చి మానవ సేవయే మాధవ సేవ అనేది అక్షరాలా యదార్థం అయి, అమిత ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ సమాజ సేవ క్రమేపీ ప్రపంచ వ్యాప్తమే అయింది. తత్సంబంధమయిన గ్రంథాల్ని కొన్ని చదివాడు జగదీష్.

ఒక్కొక్క మనిషి మనస్తత్వం ఒక్కో రీతిగా ఉంటుంది. మనం చేసే సత్కార్యాలను ఎదుటి వారు మరో దృష్టితో విమర్శిస్తుంటే మన మనస్సులో ఒక రకమైన సంఘర్షణ ఏర్పడి, మానసిక వత్తిడికి తట్టుకోలేక ఆ పని విడిచి పెట్టేస్తాం. అంత మాట మనల్ని అన్నారే అన్న కుమిలింపే ఆ పరిస్థితికి కారణం. కొందరి మనస్సు ఎన్ని విమర్శలనయినా తట్టుకుని ధీరోదాత్త స్వభావంతో తాము తలపెట్టిన ఆ సత్కార్యాన్ని సాధించి చేసి తీర్తారు. ఈ రకమైన వ్యక్తులకు ధృఢమైన వైఖరీ, మనస్తత్వం ఉండాలి. జగదీష్ ఈ స్థితిలోకే వచ్చాడు.

ఒక రోజు రాత్రి జగదీష్ కల్లోకి ఒక స్వామి వచ్చి కనిపించాడు. ఏమీ మాట్లాడకుండా చిరునవ్వుతో ఆశీర్వదించి వెళ్ళాడు. మూడో రోజు సాయంత్రం మరో ఊళ్ళో చేయవలసిన సేవా కార్యక్రమాన్ని గురించి జగదీష్, మిగతా సభ్యులతో చర్చిస్తున్నాడు. ఆ సమయంలో ఒక సన్యాసి వచ్చి జగదీష్‌ని పలకరించి ఆశీర్వదించి ఒక కాగితం ఇచ్చి మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. కాగితం మడత విప్పి చదివాడు. జగదీష్ "సాగిపో, సేవా కార్యక్రమాలు చేపట్టు, నీ వెనక నేనున్నాను. నేనుండగా నీకు భయమెందుకు?" ఆశ్చర్యం నుండి తేరుకొనేసరికి అయిదు నిమిషాలు దాటింది. పదిమందీ పరుగెత్తి చూశారు. ఆ సన్యాసి కనిపించలేదు. కలలో కనిపించిన ఆ స్వామి కాదు. ఈ స్వప్నం సంగతీ, స్వామి విషయమూ, ఆ సన్యాసి ఇచ్చిన కాగితం ఆనోట పడి, ఈ నోట పడి చాలామందికి తెలిసిపోయింది. అయిదారు రోజుల్లో రోజూ వందలమంది పర్ణశాలకు వచ్చి జగదీష్‌ని అనేక రకాలుగా ప్రశ్నించారు. ఆ ప్రశ్నలన్నింటికీ

జరిగిన కథ–16 : సావిత్రి జగదీష్ పర్ణశాలకు వచ్చి వెళ్తుంది. అభిలాష్ జీవితాన్ని పూలబాటగా చేయాలని కంకణం కట్టుకుంటుంది సత్యభామ. బ్యాంకులో డబ్బు ఎవరు జమ చేశారో తెలియక అన్న జగదీష్ దగ్గరికి వెళ్ళి విషయం చెపుతుంది శ్రీ విద్య. అభిలాష్ జమ చేసి ఉండవచ్చుని శర్వాణి అంటుంది. అభిలాష్‌ను సన్మార్గంలోకి తెచ్చేందుకు పర్సనల్ అసిస్టెంట్‌గా సావిత్రిని నియమిస్తుంది శాంతాదేవి. సావిత్రి ఉద్యోగంలో మొదటి రోజు మొదలవుతుంది.

జగదీష్ సమాధానాలు చెప్పుతుంటే అందరూ ఆశ్చర్యపోయారు. ఆ ప్రశ్నల వర్షంలో తడిసిపోతున్న జగదీష్ ఆ పర్ణశాల ఆవరణలోనే ఒక రోజున ఒక పెద్ద సభ జరిపి ఉపన్యసించాడు:

"సోదర సోదరీమణులారా! ఈ సభకు విచ్చేసిన మీ అందరికీ సుస్వాగతం. అయిదారు రోజులుగా నన్ను చాలామంది పెద్దలు అనేక ప్రశ్నలు వేశారు. నేను ఇక్కడి వాడిని. ఇక్కడ యూనివర్శిటీలో ఎమ్‌కాం చేసిన వాడిని. నేను



హిప్నాటిస్ట్‌నీ, మంత్ర తంత్రాలు నేర్చిన వాడినీ కాదు. మీ అందరిలో ఒకడిని. మా "కలిమిలేముల పార్టీని" గురించి ఇదివరకే చెప్పాను. నచ్చిన వారు సహాయం చేశారు. నచ్చనివారు విమర్శించారు. అది లోక సహజం. విమర్శించటం, విమర్శలకు గురి కావటం కూడా జీవితంలో ఒక భాగం.

నాకు కలలో ఒక స్వామి కనిపించిన మాట నిజం. ఆ స్వామి నన్ను చిరునవ్వుతో ఆశీర్వదించి వెళ్ళారే కాని నన్ను పలకరించలేదు. ఆ తరువాత ఒక సన్యాసి వచ్చి ఇచ్చిన కాగితంలో "సాగిపో, సేవా కార్యక్రమాలు చేపట్టు, నీ వెనక నేనున్నాను, నేనుండగా నీకు భయమెందుకు" అని ఉన్నది. ఆ కాగితాన్నే ఫ్రేము కట్టించి ప్రతీ రోజూ స్వామిని తల్చుకొని నమస్కరిస్తున్నాను. ఇదుగో చూడండి" అని ఆ ఫ్రేము కట్టించిన కాగితాన్ని అందరికీ కనపడేటట్లు చూపించాడు. అందరూ చూశారు, కొందరు ఆ ఫ్రేముకు నమస్కరించారు.

"మీ మనస్సులో అనేక సందేహాలూ, నా మీద అనుమానాలూ ఉండొచ్చు, నివృత్తి చేయటం నా బాధ్యత, అడగండి" అన్నాడు. అందరూ [illegible]వ్వున్నారు.

"ఆ స్వామి ఎవరు, ఆ కాగితాన్ని నమ్మవచ్చా":

"ముందుగా మనం ఎవరం? గోపాలరావు, సుబ్బారావు, రాజేశ్వరీ, శారద ఇట్లాంటి నామధేయాలు కాదు. నేను సుబ్బారావుని అనే అహంకారాన్ని తొలగించుకొని అసలు నేను ఎవరు అని ప్రశ్నించుకుని, మనయందు మనం నమ్మకాన్ని ఏర్పర్చుకొంటే, ఇతరుల సద్భావాల యందూ నమ్మకం కలుగుతుంది. తన తత్వాన్ని తను గుర్తించి, గుర్తించిన తత్వాన్ని వర్థిల్ల చెయ్యాలి. అప్పుడే నమ్మకం మీద నమ్మకం ఏర్పడుతుంది" అన్నాడు జగదీష్.

"సేవా కార్యక్రమాలు అన్నారు? సేవ అంటే?" మరొకరు ప్రశ్నించారు.

"ఒక తండ్రికి ముగ్గురు కొడుకులున్నారు. హాస్యానికి కాదు నిజంగానే! అదే భర్త, అదే భార్య, అదే పడగ్గది. అదే దాంపత్య జీవితం, అయితే ఒక కొడుకు ఇంజనీరు, ఒకడు షావుగారు గుమాస్తా, ఒకడు చదువు రాక సంపాదనపరుడు కాక నానా అగచాట్లూ పడుతున్నాడు. కారణం?" ప్రశ్నించాడు జగదీష్.

"కర్మ" అన్నా రు, "చదువుయందు చూపించిన శ్రద్ధాసక్తులు" అన్నారు మరొకరు. "పట్టుదల, కృషి తెలివితేటలే అభివృద్ధికి కారణం" అన్నారు మరొకరు.

"మీ ముగ్గురు చెప్పిందీ నిజమే. సైంటిఫిక్ రీజనింగ్ అయినా, మానసిక పరిణామమూ, స్థితిగతుల వల్లనయినా, కర్మ సిద్ధాంతాన్ని నమ్మినా నమ్మకపోయినా మనిషిని నడిపించేది ఒక దివ్యమయిన శక్తి. మన పూర్వజన్మ కర్మఫలాన్ని బట్టి ఆ శక్తి మనల్ని నడిపిస్తూ ఉంటుంది. కర్మకూ మనిషి ఆలోచనకూ విడదీయలేని సంబంధం ఉన్నది. ఒక పండగ రోజు వస్తుంది. తలంటి పోసుకుని, కొత్త బట్టలు కట్టుకుని దేవాలయానికి వెళ్ళి దైవ దర్శనం చేసుకుని వస్తారు కొంతమంది. సినిమాకు వెడతారు కొంతమంది. క్లబ్బులో ఆ రోజల్లా కూర్చుని పేకాడుతారు కొంతమంది. ఆ వ్యక్తుల్ని ఆయా రీతుల్లో నడిపించేదే కర్మ. ఈ కర్మ సిద్ధాంతాన్ని వప్పుకోవటం, అన్ సివిలైజ్డ్ నేచర్. మూర్ఖత్వం. బూజుపట్టిన పాతకాలపు ఛాందస సిద్ధాంతం అంటారు కొంతమంది. ఈ కర్మ సిద్ధాంతాన్నే కొంతమంది ఇన్‌డివిడ్యుయల్ టేస్ట్ అనీ డిజైర్ అనీ, ఇష్టత అనీ, హాబీ అనీ, స్వభావం అనీపేర్లు పెట్టుకొని ఆ కర్మని చేసి సంతృప్తి చెందుతూ ఉంటారు. శివరాత్రి రోజున శివాలయానికి వెళ్ళకుండా క్లబ్బుకో, అశ్వమేధ యాగానికో వెళ్ళారంటే మనం చేస్తున్న కర్మ ఇష్టత, స్వభావం, హాబీ అనే పేర్లను సంతరించుకుని ఆ వైపుకు దారి తీస్తయ్యి. కనుక మనల్ని నడిపించే శక్తి మనచేత ఆ కర్మని చేయిస్తూ ఉంటుంది. సత్కర్మ మంచిని ప్రసాదిస్తే పాపకర్మ దుఃఖాన్ని ప్రసాదిస్తుంది. కనుక అందరూ కూడా కర్మబద్ధులే" అన్నాడు జగదీష్.

"ఆ స్వామి మిమ్మల్ని సేవా కార్యక్రమాలు చేపట్టమన్నారు. వాటిని గురించి చెప్పాలి" ఇంకొకరు అడిగారు.

"కర్మ పర్యవసానం జ్ఞానం, జ్ఞానానికి ఆధారం కర్మ. ఈ రెంటి సమన్వయ స్వరూపమే సేవ. మానవసేవయే మాధవ సేవ. ఇదే నిజమైన ఆరాధన. సాధన ద్వారా వ్యక్తి నిర్మాణం, సేవ ద్వారా సమాజ నిర్మాణం చేయటమే ప్రతివారి ఆదర్శం కావాలి. మా కలిమిలేముల పార్టీ సర్వ మానవ సహోదరత్వ భావంతో సమాజానికి నిష్కామసేవ చేస్తుంది. ఆ స్వామి మమ్మల్ని ఈ సేవా కార్యక్రమాల్లో వెన్ను తట్టి ముందుకు నడిపిస్తారు. మేము చేపట్టిన సేవా కార్యక్రమాలు (1) బస్సు షెల్టర్లు నిర్మించటం (2) మంచినీటి వసతి లేని గ్రామాల్లో బావులు త్రవ్వించటమో, పాడుబడిన బావులను బాగుచేసి నీటి వసతి కల్పించటం (3) కట్న కానుకల ప్రమేయం లేకుండా సామూహిక ఆదర్శ వివాహాలు చేయించటం (4) ఎలిమెంటరీ పాఠశాలలనూ, దేవాలయాలనూ బాగు చేయటం (5) కొద్ది కర్చులో మరుగు దొడ్డి నిర్మాణాన్ని చేసి ఇవ్వటం (6) వరకట్నపు బాధిత గృహిణులు తమ సమస్యల్ని మా దృష్టికి తెస్తే వారికి తగిన రీతిలో ఆ భార్యాభర్తలకు సర్ది చెప్పి వారి కాపురాన్ని సరిదిద్దటం". అని చెప్పాడు జగదీష్.

మరి కొన్ని సందేహాలు కూడా నివృత్తి చేయటంతో ఆనాటి సభ పూర్తయింది. కొంతమంది విరాళాలూ ఇచ్చేరు.

★ ★ ★ ★ ★ ★

తన బ్యాంకు పాస్ బుక్‌లో పాతిక వేలూ జమకట్టింది అభిలాష్ అని చెప్పగానే శ్రీవిద్య మనస్సు ఉడికిపోయింది. తనని మభ్యపెట్టి అనుభవించి పాడు చెయ్యటానికి అతను ఇట్లా చేశాడనే అభిప్రాయాన్ని మనస్సులో పదిలపర్చుకున్నది. రుక్మిణి చెప్పినట్లుగానే చేసి ఆ రోజు సాయంత్రమే సత్యభామ ఇంటికి వెళ్ళింది శ్రీవిద్య. చదువూ కాలేజీ విషయాలూ కాసేపు మాట్లాడుకున్నాక అసలు విషయానికి వచ్చింది శ్రీవిద్య.

"శ్రీమంతుల ఆడపిల్లలు సద్భావంతో దానధర్మాలు చేస్తుంటే మరో శ్రీమంతుల సుపుత్రుడు కామధర్మాలు చేస్తున్నాడు". అన్నది.


"కామధర్మాలా" అర్థం కాక ప్రశ్నించింది సత్యభామ.

"ఒక ఆడపిల్లను అనుభవించటానికి అమ్మాయికి తెలీకుండానే అమ్మాయి పాస్ బుక్‌లో పాతిక వేల రూపాయలు జమకట్టాడు, ఆ అభాగ్యురాల్ని నేనే సత్యభామగారూ" పాస్‌బుక్ చూపించి జరిగిందంతా చెప్పింది.

"మీ ఆర్థిక పరిస్థితి నాకూ బాగానే తెలుసు. ప్రస్తుతం మీరెట్లా జీవిస్తున్నారు" అడిగింది సత్యభామ.

"నేను ట్యూషన్లు చెప్తున్నాను. పరీక్షలయితే ఇక చదువు అయిపోయినట్లే. అప్పుడు ఇంటర్‌తో ఆపేసి ఏ చిన్న ఉద్యోగం అయినా చేస్తాను" నిర్లిప్తతగా అన్నది శ్రీవిద్య.

"నీకు తెలీకుండా నీ పాస్ బుక్‌లో అంత డబ్బు జమ చేశాడంటే మూడు విషయాలు: డబ్బు కోసం ఆ వ్యక్తిని నువ్వు ఆశించి సంబంధం పెట్టుకొని, నువ్వ



రచయిత జవాబులు

కె. నందిని, ఏలూరు

ప్ర : ఆడపిల్ల అంటే మీ దృష్టిలో .....?

జ : తన అందాన్ని గౌరవప్రదంగా కాపాడుకుంటూ, సృష్టికి అందం తెస్తూ, బాధ్యతతో తన సవ్యమైన హక్కుల్ని రక్షించుకునే వనిత.

యం. జి. సర్దార్ పాష, పుల్లూరు, ఖమ్మంజిల్లా

ప్ర : వర్తమాన సాహిత్యంలో గుర్రాలమీద, వ్యభిచారులమీద, బ్యాంకులమీద, . రాకెట్లమీద, అంతరిక్షంమీద జరిగే రచనలు పరిశోధనలేగాని, సాహిత్యం అవదు, ఏమంటారు?

జ: విమర్శనాత్మకంగా జవాబివ్వడానికి స్థలా భావం అడ్డొస్తుంది. ఇది కమర్షియల్ సాహిత్యం.

జి. శోభ, చంద్రగిరి

ప్ర : అటు పత్రికలవారూ, ఇటు రచయితలూ, ఎప్పుడయినా పాఠకులు లాభం పొందటం తప్ప, సాహిత్యంవల్ల మన ఈ సమాజానికి ఏమయినా ప్రయోజనం ఉన్నదని మీరు భావిస్తున్నారా?

జ : ఎప్పుడయినా పాఠకులు లాభం పొందటం తప్ప అని మీరే ఒప్పుకున్నారుగా. 'సామాజిక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని వెలువడే సాహిత్యంవలన సమాజానికి ప్రయోజనం తప్పకుండా ఉన్నది.

ఎ. సురేష్ కుమార్, హైదరాబాద్

ప్ర : భయపెట్టే మనిషిని చూసి భయపడతారు. కాని సర్దుకు పోయే మనిషిని చూసి మరింత భయపెట్టి పీడిస్తారు. ఇది ఎక్కడి న్యాయం?

జ : మనిషి లొంగేది భయానికీ, ఆశకూ మాత్రమే. న్యాయం అనేది వీటి తరువాతనే.

సి. నాగరాజాచారి, తిరుపతి

ప్ర : సమాజంలో స్త్రీ అన్ని రంగాల్లో పురుషునితో సమానంగా ఎదుగుతున్నది కదా, మరి స్త్రీకి అన్యాయం జరుగుతున్నదని ఎందుకు అంటున్నారు?

జ : దిన పత్రికలు రోజూ చదివితే మీకే తెలుస్తుంది.

ఉత్తమ ప్రశ్న

కుమారి ఎం. త్రివేణి, బృందావన్ కాలనీ, రంగారెడ్డి జిల్లా

ప్ర : చాలా పెద్ద ప్రశ్న వేశారు...

తమ జీవిత భాగస్వామితో, ఆత్మీయత, అనురాగాలతో జీవనం కొనసాగించేవారు చాలా అరుదు. ఎందుకు అంటారు?

జ : ఆర్థిక సమస్యలు వేగంగా ప్రయాణించే కాలమాన పరిస్థితులు, లగ్జరీస్, మనో విశ్లేషణలూ, అనేక పరిణామాలూ కారణం. అన్నిటికన్న అర్థం చేసుకోవటంలో గల లోపమే ముఖ్య కారణం.

చోడవరపు నాగేశ్వరరావు, కటుంబ సభ్యులు. హైదరాబాద్

ప్ర : రచనలవలన విజ్ఞానం పెరుగుతుందికదా, మరి అవార్డులు రాకపోవటానికి కారణం?

జ : విజ్ఞానం పెరుగుతున్నది అన్నారు సంతోషం. ఏవార్డుకి అవార్డు ఇవ్వాలో తెలీక ఇవ్వటం లేదు.

సృజన్, బళ్లారి

ప్ర : పాఠకుల్ని ఎడ్యుకేట్ చేసే గొప్ప సాహిత్యం అంటూ... ఈ ఇన్ఫర్మేషన్ సాహిత్యం ఎంతమంది అర్థం చేసుకోగలరు?

జ: ఇన్ఫర్మేషన్ తెలిసినప్పుడు, అర్థం కాకపోవడం అంటూ ఉండదు.

మహమ్మద్ రఫీ, కాశిబుగ్గ

ప్ర : నేటి సాహిత్యపు విలువలు తగ్గటానికి కారణం? కళ్ళకూ చెవులకూ గంతలు కట్టిన న్యాయదేవత తీర్పు ఎట్లా చెప్పగలుగుతుంది?

జ : పాఠకుల అభిరుచికి అనుగుణంగా రచనలు రాక తప్పటం లేదు.

మానసికంగా ఆలోచించి, చట్టం పరిధిలో దృష్టిని సారించి, రాగ ద్వేషాలకు అతీతంగా ఉండేది న్యాయదేవత. కాని ప్రస్తుత పరిస్థితుల్లో అది ఒక సింబల్ మాత్రమే.

కుమారి పెయ్యేటి విజయ చాముండేశ్వరి, శ్రీకాకుళం

ప్ర : మీ దృష్టిలో నవలా రచనకు వస్తువు ముఖ్యమా, శైలి ముఖ్యమా, ఏది ప్రధానంగా ఉండాలి. ఈనాడు మీ రచనలు వృద్ధి చెందటానికి ఏది దోహదం చేసిందని భావిస్తున్నారు?

జ : కథా వస్తువు, శైలి ముఖ్యం. నేటి సాంఘిక. పరిస్థితుల్ని గురించి సరైన అవగాహన చాలా అవసరం. కథనంలో మెళుకువలు ఇంకా ముఖ్యం

ఈ వారం ఉత్తమ ప్రశ్నని పంపిన కుమారి ఎం. త్రివేణి - (బృందావన్ కాలనీ, రంగారెడ్డిజిల్లా)కి బహుమతిగా "పసిడి మనసులు" నవల పంపటం **జరిగింది.**

మనస్సు మార్చుకొని అతన్ని అల్లరి పెట్టటానికయినా ఇట్లా బయటపడి ఉండొచ్చు. నీకు తెలీకుండా నీ ఎకౌంట్ నెంబరు తెల్సుకుని అంత డబ్బు జమకట్టాడంటే నిన్ను ప్రేమిస్తున్న ఆ అజ్ఞాత యువకుడు చాలా విశాల భావంతో నిన్ను పెళ్ళి చేసుకోదలిచి పెళ్ళి కర్చు కోసం ముందుగానే సహాయం చేసి ఉండాలి. మూడో అనుమానం నిన్ను కిడ్నాప్ చేసి అనుభవించి నువ్వు గొడవ చేస్తే, నువ్వు డబ్బు కోసం అతనికి లొంగిపోయి, ఇంకా ఎక్కువ మొత్తాన్ని కోరినట్లు ఋజువు చేయడానికయినా ఈ నాటకం ఆడి ఉండాలి. ఆ అజ్ఞాత వ్యక్తి నిన్ను వెంటాడి తిరుగుతూనే ఉండొచ్చు. కాని ఆ వ్యక్తి నువ్వు అనుమానపడిన అభిలాష్ కాదు. ఈ అనుమానం కూడా నీ స్వంతం కాదు. జగదీష్, శార్వాణి చెప్పారు, అవునా'' అన్నది సత్యభామ.

- నిస్తేజంతో చూసింది శ్రీవిద్య.

''అంతటి నీచానికి దిగవలసినంత అవసరం అభిలాష్‌కు లేదు శ్రీవిద్యా. అతని మీద అనుమానాన్ని పెంచుకుని అసలు కథా నాయకుడిని వదిలేస్తే పరోక్షంగా ఆ దుర్మార్గుడికి సహాయం చేసిన దానివే అవుతావు. నష్టపోయేది నువ్వు. మన సమాజంలో న్యాయశాస్త్రరీత్యా, చట్టరీత్యా స్త్రీకి ఎంత రక్షణ ఉన్నదో, అంతటి అగౌరవపంపాలు కావటానికీ వీలున్నది. నిన్ను ఉంచుకున్నానని ఏ సంబంధం లేకపోయినప్పటికీ అభిలాష్ తన పదిమంది స్నేహితులకో చెప్తాడు. అభాండం వేస్తాడు. అదే నోటిరంకు. అట్లాగే నేను అభిలాష్‌ని ఉంచుకున్నానని నువ్వు ఒక్క స్నేహితురాలితో అనగలవా, ఆలోచించు'' అన్నది.

మాట్లాడలేకపోయింది శ్రీవిద్య.

''చూడూ, ఆడపిల్లల్ని వేధించి అల్లరి పెడితే ఐ. పీ. సీ. 509 సెక్షన్ ప్రకారం ఆ రోడ్‌సైడ్ రోమియోకు జైలు శిక్షో, ఫైనో కోర్టులో విధిస్తారు. మానభంగం నేరం ఒకే పెద్ద యూనివర్సల్ సబ్జెక్ట్. కాని వచ్చిన చిక్కేమిటంటే నేరం జరిగాకనే పోలీస్ రిపోర్టూ, పబ్లిక్ ప్రాసిక్యూటరూ, న్యాయవాదీ, న్యాయమూర్తీ కనిపిస్తారు కాని, ఇటువంటి విషయాల్లో నేర నిరోధానికి సరయిన చర్యలేదు. అనుమానంతో అవమానంపాలు కావటం చాలా తేలిక. నీ విషయంలో ఆ కనపడని హీరోని నీ కళ్ళ ముందుకు తెచ్చుకోవటం సరయిన తీసుకోవలసిన చర్య'' అన్నది మళ్ళీ.

ధర్మపథం



భయాన్ని గురించి

భయమనేది మానవుని దౌర్బల్యానికి సూచకం. సాధారణంగా– తనకు అపాయాన్నీ ప్రాణ హానినీ కలిగించే మృగాదులను చూచి భయపడడం సహజం. ధైర్య, సాహసాలు ఉన్నవారు వాటికి భయపడరు. ఆ క్రూర ప్రాణులు నిర్బంధంలో ఉన్నప్పుడు సామాన్యులకు కూడా వాటివల్ల భయం ఉండదు. కాని, కొన్నిటికి మాత్రం మనం భయపడక తప్పదు. ధైర్య సాహసాలు ఉన్నవారు కూడా వాటికి భయపడవలసినదే! అన్యాయం, అక్రమం, ద్రోహం, అపకారం. ఇవి చెయ్యడానికి భయపడవలసినదే! అలాగే దుష్టులకు కూడా భయపడాలి. వారు కారణం లేకుండానే ఇతరులకు కష్ట నష్టాలనూ, అపాయాలనూ కలిగిస్తారు కాబట్టి.

తప్పు చేసిన వాడు– తాను తప్పు చెయ్యలేదని అందరూ అనుకునే విధంగా నటించినా, మనస్సు మాత్రం "నీవు తప్పు చేశావు దాన్ని కప్పి పుచ్చడానికి ప్రయత్నిస్తున్నావు" అని చెప్తూనే ఉంటుంది. తప్పు చెయ్యని వాళ్ళు మాత్రం నిర్భయులుగానే ఉంటారు. వారి మనస్సు నిర్మలంగానే ఉంటుంది.

న్యాయస్థానాల్లో తప్పుడు సాక్ష్యం ఇచ్చే వారు, న్యాయవాదులు అడిగిన ప్రశ్నలకు తగిన జవాబు ఇవ్వలేక తికమకలు పడతారు. వారిని భయం వెన్నాడుతునే ఉంటుంది. యధార్థ సాక్ష్యం ఇచ్చేవారూ ఉన్నది ఉన్నట్టు చెప్పేవారూ ఎదుటి పక్షం న్యాయవాదులకు భయపడరు. ధైర్యంగానే ఉంటారు.

భయం చెడ్డ గుణాలలో బలవత్తరమైనది. దానిని దూరంగా తరిమివేయాలంటే అసత్కార్యాలకు దూరంగా ఉండాలి. అప్పుడే మనస్సు నిర్మలంగా ఉంటుంది. ఎట్టి పిరికితనానికి అవకాశం ఉండదు.

శాంత స్వభావం భయానికి తావునియ్యదు. అందువల్లనే శాంత స్వభావులైన మహర్షులు క్రూర మృగాలతో కూడి భయంకరమైన అడవుల్లో నిర్భయంగా తపస్సు చేసుకొనేవారు. శాంత స్వభావులకు దుష్టులు కూడా దూరంగా ఉండగలరు.

–బులుసు వేంకట రమణయ్య

ఆడపిల్లలు– అనుభవాలు

శ్రీవిద్య కళ్ళ నీళ్ళు పెట్టుకుని వెళ్ళిపోయింది.

* * * * *

వారం గడిచింది. ఆ రోజు శుక్రవారం. శ్రీవిద్య తలంటి పోసుకుని వదులుగా జడ వేసుకుని చెవులకు రింగులయినా పెట్టుకోకుండా మంచి చీరయినా కట్టుకోకుండా, ముఖాన చాదు బొట్టు పెట్టుకుని చేతులకున్న మట్టి గాజులు కూడా తీసేసి పాస్ బుక్ తీసుకుని బ్యాంకుకు వెళ్ళింది. ఎస్. బి. ఎకౌంట్ కౌంటర్‌లో మామూలుగా ఉండే లేడీ క్లర్క్ రంజీతా ఉన్నది. కౌంటర్ దగ్గరకు వెళ్ళి నెమ్మదిగా అన్నది.

"మీతో పర్సనల్‌గా మాట్లాడాలి. మీ ఇంటి అడ్రస్ చెప్తారా".

ఎందుకో అర్థంకాక, అక్కడ మాట్లాడితే బావుండదని అడ్రస్ ఇచ్చింది రంజీతా. మర్నాడు శనివారం మధ్యాహ్నం వస్తానన్నది.

మర్నాడు మధ్యాహ్నం రెండు గంటలకు రంజీతా ఇంటికి వెళ్ళింది శ్రీవిద్య!. కుర్చీ చూపించింది కూర్చోమని. శ్రీవిద్య కూర్చున్న తరువాత-

"చెప్పండి" అన్నది.

"ఈ పాస్ బుక్ చూడండి ఈ పాతిక వేలూ నా ఎస్. బి. ఎకౌంట్‌లో జమ చేసిన ఓచర్‌ని నేను చూడాలి".

"ఎందుకూ, మీరు జమ చేయలేదా, రాంగ్ ఎంట్రీనా, మరొకరు జమకట్టారా, ఆ డబ్బు మీది కాదా" అడిగింది రంజీతా.

జరిగిన విషయం అంతా చెప్పింది శ్రీవిద్య.

ఓచర్లు చూపించటం రూల్సుకు వ్యతిరేకం అని చెప్పి, పరిస్థితిని బట్టి చూపిస్తానన్నది రంజీతా.

సోమవారంనాడు బ్యాంకుకు వెళ్ళింది శ్రీవిద్య.

ఓచర్ చూపించింది రంజీతా. ఆ ఎస్. బి. చలానా ఫారం ఇంగ్లీషులో రాసి వుంది. డబ్బు కట్టిన వారి పేరు ఎ. ఎ. బి. బి. సి. సి. డి. డి. హేమంత్. ఆ పేరు చదువుకుని నవ్వుకున్నది. దస్తూరి కూడా చాలా ఫైన్‌గా చూడముచ్చటగా ఉన్నది. సంతకం కూడా విడి విడి అక్షరాలతో బాగున్నది. ఆ దస్తూరీని, పేరునూ మనస్సులోనే ఫోటో స్టాట్ కాపీని తీసుకుని రంజీతాకు కృతజ్ఞతలు చెప్పి వచ్చేసింది శ్రీవిద్య.

ఆ రోజునే విశాఖపట్టణం నుంచీ వెలువడే దినపత్రికలో తన ఫోటో తో సహా ఒక ప్రకటన ఇచ్చింది.

ప్రకటన:–

మిస్టర్ ఎ. ఎ. బి. బి. సి. సి. డి. డి. హేమంత్. నువ్వు పంపిన డబ్బు అయిపోయినది. చాలా ఇబ్బందుల్లో ఉన్నాను. మరో పాతికవేల రూపాయలు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా రెండు రోజుల్లో పంపవలెను. నీ నెచ్చెలి,

శ్రీవిద్య

ఆ ప్రకటన ఆ మర్నాటి సంచికలో మొదటి పేజీలో వేశారు. ఆ ఎడ్వర్టయిజ్‌మెంట్‌కు డబ్బును రుక్మిణి దగ్గర అప్పు చేసి తీసుకున్నది. ఆ ప్రకటన వచ్చిన రోజున, ఆ మర్నాడూ కూడా శ్రీవిద్య కటిక దరిద్రురాలిగా, నిరుపేదగా పాత బట్టలు కట్టుకుని బ్యాంకులో విజిటర్స్ కుర్చీలో ఒక మూల కూర్చున్నది. రంజీతాకు ముందే చెప్పింది. ఆ వ్యక్తి ఎవరో బయట పడతాడని ఆశించింది శ్రీవిద్య.... బ్యాంకు వర్కింగ్ అవర్స్ ఉదయం పది నుంచీ మధ్యాహ్నం రెండు గంటల వరకూ. ఆ రెండు రోజులూ ఆ టైమ్‌లో కూర్చున్నా ఎవరూ తన కోసం వచ్చిన వాళ్ళు కనపడలేదు. ఇక లాభం లేదని బయలుదేరింది శ్రీవిద్య.

ఇంటికి వెళ్ళేసరికి జగదాంబ ఒక సీలు చేసిన కవరు ఇచ్చింది. అడ్రస్ చూసింది. ఎ. బి. సి. డి. హేమంత్ అని ఫ్రం అడ్రస్ ఉన్నది. కవరు చించి చూసింది.

సంతకం వున్న బ్లాంక్ చెక్, ఒక ఉత్తరం, ఒక చచ్చిన తేలుపిల్ల ఉన్నాయ్యి.

(ఇంకా ఉంది)

ఎర్రని మారుతీకారు శివంగిపురం వైపుగా సాగిపోతోంది. జిల్లాజడ్జీ చక్రధరరావు డ్రైవింగ్ సీట్లో కూర్చుని విలాసంగా స్టీరింగ్ తిప్పుతున్నాడు.

అతనికి నలభై ఏళ్ళుంటాయి.

హుందాగా దర్పంగా వెలిగి పోతున్నాడు.

"డాడీ మనం ఎక్కడికి పోతున్నాం?" అతని పక్కనే కూచున్న ఎనిమిదేళ్ల వెంకూ ప్రశ్నించాడు.

"దేవాలయానికి బాబూ!" అన్నాడు చక్రధరరావు వెంకూ తల మీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమురుతూ.

"శివంగిపురంలో కోవెలుందా?" మళ్లీ ధర్మ సందేహాన్ని వెలువరించాడు వెంకూ.

"వీడికి చదువు తప్పించి అన్నీ ఆసక్తే!" అనుకుంటూ, దేవుడిలాటి మనిషి వున్నాడు బాబూ అక్కడ, అన్నాడు చిన్నగా విసుక్కుంటూ.

మరేమీ ప్రశ్నించకుండా ప్రకృతి దృశ్యాలు తిలకిస్తూ కూచున్నాడు వెంకూ.

చక్రధరరావు ఆలోచనంతా ఒక్కటే. "ముందుగా మాష్టార్ని చూడాలి!" "తనెంత గొప్పవాడయ్యేడో ఆయన చూడాలి!"

"చిన్నప్పుడు తను ఆయన పట్ల ఎలా ప్రవర్తించేవాడు?" విషాదహర్ష సమ్మిళిత మైన నవ్వు వెలిగింది అతని పెదాలమీద.

"డాడీ..... ఇంకా.... ఎంతదూరం పోవాలి?" వెంకూ ప్రశ్నించాడు. వాడి ప్రశ్నలో విసుగు ధ్వనిస్తోంది.

కాలునడకని పోతున్న వాడిలా చిరాకెత్తి పోతున్న కొడుకుని చూస్తూ వుంటే కోపం పెల్లుబికింది చక్రధరరావులో.

కొడుక్కి ఏసమాధానం చెప్పకుండా మౌనం వహించాడు అతను.

దూరంగా "శివంగిపురం" అన్న బోర్డు కనుపించింది.

"వచ్చేశాం బాబూ!" అన్నాడు చక్రధరరావు ఉత్సాహంగా. అతని అంతరంగం గతం వర్తమానాల మధ్య కొట్టుమిట్టాడుతున్నది.

ఈఊరుతను విడిచిపెట్టి చాలా ఏళ్లయ్యింది. ఆ పసితనపు జ్ఞాపకాలు మాత్రం మిగిలి పోయాయి.

"తను ఇప్పుడు ఇక్కడికి ఎందుకు వస్తున్నట్టు?"

"ఏమండీ వీడికి చదువు వచ్చే సూచనలు కనుపించడం లేదు!" "కాన్వెంటులో కూడా నేను జడ్జీగారి అబ్బాయిని", అంటూ తన ఆధిక్యతని ప్రదర్శిస్తున్నాడట!" "టీచర్లు చెప్పినట్టు అసలు వినడమేలేదట!" "చదువను వ్రాయను అసలు చేయడట!" "ఇలాగైతే వీడికి చదువు ఎలా వస్తుందంటారు?" భార్య కమలిని గోలపెట్టింది.

కొన్నాళ్ళు ట్యూషన్ పెట్టి చూశాడు. ఇంటికి వచ్చిన ట్యూషన్ మాష్టర్ని ఆటపట్టించి పంప వేశాడు. జడ్జీ గారిదగ్గర ఎంత మొహమాటం వున్నా! వెంకూ దగ్గర మాత్రం అందరూ జడిసి పోతున్నారు.

తమ ఒక్కగా నొక్క బిడ్డా ఎందుకిలా తయారవుతున్నాడు. "వీడికి అసలు చదువురాదా?"

తన బిడ్డగురించి అందరూ "జడ్జీగారి అబ్బాయి!" అంటూ గర్వంగా చెప్పుకోవాలి! అనుకున్నాడు," కాని...... కాని...... లోపం ఎక్కడుంది?

"కమలినీ బాబుని నాతో ఓ చోటికి తీసుకు వెళ్తాను!" అన్నాడు నిద్ర లేస్తూనే.

కమలిని "ఎందుకు?" ఏమిటి? అని ప్రశ్నించలేదు. "వాడు బాగు పడడమే కావాలి!"

ఊరు సమీపించింది కారు.

ఈ ముప్పై ఏళ్లలోనూ ఊర్లో పెద్ద మార్పు ఏమీకనుపించ లేదు. "కొన్ని గ్రామాలు ఇంతే కాబోలు?" అసలు అభివృద్ధినే సంతరించుకోవు.

మాష్టారు వచ్చి పోవాలి

కె. తాయారమ్మ

కరంటు దీపాలు మాత్రం వచ్చినట్టున్నాయి.

కొంత వరకు తారు రోడ్డు పడింది.

ఊరి మొదట్లోనే వున్న అంకాళమ్మ గుడి కనిపించింది. అది ఇప్పుడు బాగా పాడుపడినట్టుంది. అసలు పూజలు పునస్కారాలు జరుగుతున్నట్టే లేదు.

ఇదివరలో మూడేళ్లకోసారి జాతర జరుగుతూ వుండేది. అప్పుడు ఎందరోజనం వచ్చేవారు ఈ ఊరు. రకరకాల దుకాణాలు వచ్చేవి. తాము ఎన్నో బూరలు, బుంగలు కొనుక్కునేవారు అప్పుడు. ఏదో ఆనందం, ఎంతో థ్రిల్ . "కాని..... కాని..... ఇప్పుడవన్నీ ఏవి?" బహుకార్యమగ్నత. ఎప్పుడూ బిజీ. మనిషి ప్రాణాలతో చెలగాటం!" తన వృత్తి ధర్మం అలాటిదిమరి!"

గుడిముందు ఆపాడు కారుని.

గుడిచుట్టూ చెట్లూ గుబుర్లూ దట్టంగా అలుముకున్నాయి.

"సున్నం వేసి ఎన్నాళ్లయ్యిందో?" పాచిపట్టి నట్టున్నాయి గోడలు.

"దిగుబాబూ!" తను కారుదిగి డోరు తీసి పట్టుకున్నాడు చక్రధరరావు.

వెంకూ దిగాడు. వాడికిదంతా ఆశ్చర్యంగా కొత్తగా వుంది. వాడెప్పుడూ ఇలాంటి పరిసరాలు చూడలేదు. అసలు పల్లెటూర్లే చూడలేదు.

ఏదో హాయి ఆవరించింది వెంకూ మనస్సుని.

అప్పటికే చాలా మంది ఆ ఎర్రకారుని, ఆ వచ్చిన వాళ్లని చూస్తూ గుడిప్రాంతానికి వచ్చారు.

"రాబాబూ గుడిలోకి వెళ్దాం!" అంటూ గుడిలోకి నడిచాడు వెంకూతో సహా.

లోపల అంతా చీకటిగా వుంది. టార్చి లైటు వేశాడు. పలుచని వెలుగు పరుచుకుంది గుడి లోపల అంతా.

అంకాళమ్మ విగ్రహం నల్లగా వుంది. నవ్వుతున్నట్టుంది.

"ఆ దేవతలో ఏ మార్పూ లేదు".

"మరి మార్పు ఎక్కడుంది?" చక్రధరరావు కళ్ళు గుడి నలుమూలలా పరికించాయి. "అంతే!" తక్కున అతని చూపు ఓ చోట ఆగిపోయింది.

అంకాళమ్మ విగ్రహానికి వెనకగా మసకమసకగా ఏవో అక్షరాలు. అక్కడికి నడిచాడు జడ్జి చక్రధరరావు.

చేతిరుమాలుతో గోడ మీద బాగా తుడిచాడు. రుమాలుకి నల్లని మకిలి అంటింది. ఇప్పుడు అక్షరాలు స్పష్టతని సంతరించుకున్నాయి. వంకరటింకరగా వున్న ఆ అక్షరాల్ని ఒక్కసారి చదివాడు అతను.

అతనికన్నులలో నీరు స్పష్టాస్పష్టంగా కదిలింది. ఆ నీటి తెరలమధ్య అతని చూపులు అక్షరాల్ని స్పృశించాయి. "మాష్టారు చచ్చిపోవాలి!"

గతుక్కు మన్నాడు అతను. "తన చిన్ననాటి జ్ఞాపకం ఇలా.... ఇలా..... మిగిలి పోయిందా?"

"డాడీ!" వెంకూ పిలుపుతో వాస్తవంలోకి వచ్చాడు చక్రధరరావు.

"పదబాబూ మనం వెళ్దాం!" అంటూ కారు ఎక్కి స్టార్ట్ చేశాడు.

ఎప్పుడూ రానివ్యక్తి, అందమైన కారు ప్రజలు అపురూపంగా చూడసాగారు.

ఓ చోట కారు ఆపి, "సోమయ్య మాష్టారి ఇల్లెక్కడ బాబూ?" అంటూనే నడివయస్కుణ్ణి ప్రశ్నించాడు.

'ఆ వ్యక్తి చక్రధరరావుని నఖశిఖ పర్యంతం పరీక్షించి "బాబూ మీరెవరు?" అంటూ ప్రశ్నించాడు.

"వెంకటాచలంగారి అబ్బాయిని!"



ఆ వ్యక్తి కళ్ళు ఆనందంతో వెలిగాయి.
'అయితే..... నువ్వు .... చక్రధరానివా?"

"అవును!" అన్నాడు చక్రధరరావు.

"ఒరే చక్రీ..... చక్రీ.... " నేనురా అబద్ధాల్ని" అదే కంది అబద్ధాల్ని!" ఆనందోద్వేగంతో అన్నాడా వ్యక్తి.

చక్రధరరావు నేత్రాలలో ఏవేవో మెరుపులు మెరిసాయి. "తనూ ..... అబద్ధాలు.... అక్కిరెడ్డి.... గుండుగాడు.... మాష్టార్ని గురించి..... మరి ఊహించ లేకపోయాడు. "ఆ పసితనపు రోజులు ఎంతో మధురంగా హాయిగా వుండేవి.!"

"అబద్ధాలూ ఇప్పుడు నువ్వేం చేస్తున్నావు?" మెమ్మదిగా ప్రశ్నించాడు.

"వ్యవసాయం చేసుకుంటున్నాను!" "మాలాంటి వాళ్లం ఇంకా ఏమిటి చేయగలం?" నిరాశ ధ్వనించింది అబద్ధాలు గొంతులో.

"ఓఁ!" అన్నాడు చక్రధరరావు.

"చక్రీ ఈకారు నీదేనా?" అపురూపంగా కారుని స్పృశిస్తూ ప్రశ్నించాడు అబద్ధాలు.

"నాదే!" "బావుందా?" ప్రశ్నించాడు.

"చాలా బావుంది. దేనికైనా పెట్టి పుట్టాలి!". పిపెంపుడు తండ్రి బాగా ఆస్తి పరుడుకదా?" "ఇంతకీ నువ్వేం చేస్తున్నావు?"

"జిల్లా జడ్జీ!"

"అంతే!" ఆ వ్యక్తి వడివడిగా అడుగులు వేస్తూ వెళ్లిపోయాడు.

చిన్నగా నవ్వుకుంటూ మళ్ళీ కారు స్టార్ట్ చేశాడు చక్రధరరావు.

ఆ కారు ఓ యింటి ముందాగింది.

ఆ ఇల్లు శిథిలమై నామ మాత్రంగా మిగిలివుంది. తాటాకుల కప్పుతో తలదాచుకుంటున్నారా ఇంటివాళ్ళు.

ఆ ఇంటి మట్టి అరుగు మీద తాటిరేకుల చాప పరుచుకుని పదిమంది పిల్లలకి చదువు చెప్తున్నాడో నడివయస్కుడు.

"సోమయ్య మాష్టారి ఇల్లిదేనాండీ?" ప్రశ్నించాడు చక్రధరరావు.

"ఆఁ ఇదే!" అని, నాన్నా నీకోసం ఎవరో వచ్చారు!" అంటూలోపలికి కేకేశాడు.

చేతికర్ర సాయంతో ఇవతలికొచ్చాడో వృద్ధుడు.

"మాష్టారూ నమస్కారం!" అన్నాడు చక్రధరరావు వినయపూర్వకంగా.

"ఎవరు బాబూ నువ్వు?" అంటూ ప్రశ్నించాడా వృద్ధుడు చక్రధరరావుని సమీపిస్తూ.

ఆయన ముఖం చూసి గతుక్కుమన్నాడు చక్రధరరావు. ఓ చెంపంతా చర్మం ఊడి వికృతంగా వుంది. కనుగుడ్డు పూర్తిగా ఊడిపోయి అక్కడో గొయ్యి మాత్రం మిగిలింది. "ఏమిటిది?" "ఎందుకిలా జరిగింది?"

"బాబూ నా ప్రశ్నకి సమాధానం చెప్పావుకాదు?"

"ఆఁ...... ఓఁ...... అంటూ క్షణకాలం తడబడి "నేను వెంకటాచలంగారి అబ్బాయిని!" అన్నాడు జీర్ణ వస్త్రధారియైన ఆయన్ని చూస్తూ.

"చక్రధరం..... అరే.... చక్రీ.... నువ్వా!" "ఎంత మారిపోయావు!" "ఇంకానీకు.... ఈ బడుగు బడిపంతులు జ్ఞాపకం వున్నాడా?" "నా మీద కోపం పోయిందా బాబూనీకు?" వాత్సల్యం తొణికిసలాడింది సోమయ్య మాష్టారి గారి గొంతులో.

"మీ సౌజన్యంతో నన్నింకా శిక్షించకండి మాష్టారూ!" "నేను చిన్నతనంలో మీపట్ల ఏదోలా ప్రవర్తించేవాణ్ణి!" జీవితం నేర్పిన పాఠం మహత్తరమైనది.

"వీడు నా బిడ్డ వెంకటేష్!" "వీడికి చదువు అబ్బలేదు!" వీడిగురించే నాకూ నా భార్యకీ బెంగ. "వీణ్ణిలాగైనా విద్యావంతుణ్ణి చెయ్యాలి మాష్టారూ!" "ఆభారం మీ మీద మోపుతున్నాను!" "వీడి చేత మీరు అక్షరాలు రాయించండి!"

"నేను పిల్లల్ని కొడతాను చక్రీ!" ఎటో చూస్తూ అన్నారు సోమయ్య మాష్టారు.

తుళ్ళి పడ్డాడు చక్రధరరావు. మాష్టారు గతాన్ని ఎంత చక్కగా గుర్తు చేశారు! "తనతప్పుని తనే తెలుసుకునేలా ఎలా మాట్లాడుతున్నారు?"

సిగ్గుతో అతని తల వాలిపోయింది.

"చక్రీ ఏవీ నీ చేతులు?" "అప్పుడు నేను చింతరువ్వతో ఈ అరచేతులలో కొడితే ఎర్రగా కంది పోయి బొబ్బలెక్కేవి కదూ?"

"మాష్టారూ మీరు అనాడు నన్ను అలా కొట్టబట్టే నేను ఇంతటి వాణ్ణయ్యాను!" ఓ గర్వరేఖ తళుక్కుమంది చక్రధరరావు కన్నులలో. అతని మాటలలో కృతజ్ఞత తొణికిసలాడుతోంది.

"బాబూ చక్రధరం నువ్వేం చేస్తున్నావు ఇప్పుడు?" అరుగుమీద తాటాకు చాపమీద కూచున్న అతన్ని ప్రశ్నించారు సోమయ్య మాష్టారు.

క్షణ కాలం మౌనం వహించి తరువాత అన్నాడు చక్రధరరావు: "జిల్లా జడ్జీగా నియమించబడ్డాను!"

"బాబూ... మీరు... పొరపాటైంది...మిమ్మల్ని గురించి తెలియక ఏవేవో వాగాను!" నన్ను క్షమించండి బాబూ!" అంటూ లేచి నిలబడ్డారు సోమయ్య మాష్టారు.

గలగల నవ్వాడు చక్రధరరావు.

"నేను జిల్లా జడ్జీనైనా ఒకప్పటి మీ విద్యార్థినే మాష్టారూ!" ఎప్పుడూ విద్యార్థుల్ని చింత రువ్వతో కొడుతూవుండే మిమ్మల్ని చూస్తూవుంటే ఎంతో కసిగా వుండేది నాకు!" కాని... అనాడు మీరు నన్నలా శిక్షించబట్టే నేనింతటివాణ్ణయ్యాను మాష్టారూ!"

"బాబూ... చ...క్ర...ధ...రం...! మాష్టారి కన్నులనుండి ఆనంద బాష్పాలు జలజల రాలాయి. హృదయం ఆనంద తరంగితమయ్యింది.

"ఒసేవ్ కాముడూ ఇలారా; మన చక్రధరం వచ్చేడు!" వాడిప్పుడు వట్టి చక్రధరం కాదే!" జిల్లా జడ్జి చక్రధరరావు! ఆనందోద్వేగంతో భార్యను కేకేశారు సోమయ్య మాష్టారు.

కళ్ళజోడు చేతితో సవరించుకుంటూ వచ్చింది కామమ్మ; ఎవరూ?" అంటూ.

"మన చక్రధరం!" అదే వెంకటాచలంగారి అబ్బాయి!" పేదరికానికి పెన్నిధిలా వుందామె. రంగు వెలిసిన ముతక నేత చీర, జిడ్డు పట్టిన లావుపాటి మట్టి గాజులు, ఒకటి రెండు పళ్ళూడిపోయి, బుగ్గలు లోపలికి చొచ్చుకుపోయాయి.

ముఖంమీద మాత్రం అర్ధ రూపాయి కాసంత బొట్టు వెలిగిపోతోంది ఆమె ఐదవతనానికి చిహ్నంగా.

"ఒసేవు కావుడూ... మన చక్రధరమే!" గుర్తు పట్టలేదూ? ఉత్సాహం వెల్లి విరుస్తుండగా అన్నారు సోమయ్య మాష్టారు.

"ఆ మహానుభావుడా?" వాడినించేగా మీ కీ అవస్థ పట్టింది! తగుదునమ్మా అంటూ ఇప్పుడెందు కొచ్చినట్టు?" ఎకసక్కెంగా అంది కామమ్మగారు.

"కావుడూ చక్రి మన బిడ్డలాంటివాడు. "బిడ్డలు తప్పు చేస్తే తల్లిదండ్రులు కోపగించుకుంటారా?" అంత దూరంనించి నన్ను చూడడానికి వచ్చేడుకదే చక్రధరం!" అన్నారు సోమయ్య మాష్టారు.

అయన ప్రతీమాటలోనూ ఆనందం వెల్లి విరుస్తూంది.

"మాది మొదటినించీ ఒకటే పద్ధతి! నేను చెప్పిన మాట ఎప్పుడు వినిపించుకున్నారు కనక!" అంటూ లోపలికి వెళ్ళిపోయిందావిడ.


"ఈవిడ వరస ఎప్పుడూ ఇంతే చక్రధరం!" నువ్వేం బాధపడకు!" అంటూ నవ్వారు మాష్టారు.

అంతవరకూ అరుగుమీద కూచుని పిల్లలకి పాఠాలు చెప్తున్న ఆ నడి వయస్కుడు లేచి నిలబడ్డాడు వినయంగా.

టి.జి.యల్. వంటనూనెలు

వంటకాలకు శ్రేష్ఠం

రుచిలో అద్భుతం



టిజియల్ మైక్రోరిఫైన్డ్ గ్రౌండ్‌నట్ ఆయల్;
టిజియల్ మైక్రో రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ స్వచ్ఛమైనవి, రుచికర
మైనవి. వీటిలో వంట చేయటమే గృహిణికి ఆనందదాయకం.
ఆ వంటల్ని తినటమే ఇంటిల్లిపాదికీ మహదానందకరం.



రు. 2/- తగ్గింపు

మీరు ఉపయోగించిన ఖాళీ సీసాను మూతతో
తిరిగి ఇచ్చేసి, కొత్త సీసా ధరలో
రెండు రూ.లు తగ్గింపు పొందండి!

TGL

ఉత్పాదకులు:

టిజియల్ గ్రౌండ్ నట్ కార్పోరేషన్

ఆదోని-518 301, ఆంధ్రప్రదేశ్.

సి. & ఎఫ్. ఏజెంట్ ఫర్ హైదరాబాద్ / సికిందరాబాద్ & తెలంగాణా జిల్లా : నాగ్ మార్కెటింగ్, పూనం అపార్టుమెంట్స్, అబిడ్స్, హైదరాబాద్-500001, ఫోన్:232823. స్టాకిస్టులు: కె.వి. ఎంటర్‌ప్రైజెస్, అఫ్జల్‌గంజ్, హైదరాబాద్-500012, ఫోన్:42271, శివ ఏజన్సీస్, రామనగర్‌గుండు, విద్యానగర్, హైదరాబాద్-500044, ఆర్.అక్సా ఎస్టాబ్లిష్‌మెంట్, ఫతేనగర్, హైదరాబాద్-500018 ఫోన్ : 261114.

తన హోదా ఉద్యోగం అతన్ని అంత నమ్రుణ్ణి చేసింది అనుకున్నాడు చక్రధరరావు. అతని పెదాలమీద చిన్న నవ్వు వెలిగింది.

"మాష్టారూ... ఇ...త...ను?" ఒక్కొక్క అక్షరాన్నే ఒత్తి పలుకుతూ ప్రశ్నించాడు చక్రధరరావు.

"నాబిడ్డ బుచ్చబ్బాయ్ బాబూ!" "నాలాగే ఉపాధ్యాయ వృత్తినే చేపట్టాడు బాబూ! కాని... కాని... ఉద్యోగం మాత్రం దొరకలేదు. పదిమంది పిల్లల్ని పోగు చేసుకుని చదువు మాత్రం చెప్తున్నాడు. "బాబూ ఇంకొక్క విషయం. విద్యార్థుల్ని కొట్టడం అనే వారసత్వాన్ని నా నుండి సంతరించుకున్నాడు బుచ్చబ్బాయ్! మాష్టారి ప్రతీ మాట వెనుక ఒకనాటి ఆయన ప్రవర్తన ధ్వనిస్తూనే వుంది. ఆ ధ్వని చక్రధరరావు హృదయాన్ని కలచి వేస్తున్నది.

మెల్లిగా అరుగు దిగాడు చక్రధరరావు. "బుచ్చబ్బాయ్ నేను గుర్తున్నానా!" "మనం చిన్నప్పుడు స్కూల్ ఎగ్గొట్టి గోళీలు ఆడుతూ వుండేవాళ్లం!" "మాష్టారుచేత దెబ్బలు తింటూ వుండేవాళ్లం!" "చూడు బుచ్చబ్బాయ్... మనం ఈ అరుగు చివర కూచుని ఇసుకలో అక్షరాలు దిద్దుతూ వుండేవాళ్లం గుర్తుందా?" "వేళ్లు ఎర్రగా వాచిపోతూ వుండెవి!" ఆ కళ్లల్లో ఏవేవో మెరుపులు మెరుస్తున్నాయి.

"బాబుగారూ... మీరు... పెద్ద జడ్జీగారు... నసిగాడు బుచ్చబ్బాయి.


"నేను ఇప్పుడు జడ్జీనైనా ఒకనాటి నీ నేస్తాన్నే బుచ్చబ్బాయ్!" ఇప్పుడు ఇంకా... శివంగులు, ఎలుగుగొడ్లు తిరుగుతున్నాయా- బుచ్చబ్బాయ్?" ఉత్సాహంగా ప్రశ్నించాడు చక్రధరరావు.

"అటవీశాఖ ధర్మమా అని అవి ఇప్పుడు ఊర్లమీద పడడంలేదు!" అయినా అప్పుడప్పుడు వస్తున్నాయనుకో!" అంతలోనే గతుక్కుమని "అలా కూచోండి బాబూ!" అన్నాడు బుచ్చబ్బాయ్. లోపలినించి చిన్న చెక్క కుర్చీ తెచ్చివేస్తూ.

నవ్వుతూ అందులో కూచున్నాడు చక్రధరరావు. బుచ్చబ్బాయ్ భార్య స్టీలు గ్లాసుతో కాఫీ తెచ్చియిచ్చింది.

దాన్ని మింగలేక మింగాడు చక్రధరరావు.

కొంతసేపు మాష్టారితోటీ, బుచ్చబ్బాయ్‌తోటి చిన్ననాటి విషయాలు ముచ్చటించాడు. తరువాత అసలు విషయం బైట పెట్టాడు. "మాష్టారూ ఈనాబిడ్డ వెంకూని మీ దగ్గర కొంత కాలం వుంచుతాను!" వీడికి మంచి శిక్షణ నియ్యండి!" "వీడు పట్నంలో అందరిమధ్యా ఆధిక్యతని ప్రదర్శించి అసలు చదువుజోలికే పోవడంలేదు!" "వీణ్ని మీరెలా శిక్షించినా నేను బాధపడను!" "వీడి బాగు నాకు కావాలి!" అన్నాడు చక్రధరరావు ఉద్విగ్న మనస్కుడై.



మాష్టారు చచ్చిపోవాలి

మాష్టారి పెదాలమీద వేదాంతంతో కూడిన నవ్వువెలిగింది. "బాబూ నేను విద్యార్థుల్ని కొడతానోయ్!" ఒకనాడు నేను ఒక శ్రీమంతుల బిడ్డని కొట్టిన నేరానికే ఈ మారు మూలకి బదిలీ చెయ్యబడ్డాను! "నాటినుంచీ మరి ఇక్కడ నించి కదలలేక పోయాను!" ఇక్కడే పదవీ విరమణ చేశాను. ఆ భగవంతుడి పిలుపుకోసం ఎదురు చూస్తున్నాను!"

క్షణకాలం ఆగారు సోమయ్య మాష్టారు.

"బాబూ చక్రధరం ఈ ఉపాధ్యాయ వృత్తివుంది చూశావూ; ఆఖరి క్షణం వరకూ పిల్లలకి పాఠాలు చెప్పమంటుందోయ్; "ఇంతకీ నువ్వేమంటున్నావ్?" "మీ అబ్బాయిని, నా దగ్గరుంచు తావా?" "సంతోషం బాబూ అలాగే వుంచు" ఒసే కావుడూ ఇవాళనించి చక్రధరం బిడ్డకూడా మనతోపాటే వుంటాడే!" అన్నారు మాష్టారు ఉత్సాహంగా.

చక్రధరరావు నేత్రాలు ఆనంద బాష్పాలని వర్షించాయి.

"మాష్టారూ ఇందండి ఈ యాభైవేల రూపాయలు మీ దగ్గరుంచండి!" "ఇక్కడే స్వంతంగా ఓ బడి పెట్టుకోండి. బుచ్చబ్బాయి నిరుద్యోగం సమసిపోతుంది!" "జీవితానికో సార్థక్యం ఏర్పడుతుంది!" "అంకాళమ్మ గుడికూడా బాగు చేయించి సున్నాలు వేయించండి!" "ఈ ఏడు జాతర కూడా ఘనంగా జరిపించండి. నేను వెళ్లివస్తాను!"

"బాబూ నువ్వు నిజంగా దేముడివి!"

డబ్బు చూసేసరికి కాముడమ్మగారి కళ్లు వెలిగాయి ఆనందోద్వేగంగా. వెంకూ ఇక్కడే వుండి చదువుకుంటాడు నువ్వెళ్లిరాబాబూ!" అందావిడ.

"వెంకూ మాష్టారి దగ్గర వుండి జాగ్రత్తగా చదువుకో!" నేను వస్తూవుంటాను!" అంటూ కారుఎక్కి స్టార్ట్ చేశాడు జడ్జి చక్రధరరావు.

శివంగిపురం దాటి రోడ్డుమీది కొచ్చింది కారు. ఒక్కసారి వెనుదిరిగి చూశాడు. తన ముద్దుల కొడుకుని అక్కడదించి వస్తున్నాడు. "వాడు అక్కడ ఎలా వుంటాడో?"

"అసలు తనెవరు?" "మాష్టారు ఎవరు?" శివంగిపురం ఏమిటి?" అతని మనస్సు అలా గతంలోకి పరుగులు తీసింది.

* * * * * * *

ఎర్రగా కంపోయి బొబ్బలెక్కిన చేతుల వైపు చూసుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు చక్రధరం. "ఛీ ఈ మాష్టారు మంచివాడుకాదు!" అంటూ మనస్సులో నే తిట్టుకున్నాడు.

"ఒరే సెక్రీ ఈ పాటి దెబ్బలకే ఏడుత్తారేట్రా?" సూడు నా బీపు ఎట్టా సాపై పోనాదో!" అన్నాడు గుండుగాడు.

"నాన్నా నేను బడికెళ్ళను!" అన్నాడు చక్రధరం చొక్కాతో ముక్కు తుడుచుకుంటూ.

"బడికెళ్లవ్?" "ఏం అంత కండకావరం?" అంటూ బరబరా లాక్కెళ్లి సోమయ్య మాష్టారి దగ్గర దిగవిడిచారు. వెంకటాచలంగారు.


ఉక్రోషంగా చూస్తూ వుండి పోయాడు చక్రధరం. అక్కిరెడ్డి, అబద్ధాలు ఓదార్చారు.

పావురాల పోటీలు



పావురాల పోటీలు మొదట బెల్జియమ్‌లో ప్రారంభించినా తర్వాత 1820 ప్రాంతంలో వాటిని బ్రిటన్‌లో ప్రవేశపెట్టారు. అతి ఎక్కువ దూరం జరిగిన మొట్ట మొదటి పోటీ 1871లో జరిగింది.

115 అంతర్జాతీయ పోటీలు!



స్వీడన్‌కి చెందిన సాకర్ (కాలిబంతి) క్రీడాకారుడు బ్జోర్న్ నార్డ్ క్విస్ట్ 1963–79 మధ్య కాలంలో 115 అంతర్జాతీయ పోటీలలో పూర్తిగా ఆడాడు!

పెద్ద పెద్ద మీసాలు, భయంకరమైన కంఠస్వరం, మేష్టార్ని చూస్తూ వుంటే ఏదోలా అనిపిస్తూ వుండేది చక్రధరానికి.

ఆయన చేతిలో ఎప్పుడూ చింతరువ్వ వుండేది. అక్షరాలు కుదురుగా రాయకపోతే అరుగు చివర ఇసుకపోసి దిద్దించేవారు. చిన్ని లేతవేళ్ళు అరిగిపోతూ వుండేవి. పద్యాలు పాఠాలూ ఒప్పో చెప్పకపోతే చింతరువ్వతో అరచేతుల్లో కొట్టేవారు.

"మాష్టారి పీడ వదలి పోవాలి!" అనుకునేవాడు చక్రధరం.

చక్రధరం బడికెళ్ళే దారిలోనే అంకాళమ్మ గుడివుంది. రోజూ అక్కడికి వెళ్ళి ఆ దేవతకి నమస్కరిస్తూ వుండేవాడు!" మాష్టారి పీడ వదల్చమని. మామిడి జీడి పట్టుకుని గుడి గోడలనిండా ఏవేవో రాస్తూ వుండేవాడు.

ఆ రోజు చక్రధరం స్కూల్‌కి వెళ్ళేసరికి చాలా ఆలస్యమైంది. "వెధవాయ్ ఎక్కడ చచ్చావ్?" అంటూ చింతరువ్వతో బాదారు సోమయ్య మాష్టారు.

ఏడుపు ముంచుకొచ్చింది చక్రధరానికి. ఇంటికి రివ్వున పరుగెత్తాడు "ఇంట్లో ఎవళ్ళో కొత్త వ్యక్తులు మాట్లాడుతున్నారు. "వాళ్ళు తమకి దూరపు బంధువులట!" చాలా డబ్బున్నవాళ్ళట. తనని దత్తత చేసుకుందికి వచ్చారని బామ్మ చెప్పింది. ఎగిరి గంతేశాడు చక్రధరం. ఇక మేష్టారి పీడ తనకి వుండదు.

మరునాడే దత్తత. ఎలాగైనా ఈ రాత్రికి మేష్టార్ని చంపెయ్యాలి!" పెద్దరాయి పట్టుకుని బయలుదేరాడు. మేష్టారు వీధిలో పడుకుంటారు. దీనితో ఆయన బుర్ర పగలగొట్టాలి!".

చిక్కని చీకటి. ఆ చీకట్లో నడుస్తున్నాడు చక్రధరం. ఆ ఊళ్ళో రాత్రి శివంగులు, ఎలుగుబంట్లు సంచరిస్తాయని ప్రతీతి. అయినా బయలుదేరాడు. కొంతసేపుపోతే మాష్టారు లోపలికెళ్ళిపోతారు.

మేష్టారి ఇంటిని సమీపించాడు. ఇంతలో వాడిమీద ఏదో జంతువు పడడం, వాడికి తెలివితప్పి పోవడం క్షణాలలో జరిగిపోయాయి.

మరునాడు దత్తత జరిగిపోయింది. కొత్త తండ్రితో వెళ్ళిపోతున్న తరుణంలో బామ్మ అంది "ఆ సోమయ్య మాష్టారేగాని రక్షించి వుండకపోతే రాత్రి బిడ్డ ఏమైపోయేవాడో అని. తనని మాష్టారు రక్షించారా?" కాలగర్భంలో ఏళ్ళు గడిచిపోయాయి. వర్తమానంలోకి వచ్చిపడ్డాడు. చక్రధరరావు. "తనని మాష్టారు రక్షించినట్లు తెలుసు!" కాని మాష్టారే జంతువాత పడి ఇలాగయ్యేరని తెలియదు!" అల్లరి చిల్లరగా తిరిగే కొడుకు వేళకి గుర్తొచ్చారు మాష్టారు. ఉపాధ్యాయుడి చేతిలో తగిన శిక్షణలేందీ ఏ విద్యార్థీ బాగుపడడేమో?"

కాల చక్ర పరిభ్రమణంలో రెండు సంవత్సరాలు దొర్లిపోయాయి. ఈ రెండు సంవత్సరాల్లో ఎన్నోసార్లంది కమలిని "బాబు ఎలా వున్నాడో చూసిరండీ!" అని.

"వాణ్ణి అలా ఒంటరిగా వుండనివ్వు కమలినీ; మాష్టారి అధ్యాపకత్వంలో సుశిక్షితుడై తిరిగి వస్తాడు. కష్టసుఖాలు అనేవి ఒంటికి నాటుతాయి!" అంటాడు చక్రధరం.

"అబ్బాయ్ చక్రధరం నీ బిడ్డ నా దగ్గర బాగానే చదువుకుంటున్నాడు!" అంటూ అప్పుడప్పుడూ మాష్టారు ఉత్తరాలు రాస్తూనే వున్నారు.

చక్రధరానికి వెంకూని చూడాలని బుద్ధిపుట్టింది. తన చిన్ని మారుతీకారులో బయలుదేరాడు శివంగిపురం.

ఊరి మొగికొచ్చేసరికి అంకాళమ్మ గుడి కనిపించింది. ఇప్పుడది వెల్లవేసి తెల్లగా వెలిగి పోతోంది.

అక్కడ దిగాడు చక్రధరం. మెల్లగా లోపలికి నడిచాడు. విగ్రహానికి కొంచెం వెనకగా ఎవరో కుర్రాడు నిలబడి మామిడిజీడితో ఏదో రాస్తున్నాడు.

గతుక్కుమన్నాడు చక్రధరం. "వెంకూ!" గట్టిగా కేక పెట్టాడు. వాడు గజగజ వణుకుతూ ఇటు తిరిగాడు.

"వెంకూ నీకు వారసుడు బాబూ!" వాడు కూడా రేపు నీ అంతటివాడు అవుతాడు!" సోమయ్య మాష్టారి మాటలు వినిపించి వెనుదిరిగాడు చక్రధరం

ఆయన ముఖం ప్రశాంతంగా వుంది.

"బాబూ చక్రధరం వెంకూని నీతో తీసుకువెళ్ళు!" "నీ అంతటి వాణ్ణి చెయ్యి!" "వాడు నీ అంతటి వాడయి ఇక్కడికి వచ్చినా నేను చూడడానికి నేను మాత్రం వుండను!" కాని నేను ఎక్కడ వున్నా నా ఆశీస్సులు మాత్రం మీకు అందుతూనే వుంటాయి!" నేను పైలోకం నించి మిమ్మల్ని చూస్తూ వుంటాను!"

మాష్టారు మెల్లగా నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

చక్రధరరావు వెంకూతో సహా నాలుగడుగులు నడిచి మళ్ళీ వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ అమ్మ వారికి కాస్త వెనుకగా ఉన్న అక్షరాలు కనిపించాయి 'మాష్టారు చచ్చిపోవాలి!" అని. □

వారఫలం

15–7–1988 శుక్రవారం మొదలు 21–7–1988 గురువారం వరకు

★ **మేషం:** మీరు చలనచిత్రరంగాన శ్రమించాలనుకొన్నారా మేలే. మీరు వర్తకం చేయాలని సంకల్పించారా అనుకూల వారం. పత్రికా వ్యాసంగాన ఉన్నారా. క్షేమమే. స్త్రీలకు: అమూల్య వస్తువులు కొనుటకు, నగల తయారీకి అనుకూల వారంగా గ్రహించాలి.

★ **వృషభం:** ప్రసిద్ధులను కలసికొంటారు. వృత్తియందు చెప్పతగిన మార్పులు రావచ్చు. రాజకీయ వాదుల స్నేహం లాభదాయకం. అధికారుల ఆదరణకు ఎంత శ్రమిస్తే అంత మేలు. సాంఘికంగా అనుకూల సమయంగా గుర్తించాలి. స్త్రీలకు: వృత్తి వికాసం, ధనవసతి, శుభ ప్రస్తావనలు.

★ **మిధునం:** ఎవరు ఉపకారులో, కానివారెవరో గ్రహించి మెలగండి. దూర ప్రాంతాలకు వెళ్ళాలనే ఆకాంక్ష ఎంత యత్నించినా నెరవేరదు. ఇంకా కొంత కాలం ఆగితేగాని వారఫలం అనుకూలం గాదు. స్త్రీలకు: నూతనోద్యోగ ప్రాప్తి. సుఖశాంతులకు ఆస్కారం.

★ **కర్కాటకం:** వారమంతా అధిక లాభదాయకం. కొంత కాలంగా ఆరోగ్యభంగం ఏర్పడిన వారికి అనుకూలం. రాజకీయంగా ముందుకు దూకటం న్యాయమే. ఆటపాటల్లో ప్రసిద్ధి గలవారికి చక్కని అవకాశాలు ఏర్పడతాయి. స్త్రీలకు: వస్తు వాహన సేకరణకు అనుకూలం.

★ **సింహం:** నూతనాధ్యాయం ప్రారంభం కానున్న దినం. వారఫలం అనుకూలంగాక పోయినా, శని, కేతు రాహు గ్రహాలు అనుకూలించక పోయినా పూర్వ పుణ్యఫలం వలన ధనలోపం లేదు. స్త్రీలకు: ఇంకా కొంతకాలం ఆగితేనే గాని ఉద్యోగావకాశాలుండవు. శుభ కార్యాలో చనలు సాగిరావు.

★ **కన్య:** విద్యా వినయ సంపన్నుల స్నేహం లభ్యమవుతుంది. ఎలాగైనా ఆదాయం లేకపోలేదు. కోర్టు వ్యవహారాలు లాభదాయకం. ఒకానొక విషయం మధ్యవర్తిత్వంతో పరిష్కారం. స్త్రీలకు: సుఖశాంతులు, మిత్ర సమాగమం, చిత్రరంగాన అనుకూలత చేకూరుతుంది.

★ **తుల:** రాజకీయాలందు మీకు తిరుగులేదు. వృత్తి వికాసంలో ఎలాంటి లోపంరాదు. చిత్రరంగానుభవం గల వారికి సదవకాశాలు, మీకు గల రచనా పరిజ్ఞానం వికాసవంతం. స్త్రీలకు: ప్రభుత్వ గౌరవం, ప్రజా గౌరవం, పత్రికా గౌరవాదులున్నాయి.

★ **వృశ్చికం:** ఇటీవల కొంతకాలం విద్యావంతుల, ధనవంతుల సహాయం సమకూడుట గమనించియే ఉన్నారు. మీరు పరులకు యిచ్చిన అప్పుసప్పులు వసూలవుతాయి. గౌరవాధిక్యతకు అనుకూలం. ఉద్యోగ మార్పు చెప్పవచ్చు. స్త్రీలకు: సభా గౌరవం. పత్రికాగౌరవానికి ఆస్కారం.

★ **ధనుస్సు:** అనుకూల వారఫలం. అయితే ఆదాయానికన్నా వ్యయం అధికం. ఆ వ్యయం అయినా శుభ వ్యవహారాలకే అనుకోవాలి. సభా మర్యాద కొందరకు పత్రికా ప్రశంసలు కొందరకు. వారాంతాన వ్యాపార లాభమున్నది. స్త్రీలకు: ఉద్యోగ, వృత్తులు లాభదాయకమే. గ్రహించండి.

★ **మకరం:** 'శని భగవానుడు' రజితమూర్తిగా ధనుస్సున సంచరించుట చేత మీకు అపకారం జరుగదని గ్రహించాలి. 'పంచమగురుడు' కుటుంబానందం, బిడ్డల ఆరోగ్య వృద్ధికి అనుకూలుడు కానున్నాడు. గ్రహించండి. స్త్రీలకు: రాజకీయంగా ఆనందం. వృత్తి పెంపు.

★ **కుంభం:** గత కొన్ని వారాలుగా సర్వ గ్రహాలు 'కుంభ' రాశి జాతకులకు, ధన, వస్తు, వాహన సేకరణకు అనుకూలంగా ఉన్నారని గ్రహించియే యున్నారు. 1988 సం. అంతా యోగం. మరీ ఈ వారం సకల కార్యాలు నెరవేరతాయి. స్త్రీలకు: ఉద్యోగ యత్నమా? మేలే. రాజకీయ రంగాన అనుకూలమే.

★ **మీనం:** రాజకీయవాదులకు 'వారఫలం' యోగదాయకం. ఉన్నత విద్యార్జన యత్నమా? కొనసాగుతుంది. వృత్తియందు అనుకూలత, పెద్దల వలన, ధనవంతుల మూలాన ఏదో మేలు చేకూరుతుందనుట నిశ్చయం. చిత్రరంగావకాశ యత్నాలా స్త్రీలకు సర్వానుకూలం. డబ్బుకు ఎలాంటి కొరత రాని వారం. ఉత్తమ 'వారఫలం' గల వారం.

విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి

పచ్చటి పొలాలు...మెచ్చదగిన పంటలు!
జైకిసాన్ శక్తితో దిగుబడులు కుప్పతిప్పలు.



హెచ్చు పోషక పాళ్ల గల జైకిసాన్ ఎరువుల్లో నిండివున్నాయి మరింత సమృద్ధమైన పోషక పదార్థాలు—మీకు పుష్కలమైన పంట ఇవ్వడం కోసం.



జైకిసాన్ సామ్రాట్ 18 : 46 : 0

విత్తే సమయంలో ఇది అతి ముఖ్యం. బలమైన వేళ్ల కోసం, పూర్తిగా గింజ కట్టడం కోసం, పాస్ఫేట్‌తో సమృద్ధమైనది.

జైకిసాన్ సంపూర్ణ 19 : 19 : 19

మొక్క అన్ని విధాలా ఆరోగ్యంగా పెరగడం కోసం అత్యధిక పాళ్లలో ఎన్ పి కె పోషక పదార్థాలు గల ఇటువంటి ఎరువు ఇదొక్కటే.

జైకిసాన్ యూరియా 46.4% నత్రజని


నత్రజని నిండి వుండే ఈ స్వచ్ఛమైన తెల్లని గుళికల్లో బైయూరేట్ పాలు తక్కువ. పైపాటుగా వేయటానికీ, ఆకుల మీద చల్లటానికీ ఆదర్శవంతమైనది.

JAI KISAAN



LINTAS ZUA 165 2317 TL

నిత్య నూతన సీరియల్




(గత సంచిక తరువాయి)

పసిరిక ఒకనాడు తూర్పు పొలమునకు పోయెను. వాన కురిసిననాడు చెదలు బయలుదేరినట్లు జనమచట మూగియున్నది. అతనికి భయము వేసి యింటికి వచ్చెను. ఇదిగాక తదితర గ్రామస్థుల మెట్ట పొలాలొక యేబది యెకరములదాక ఉన్నవి. వానిలో చెట్లున్నవి, చేమలున్నవి; పాములున్నవి, పక్షులున్నవి. చెట్లు చాటు చేసికొని పసిరిక తిరుగుచుండెను. పవతిల్లు ఇంటిలో నుండి రాత్రులందే పొలాల మీదికి పోవును. అప్పుడచ్చట త్రవ్వు జనముండదు. పసిరిక చూచెను. ఈ జనము మొక్కలనెచ్చటి కచ్చట త్రవ్వివేయుచున్నది. వ్రేళ్ళతో కుద్దాలించుచున్నది. కనబడిన పామునెల్ల చావమోదుచున్నది. రోజునకొకటి, రెండు పాములు చనిపోవుచున్నవి. పక్షులను కొట్టి వండుకొని తినుచున్నది, పొలము పిచ్చుకల గుంపులు చెల్లాచెదురైనవి; సర్వ నాశనముగా ఉన్నది. పొలములో ఒకవేళ బసిరిక పండుకొనిన పామని తల చిదుక మోదుదురేమో! మునుపటికన్న తాను కొంచెము బలిసెను. అంత పామనుకొనరేమో!

విద్యుద్దీపములకు స్తంభములు వేయబడెను. పేటలో వృక్షములు ప్రతిపదముండెను. ప్రతి వీధి యందు వృక్షములే. వేప, మఱ్ఱి, రావి, గానుగ, దిరిసెన, గంగరావి-మొదలయిన వృక్షములు ప్రాత ఊరంతయునున్నవి. తీగెలు వేయు సమయము వచ్చినది. ఒక చెట్టు మూలచ్ఛేదమయ్యెను. ఒక వృక్షమునకు చేతులు తెగెను. ఒక తరువు కత్తిపెట్టి సగమునకు తెగవేయబడినట్లయ్యెను. ఒక వనస్పతికి గాడ చ పేటము తగిలెను. మరియొకదానికి శిరచ్ఛేదము చేయబడెను. నానా వృక్షములు తతోధావత్పక్షి కంఠారావముల చేత కూయి వెట్టెను. మూలివను, శరణు వేడెను. నిర్దయమైన విధి, "పొండు పొండు- గుడేటి యట్టియడుగున గూళ్ళు కట్టుకొనుడు. మీకింత ఉన్నత స్థితి ఎందు" కనెను. పక్షులు ఱెక్కలాడించెను. నోళ్ళు తెఱచెను. నీవు పోయి గుడ్డున్న గూటిని కళ్ళతో తాకుము. తల్లిపక్షి వచ్చి నెత్తి మీద ముక్కుతో పొడుచును. కిరాతుడు వచ్చి చెట్టు చెట్టెక్కి ప్రతి పసి పిట్టను ఱెక్క విరిచి బుట్టలో వేసికొమ్మనుము; తల్లి పక్షులు పిండు కట్టి యాకాశమున మండల పరిభ్రమణము చేయగాని, వానినొక పక్షి పొడువబోదు. ఆ పక్షులకు తెలియను. దగ్గఱకు పోతిమా, మన మెడలు కూడ విరుచునని. స్వాతిశయము వదలి పోవలసినంత దుర్దశ వచ్చినప్పుడు, పోక యుండుటకు వీలు లేనప్పుడు, పోయి తీరవలయునని తెలియని జంతు వేముండును? చెట్టు సగము కొట్టగా మిగిలిన సగములు- పక్షులను చూచి "మా చేతగాదు. మేము కల నాళ్ళలో మీ కాశ్రయ మిచ్చితిని. ఈ దుర్దినములలో మమ్మేల యాశ్రయించెదరు! మరొక తృణ కాష్ఠ జల సమృద్ధిగల దేశమునకు పొం"డని చెప్పెను. మరి కొన్ని వృక్షములనెను. "మే మనగా ఉన్న చోటి నుండి కదలలేము, నిర్దయుడు వచ్చి మమ్ము గొడ్డలి పెట్టి తెగ వ్రేయును. మేము పారిపోజాలము. కాదన జాలము, చేయద్మైన పెట్టుకొనజాలము. మీకేమి! ఱెక్కలుగల జంతువులు. వీలైన చోటునకు పొం"డనెను. ఎంత చెప్పినను పోని పక్షులను చూచి ఒక ముసలి వృక్షమన్నది- "ఇవి యేవో క్రొత్త చెట్లు వచ్చుచున్నవి. వీనికి శాఖలు లేవు. పండ్లు లేవు. ఫలములు లేవు. తాటిచెట్లకైన పైన మొవ్వులుండును. వీని కవియు లేవు. ఈ వృక్షములు పెరిగిన దేశమెదియో! అచ్చట సూర్యుడుద యించునో ఉదయించడో! అవి ఇంత పెద్దవైన తరువాత గూడ తెచ్చి పాతవచ్చును కాబోలు! మన బదులా వృక్షములే గ్రామమంతయు వెలసినవి. ఈ వృక్షములకు బోదెలె తక్క ఇతర వృక్షావయవములు లేవు. వాని స్వభావము మనకు తెలియదు. మీరు నా మాటలు విని లేచి పొండు. అవి యొకవేళ శాఖలు వేయునేమో! ఆ శాఖ లెట్లుండునో! వానిమీద మీరు గూర్చుండిన చచ్చిపోదురేమో" అని. జంతువులన్నిటికి ఒక్కటియే గుణము. వనమంతయు నరికి వేయుము. సింహము మిగిలిన నాలుగు చెట్లలోనే దాగియుండును. పెద్ద పెంకుటిల్లు తగులబడి పోనిమ్ము! అచ్చటనే మనుష్యుడు చిన్న పాక వేసికొని యుండును. నరికివేయబడిన చెట్లన్నియు పోయినను పక్షులు మిగిలిన కొమ్మలను వదలలేక పోయెను.

వేసగి వెడలిపోయెను. వర్షాకాలము వచ్చెను. ప్రతి సంవత్సరము నల్లని మేఘ మొకడు పడమటి కనుమలలో, వింధ్య గిరులలో, హిమవత్పర్వతములో, బ్రహ్మదేశ శైలములలో జాగ్రత్తగా తానే గుట్టకు, ఏ కొండ అంచునకు, ఏ శిలా కోణమునకు, నే దృష దుపరి భాగమునకు తగులకుండ దన్నుఁదా గాపాడుకొనుచు వచ్చి అన్ని మేఘములును తెలుగు దేశముమీద కురియుచుండగా తాను తన సావాసగాండ్రతో కలసి సుబ్బన్నపేటకు వచ్చి, అచ్చట తన ప్రియమిత్రమైన ఒక మహాన్యగ్రోధ శిఖరమున కూర్చుండి అతనితో సంభాషించును. ఆ మొగిలు పేరు "వృషన్నిధి". ఆ చెట్టు పే "రాదివటము". అదివటము మహా బలశాలి. వచ్చిన మిత్రమును భుజములమీద చేతుల వైచి యిన్నాళ్ళకు వచ్చితి"వని కదిల్చి వేయును. వృషన్నిధి ఆనంద బాష్పములు మిత్రుని యొడలినిండ వర్షించును. వృషన్నిధి వెనుకటియేడు వచ్చి ఆదివటమును గౌగలించుకొని కన్నీరు గార్చి "మిత్రమా! నీవు పుట్టి నాలుగు

జరిగిన కథ 52 : రంగారావుగారు దొరసానిని వివాహం చేసుకుంటారు. దేవదాసి ప్రతి రోజూ దేవాలయానికిపోయి స్వామిని సేవిస్తూ ఉంటుంది. గణాచారికి, పసిరికకు ఘోరి పరిస్థితులు శ్రమను కలిగిస్తాయి. ధర్మారావు పంకజమ్మగారింటిలో భారతీయ తత్వం గురించి ఉపన్యాసాలు అప్పుడప్పుడూ ఇస్తూ ఉంటాడు. రాధాపతి, చక్రవర్తి వంటివారిని ఉపన్యాసాలు బాధిస్తూ ఉంటాయి. పశుపతి కూతురు అరుంధతి ధర్మారావు భార్యకు చాలా దగ్గిర అవుతుంది. అరుంధతి ఆరోగ్యం చెడిపోతుంది. మంగమ్మ ధర్మారావుకు నాటకం టిక్కెట్టు పంపుతుంది. నాటకం గురించి ధర్మారావు తీవ్రంగా అధిక్షేపిస్తాడు. నాటక లక్షణాలనూ గురించి ధర్మారావు పంకజమ్మగారి ఇంటివద్ద వివరిస్తాడు. సుబ్బన్నపేట చాలావరకు తగులబడిపోతుంది. ధర్మారావు ఇల్లు కూడా తగులబడిపోతుంది. సుబ్బన్నపేటలో కుళాయిలు, విద్యుద్దీపములు పెట్టించడానికి తీర్మానాలు నెగ్గుతాయి.



వందల యేడులైనవి. ఇచ్చట గ్రామము కట్టకమునుపు నీ విచ్చటనే ఉన్నావు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నిన్ను మాత్రము దయగానే చూచెను. నే ననాదినైన మేఘమును. నాల్గు వందల యేండ్లు నుండి మన మైత్రి అవ్యవహితముగా సాగుచున్నది. ముందునాటికి మరల మనము కలియుదుమో, కలియమో!" అన్నది. ఆది వటమప్పుడే భయపడెను. "ఇది యేమిరా? అమృతమూర్తియైన మిత్రుని నోటినుండి యశ్లీలములు వచ్చుచున్న"వని.

ఆయేడు "వృషన్నిధి" వచ్చినది. మనసులో ఏమో దిగులుగానే ఉన్నది. వింధ్య పర్వతములలో నొక వేటకాడు తన తుపాకితో ఒక లేడిని కొట్టెను, ఆ గుండు వృషన్నిధిగుండ దూసుకొనిపోయెను. అదివటమునకు వృషన్నిధి తుపాకిదెబ్బ తిని యెఱుగదు. హిమవంతమునందొక కస్తూరి లేడి దానిని గొమ్ముతో గీసెను. బ్రాహ్మ దేశమున సముద్ర ప్రాంతముల నొక పొగ యోడ వృషన్నిధిని కంబముతో గీరెను. ఈ యపశకునములన్నియు వృషన్నిధి యోజించుకొనుచునే వచ్చెను. అతడు వచ్చి చివరకు చూచెను. ఆదివటములేదు. అది సుబ్బన్నపేట అగునో కాదో అని చుట్టుపట్లనున్న పది పదునొకండు గ్రామములు వెదకెను. ఎల్లలన్నియు నీ యూరికే సరిపోవుచున్నవి. కోట యిచ్చటనే యున్నది. జగదీశ్వరుల యాలయము లిచ్చటనే కనబడుచున్నవి. అడుగో ధర్మారావు, అదిగో గణాచారి, అదిగో దేవదాసి, అడుగో పసిరిక; నిరుటికన్న లావైనను గుర్తుపట్టవచ్చును. ఇదియే సుబ్బన్నపేట. ఆదివటమేది? ఆదివటమేది? వృషన్నిధి తానంతయు దుఃఖాశ్రుమయమయ్యెను. కాని పట్టుకొని యాదరించు స్నేహితుడు లేడు. ఒక విద్యుద్దీపికా స్తంభముమీద శ్రమ దీర్చుకొనుట

కొఱగెను. అది యతనికి దన్ను కొఱత వేసినట్లుండెను. దైవము రక్షించి యొక ఝుంఝూమారుతము జడమైన వృషన్నిధిని తన్ను కొనుచుపోయెను. వృషన్నిధి పోయి, "నీరక్కఱలేని ఒక గుట్ట పైభాగమున"* కూలబడెను. అదివటమేమైనదో వృషనిధియు అదియే అయ్యెను.

మంచినీళ్ళు వచ్చుటయో, రాకపోవుటయో! వీధులలోనున్న నూతులన్నియు మాత్రము పూడ్చబడినవి. గొట్టాలవెంట నీరు వచ్చునప్పటికి సంవత్సరము పట్టినది. తక్కిన పట్టణములలో రెండు మూడేండ్లకు తక్కువ పట్టలేదట. రాచరికమువారు సుబ్బన్నపేట పురపాలక సంఘ సభ్యులలో నొకనికి మొగమింత యయ్యెను. ఒకనికి బుజములు పొంగెను. ఒకనికి నొక మహా పురుషుడననిపించెను. ఇంతకును నీటి కొళాయిలు బజారున కొకటి పడినవి. వీధి బావులున్నప్పుడు బీద జనులు తమ కడవలు తాము తెచ్చుకొని చేదుకొని పోయిరి. నాల్గు కడవలతో రోజెల్ల గడచినది. తెల్లవారువఱకు ప్రతి కొళాయి చుట్టును వంద వంద కడవలు ముందు వచ్చిన వారిది ముందు వంతు. కొందఱు కోడి కూసినపుడే తమకుండ కొళాయి క్రింద బెట్టి పోవుదరు. కళాశాల విద్యార్థులు, కాఫీ హోటళ్ళలో తెల్లవారకముందే తినువారు, మోటారు కార్లవారు, మొగాలు కడిగి, కొళాయిల చుట్టును "కంగాళీ" సేయుదురు. బ్రాహ్మణవీధిలోనను, మరికొన్ని చోట్లను, దొడ్లలో నూతులు పూడ్చుకొనలేదు. బావులలో నీరు కాలువ నీటివలె తియ్యగా నుండదు. అందుచేత క్రమముగా అందరును గొళాయి నీటికే యెక్కిరి. ఆ నీటికి ధర పెరిగెను. కొళాయి యింటిలోనికి పెట్టించుకొనినచో దానికి కొంత వ్యయము. తరువాత "మీటరు". మీటరు సర్దిపోవు వాని చేతిలో నేదైన బెట్టుట! యొఱుగనివారికి ' చేతి కెక్కువ తగులుట? ప్రతివారము నేలలోనున్న గొట్టములలో నీరు నిలిచియుండునని యొక్కక్కచోట నాలుగైదు వందల బిందెల నీరు వీధి వెంట నూరకే వదలి పెట్టెదరు. ఆ నీరు యథేచ్ఛముగా నెవరైన వాడుకొనవచ్చునుగదా! అంత నీరూరకే పోయినందులకు డబ్బెవరి వద్దను బుచ్చుకొనలేదు. మీటరు వలన నీరు చూపెట్టుకొని బ్రదుకవలసి వచ్చెను. ఇంటిలోనికి కొళాయిలు పెట్టించుకొనిన ధనవంతుల పని బాగుగనే యున్నది. పేదవారి బిందెలు వీధి చివరనున్న కొళాయిచుట్టు గంటల తరబడి సభలు చేయుచుండెను. సభలో తీర్మానము లగుచుండెను. ఆ తీర్మానములు పై యధికారుల చేతులలో బడుచుండెను. ఆ యధికారులు "మిమ్ము గురించియే విచారించుచున్నాము"అని, "ఇప్పుడు వేతే ఖర్చున్నది, మరియొకసారి" యని, "మీలో మీ కైకమత్యమవలంబించ వలయును, పోట్లాడుకొన్నచో నె"ట్లని సమాధానములు చెప్పుదురు. కొన్ని మట్టికుండ లెక్కువ జోక్యము కలిగించుకొనక దూరమునందే ఉండును. ఎవరి యింటికి పోయినను పూర్వము సుబ్బన్నపేటలో మంచి నీరు లేదనుమాట లేదు. ఇప్పు డెవరి యింటి కైన పోయి మంచి తీర్థ మడుగుడు! "వీధిలో గొళాయి యుండగా ఇచట కేల వచ్చితివి? ఒక్క కుండ నిండునప్పటికే మా కాయుస్సు నిండుచున్నది. వెళ్ళు. వెళ్ళు!" అని యుచ్చాటన చేయుదురు.

విద్యుద్దీపములు వచ్చినవి. ఇంజనీయరులు, పంపుల కొకడు, దీపముల కొకడు- నెల కైదు వంద లైదు వందల జీతగాండ్రు. సాలునకు పన్నెండు వేలు. సుబ్బన్నపేట నిమ్మనుచుండిరి. ఇదివఱకు దీపములు వెలిగించు చాకలివాండ్రు పాతికమంది తీసివేయబడిరి. వారికి నెలకు పది రూపాయల జీతము పాతిక పదులు. రెండు వందల యేబది. ఇంజనీయరు కీయవలసిన జీతములో సగము సమకూర్చినట్లయినది. ఆ చాకళ్ళు గుడ్డలుతుకుటకు గూడ పనికిరాక పోయిరి. తక్కువ జాతి వారికి, పేదవారికి సున్నలు చుట్టి, యెక్కువ కులము వారికీ, ధనవంతులకు ఉద్యోగము లిచ్చిరి. విద్యుద్దీపములు వెలుగుచుండెను. చంద్రారెడ్డి ఒకనాడు దారి వెంట పోవుచుండెను. మఱల అతని ఉంగరము జారిపడెను. వెదకెను. కనిపించలేదు. దీపము దీసికొని రమ్మని యెవరినైన నేమని అడుగును? లక్షలు పోసి తెచ్చుకొన్న దీపములు ద్వివిటీలవలె వెలుగుచుండెను. ఉంగరమేమో కనిపించ దాయెను. సుబ్బన్నపేటలోని దీపములేమో యెఱ్ఱ మొగము బడెను. డబ్బులో లోభించి తక్కువ వోల్టులుగల బల్బులు తెప్పించిరి. అవి యేమో యెఱ్ఱగా కాలును. ఉంగరము కోసము మఱల ఇటునిటు చూచెను. దీపములు వాని వెంట నేమి దురభిమానము తెచ్చెనో. యుంగరము కొఱకు వెదకుచున్నట్లు కనబడుట గూడ రెడ్డికి తప్పనిపించెను. రెడ్డి తన దారిని తాబోయెను. మరునాడొక ధనవంతుడు దారిని బోవుచు ఉంగరము చూచి తాను దీసికొనిపోయెను. ఆ ఉంగరము బీదవాని కొకనికి దొరకరాదా! ప్రతి రోజు ప్రొద్దున్నను మన్నంతయు ప్రోగు చేసి, చేటలతో చెరగుకొందురు, కన్నుంచి ప్రతి గోడ ప్రక్క చూచుచూ పోవుచుందురు, పాకీవాండ్రకు దొరకరాదా? వారి కేల దొరకును. దొరకదగు గీతయే యున్నచో వారట్లేల పుట్టుదురు! విద్యుద్దీపములు వీధులవెంట ధగధగలాడినవి. ఇండ్లలో చీకట్లు ముసురుకొన్నవి. పురుగులు లక్షలకు లక్షలు దీపముల చుట్టు ముసిరి, మనుజులను దారి వెంట నడవనీయలేదు. నాటకములు చూడనీయలేదు. నిశలయందు మనుజుల నన్నము తిన నీయలేదు. ఈ పురుగులు దీపములలో నుండి పుట్టినవా? ఇదివఱకు కనిపించలేదు. ఇప్పుడు దీపముల వెలుగున కనిపించుచున్నవి కాబోలు! ధనవంతు లిండ్లలోనికి దీపములు పెట్టించుకొనిరి. ఆ దీపముల కెంత రాచఠీవి! మేము పేదవాని యిల్లు త్రొక్కనన్నవి. ఇంటిదాక ఎందుకు? వాడున్న సందులోకే పోనన్నవి. పేదవాని యిల్లు బిక్కమొగము వేసికొని దీపముల వంక జూచినది. దీపములు వాని వంకనే చూడమన్నట్లు స్తంభములు చాటు పెట్టుకొన్నవి. విద్యుద్దీపములు ధగధగ మెఱసినవి. పేదల కడుపులో భగభగ మండినది. పేదవారలు తిండిలేక మలమల మాడుచుండిరి. ఊరికి చివరనున్న ఒక పాడుపడిన మఠములో పైన కప్పులేని లోన నొకని యిల్లు. గోడల నానుకొని మరికొందరి యిండ్లు. యిండ్లనగా పొయ్యిలు మాత్రమే! ప్రొయ్యిలనగా మూడు ఱాళ్ళు. ఆ ఱాళ్ళున్నచోట ఇల్లు - ఆ యిల్లొక్కొక్కప్పు డేదైన గోడ కానుకొని యుండును. మరియొకప్పుడు నిరాలంబముగ నుండును. పురపాలక సంఘమనగా పురములో నుండి పన్నీయ

గల వారిని బాలించు సంఘము. ఆస్తి గలవారిని బాలించుట అనగా, వారి వద్ద పన్ను వసూలు చేసి, అందులో అనేక దేవతలకు నైవేద్యములు తీసి, తక్కిన వారి కిదుగో అని సుఖము కానిది సుఖమని చెప్పి చూపించుట. పసివానికి రూపాయి యిమ్ము! వాడు నా కది వద్దని కానీ కొంటకేడ్చును. వాడు - కానీకి పది పదునొకండు రూపాయలు వచ్చుననుకొనును. పసివానిని "తెలివి తక్కువవాడా" అనుము. వానికి కోపము వచ్చును.

పట్టణమున్నది : "నేను మీకు సుఖముగా వెలుగిచ్చినాను. సుఖముగా నీరిచ్చినాను."- ధనవంతుడన్నాడు: ఛీ! నీవిచ్చిన దేమిటి? నేను డబ్బు పెట్టి తీసికొన్నాను." చాలినంత ధనము లేక సుఖ భ్రాంతి కలవాడన్నాడు : ఇదివఱకు డబ్బు పెట్టి నీరు కొనలేదు. వెలుతురు గావలెనని దిగులులేదు. పవిత్రమైన నీరును. పవిత్రమైన జ్యోతిస్సును వెలయాండ్రకన్న కనాకష్టమై పోయినవి.

ఒక గ్రుడ్డివానిని నొక కుంటివాడు కళ్ళు పుచ్చుకొని తీసికొనిపోవు చుండెను.

కుంటి : మన యూరిలో విద్యుద్దీపములు వెలిగించిరి.

గ్రుడ్డి : అనగా సూర్యునియంత వెలుగుండునా?

కుంటి : రాతురులం దంతకన్న వెలుగుండును.

గుడ్డి : పగలు?

కుంటి : పగలు దీపము లెందుకు?

గ్రుడ్డి : నన్నొక దీపము వద్దకు దీసికొని పొమ్ము.

కుంటివాడు వానిని దీసికొనిపోయి నాల్గు రోడ్లు కలసిన యొక విద్యుద్దీపికా స్తంభము నొద్ద నిలుచుండబెట్టెను.

గ్రుడ్డివాడు "వెలుతురేది?" అనెను.


కుంటివాడు "గ్రుడ్డి ముండ కొడుకువు, నీకేమి కనబడు!" ననెను. వాడు "నాకు కనిపించకేమి? కన్ను లేకపోయిన కనుపించదేమి? ఈ దీపమువలన నాకు కనుపించు దానిలో ఎక్కువ తక్కువలు కలుగుటలేదు. ఇది నిజమైన దీపము కాదుపో" అనెను. అచట అందఱు నవ్విరి. గ్రుడ్డివాడనుకొనెను-"పిచ్చివాడను నేనా, నీవా?"

విద్యుత్తం తులకు తగిలి రోజుకు నాలుగైదు పక్షులు చచ్చుచుండెను. ఆ ముసలి చెట్టు చెప్పిన మాట నిజమే! ఊరిలో వెలుతురు! వెలుతురింత మలగెనా, చీకట్లు జీవములు వదలిన శవములవలె నుండును.


21వ అధ్యాయము

గణాచారి అన్నగారి భార్య రంగమ్మకు చిన్నప్పటి నుండియు ఆడుబిడ్డ యింటిలో పని సేయుచుండగా తానుపోయి కొంచెము చిరుపెత్తనము చేయుట అలవాటు. తన కొడుకుల నిద్దరిని నాగమ్మకు వదలిపెట్టి, తాను సాయంకాలము వాహ్యాళి పోవును. వాహ్యాళి యనగా ఐదాఱేండ్లకు పూర్వము వఱకును పట్టి గ్రామ సంచారమని అర్థము. పది పన్నెండేండ్లకు పూర్వము కాపు భార్య లందరును పొలాలకు పోవుట, గడ్డియు, జొన్నయు కోసి తెచ్చుట చేయుచుండిరి. పైరు గాలి తగిలి యెల్లరు ఆరోగ్యవంతులుగా నుండిరి. మెట్టపోయి పల్లమయిన తరువాత మాగానిలో కాపు భార్య చేసెడిపని ఏమియు లేదు. ఊడ్చినను, కోసినను, గొల్లవాండ్రును, మాలెతలును. ఇంటిలో నికి నీరు మగవాడే తెచ్చును. రాటము మానివేసిరి. కాపు భార్యకు పని యేమి మిగిలినది? ఆమె కూడు ఉడుక వేసి పెట్టుట మిగిలినది. పాలు తీసినను, పేడ చేసినను పాలేరువాడు చేయుచుండెను. కాపు భార్య నిర్వ్యవసాయురాలయ్యెను. మాగాని వచ్చినప్పటి నుండియు, రైతు భార్య తాను రైతు భార్య ననుకొనలేదు; దొరసాని ననుకొన్నది. కొన్నాళ్ళు దొరసాని ననుకొనుటతోనే తృప్తి పడినది. తరువాత వేషముచేత దొరసానిగా మారినది. జపాను సిల్కు చీరెలు. పట్టు రైకలు, చిత్ర వర్ణముల దుస్తులు తలనూనెలు, సబ్బు బిళ్ళలు, పిన్నులూ, జడ చివర పట్టు పీలికలూ, కాళ్ళకు సందెలు, తుమ్మకాయ గొలుసులు పోయి పాంజేబు పట్టాలూ, మెడలో పట్టెడ నాను కాసుల పేరు పోయి గడియారపు గొలుసు. తలమీద రాగిడి చంద్ర వంకలు పోయి ప్రక్క పాపటలు, అడ్డబాసపోయి యర్ధ చంద్రాకారపు మదరాసు జాతి ముక్కు పుడకలు, చేతులకు మురుగులు, గొలుసులు పోయి బంగారు గాజులు క్రమ క్రమ పరిణామము పొందెను. మొదటి కాపు రెండెకరముల పొలము గలవాడు. ఆ యింట గణాచారి వెలసి, పొదుపు చేసి పెట్టినది. ఆ యింట తానొకతెయే కూతురు. పెండ్లి లేదు. ఆ ఖర్చు లేదు. ఎప్పుడు నొక్కడే కొడుకు. ఇంట నైదుగురుకన్న ఎక్కువ ఎప్పుడును లేరు. దైవభక్తి, ధర్మాచరణలతో అదే అదే నెమ్మదిగా వృద్ధి పొంది పాతిక యెకరముల దాక వచ్చి, రంగయ్య గ్రామములో నొకరకమయిన యాసామి యయ్యెను. మాగాని ఊళ్ళలో నీ దినములలో పాతిక యెకరముల ఆస్తి ఉన్నదనగా వానికి భూమ్యాకాశములు పట్టవు. రంగయ్య నాటికి అతని వంశ పూర్వ మర్యాద చెడలేదు గాని, అతని యింటిలో మార్పులు జరిగినవి.

తన కడుపునతొలి చూలు స్త్రీ నిలువలేదు. కుమారు లిద్దరు కలిగిరి. వ్యవహారము క్రొత్త దారి పట్టెను. మాగాని ఊళ్ళలో ఎక్కువ మంది యువకులవలెనే రంగయ్య సైతము దురహంకారియు, గర్వియు నయ్యెను. దైవము వారి



యింట నుండి వెడలిపోవుటకు పది యేండ్ల క్రిందనే నిశ్చయించుకొనెను. అతని మనస్సులో అహంకారము గాని, గర్వము గాని తొలగించుటకు ప్రయత్నించలేదు. రంగమ్మ నేడు పరమాధునిక స్త్రీ వలె నుండెను. ఆమె కొంత యింగ్లీషు కూడ చదివెను. కడచిన యాఱేండ్లలో వారి యింటిలో నొక విచిత్ర పరిస్థితి యేర్పడెను. రంగమ్మ ముట్టుకొన్న అన్నము గణాచారి తినదు. ఎందుకు తినరాదని రంగమ్మ - గణాచారి సమాధానము చెప్పదు. ఒక దానికి చెప్పును కనుకనా. దీనికి చెప్పుటకు! రంగమ్మ యింటికి నామెకు పాఠములు చెప్పుటకు హిందూ క్రైస్తవ స్త్రీలు వత్తురు. రంగమ్మ వారితో చావడిలో కూర్చుండును. నాగమ్మ దొడ్డిలో పోయి కూర్చుండును. ఆధునిక నాగరికతా చిహ్నములైన వస్తువు లెచట నున్నను నాగమ్మ దూర దూరముగా పోవును. రంగమ్మ కోపగించు కొనును. నాగమ్మ మాట్లాడదు.



వేయిపడగలు

ఒకనాడు రంగమ్మకు పాఠము చెప్పుటకు వచ్చిన క్రైస్తవ స్త్రీ "తాను వచ్చినంతనే నాగమ్మ దొడ్డిలోనికి పోవునే?"మని అడిగెను. రంగమ్మ "ఆమె గణాచారి" అన్నది. క్రైస్తవి నవ్వెను. రంగమ్మయు నవ్వెను. తరువాత గణాచారి నిద్దరును కలిసి యేమనుకొనిరో కాని, రంగమ్మ రెండవ కొడుకు వాకిటనున్న వేపచెట్టు పంగలలో నెక్కి క్రింద పడెను. వానికి కాలు విరిగినది. కాలు నెమ్మదించు వఱకును రంగమ్మకు చదువు సాగలేదు. మరియొక నాడు క్రైస్తవి నాగమ్మను పిలిచెను. నాగమ్మ కన్ను లెఱ్ఱ చేసి చూచెను. క్రైస్తవి భయకంపితయై ఆనాడు పోయి జ్వర పడెను. ఆ జ్వరము జ్వరము మశూచికములోనికి దించెను. అప్పటినుండియు ఆమె రంగమ్మ యింటికి రాలేదు. మఱొక క్రైస్తవి వచ్చుచుండెను. ఆ పూర్వపు స్త్రీ యామెతో "గణాచారితో మాట్లాడకువే" యని మందలించి పంపించెను.

పట్టణములో విద్యుద్దీపములు ప్రకాశించు చుండెను. అవి ప్రకాశించుటకు పట్టు చీరలు, రతనముల నగలును కావలసి వచ్చెను. అంత దీపములు వట్టి రాళ్ళమీద ప్రకాశించి యేమి ఫలము? వెలరాళ్ళమీద ప్రకాశించవలయును.

ఒకనాడు ప్రొద్దు క్రుంకినది. వెంటనే చీకటి పడినది. ఆనాడు గణాచారి ప్రొద్దుననే లేచి, స్నానము చేసి, ప్రతి దినమువలె పని చేయక కూర్చుండెను. రంగమ్మ తానును పొద్దుననే లేచి, తల దువ్వుకొని స్నానము చేయకయే క్రొత్త చీర దాల్చి గ్రామము వెంట పోయెను. ఆమె గ్రామములో నున్న బాలికా పాఠశాలకు పోవును. అచ్చటనున్న క్రైస్తవోపాధ్యాయలందరును ఆమెకు స్నేహితురాండ్రు. అచటనుండి చంద్రారెడ్డి యింటికి పోవును. చంద్రారెడ్డి భార్య సీతారావమ్మయు. రంగమ్మయు మిత్రములు. అచటనుండి మరికొందఱు స్త్రీలను కలిసికొని యింటికి వచ్చును. వచ్చు వేళకుజామున్నఱ ప్రొద్దెక్కును. అప్పటికి నాగమ్మ వంట చేసి సిద్ధముగా నుండును. ఈ రోజునను రంగమ్మ ప్రొద్దెక్కియే వచ్చెను. వచ్చుసరికి ప్రొయ్యిలో పిల్లి లేవలేదు. రంగయ్య గ్రామములో లేడు. వదినెగారు వచ్చి నాగమ్మను "వంట యేల చేయలే"దనెను. ఆమె సమాధానము చెప్పదని రంగమ్మకు తెలియును. అయినను అడిగినది. ఆశ్చర్యముగా నాగమ్మ సమాధానము చెప్పినది. "ఈనాడు నేనుపవాసము."

రంగ : నేనును పిల్లలో?

నాగ : మీరు నుపవాస ముండిననే మంచిది.

రంగ : నేనుండలేను.

నాగ : పిల్లలకు మాత్ర మన్నము పెట్టకుము.

రంగ : వాండ్రు చచ్చిపోవలయుననియా యేమి నీ యుద్దేశ్యము?

నాగ : బ్రదికి యుండవలెననియే.

రంగ : ఇంక వంట చేయుము.

నాగ : నేనీనాడు ద్రవ్యములు ముట్టుకొనను.

రంగ : నాకు భోజనమెట్లు?

నాగ : అడుదానవు. వంట చేసికొనవలయును.

(ఇంకా ఉంది)



దూరదర్శనం

లత

రేపటి వెన్నెల

నాటకం. రచన సుబ్బారావు.

ప్రథమ కబళే మక్షికా పాతః అన్నట్టు నాటకం మొదలవగానే లింక్ ఫెయిలయింది. తరువాత వచ్చిందనుకోండి. ఒక భాగ్యవంతుల కుటుంబం – రెండు మధ్యతరగతి కుటుంబాలూ – ఒక రిక్షావాడి కుటుంబం– మొదటి కుటుంబంలో ఇద్దరు పిల్లలూ తల్లీ తండ్రీ నౌకరూ– అయిదుగురు. రెండో కుటుంబంలో భార్యాభర్తలూ వెరశి నలుగురూ. మూడో కుటుంబంలో తల్లీ తండ్రీ ముగ్గురు పిల్లలూ. కలిసి అయిదుగురూ – నాలుగో కుటుంబంలో రిక్షావాడూ నలుగురు పిల్లలూ అయిదుగురు టోటల్‌గా 19 పాత్రలు టపటపా చూపించారు. ఈ కుటుంబాల్లో పిల్లల్ని ఎలా పెంచుతారనేది కథ కాబోలు. గందరగోళంగా ఉందా?

అమీర్‌ఖుస్రూ-

పెద్దవాడై– ఆడవాళ్ళ పాటలలోనూ – మగవాళ్ళ మాటలలోనూ పేరు పొంది ఒక చిన్న సుల్తాన్ కొలువులో కుదురుకొని – అతనితో మాటా మాటా వచ్చి విడిపోయాడు. ఖుస్రూకి అరబ్బీ సంస్కృతం వ్రజ పర్షియన్ భాషలు రావటం వలన కాబోలు అతని కవిత్వం నా వరకు కఠినంగా ఉంది. అయితే ఇది కూడా కబీరు లాగా బ్రహ్మాండంగా మొదలై చివరకు జారిపోయే సూచనలు ఉన్నయ్– అంతా అలాగే ఉంది. తియ్యటంలో కొత్తదనం లేదు.

మనం మనం

స్త్రీల కార్యక్రమంలో మంజులత, శ్యామసుందరి గార్లు పాల్గొన్నారు.

చర్చ సమానత్వం – మంజులత గారు స్త్రీ సమానత్వం మీద ఆశాభావాన్ని వెలువరిస్తే – శ్యామసుందరి గారు – మనల్ని మనమే న్యూనపరుచుకొంటున్నాం అన్నారు. మరో ఆమె... ఆమె పేరు సరిగా వినిపించలేదు గాని కండెక్ట్ చేసిన ఆ సోదరి చక్కగా మాట్లాడారు. శ్యామసుందరి గారు పాత ఆకాశవాణి చర్చలో లాగానే ఎదుటి వాళ్ళని మాట్లాడనిస్తే ఒట్టు– ఒక సమయంలో ఆ ఇద్దరూ సర్దుకుపోయారు కూడా. సరే ఇంకా సమానత్వం మీద చర్చ అనవసరం. తాతల నాటి సబ్జక్టు అది.

ఆధాసత్య ఆధాయూట్

వినోద్– కంచన్ భార్యాభర్తలు. పాపం వాళ్ళ పనులన్ని తలకిందులవుతాయి. వినోద్ కోతలరాయుడు. ఈ వారం వినోద్ వంట చేసి – స్నేహితుడిని తినమంటే తినడు. పిల్లలకు పెట్టేస్తాడు. ఆ స్నేహితుడు పది మందిని విందుకు తెస్తాడు పోయి. కంచన్ ఇరుగు పొరుగు ఆడవాళ్ళని తెస్తుంది. ఇద్దరూ తెల్ల మొహం వేస్తారు. ఇది హాస్య నాటిక అని మనం అనుకోవాలి. అందుకే సైడ్ నించి నవ్వుల ఎఫెక్ట్ వేశారు బి. బి. సి. వాళ్ళ నాటకాల్లో లాగ. హమ్మయ్య హిందీలో కూడా ఒక టోటల్ చెత్త నాటకం వచ్చింది. హాస్యం పేరుతో అపహాస్యం.

* * *

ఆదివారం నాడు వచ్చే తెలుగు ప్రోగ్రాంలో ఒక డాన్సు ఇంకో పాటగా ఉంటాయి. అందుకే వాటిని పట్టించుకోలేదు కాని ఈనాడు చిరంజీవి షణ్ముగ శ్రీనివాస్ నృత్యం కన్నుల విందు చేశాడు సత్యభామ వేషంలో– అతను వేదాంతం సత్యనారాయణ గారంతటి వాడై పద్మశ్రీలు పొంది కాళిదాసు ఎవార్డులు పొందాలని ఈ కుమారున్ని సిద్ధేంద్ర యోగి ఆశీర్వదించు గాక.

రామాయణ్

లక్ష్మణుడు బ్రతకాలంటే లంకలో సుశేణుడు అనే వైద్యుడు రావాలని విభీషణుడు చెపితే హనుమంతుడు వెళ్ళి ఆ వైద్యుడుని కొంపతో సహా ఎత్తు కొస్తాడు. అతన్ని ప్రార్థించగా వైద్యం చేయటానికి ఒప్పుకొని – సంజీవిని తెమ్మంటాడు – హనుమంతుడు బయలుదేరిన అనంతరం – కాలనేమి అనే గూఢచారిని రావణుడు పంపుతాడు– అతడు ఋషి రూపంలో సెటిలయి రామనామం పాడుతూ హనుమంతుడ్ని భూమికి దింపి– స్నానం చేసిరా నీకు ఆకలి దప్పులు లేకుండా మంత్రం ఉపదేశిస్తానంటాడు. హనుమ నమ్మి నదిలో దిగుతాడు. మొసలి సిద్ధంగా ఉంటుంది. అది ఈ వారం కల్పన. సుశేణుడు అనే వైద్యుడు వానర జాతిలోని వాడే. అతన్ని లంక నుంచి తేవటం లేదు. అలాగే హనుమని అడ్డగించిన వారూ లేరు. సంజీవి పర్వతపు గాథని కాస్త నాటకీయంగా మల్చాలని రామానంద సాగర్ సంకల్పించినా– ఏదో ఒక రామాయణంలో ఈ కథా ఉంటే ఉంటుంది. రామాయణంలో పాఠ్యభేదాలూ భావభేదాలూ అనంతం – మొత్తం మీద సరదాగానే ఉంది. □



"రామాయణ్"లో ఒక దృశ్యం

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada - 520 003. Acting Editor : M. Madhava Rao, Chief Editor : S. Radhakrishna.
Phones : Business : 61247, 61248, 75569 Editorial : 75667

బైద్యనాధ్ ఆరోగ్య దీపిక

పాఠకుల ప్రశ్నలకి బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ వైద్య ప్రముఖుని సమాధానాలు

కొమరయ్య (వయసు 45 సం.లు), విశాఖపట్నం

ప్ర : నాకు సంతానం ముగ్గురు. ఒక సంవత్సరం నుండి ఏ పనిలోను ఉత్సాహము లేకపోవటం, నిస్త్రాణ కలయికలో సంతుష్టి లేకపోవటం, వృద్ధాప్య సూచనలు కనిపించుచున్నవి మంచి ఔషధము తెల్పండి.

జ : బైద్యనాధ్ విటా– ఎక్స్ 2 మాత్రల చొప్పున బైద్యనాధ్ చ్యవనప్రాశ స్పెషల్ పాలతో. ఉదయం సాయంత్రం సేవించండి. బైద్యనాధ్ స్వర్ణమకరధ్వజ 1 మాత్ర పాలతో రాత్రి పరుండబోవునపుడు వాడండి. మంచి ఆహారము తీసుకొండి.

సుధాకరరావు, సత్తుపల్లి

ప్ర : చర్మము అంతా దురద, పొలుసు లాగ రాలటం. చికాకుగా ఉన్నది. మలబద్ధకము కలదు.

జ : రాత్రి పరుండబోవునపుడు బైద్యనాధ్ కబ్జహర చూర్ణం 2 చెంచాలు గోరు వెచ్చని నీటితో సేవించండి. మలబద్ధకము పోవును. బైద్యనాధ్ రక్తశోధకబటి 1 మాత్ర బైద్యనాధ్ సురక్తాస్త్రాంగుతో విడవకుండా 2 నెలలు వాడండి. బైద్యనాధ్ తువరక తేల్ శరీరముపై రాసి స్నానము చేయండి. చవకరకము సబ్బులు వాడవద్దు.

సుందరవరదరావు (వయస్సు 50 సం.లు), మద్రాసు

ప్ర : నాకు మధుమేహము (షుగర్) ఉన్నది. విరేచనము సరిగాలేదు. ఆకలి లేదు.

జ : రాత్రి పరుండపోవునపుడు బైద్యనాధ్ కబ్జహర చూర్ణం 2 చెంచాలు గోరు వెచ్చని నీటితో సేవించండి. సుఖ విరేచనమగును.

మధుమేహమునకు బైద్యనాధ్ మధుమేహారియోగ్ మాత్రలు, బైద్యనాధ్ బసంతకుసుమాకరరస ఉదయం ఒక మందు, సాయంత్రం మరియొక మందు వాడండి ఆకలికి బైద్యనాధ్ హజమ్–యమ్ టాబిలెట్లు రెండేసి చొప్పున రోజుకు రెండు సార్లు చప్పరించండి.

గోపాలకృష్ణ, కడప

ప్ర : మా అబ్బాయి 16 సం.లు జ్ఞాపకశక్తి తక్కువ. పరాకు చదువులో ధ్యాస లేదు.

జ : బైద్యనాధ్ బ్రైన్ టాబిలెటు 1 చొప్పున బైద్యనాధ్ శంఖపుష్పి సిరఫ్‌తో ఉదయం సాయంత్రం 2 నెలలు వాడించండి. తలకు బైద్యనాధ్ బ్రాహ్మీ తేల్ మర్దనా చేయించండి.

రాంకిషోర్ (వయస్సు 25 సం.లు) అనంతపురం

ప్ర : ఆకలి లేదు, కడుపులో గుడ గుడ, ఎక్కువ తింటే నీళ్ళ విరేచనములు.

జ : రాత్రి పరుండబోవునప్పుడు బైద్యనాధ్ కబ్జ– హర చూర్ణ రెండు చెంచాలు గోరు వ్చెని నీటితో సేవించండి. బైద్యనాధ్ అగ్నితుండి వటి 2 మాత్రల చొప్పున బైద్యనాధ్ ద్రాక్షాసవతో భోజనం తరువాత రోజుకు రెండు సార్లు వాడండి. బైద్యనాధ్ హజమ్–యమ్ టాబిలెట్సు రోజు రెండు, మూడు సార్లు చప్పరించి తినండి.

సి. హెచ్. మున్షీ (వయస్సు 34 సం.లు), విజయవాడ

ప్ర: పేగుపూత, కడుపులో గేస్, కడుపు నొప్పి.

జ: బైద్యనాథ్ సూతశేఖర రస నెం. 1· 3గ్రాములు;
బైద్యనాథ్ సూతశేఖర రస 12 గ్రాములు;
బైద్యనాథ్ గిలోయ సత్వ 6 గ్రాములు
కలిపి 40 మోతాదులు చేసి ఉదయం సాయంత్రం బైద్యనాథ్ దాడిమావ లేపంతో సేవిస్తూ భోజనం తరువాత బైద్యనాథ్ శొబాధ్యాసవ రోజుకు రెండు సార్లు సేవించండి. కారము, పులుపు, ఉప్పు మరియు వేడి చేసే పదార్థములు నిషేధము. కడుపు ఖాళీగా ఉంచవద్దు.

ఎం. ఎస్. సాయిబాబు (వయస్సు 40 సం.లు), గుల్బర్గా

ప్ర: అరికాళ్ళ మడిమలు విపరీతంగా నొప్పి పెడుతుంది.

జ: బైద్యనాథ్ యోగరాజ గుగ్గులు: 1 మాత్ర
బైద్యనాథ్ వాతకీనా: 1 మాత్ర
ఉదయం సాయంత్రం గోరువెచ్చని నీటితో సేవించాలి. బైద్యనాథ్ రుమా అయిల్ మడిమలకు మర్దనచేసి కాపడం పెట్టండి.

ఆర్. వి. రమణారావు (వయస్సు 25 సం.లు) పిఠాపురం

ప్ర: ఆయాసం, కఫం, గొంతులో పిల్లి కూతలు, బైద్యనాథ్ చ్యవనప్రాశ అప్పుడప్పుడు వాడు తున్నాను.

జ: చ్యవనప్రాశ విడవకుండా వాడండి. మలబద్ధకము ఉంటే రాత్రి పడుకునే టప్పుడు బైద్యనాథ్ కబ్జహర చూర్ణం రెండు చెమ్చాలు, గోరు వెచ్చని నీటితో లోనికి సేవించిన విరేచనము అగును. మరియు బైద్యనాథ్ శ్వాస చింతామణి, బైద్యనాథ్ శ్వాస కల్ప ఉదయం సాయంత్రం వాడుతూ తేలిక ఆహారం తీసుకోండి. రాత్రి భోజనం తేలికగా, త్వరగా ముగించాలి. □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
బైద్యనాధ్ ఆరోగ్య దీపిక

ప్రశ్న : ....

....


....

పంపినవారి పేరు :

పూర్తి చిరునామా :

వరంగల్లులో విద్యారణ్య విద్వద్గోష్ఠి

భారత దేశ చరిత్రలో ధర్మగ్లాని కలిగినప్పుడు, సామాజిక పరిస్థితులలో విపత్కర విషమ పరిణామాలు ఏర్పడినప్పుడు, రాజకీయమైన పారతంత్ర్యం, ఒడుదుడుకులు సంభవించినప్పుడు ఎవరో ఒక మహా పురుషుడు సత్య ధర్మ దయా వీర సాహస విజ్ఞాన తపోవిభవుడు ప్రభవించి మళ్ళీ ధర్మాన్ని పునరుద్ధరించడం జరుగుతూనే ఉన్నది. అది మతం కావచ్చు, ధర్మం కావచ్చు, రాజకీయ పతనావస్థ కావచ్చు. సంక్షోభ పరిస్థితులు లేర్పడినప్పుడు మహా పురుషులు జన్మిస్తూనే వున్నారు. ఈ మహా పురుషుల కోవలోనివాడు విద్యారణ్య స్వామి. 13, 14 శతాబ్దుల చరిత్ర, అందునా ముఖ్యంగా దక్షిణ భారత దేశ చరిత్ర విమతస్థుల దురహంకార దుస్సహదర్ప విజిగీషతో రక్తసిక్తమైంది. క్రీ. శ. 1323 లో మాలిక్కాఫర్ దక్షిణ భారతంలోని ప్రధాన రాజ్యం వశం చేసుకున్నాడు. ఓరుగల్లు తురుష్కుల వశమైంది. ఆ కాలంలో విద్యారణ్యస్వామి గనుక భారతీయ సంస్కృతిని, విలువలను, ధర్మాన్ని, వేద విజ్ఞానాన్ని పరిరక్షించి ఉండకపోయినట్లయితే ఆ తర్వాత చరిత్ర వేరొక విధంగా ఉండేదేమో! శ్రీ విద్యారణ్య స్వామి ఆర్ష ధర్మోద్ధారకుడు. గొప్ప సంఘ సంస్కర్త. ప్రాణవిత్త మానభంగ భయంతో బలాత్కార మతాంతరీకరణం పొందితే అటువంటి వ్యక్తులు మళ్ళీ స్వీయ మతప్రతిష్ఠులు కావచ్చునని శ్రీ విద్యారణ్యులు శుద్ధి ఉద్యమానికి కూడా ఆరు వందల ఏళ్ళ కిందటనే మార్గం ఏర్పడినట్లు అయింది. హరిహర బుక్కరాయలను ఆదరించిన ఉదంతం ద్వారా, సాయణ, భోగనాథులనే తన సోదరుల ద్వారా వేదానికి భాష్యం నిర్మింపచేశారు విద్యారణ్యులు. ఆగమ విజ్ఞానికి, వేదాంతానికి, వేదాంగాలకు ఆయన చేసిన సేవ ఉత్కృష్టం. ఉపనిషత్తులకు ఆయన వ్యాఖ్యానాలు రచించారు. సంగీతంలో కూడా ఆయన గొప్ప పాండిత్యం ఉన్నవాడనీ కర్ణాటక సంగీత సంప్రదాయ ప్రవర్తకుడనీ విమర్శకులు ప్రతిపాదిస్తున్నారు. ఇట్టి మహనీయుని సంస్మరణ చిహ్నంగా, కృతజ్ఞతా రూపంగా గడచిన మార్చి 20, 21, 22, తేదీలలో వరంగల్లులోని కాకతీయ విశ్వ విద్యాలయ తెలుగుశాఖ నిర్వహణలో విద్యారణ్యులవారి జీవిత వాఙ్మయాలపై అఖిల భారత స్థాయిన విద్వద్గోష్ఠి జరిగింది. అమృతసర్, అహమదాబాద్, పూనా, భువనేశ్వర్, తిరుపతి, మద్రాసువంటి విద్యా కేంద్రాల నుంచి ఆచార్యులు, పరిశోధకులు, మేధావులు వచ్చి ఈ సదస్సులో పాల్గొన్నారు. యు. జి. సి. సహకారంతో ఏర్పాటైన 20వ తేది ఉదయం ప్రారంభమైన ఈ సదస్సు తొలి సమావేశానికి కాకతీయ విశ్వ విద్యాలయోపాధ్యక్షులు ఆచార్య టి. వాసుదేవ్ అధ్యక్షత వహించి కాకతీయ విశ్వ విద్యాలయ భవన సముదాయ ప్రదేశానికి విద్యారణ్యపురి అనే పేరున్నదనీ, విద్యారణ్యులు ఈ ప్రాంతంనుంచే హంపీ తుంగభద్రా తీరానికి వెళ్ళినట్లు పరంపరగా జనశ్రుతి వినబడుతున్నదనీ, వరంగల్లులో విద్యారణ్య విద్వద్గోష్ఠి జరగడం శోభావహమనీ అన్నారు. ప్రారంభోపన్యాసం చేసిన ఆచార్య బి. రామరాజు నేడు భారతదేశం మళ్ళీ విషమ పరిణామాలతో కొట్టుమిట్టాడుతున్నదనీ ఈ పరిస్థితులలో శ్రీ విద్యారణ్యస్వామినుంచి భారతీయ సమాజం ఎంతో స్ఫూర్తి పొందాలన్నారు. ముఖ్య అతిథి ఆచార్య యస్వీ జోగారావు ప్రసంగిస్తూ, ఆధునిక భారతీయ చేతనను అత్యంత ప్రభావితం చేసినవారు వేదవ్యాసులవారు, ఆదిశంకరులు, అభినవగుప్తులు, విద్యారణ్యస్వామి, వివేకానందులు అనీ, వీరి ద్వారానే భారతీయ సంస్కృతి, విజ్ఞానం, నైతిక ధార్మిక మూల్యాలు ఉజ్వలంగా ప్రకాశించా యన్నారు. సుప్రసిద్ధ చిత్రకారులు శ్రీ కొండపల్లి శేషగిరిరావుగారు చిత్రించిన శ్రీ విద్యారణ్యస్వామి హరిహర బుక్కరాయలను అనుగ్రహించడం అనే వర్ణ చిత్రాన్ని స్థానిక న్యాయవాద ప్రముఖులు సాంస్కృతిక సంస్థా నిర్వహణ తత్పరులు అయిన శ్రీ భగవాన్‌దాస్ మంథానీ ఆవిష్కరించి విద్యారణ్యులపై ఒక విద్వద్గోష్ఠిని నిర్వహించాలని వరంగల్లు పుర ప్రముఖులు సంకల్పించారనీ, మన చరిత్ర సంస్కృతి ధార్మిక మూల్యాలు, వేద విజ్ఞానం పరిరక్షించుకోటానికి సంస్థాగతమైన కృషి ఎంతో అవసరమనీ, రాజ్యాంగబద్ధంగా సామాజికావసరాలకు ధార్మిక ప్రబోధం, వేద విజ్ఞాన ప్రబోధం మన కర్తవ్యంగా ముందుకు సాగాలనీ విద్యారణ్యస్వామి జీవితం, వాఙ్మయ సేవల గూర్చి విస్తృత ప్రాతిపదికపై అధ్యయనం, ప్రచారం, సమన్వయం కోసం వరంగల్లులో ఒక మహా సంస్థను రూపొందించనున్నామని ప్రసంగించారు.



వరంగల్లులో కాకతీయ విశ్వ విద్యాలయం - తెలుగు శాఖ ఆధ్వర్యంలో "విద్యారణ్యులు - వారి రచనలు" గురించి మార్చి 20 నుంచి 22 వరకు జరిగిన యు. జి. సి. జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న శ్రీ భగవాన్‌దాస్ మంథాని, అడ్వొకేటు (జ్యోతి ప్రజ్వలనం, మరియు సందేశం), ఆచార్య ఎన్. లక్ష్మణమూర్తి (అతిథి పరిచయాలు), ఆచార్య పేర్వారం జగన్నాథం (సదస్సు సంచాలకులు), ఆచార్య టి. వాసుదేవ్ - వైస్ ఛాన్సలర్ (సభాధ్యక్షులు), ఆచార్య ఎస్వీ. జోగారావు (ముఖ్య అతిథి), ఆచార్య బి. రామరాజు (సదస్సు ప్రారంభకులు).

మరుసటిదినం దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన విద్వద్గోష్ఠి ప్రతినిధులకు శ్రీ భగవాన్‌దాస్ మంథానీ తమ ఇంట్లో ప్రత్యేకించి ఏర్పాటు చేసిన సభలో జ్ఞాపికలు బహూకరించారు. అటుతర్వాత షడ్రసోపేతమైన విందు చేశారు. శ్రీ మంథానిగారి ఇంట్లో జరిగిన సభలో భారతీయ భాషలలో విద్యారణ్య జీవితాదర్శాలను గురించి, భారతీయ విజ్ఞానాన్ని గురించి గొప్ప కృషి చేసిన విద్వాంసులకు ఇప్పుడు జాతీయంగా, అంతర్జాతీయంగా వ్యవస్థితమైన విజ్ఞాన, సాహిత్య పురస్కారాలకు మించిన గొప్ప పారితోషికాన్ని ఏర్పాటు చేయాలని సదస్యులు నిర్ణయించారు. ఈ సంస్థ రూపురేఖలు నిర్ణయించటానికి పూనాలోని వైదిక సంశోధన మండల డైరెక్టరయిన శ్రీ టి. ఎన్. ధర్మాధికారిని

గిన్నీసుబుక్‌లోకి ఎక్కిన వృద్ధ క్రీడాకారుడు

ప్రపంచములో అతివృద్ధ క్రీడాకారుడు, 'వాటర్ స్కేయర్' జార్జ్ బ్లెయిర్. అతని వయసు 73 ఏళ్ళు. వృత్తి రీత్యా వ్యాపారము, బ్యాంకర్. కాళ్ళకు ఎటువంటి నీటిపై తేలే జోళ్ళు లేకుండా గత 26 ఏళ్ళ నుండి నీటిపై తేలి ఆడుచు 'స్కీయింగ్' చేయుచున్నాడు. నీటి 'స్కీయింగ్'లో 33 ఏళ్ళ అనుభవము కలదు.

వైద్య రంగములోనే ఒక విచిత్రముగా చెప్పబడిన సంఘటన బ్లెయిర్ జీవితములో జరిగినది. వెన్నుముక స్థానము నుండి తప్పుకొనుట వలన జీవించుట దుర్భలము అయినది. కష్టతరము, ప్రమాదకరమైన ఆపరేషన్ వలన వెన్నుముక యధాస్థానమునకు చేర్చబడినది. ఆపరేషన్ దిగ్విజయమగుట బ్లెయిర్‌కే గాక వైద్య నిపుణులు కూడా ఆశ్చర్యపోయారు. వ్యాయామము కొరకు, సరదాకు నీటి స్కయింగ్ ఆపరేషన్ తర్వాత 40 వ ఏట ప్రారంభించాడు. మొదట నీటిపై తేలుటకు ఉపయోగించు జోళ్ళు కాళ్ళకు ధరించేవాడు. ఏడు ఏళ్ళ తర్వాత కాలికి ఎటువంటి జోళ్ళు లేకుండా 'స్కీయింగ్' చేయ ప్రారంభించాడు. గత 26 ఏళ్ళ నుండి వివిధ కార్యక్రమాలు, పోటీలలో పాల్గొనుచున్నాడు. ప్రపంచములో కాలికి ఎటువంటి జోళ్ళు లేకుండా 'స్కీయింగ్'లో పాల్గొన్న వృద్ధ క్రీడాకారుడు బ్లెయిర్.



ప్రతిరోజు బ్లెయిర్ తన వ్యాపారము చూచుకొనుచు, మధ్యలో సమయము దొరికినప్పుడు, 'స్కీయింగ్'లో పాల్గొంటాడు. ప్రదర్శన పోటీలలో ఆహ్వానించినప్పుడు పాల్గొంటున్నాడు.

వాటర్ స్కీయింగ్‌లో మొదట కొంత సేపు నీటిపై పరుగెత్తుట, 'సర్కిల్స్' కొట్టుట చేస్తాడు. ఆ తర్వాత త్రాటిని ఏళ్ళ మధ్య పట్టుకొని చేతులు వదలి ప్రదర్శన యిస్తాడు. కాలి బొటన వ్రేలితో త్రాటిని పట్టుకొని ప్రమాదకరమైన ఫీట్స్‌లో ధైర్యముగా పాల్గొంటాడు.

అతి లోతు అయిన అంటార్కటిక్ ద్వీపకల్పము వద్ద గల సముద్రములో సహితము ప్రదర్శనలు యిచ్చాడు. అక్కడ సముద్రము నీరు నల్లగా యుండి, సముద్ర ముఖద్వారము యుండును.

బ్లెయిర్ సప్త సముద్రాలలో బ్రహ్మాండమైన ప్రదర్శనలు యిచ్చి 'గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదు అయ్యాడు. —ముకరమ్

హైదరాబాద్ నోట్‌బుక్

సమావేశకర్తగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మూడు రోజుల విద్వద్గోష్ఠిలో సుమారు 30 పరిశోధన పత్రాలు సమర్పితమైనాయి. ఆనాటి సాంఘిక పరిస్థితులు, సామ్రాజ్య స్థాపనం, విద్యారణ్యుల వేద వేదాంగ విజ్ఞాన కృషి, ఉపనిషద్భాషాలు, ప్రకరణ గ్రంథాలపై ఐదు విభాగాలుగా చర్చా సదస్సులో ప్రముఖ విద్వాంసులు పత్ర సమర్పణం చేశారు. ఆచార్య పి. జి. లాల్యే, ఆచార్య పి. ఎన్. ఝా, ఆచార్య బి. ఎన్. ఎల్. హనుమంతరావు, ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు, ఆచార్య ఇ. వి. ఆర్. కృష్ణశర్మ చర్చా విభాగాల అధ్యక్షులుగా వ్యవహరించారు. ఆచార్య పి. శ్రీరామశర్మ విద్యా నగర సామ్రాజ్య నిర్మాణ చారిత్ర కేతి వృత్తం గురించీ, డా. గౌతమ్ పటేల్ ఛాందో గోప నిషద్దీపిక గురించి శ్రీ తిరుమల రామచంద్ర సంఘ సంస్కర్తగా విద్యారణ్యులు అనే విషయం గురించి డా. ఎ. పున్నారావు సర్వ దర్శన సంగ్రహం గురించీ, డా. అక్కిరాజు రమాపతిరావు విద్యారణ్యుల నిరూపాక్ష పీఠ ప్రతిష్ఠాపనం గురించి, డా. టి. ఎన్. ధర్మాధికారి తైత్తిరీయ సంహిత ఆధారంగా శ్రీ విద్యారణ్యుల అలౌకిక, లౌకిక ప్రతిభను గురించి పత్ర సమర్పణం చేశారు. శ్రీ భాష్యం విజయ సారథి విద్య అంటే షోడశీ విద్య అని దాని ప్రజ్వలనం విద్యారణ్యమూర్తి అని, చెపుతూ సర్వ దర్శన సంగ్రహంలో ఆయన ప్రతిభ ఎట్లా వికసించిందీ ప్రసంగించారు. మరుసటిరోజున మద్రాసులోని మహా మహోపాధ్యాయ కుప్పుస్వామి శాస్త్రి పరిశోధన సంస్థ డైరెక్టర్ శ్రీమతి జానకి సూత సంహిత తాత్పర్య దీపికపై ప్రసంగించారు. ఆచార్య రూసాయణ ఋగ్వేదసారం గూర్చి ప్రసంగించారు. శ్రీ పాములపర్తి సదాశివరావు విద్యారణ్యుల సంగీత వైదుష్యం గురించి ప్రసంగించారు. డా ఓ. సుందర రామయ్య సర్వ దర్శనం సంగ్రహంలో చార్వాక దర్శనం గురించి ప్రసంగించారు.

ఆచార్య శీలాక రఘునాథశర్మ పంచదశి గురించి డా. సి. మధుసూదనరావు పరాశర మాధవీయాన్ని గురించి పత్రాలు చదివారు. ఆచార్య ఎం. నరసింహాచార్య విద్యారణ్యుల జీవన్ముక్తి వివేకం గురించి, డా. రవ్వా శ్రీహరి మాధవీ యథాతు వృత్తిని గురించి, డా. హెచ్. ఎస్. బ్రహ్మానంద విద్యారణ్యస్వామిని గూర్చిన జనశ్రుతి వృత్తాంతాలను గురించి పత్రాలు సమర్పించారు. తిరుపతి నుంచి వచ్చిన శ్రీ ఎమ్. ఎస్. ఎన్. మూర్తి ఋగ్వర్థ ప్రకాశికపై పత్రం సమర్పించారు. భువనేశ్వర్ నుంచి వచ్చిన డా. హర మోహనమిశ్ర విద్యారణ్యుల ఉపనిషద్వ్యాఖ్యానాలపై పత్రం సమర్పిస్తూ బృహదారణ్యకం గూర్చి విశేషించి ప్రసంగించారు. అమృత్‌సర్ నుంచి వచ్చిన ఆచార్య కృష్ణలాల్ శర్మ విద్యారణ్య స్ఫూర్తి వర్తమాన పరిస్థితులకు ఎంతో అవసరమని చెపుతూ జాతీయ సమైక్యానికి విద్యారణ్యుల కృషి గూర్చి ప్రసంగించారు. స్థానిక విద్వాంసులు ప్రొ. ఎస్. లక్ష్మణమూర్తి, వితాల వెంకట రామశాస్త్రి, ఎ. మృత్యుంజయశర్మ, డా. సి. హెచ్. రాములు, గట్టు నరసింహాచార్యులు, ఎమ్. సుబ్బరామశాస్త్రి, డా. జి. స్వామినాథాచార్య, డా. ఎ. పూర్ణానందశర్మ. పంచదశి, సూత సంహిత ఉపనిషత్తులు మొదలైనవాటిపై పత్రాలు సమర్పించారు. డా. హెచ్. శివకుమార్, డా. బి. రుక్మిణి, డా. పి. జ్యోతి, డా. ఎ. బొబ్బిలి, శ్రీ కె. వి. ఆర్. కృష్ణమాచార్యులు, సమావేశకర్తలుగా నిర్వహించారు. చివరి సమావేశానికి అధ్యక్షత వహించిన మద్రాసు, అడయార్ గ్రంథాలయ నిర్వాహకులు ఆచార్య ఇ. వి. ఆర్. కృష్ణ శర్మ ఆదిశంకరుల తర్వాత విద్యారణ్యులు భారతీయ విజ్ఞానాన్ని కాపాడా రన్నారు. సాయంకాలం సాంస్కృతిక ప్రదర్శనలు, డా. నేరెళ్ళ వేణు మాధవ్ ధ్వన్యనుకరణం, డా. తిరుపతయ్యగారి గాత్ర కచేరి, ఇంకా వర్ధిష్ణు నర్తకుల నృత్య ప్రదర్శనలు జరిగాయి. భద్రకాళి దేవాలయంవారు ప్రతినిధులకు అమ్మవారి ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని బహూకరించారు.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు వరంగల్లులోని చారిత్రక విశేషాలు దర్శించారు. ముగింపు సమావేశం ఆచార్య వాసుదేవ్‌గారి అధ్యక్షతన జరిగింది. శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు ముగింపు సందేశం ఇవ్వగా జిల్లా కలెక్టరు శ్రీ చెంగప్పగారు ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ కార్యక్రమాలన్నిటినీ సమర్థంగా నిర్వహించిన సెమినార్ డైరెక్టరు కాకతీయ విశ్వ విద్యాలయ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పేర్వారం జగన్నాథం సర్వుల అభినందనకు పాత్రులైనారు. □

సినిమా విశేషాలు

—జి.వి.జి.

"అశ్వత్థామ"లో అన్వేషణ

"జాగ్రత్తగా దిగండి!" అన్నాడు అశ్వత్థామ (కృష్ణ) బస్‌లోంచి బిలబిల మంటూ దిగుతూన్న విద్యార్థుల వంక చూసి. చివరన సుధ (విజయశాంతి) దిగడం చూసి, "ఏయ్! నువ్వెలా ఎక్కావ్ బస్‌లోకి?" అన్నాడు.

"టిక్కెట్ లెస్ పాసింజర్," అంది సుధ కొంటెగా.

"పిల్లల దగ్గర రిసెర్చ్ చెయ్యడానికొచ్చావా?"

"అవును. వీళ్ళ మనస్తత్వాలను బట్టి వీళ్ళ తల్లుల మనస్తత్వాలు, తండ్రుల మనస్తత్వాలు కనిపెడతాను."

"రెక్క లొచ్చిన తూనీగ, సెలవు దొరికిన విద్యార్థి అంత తేలిగ్గా దొరకరు."

"చూస్తూండు ఎలా ఇంటర్‌వ్యూ చేస్తానో!"

"ముందు నిత్య పెళ్ళి కొడుకు కిరణ్‌బాబు గారు కనిపించడం లేదు. వారిని సెర్చ్ చెయ్యి."

సుధ ఆలో చనలో మునిగి పోయింది.

బి. గోపాల్ దర్శకత్వం వహించిన శ్రీ రాఘవేంద్రా ఆర్ట్ పిక్చర్స్ "అశ్వత్థామ" చిత్రానికి ఎం. కృష్ణ, శేఖర్ నిర్మాతలు.

"పెళ్ళి చేసి చూడు"లో ప్లేటు ఫిరాయింపు

టిఫిన్ తింటున్నాడు మోహన్ (రాజేంద్రప్రసాద్). వడ్డిస్తూన్న సుందరమ్మ (అన్నపూర్ణ) "పెసరట్టు ఉప్మా నీ కోసం ప్రత్యేకంగా చేశాను. ఎలా ఉంది?" అంది.

"ఫస్ట్ క్లాస్‌గా ఉంది. మరోటి వెయ్యి," అన్నాడు మోహన్ లొట్టలేసుకుంటూ.

సుందరమ్మ ఒకసారి గొంతు సవరించుకుని, "అమ్మాయిని చూసొచ్చాను. లక్ష రూపాయలు కట్నం ఇస్తామన్నారు. అమ్మాయి కూడా బాగానే ఉంది," అంది.

మోహన్ ముఖం చిట్లించాడు. "పెసరట్టేమిటి పరమ చెత్తగా ఉంది... ఉప్మా అసలు ఉడకలేదు".

సుందరమ్మ నిర్ఘాంత పోయింది. "అదేమిట్రా, ఇప్పుడేగా బాగుందన్నావ్?"

"నీ కుట్ర నాకు తెలియక అన్నాను," అని మోహన్ అనేసరికి సుందరమ్మ ముఖం చిన్నబుచ్చుకుంది.

రేలంగి నరసింహారావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో భీమవరపు బుచ్చిరెడ్డి సమర్పించే కౌసల్యా పిక్చర్స్ "పెళ్ళి చేసి చూడు" చిత్రానికి బి. కౌసల్య నిర్మాత.



"..తేడల్లా త్వా..లే"

గౌతమి, రాజేంద్రప్రసాద్

రాజశేఖర్‌తో "ప్రజా తీర్పు"

"ఎంతో మంది డైరెక్టర్ల వద్ద శిష్యరికం చేసిన పోతునీడి కృష్ణను దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం," అన్నారు బండారు భాస్కరరాజా. ఈయన నిర్మిస్తున్న వాసు ప్రొడక్షన్స్ "ప్రజా తీర్పు" చిత్రంలో రాజశేఖర్, రజని, చరణ్‌రాజ్, తులసి, జయచిత్ర, శుభలేఖ సుధాకర్, చంద్రిక, హేమసుందర్, నర్రా, మల్లికార్జునరావు, గరగ, కిరణ్, ఏచూరి, గోపి నాయుడు పాత్రధారులు. ఎస్. కె. సోదరుల సంభాషణలు రాశారు. గోపి, జాలాది గీతాలకు చక్రవర్తి స్వరకర్త. సుధాకర రెడ్డి ఛాయ, కృష్ణ శిల్పం. సాహుల్ సాహసాలు. శివసుబ్రహ్మణ్యం నృత్యాలు, చిన్నారావు- వెంకట్రావు ప్రొడక్షన్, జయారెడ్డి నిర్వహణ, రాజగోపాల్ కూర్పుతో బి. సుబ్బారావు సహ నిర్మాత. "మే 6 నుంచి 14 వరకు జరిగిన తొలి షెడ్యూల్‌లో సగం చిత్రం తయారైంది. మిగతా భాగం జూన్‌లో జరిగే 15 రోజుల మలి షెడ్యూల్‌తో పూర్తవుతుంది," అన్నారు డైరెక్టర్ పోతునీడి కృష్ణ.

బాలకృష్ణ ద్విపాత్రాభినయంతో "రాముడు- భీముడు"

"కాశ్మీర్‌లో పాటలు చిత్రీకరించడంతో షూటింగ్ ముగిసింది," అన్నారు కె. మురళీ మోహనరావు. ఈయన దర్శకత్వంలో సత్యం సినీ ఎంటర్ ప్రైజెస్ అధినేత సి. హెచ్. వి. వి. సత్యనారాయణ నిర్మించిన పై చిత్రంలో బాలకృష్ణ, సుహాసిని, రాధ, జగ్గయ్య, సత్యనారాయణ, సుధాకర్, రావు గోపాలరావు, చలపతి రావు, రాంజీ, రావి కొండలరావు, శ్రీవిద్య, నిర్మల, శ్రీ దుర్గ వగైరా నటవర్గం. గుహనాధన్ కథకు పరుచూరి సోదరులు సంభాషణలు రాశారు. వేటూరి గీతాలు, చక్రవర్తి సంగీతం, నందమూరి మోహనకృష్ణ ఛాయ, ఎన్. శ్రీనివాసరావు సంయుక్త దర్శకత్వం, రఘురామ్ నృత్యాలు, జి. సత్యం ప్రొడక్షన్, కె. వెంకటేశ్వరరావు కూర్పు నిర్వహించారు.

"మరణ మృదంగం"లో చిరంజీవి, సుహాసిని





వినోదపన్ను రెట్టింపు చేసారు- మరి ప్రేక్షకులకి వినోదం కూడా రెట్టింపు చేయాలి కదా సార్! అందుకని మా సిన్మాలో కాస్త సెక్స్ ఎక్కువ పెట్టాం!

వనితా ఆర్ట్స్ చిత్రంలో బాలకృష్ణ

"బాలయ్యది డైనమిక్ రోల్," అన్నారు నందమూరి రమేష్. ఈయన దర్శకత్వంలో ఎస్. భాస్కర్ నిర్మించే వనితా ఆర్ట్స్ చిత్రానికి సత్యానంద్ సంభాషణలు, నందమూరి మోహనకృష్ణ ఛాయ, చక్రవర్తి సంగీతం తెర వెనుక హంగులు.

"వారసు డొచ్చాడు"లో వెంకటేశ్, సుహాసిని

"జూన్ 4 నుంచి తణుకులో నెలాఖరు వరకు జరిగే షెడ్యూల్‌లో మూడు పాటలతో సహా టాకీ భాగం పూర్తవుతుంది. చివరి షెడ్యూల్ జూలై 20 నుంచి 31 వరకు," అన్నారు వేమూరి సత్యనారాయణ. ఈయన ప్రొడక్షన్ డిజైనర్‌గా రవికిశోర్ సమర్పించే స్రవంతీ మూవీస్ "వారసుడొచ్చాడు"లో వెంకటేశ్, సుహాసిని, మోహన్‌బాబు, గొల్లపూడి మారుతీరావు, కోట శ్రీనివాసరావు, నిర్మల వగైరా నటవర్గం. కలైమణి కథకు తనికెళ్ళ భరణి సంభాషణల కర్త. ఇళయరాజా స్వరకల్పనలో సీతారామ శాస్త్రి, వెన్నెలకంటి గీతాలు రాశారు. హరి అనుమోలు ఛాయ, రాంచంద్ర సింగ్ శిల్పం, రఘురామ్ నృత్యాలు, విజయన్ సాహసాలు, తమ్ముడు సత్యం నిర్వహణ, గౌతంరాజు కూర్పుతో కె. శారదాదేవి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎ. మోహన్‌గాంధి స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు.



సుమలత సమాధానాలు

ఎం. అంజయ్య, కోరాపుట్

ప్ర: ఏమండోయ్, శతచిత్ర సుందరిగారూ! నేనొక చిత్రాన్ని నిర్మించి, దానికి మిమ్మల్ని డైరెక్టర్‌గా చేయాలని అనుకుంటున్నాను. మీకు "స్టార్ట్... కట్" అనడం తెలుసా?

జ: ఎప్పుడనాలో కూడా తెలుసు.

జీనత్‌బేగం, మాంచిర్యాల

ప్ర: నిజం చేదుగా ఉంటుందంటారు. ఐతే, దాని విలువ ఎంత?

జ: కిలో ఆరు రూపాయలు. ఆ ధరకు ఇక్కడ కాకరకాయలు అమ్ముతున్నారు.

ఎం. గోపాలయ్య, నాయుడుపేట

ప్ర: ఇదేం అన్యాయమండీ. మా ఊరి ఆస్పత్రిలో డాక్టరుంటే మందులుండవు. మందులుంటె డాక్టరుండడు.

జ: మీ ఊళ్ళోని రోగులు చాలా అదృష్టవంతులన్నమాట!

కె. రేణుక, ధార్వాడ

ప్ర: సినిమాలలో నిరుపేదలు కష్టపడుతున్నట్టు చూపిస్తే, నా హృదయం ద్రవించిపోతుంది. కాని, రోడ్డుతో ఎవరైనా బిచ్చగాళ్ళు కనిపిస్తే నా మనసు అంతగా చలించదు. కారణమేమిటి?

జ: సినిమాలలోని నిరుపేదల వల్ల మీ పర్సుకు ప్రమాదం ఉండదు గనుక.

జె. శ్యామల. శ్రీహరికోట

ప్ర: లతగారూ! నాలాంటి పాఠకుల చిలిపి ప్రశ్నలకు సైతం మీరిచ్చే చమత్కార పూరితమైన జవాబులు చదువుతూంటే నేనెక్కడో అంతరిక్షంలో తేలిపోతున్నట్టుండుటకు కారణమేమి?

జ: అవును మరి. మీరుంటున్నది రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపే ప్రదేశంలో నాయె!

జాస్తి విఠల్, యద్దనపూడి

ప్ర: మీ ఇంటి వెనుక తవ్వుతూంటే, లంకెబిందెలు కనిపించాయనుకోండి. అప్పుడు మీరెలాంటి అనుభూతి పొందుతారు?

జ: లంకెబిందెల సంగతి ఎవరికి కావాలి. తవ్విన చోట నీళ్ళు పడ్డాయో-లేదో చూస్తాను. మద్రాసులో మంచినీటి ఎద్దడి అలా ఉంది మరి.

ఎం. మీర్‌హసన్, హన్మకొండ

ప్ర: సుమగారూ! సినిమా అనేది కళా? వినోదమా?, వ్యాపారమా?

జ: విమర్శకులకు కళ. ప్రేక్షకులకు వినోదం. నిర్మాతలకు వ్యాపారం.

కె. రాజశేఖర్, మణిపూర్

ప్ర: సినిమాకు సంబంధించిన విషయాల గురించే కాక మరేవేవో విషయాల గురించి కూడా పాఠకులు (రాళ్ళు) మిమ్మల్ని ఎందుకు ప్రశ్నించెదరు?

జ: ఎలాంటి ప్రశ్నకైనా నేను తగిన జవాబు ఇవ్వగలనన్న దృఢ విశ్వాసం వారికి ఉండడం వల్లనేమో!

నిమ్మల సత్యానంద్, పాలకొల్లు

ప్ర: మన చలన చిత్రములలో దుఃఖపు సన్నివేశములలో ఏడుస్తూ పాడుదురు. అది కూడా కళయేనా?

జ: శోక కళ.

అడ్డూరి మల్లయ్య, బుడంపాడు

ప్ర: సినిమా పరిశ్రమలో చేరిన తారలు కొందరు చెడిపోతురని మా బ్రదర్ నాతో వాదిస్తూంటాడు. నేను కాదంటాను. దీన్నిబట్టి మీరేమంటారు?

జ: మీకూ, మీ బ్రదర్‌కూ అభిప్రాయభేదాలున్నాయని.

బండి నారాయణస్వామి, టెక్కలి

ప్ర: నేనసలు అట్టే పత్రికలు చూడను. ఇటీవల ఒక రోజు ఆంధ్ర సచిత్ర వారపత్రిక చూశాను. మీ జవాబులూ చదివాను. మీరు కూడా జవాబుల్లో బాగా జోక్ చేస్తారల్లే ఉందే?

జ: మీరు కూడా బాగా ఎంజాయ్ చేస్తారల్లే ఉందే!

సి. రామలింగయ్య, విజయవాడ

ప్ర: మంత్రులు ఒక ఊరిలో చెప్పిన మాటను పక్క ఊరికి వెళ్ళేలోగానే మరచిపోతుంటారేమిటండీ?

జ: ఇంకా నయం. ఆ ఊళ్ళోనే మరిచారు కాదు. అంతవరకు సంతోషించాల్సిందే. □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

సుమలత సమాధానాలు

ప్రశ్న..

....

....

పంపినవారి పేరు..

పూర్తి చిరునామా..



మీ అందాలకు చక్కని సింగారాలు
బొమ్మన వారి వస్త్రాలు
కంచి, ధర్మవరం మొదలైన అన్ని రకాల సిల్కు చీరలు, సూటింగులు, షర్టింగులు, ఫర్నిషింగ్స్ మరియు డ్రస్ మెటీరియల్స్ కొరకు దర్శించండి.
పట్టు చీరలకు మా ప్రత్యేకత.
హోల్ సేల్ ధరలకే రిటైల్ అమ్మకం
Alfavision 881
రాజమండ్రి బొమ్మన వారి
బొమ్మన శారీ మందిర్
త్వరలో ప్రారంభం! తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్.
● బొమ్మన నారాయణ యండ్ కో, ఫోర్ట్ గేట్, రాజమండ్రి. ● బొమ్మన జయకుమార్, మెయిన్ రోడ్, రాజమండ్రి.
● విచిత్ర సిల్క్స్ యండ్ శారీస్, (హోటల్ బృందావన్) ఫోర్ట్ గేట్, రాజమండ్రి. ● బొమ్మన బ్రదర్స్, జగదంబ సెంటర్, విశా
● బొమ్మన క్లాత్ షోరూం, వెంకటరామా థియేటర్ దగ్గర, భీమవరం.